పరిణతవాణి

(మొదటి సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్ - హైదరాబాదు - 500 001

పరిణతవాణి

(మొదటి సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్రసారస్వత పరిషత్తు

సంపాదకులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
కార్యదర్శి , ఆంధ్రసారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001

PARINATAVANI

(A collection of autobiographical speeches of eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ : డిసెంబర్ 1997

ప్రతులు : 1000

మూల్యం : 36-00

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్ - హైదరాబాదు - 500 001

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్సు
గాంధినగర్, హైదరాబాదు.
ఫోన్: 7611413

టైప్ సెట్టింగ్,
వియాన్స్ గ్రాఫిక్స్,
హైదరాబాద్ - ఫోన్.764 3567

ప్రవేశిక

జ్ఞానపీఠపురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో 'పరిణతవాణి' ప్రసంగ పరంపర ఎందరో సహృదయుల ప్రశంసలు అందుకున్నది. ఆంధ్రదేశంలోని ప్రముఖులను ఆహ్వానించి వారి జీవిత విశేషాలు, సాహిత్యవేత్తలతో వారికి ఉన్న పరిచయం, ఉద్యమాలతో వారికి గల సంబంధం, సాహిత్య సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ప్రసంగించమని కోరాం. మొదట డెబ్బై యేళ్లకు పైబడ్డ ప్రముఖులచేత ప్రసంగాలు ఇప్పించాం. తరువాత అరవై అయిదేళ్ళు పైబడ్డ వారిని ఆహ్వానించాం. ఈ ప్రసంగాలను ఆడియో టేపుల్లో రికార్డు చేయించాం.

ఆడియో టేపుల్లోని విషయాన్ని ఎత్తి రాయించి ఈ ప్రసంగ వ్యాసాలుగా రూపొందించాం. కొందరు వక్తలు వ్యాసాలు సమర్పించారు. సుదీర్ఘంగా ఉన్న వ్యాసాలను క్లుప్తీకరించాం. విషయ ప్రాధాన్య దృష్టిలో ఈ ప్రసంగ వ్యాసాలను సంపుటీకరిస్తున్నాం. అందుచేత ఈ ప్రసంగ వ్యాసాలు విస్తృతిలో కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా రూపొందాయి.

పరిషత్తు కార్యవర్గంవారు, కార్యకర్తలు, ఈ ప్రసంగ పరంపరకు విచ్చేసిన సదస్యులు, సాహిత్యవేత్తలు వీటిని పుస్తక రూపంలో తీసుకురావలసిందని సూచించారు. వారి సూచన ప్రకారం అయిదు ప్రసంగాలతో మొదటి సంపుటిని వెలువరిస్తున్నాం. ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను.

డా॥ సి. నారాయణ రెడ్డి

ముందుమాట

'పరిణతవాణి' అన్నది ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారు ఈ ప్రసంగ పరంపర స్వరూప శిల్పి. పరిణతవాణి కార్యక్రమంలో పరిషత్తు వేదిక నుంచి తెలుగు ప్రముఖులు వారి అనుభవాలను, ప్రముఖులతో వారికిగల పరిచయాలను, వారు చేసిన కృషిని గురించి ఆత్మ కథాకథన రూపంలో ఎన్నో విశేషాలు వివరించారు. అవి ఎప్పుడూ ఎవరికీ తెలిసిన విషయాలు కాకపోవచ్చు. ఈ తరం వారికి ఆ అనుభవాలు జ్ఞాపకాలు, ఎంతైనా అవసరం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంలో ఈ తెలుగు ప్రముఖుల అనుభవాలను, జ్ఞాపకాలను ఇలా పుస్తకరూపంలో తీసుకు రావడానికి కారణం మా అధ్యక్షుల వారి సంకల్ప బలం. ఇప్పటికి ఇరవై రెండు ప్రసంగాలు జరిగాయి. అందులో అయిదింటిని ప్రచురిస్తున్నాం.

ప్రముఖులు ప్రసంగిస్తున్నప్పుడు రికార్డు చేయించిన ప్రసంగాలను, వ్యాసరూపంగా ఇచ్చిన ప్రసంగాలను సంగ్రహించి ఇందులో ప్రచురించాం. సాధ్యమైనంత వరకు విషయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. చాలావరకు వారి స్వచ్ఛందమైన అభిప్రాయాలను గౌరవిస్తూ వాటిని ప్రచురించాం. అభిప్రాయ భేదాలు ఉన్నచోట ఆ అభిప్రాయాలు ప్రముఖులు వెలువరించినవని ఆంధ్ర సారస్వత పరిషత్తు కేవలం వాటిని ప్రచురించిందని గమనించవలసిందిగా మా విజ్ఞప్తి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాల్ని తీర్చి దిద్దుతూ, ఎన్నో కార్యక్రమాలను, సదస్సులను నిర్వహింపజేస్తూ మా అధ్యక్షులు **ఆచార్య సి. నారాయణరెడ్డిగారు** కార్యక్రమాల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఈ సంపుటిని ప్రచురించడంలో వారి ప్రోత్సాహం ఎంతైనా ఉంది. వారికి నా కృతజ్ఞతలు. నాతో సహకరిస్తున్న కార్య వర్గ సభ్యులకు కృతజ్ఞతలు. ఈ సంపుటిని తీర్చి దిద్దడంలో శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారు ఎంతగానో సహకరించారు. వారికి నా కృతజ్ఞతలు.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
కార్యదర్శి,
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ప్రసంగ వ్యాస సూచిక

ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు

(27-7-1994)

''పరిణతవాణి'' అనే పేరుతో 70 సంవత్సరాలు దాటిన సాహిత్య కృషీవలుల చేత వారి జీవిత విశేషాలు, అనుభవాలు చెప్పించాలనే నిర్ణయం తీసుకొని ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన కార్య నిర్వాహకులను మొదట అభినందిస్తున్నాను. దీనికి వెనుక జీవనాడిగా వ్యవహరిస్తూన్న మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, సహృదయమూర్ధన్యులు, చిరకాల మిత్రులు అయిన ఆచార్య సి. నారాయణ రెడ్డిగారికి ముందుగా వందనా లర్పిస్తున్నాను.

ఈ పద్మభూషణ బిరుదాంకితుని హృదయ పద్మం - సహృదయతా సుగంధబంధురమై, ఉదారతా భ్రమర భూషితం గనుకనే ఈకార్యక్రమం ద్వారా సర్వులకు ఆమోదాన్ని అందియ్యాలని సంకల్పించింది.

దేశ చరిత్రలో రాజకీయంగా నా చదువుకొనసాగిన ఆరు సంవత్సరాలు (1936-1942) ప్రాముఖ్యమున్నవి. ఆ కాలంలోనే మొట్టమొదటిసారిగా కాంగ్రెస్సు వారు మద్రాసులో మంత్రులుగా పరిపాలించారు సాగినంతకాలం. ద్వితీయ ప్రపంచ సంగ్రామం తీవ్రస్థాయిలో ఉన్నకాలమది. ''క్విట్ ఇండియా'' ఉద్యమంకూడా వచ్చింది. భారతదేశ భూభాగంమీద పడకపోయినా, విశాఖ ప్రాంతంలో - పోర్టు ఏరియాలో - జపానువారి బాంబులు పడడం అప్పుడే జరిగింది. మహాత్మా గాంధి నాయకత్వం క్రింద వ్యష్టి సత్యాగ్రహం ''వినోబాభావే''తో ప్రారంభం అయింది. నేను - ఇంటరు, బి.ఏ. (ఆనర్సు) చదివిన కాలంఅది. యువకులమైన మేమందరం ఉత్తేజితులమై ఉన్నాము. సుభాస్ చంద్రబోస్ భారతరాజకీయాలలో కొత్త పుంతలు తొక్కిన కాలం అది. వీటి నన్నింటినిబట్టి, రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధంలేని వారందరూ కూడా ఏదో రూపంలో వాటి ప్రభావాన్ని చవిచూచినవారే! కొందరు ''ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చా''రు; కొందరు ''విశ్వ సృష్టికి అశ్రు వొక్కటి ధారపోశా''రు. కొందరు '' భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మ్రోశా''రు.

చివరకి అందరూ శాంతిని వాంఛించే '' ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవించా'' లను కొన్నారు. అందరూ భారతజాతీయ పతాక రెపరెపలాడాలని వాంఛించారు!

దూరం నుంచైనా రాజకీయాలతో నాకు కొంత సంబంధం కలగడానికి కారణం, నేను 1942 సెప్టెంబరు 16నాడు విజయ నగరంమహారాజావారి కాలేజీలో ఉద్యోగంలో చేరడం. 1942లో నేను పరీక్షప్యాస్ అయి ఉద్యోగాన్వేషణలో ఉండగా విజయనగరం మహారాజావారైన శ్రీపూసపాటి విజయరామ గజపతి (శ్రీ పి.వి.జి.రాజుగారు) గారితో మద్రాసులో పరిచయం అయింది. అప్పటికింకా, ఆయన యుక్తవయస్కులు కాకపోవడం వల్ల, సంస్థానం కోర్ట్ ఆఫ్‌వార్డ్స్ కిందే ఉంది. ఆయన మద్రాసులో విద్యాభ్యాసం చేస్తూ ఉండేవారు. నేనాయన్ని మొట్టమొదటి సారి హోటల్ బసోటో (మద్రాసు)లో కలుసుకొన్నాను. చాలా సౌమ్యులుగా, మేధావులుగా, నిరాడంబరులుగా కనబడి నన్నాకర్షించారు. ఒకటి రెండు సంవత్సరాలు ఇటూ అటూగా మేము సమవయస్కులం కావడం కూడా మా పరిచయం బలపడ్డానికి కారణం అయింది. ఒక విధంగా నేను విజయనగరంలో చేరడానికి ఇదికారణం అనవచ్చు. నేను 16-9-1942న, విజయనగరం మహారాజావారి కాలేజీలో చేరిన తరువాత, వారి పట్టాభిషేకం (Rendition) మహోత్సవంగా జరిగింది (24-8-1945). నేనప్పటికీ ఉద్యోగంలో ఉన్నాను గనుక, నేనూ ఆహూతుణ్ణై దానిలో పాల్గొన్నాను.

అప్పుడు నేను మద్రాసులో ఉండడానికి కారణం - ఆనాడు తెలుగు ఎం.ఏ. చదివిన వాడెవ్వడూ సాధారణంగా తలపెట్టడానికి జంకే ఒక సాహస కార్యం తలపెట్టడం. అది ఐ.ఏ. & ఏ.యస్. పరీక్షకు కూర్చోవడం. పోస్టుగ్రాడ్యుఏటు డిగ్రీ ఉన్నవాడెవడెవడైనా దానికి కూర్చోవచ్చునన్నారు. తెలుగు ఎం.ఏ.లో మేము చదివిన విషయాలేవీ ఉండవు దాని పరీక్షకు. నేను ఇంగ్లీషు లిటరేచర్, ఎకనామిక్సు, హిస్టరీ ఆఫర్ చేసినట్లు జ్ఞాపకం. నేను తెలుగు చదివినా, ఇంగ్లీషు భాషా సాహిత్యాలను మొదటి నుండి అభిమానంతో చదివినవాణ్ణి. ఏ సాహిత్యమైనా నాకు ఆనందం కలిగించేది. తరువాత నేను రష్యన్ మొదలైన సాహిత్యాలు చదవడానికి కూడా ఇదే కారణం.

అప్పటికప్పుడు సద్యః ఫలితం శ్రీ పి.వి.జి. రాజుగారితో పరిచయం. అయితే, అసలు మద్రాసు వైపు దృష్టిపడ్డానికి ముఖ్యకారణం ఆంధ్ర

విశ్వవిద్యాలయంలో సైన్సు విభాగం - ముఖ్యంగా కెమిస్ట్రీ విభాగం - తాత్కాలికంగా అక్కడికి మారడం దీని వెనుక ఉన్న కథ కొంచెం చెప్పాలి.

నేను 1942లో తెలుగు పరీక్ష ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వ్రాసిన తరువాత ఏప్రెల్ 6వ తేదీని విశాఖపట్టణం మీద జపానువాళ్లు, ద్వితీయ ప్రపంచ సంగ్రామం కాలంలో కొన్ని బాంబులు వేశారు. అంటే అవి వైజాగ్ ఊరు మీద వేయడం కాదు. ఏదో ఒక ఓడ - అమెరిగా వారిది కావచ్చు - కొంత మందుగుండు సామగ్రి తెస్తూ ఉంటే దాన్ని వెన్నాడి వచ్చాయి జపాను విమానాలు. ఇది, ఆనాడు చెప్పుకొన్న విషయం. సత్యాసత్యాలు తెలియవు. బాంబులు పడ్డం మాత్రం సత్యం. ఆ ఓడ వైజాగ్ పోర్టులోనికి రావడంతో అక్కడ కొన్ని బాంబులు వేశారు. అప్పటికి మాకు తెలుగు ఆనర్సు పరీక్షలు అయిపోయాయి. ఇంటికి వెళ్లే ప్రయత్నంలో ఉండగా ఈ బాంబింగ్ జరిగింది. అప్పుడు ఆంధ్ర యూనివర్శిటీ వి.సి.గా సి.ఆర్.రెడ్డిగా రుండేవారు. విద్యార్థులం మేమందరం హాస్టల్ బిల్డింగులైన సద్ధర్మ సదన, అశోక వర్ధన మొదలైన వాటిపై అంతస్థులు ఎక్కి చూశాము. ఆ ఓడవాళ్లు విమానాలమీదికి - యాంటి ఎయిర్ క్రాఫ్ట్ గన్నులు కాల్చారు. బాంబుపేలుళ్ల చప్పుడుకంటే, ఈ గన్నుల చప్పుళ్లు గట్టిగా ఉన్నాయని మేం అనుకున్నాం.

ఈ బాంబింగ్ వల్ల ఆంధ్ర విశ్వ విద్యాలయం గుంటూరు తరలి వెళ్లింది. కెమిస్ట్రీ మొదలైన కొన్ని సైన్సు విభాగాలు అప్పుడు కెమిస్ట్రీ ప్రొఫెసరయిన డా. శేషాద్రిగారి సహాయంతో మద్రాసు విశ్వ విద్యాలయంలోకి మారాయి. ఇంక, వైజాగ్‌లో ఉన్నవాళ్లు ఊరు ఖాళీచెయ్యడం ప్రారంభించారు. కొన్ని వేలమంది రైలు స్టేషనుకు వచ్చారు. సింహాచలం వైపు కొందరు నడక పుచ్చుకొన్నారు. బాంబుల భయంతో పట్టణాలలో ఉన్నవాళ్లు పల్లెటూళ్లు పట్టారు. రాజమండ్రి గోదావరి బ్రిడ్జిమీద బాంబులు వేస్తారని పుకారు పుట్టడంతో, రాజమండ్రిలోని చాలామంది - మా బంధువులు కూడా - పల్లెటూళ్లకు తరలి వెళ్లారు. తాము కూడా రాజమండ్రి విడిచి తణుకు తాలూకాలోని కాకరపఱ్ఱు గ్రామానికి వెళ్లినట్లు చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ 'స్వీయ చరిత్ర' లో వ్రాశారు.

నేను, 1942లో గుంటూరు మొట్టమొదటిసారి చూశాను. మాగోదావరి జిల్లాలో నీటి కరువు ఎరగం. కొండవీటి చేంతాడు అనడమే గాని ఎన్నడూ చూడలేదు.

ఈ రెండూ నాకు మొట్టమొదట అనుభవం గుంటూరులోనే. పెద్దమోకును ఇద్దరు మోసుకొని పోతూంటే, ఒకళ్లు రేకు బిందెను గాని బాల్చీని గాని పట్టుకొని పోవడం చూశాను. మేమిద్దరం, ముగ్గురం ఒక ఇంట్లో గది అద్దెకు తీసుకొని ఉండి, సూర్యోదయానికి ముందే ఆ ఇంటి నూతిలోంచి నీళ్లు తోడుకొని స్నానం చేసే ఇంటావిళ్లు లేచేటప్పటికి నూతిలో నీళ్లు ఉండేవి కావు. రాత్రి ఊరిన నీటిని మేము స్నానానికి వ్యర్థం చేస్తున్నామని ఇంటి యజమాని మాతో పోట్లాడేవాడు. అప్పుడు ఆంధ్ర విశ్వ విద్యాలయం భాగాలుగా గుంటూరులోనే ఇక్కడ అక్కడ ఉండేది. ఉన్నవ లక్ష్మీనారాయణగారి శారదానికేతన్ వాటిలో ఒకటి. నాకు ఉన్నవ వారితో పరిచయం అయింది. ఆయన నేను కలిసినప్పుడు ఇతర విషయాలతో బాటుగా చిలకమర్తివారిని గురించి కూడా మాట్లాడుకొనేవాళ్లం. నేను రాజమండ్రివాణ్ణి గనుక చిలకమర్తి వారిని బాగా ఎరుగుదును. గుంటూరులోనే తెలికిచర్ల వెంకటరత్నంగారితో, మహాకవి జాషువాగారితో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారితో బాగా పరిచయం అయింది. వీరిని నేనంతకి పూర్వమే 1937లో రాజమండ్రి సభలలో చూశాను. నేను గుంటూరులోనే మహా విద్వాంసులు, కవులు అయిన కాశీ కృష్ణాచార్యులుగారిని సందర్శించాను. అక్కడే సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులైన మారేమండ రామారావుగారిని వదాన్యులని పేరు పొందిన ఏకాదండయ్య పంతులుగారిని కలుసుకొన్నాను. నాకు అప్పుడు ఇరవయ్యో ఏడు జరుగుతోంది. నేను గుంటూరు రావడంవల్ల, నా భవిష్య జీవితంలో విశేష ప్రభావాన్ని చూపించిన రెండు సంఘటనలు జరగడానికి నేపథ్యం సిద్ధమయింది. మొదటిది - విజయనగరం మహారాజావారి కళాశాలలో నా ఉద్యోగం; రెండోది - మహాకవి రాయప్రోలు సుబ్బారావుగారి ద్వితీయపుత్రిక లలితతో నా వివాహం. ఈ రెండూ నాజీవితాన్ని మార్చివేసి ఫలప్రదం చేసినవే. వీటిలో మొదటిది సెప్టెంబరు 1942లోను; రెండోది జూన్ 1943లోనూ జరిగాయి. ఈ రెండూ 1942లోనే జరిగాయి. దీనికి పరీక్షలో నేను ఫస్టు క్లాసులో ఫస్టుగారావటాన్ని కూడా చేర్చి చూస్తే ఆసంవత్సరం నాజీవితంలో ఎంత ప్రముఖమైనదో తెలుస్తుంది.

మానాయనగారు ఆకస్మికంగా 1937లో దివంగతులైన తరువాతనే నేను బి.ఏ. పూర్తిచేసాను. ఆయన్నిగురించి ఇంకొంచెం చెప్పాలి. చాలా నిజాయితీ గల

మనిషి. కోర్టు ఉద్యోగాల్లో వేరే సంపాదనకు అవకాశాలు ఎక్కువ అని చెప్పుకొంటూ ఉండేవాళ్లు. ఆయన నిప్పులాంటి మనిషి అనీ, మాట ఇస్తే దాటడని పేరు పొందారు. చాలా మితభాషి. ఆరోజుల్లోనే ఆయన కర్మిష్ఠి కారు. ఆయన పెద్దగా పూజలు అవీ చెయ్యడం నేను చూడలేదు. ఆయనకు చాలామంది క్షత్రియులు, తెలగ కాపులు, స్నేహితులుండేవారు. అమలాపురంలో ఆయన మిత్రుల్లో పలచోళ్ల పద్మనాభస్వామి నాయుడుగారనే లాయరు, చంద్రమౌళిగారనే మారుతీ ప్రెస్ ప్రొప్రైటరు ముఖ్యులుగా చెప్పాలి. ఆయన ఎఱ్ఱపంచలు కట్టేవారు. మీసాలుండేవి. మా మేనమామగారు విష్ణువఝుల రామయ్యగారు. ఆయనా కోర్టులో ఉద్యోగం చేసేవారు. దేవతార్చన అదీ ఉండేది ఆయనకు. మానాన్నగారు ఎఱ్ఱ పంచలు కట్టడం, మీసాలుంచుకోవడం - వైదికులకు అనుచితమనే భావంతో - మా బంధువుల్లో కొందరుఆయన్ని చూసి ముసి ముసి నవ్వులు నవ్వుకొంటూ ఉండే వాళ్లు! ఆయన ఎవళ్లనీ లెక్క పెట్టేవారూ కారు. విమర్శించేవారూ కారు. తన మార్గం మాత్రం వదలి పెట్టేవారూకారు. ఆయన శివానందలహరి, సౌందర్యలహరి, భగవద్గీతలను ఎప్పుడూ చదువుతూ ఉండేవారు. పై నాయుడుగారి కొడుకుల్లో కొందరు నాక్లాసుమేట్సు. ఆయనది చాలా అందమైన దస్తూరీ. మా కోసం తెప్పించిన సంస్కృత వాచకాలలో పేజీలమధ్య తెల్లకాగితాలు వేయించి బైండు చేయించి, ఆ కాగితాలమీద నాగరలిపి మేము చదవడంలో శ్రమపడతామనే భావంతో, తెలుగు లిపిలో ఆ పాఠాలన్నీ వ్రాసి మాకు ఇచ్చేవారు. ఆయన శ్రద్ధకు నిదర్శనంగా అవి ఇప్పటికీ ఉన్నాయి మాఇంట్లో! మన దేశానికి ఒక భారతీయ భాష అవసరమని ఆయన విశ్వాసం. అందుచేత చిన్నతనంలోనే నాచేత హిందీ చదివించారు. ఆయనకు టైం ప్రకారం అన్నీ జరగాలి.

రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో చదివిన నాలుగు సంవత్సరాలు, తెలుగు వక్తృత్వ పోటీలలో నేను బాగా రాణించాను. ఆ పోటీలను పురస్కరించుకొని నేను విశాఖ పట్టణం, కాకినాడ, గుంటూరు కళాశాలల్లో కూడా మాటాడి బహుమతులు సంపాదించాను. ఆ సందర్భంలోనే ఒకసారి ఇంగ్లీషు వక్తృత్వ పోటీలో పాల్గొనడానికి మద్రాసు వెళ్లాను. అక్కడ గోఖలే హాలులో ఆ పోటీ జరిగింది. దానికి జడ్జీలుగా సుప్రసిద్ధులైన సత్యమూర్తిగారు, డా॥ మర్ఫీగారు వచ్చి నా ఉపన్యాసాన్ని మెచ్చుకొని నాకు బహుమానం ఇచ్చారు. మన రాష్ట్రందాటివెళ్లి ఇంగ్లీషు డిబేటులో బహుమానం

పొందడం నాకదే మొదటిసారి. అప్పుడు మాకాలేజికి తెన్నేటి సూర్యనారాయణగారు ప్రిన్సిపాల్. గణిత శాస్త్రంలో నిధి. సీనియర్ రాంగ్లర్ (Senior Wrangler). ఆరోజుల్లో కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీకి పెద్దాడ రామస్వామిగారు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. కాకినాడ తీరే వేరు. బ్రహ్మ సమాజ ప్రభావం వల్ల, రఘుపతి వెంకటరత్నంనాయుడు (1862-1939) గారి ప్రభావం క్రింద, ఉదారులైన పిఠాపురం మహారాజా శ్రీ ఆర్.వి.కె.ఎమ్. సూర్యారావు బహద్దూర్ (1885-1964) వారి ఆదరణవల్ల అక్కడ ఆధినిక భావాలకు విశేష ప్రాధాన్యం ఉండేది. రాజమండ్రి నుండి వెళ్లిన నాకు, కొంత కొత్తగా అనిపించింది. అందరు ఆడపిల్లలు కాలేజీలో చదవడం, ఆ క్రమశిక్షణ నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి! ఆరోజుల్లో పాత రాజమండ్రిని కొత్త కాకినాడను పోలుస్తూ ఈ పద్యభాగం చదువుతూ ఉండేవారు; ''పడుచు బోగము సానికి పసులు మెండు! ముసలి ముత్తైదువున కింత పసుపు బొందు॥'' మా గవర్నమెంటు కాలేజీలో విద్యార్థుల మొత్తం సంఖ్య 150 - 200 ఎప్పుడూ దాటలేదు. ఆ రోజుల్లో ఆర్ట్సు కాలేజీ రాజమండ్రి రైలు స్టేషను దగ్గిర ఉండేది. దాని కెదురుగా ఆట స్థలం ఉండేది. రెండో రైలు బ్రిడ్జి రావడంతో ఆ కాలేజీని అచ్చటనుండి ప్రస్తుతం ఉన్నచోట కొత్త బిల్డింగులు కట్టి తరలించారు. విద్యార్థులమొత్తం సంఖ్య అంత తక్కువగా ఉన్నప్పుడు విద్యార్థినుల సంగతి ఇంక చెప్పేదేమిటి? ఐదుగురో ఆరుగురో ఉండేవారు! అందరు ఆడపిల్లలు ఒక్క కాలేజీలో చడవడం నేను మొదటిసారి 1936లో కాకినాడలోనే చూశాను. 1936-1938 మధ్య నేను డిబేట్స్ కోసం మిసెస్ ఏ.వి.ఎన్. కాలేజీకి రెండు సార్లు వెళ్లాను. ఆ కాలేజీలో ఇంటర్ మాత్రమే ఉండేది గనుక, ఇంటర్ చదువుతున్న విద్యార్థులే పోటీలో పాల్గొనేవారు. ఆ కాలేజీ 1950దాకా అనవచ్చును - ఇంటర్ మీడియేట్ కాలేజీగానే కొనసాగింది. ఆంధ్రవిశ్వ విద్యాలయం ఉన్నా, ఆనాటి విశాఖ పట్టణం కాలేజీలో కూడా కాకినాడ కాలేజీలో ఉన్నంతమంది విద్యార్థినులు లేరు.!

నేను నాలుగేళ్లు (1936-1940) ఇంటరు, బి.ఏ; రాజమండ్రిలో చదవడం వల్ల, మన తెలుగునాట కవులుగా, పండితులుగా, పరిశోధకులుగా తరువాత లబ్ధ ప్రతిష్ఠులైన వారిని - వారింకా ఉన్నత స్థాయికి పూర్తిగా ఎదక్క పూర్వమే - కలుసుకొనే అవకాశం కలిగింది. అప్పటికే లబ్ధ ప్రతిష్ఠితులై ఉన్న పెద్దలనూ

కలుసుకోవడం జరిగింది. నేను 60సంవత్సరాల క్రిందటి విషయం వ్రాస్తున్నానంటే దీని సామంజస్యాన్ని అర్థంచేసుకోగలరు! భక్త చింతామణి శతక కర్తగా, వేణీ సంహార నాటకానువాదకునిగా అప్పటికే కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన వడ్డాది సుబ్బారాయడు కవిగారిని (1855-1938) కలిసి మాట్లాడే భాగ్యం కలిగింది. అలాగే కవిసార్వభౌమ బిరుదాంకితులైన శ్రీ పాద కృష్ణమూర్తిశాస్త్రి (1866-1960) గారిని కలిసి చాలా సార్లు మాట్లాడే అవకాశం కలిగింది. ఇంతే కాక, తరువాత నేను విజయనగరం మహారాజావారి కాలేజీల్లో ఉద్యోగం చేస్తూ ఉన్నప్పుడు (1942-1959) వీరినే కాక ఇంకా ఎందరినో కవులను, పండితులను ఆహ్వానించివారి చేత ఉపన్యాసాలను కవితాగానాలను చేయించే అవకాశం కలిగింది. నేను రాజమండ్రిలో ఉన్నప్పుడు గౌతమీ గ్రంథాలయం పక్క సందులో ఉండడం వల్ల ఆ గ్రంథాలయానికి తరుచూగా ఉదయం, సాయంకాలం వెళ్లేవాడిని. ప్రతిరోజు సాయంకాలం, మధురకవి నాళం కృష్ణారావుగారు, ఈయన వీరేశలింగం పంతులుగారి శిష్యులు, కొంతకాలం వ్యతిరేకులుకూడా - శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారు కలిసి - గ్రంథాలయ ప్రాంగణంలో చదరంగం ఆడ్డం చూసేవాణ్ణి. ఇందువల్లకూడా ఇద్దర్నీ సన్నిహితంగా ఎరిగి ఉండడం జరిగింది. ఆ రోజుల్లోనే శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారు ''వైశ్య సేవా సదనం''లో చదువుకొంటూఉండేవారు. ఈమె కృష్ణరావుగారి పుత్రిక. ఆ సదనానికి శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. వారినీ నేను ఎరుగుదును. స్త్రీలలో విద్యా వ్యాప్తికి ఆ ''సదనం'' గొప్ప కృషి చేసింది. ఆనాడు గౌతమీ గ్రంథాలయానికి ''జీవన ప్రభాత'' అనే కలం పేరుతో అనేక కథలు వ్రాసిన ఒకరు లైబ్రేరియన్‌గా ఉండేవారు.

ఆరోజుల్లోనే 'గౌతమీకోకిల' వేదుల సత్యనారాయణ శాస్త్రి (1900-1976) గారిని తరుచుగా, ఆయన వారి గురువుగారైన కవిసార్వభౌములు శ్రీ పాదవారిని కలియడానికి వచ్చినప్పుడు, నేనూ రాజమహేంద్రవరంలో కలిసి గోదావరి గట్టుమీద ఆయనతో నడిచేవాణ్ణి. ఇదే విధంగా ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి (1911-1987) గారితోనూ సన్నిహిత పరిచయం ఉండేది. వీరందరూ మహా ప్రతిభావంతులైన కవులైనా, ఆర్థికంగా ఇబ్బంది పడుతూనే కనబడేవారు. కవులలో ఇంకా కందుకూరి రామభద్రరావుగారు, సహదేవ సూర్యప్రకాశరావుగారు

యువకవులలో నాకు మిత్రులు. వీరందరికంటె, నేను వయస్సులో కొంత చిన్నవాణ్ణి అయినా, తెలుగులో కృషి చేస్తూ ఉండడం వల్ల సన్నిహితుణ్ణి కాగలిగాను.

మొదటినుంచీ రాజమహేంద్రవరం - విద్యా సంస్కృతులకు, సాహిత్యాదిలలితకళలకు స్థానమే కాకుండా - ఆనాడు రాజకీయాలకు కూడా ప్రముఖ కేంద్రంగా ఉండేది. తూర్పుగోదావరి జిల్లాలో మంచి రాజకీయ నాయకులుగా పేరు పొందిన కళా వెంకటరావుగారు, పళ్లంరాజుగారు మొదలైనవారితో బాటుగా రాజమండ్రిలో - బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు, కందుల వీర రాఘవస్వామిగారు, వెన్నేటి సత్యనారాయణగారు, డా॥ వంగవీటి దీక్షితులుగారు, డా॥ నాగేశ్వరరావుగారు, పాలకోడేటి గురుమూర్తిగారు, దేవత శ్రీరామమూర్తిగారు, మద్దూరి అన్నపూర్ణయ్యగారు, క్రొవ్విడి లింగరాజుగారు మొదలైన వారందరు జాతీయోద్యమంలో పాల్గొని కష్టనష్టాలు పొందినవారే. వీరిలో కొందరిని గురించి ఒకచోట చెప్పాలని ఆ పేర్లు తెచ్చాను. యువకులమైన మాకు ఎంతో స్ఫూర్తి నిస్తూవచ్చారు. రాజకీయ సభలు గోదావరి గట్టున శ్రీశర్ధానంద్ ఘాట్‌లోను, ఇన్నీసుపేటలోని పాల్‌చౌక్‌లోను జరుగుతూ ఉండేవి. సాహిత్య సాంస్కృతిక సభలు కందుకూరి వీరేశలింగంగారు స్థాపించిన టౌన్‌హాల్‌లోను, గౌతమీ గ్రంథాలయంలోను జరుగుతూ ఉండేవి. యువకులలో వక్తగా కొంత, పదిమందికి పరిచయం ఉన్న నేను కూడా తరుచుగా వీటిలో పాల్గొంటూ ఉండేవాడిని. టంగుటూరి ప్రకాశం పంతులుగారికి ఆనాటి ఆ ప్రాంతం రాజకీయనాయకులందరూ శిష్యప్రాయులుగనుక, ఆయన ఒకప్పుడు రాజమండ్రిలో వివిధరంగాలలో పనిచేసినవాడు గనుక అక్కడికి తరచుగా వచ్చేవారు. బులుసు సాంబమూర్తిగారు కూడా అప్పుడప్పుడు వచ్చి రాజకీయోపన్యాసాలు ఇస్తూవుండే వారు. వారిని ఒకటి రెండు సార్లు కలిసి మాట్లాడాను. ఆ నాటి నాయకుల్ని సామాన్యులు కలవడం చాలా సులభంగా ఉండేది. నేటి ఆర్భాటాలు లేవు! వారికి ప్రజలంటే భయం లేదు!

ఆ రోజుల్లో నామస్సులో చెరగని ముద్రవేసిన ఇంకో రాజకీయనాయకుడు సుభాస్ చంద్రబోస్‌గారు హాజమండ్రి ఇన్నీస్‌పేటలోని పాల్ చౌక్‌లో ఆయన మాట్లాడుతూ ఉంటే 1937లో అనుకొంటాను - వినడం జరిగింది. ఆయన రూపం, వక్తృత్వం, చిత్తశుద్ధి యువకుల్నందర్నీ ఆకర్షించాయి. నాకప్పటికి పదహారేళ్లు.

ఆయన ఆంగ్లోపన్యాసానికి మద్దూరి అన్నపూర్ణయ్యగారు (1898-1953) తెలుగు అనువాదం చేశారు. అప్పటికి యువకులైన మద్దూరివారుకూడా మమ్మల్ని ఆకర్షించారు. గొప్ప దేశభక్తుడైన ఈయనకూడా స్ఫురద్రూపే! ఇద్దరూ ఒకళ్లపక్కన ఒకళ్లు నిలబడి మాట్లాడుతూ ఉంటే గొప్ప ఆకర్షకంగా ఉండేది. అంతకు ముందు బిపిన్ చంద్రపాల్ గారు రాజమండ్రివచ్చి వంగవిభజనకు వ్యతిరేకంగా ఆ స్థలంలో ఉపన్యసించిన నాటినుండి దానికి ''పాల్‌చౌక్'' అని పేరు వచ్చింది. చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారి స్వీయ చరిత్రలో దీని ప్రస్తావన కనబడుతుంది. ఈ విధంగానే రాజమండ్రిలో గోదావరి గట్టున శ్రద్ధానందఘాట్ ఏర్పడింది. అకళంక దేశభక్తుడు, ఆర్య సమాజ నాయకుడు, తరువాత మతదురహంకారి చేతిలో హత్య చేయబడిన వాడు అయిన స్వామి శ్రద్ధానంద పేరున అది ఏర్పడింది. ఈ విధంగానే ఇటీవలి కాలంలో గొప్ప దేశభక్తుడు, జాతీయోద్యమ నాయకుడూ, గాంధీమార్గగామి, సీతానగరం ఆశ్రమ స్థాపకుడు అయిన బ్రహ్మ జోశ్యుల సుబ్రహ్మణ్యం (1891-1936) గారి పేరు మీద, గోదావరి స్టేషను దగ్గిర ''పెరేడ్ గ్రౌండ్'' సుబ్రహ్మణ్యం మైదానమయింది.

రాజమండ్రిలోని నా విద్యార్థి దశలోని ఒక ముఖ్య సన్నివేశాన్ని గురించి చెప్పాలి. అది రెడ్డిగారు ప్రబంధాలలో 'ఐక్యం' లేదన్న దానికి నా పద్యరూప విమర్శ. ఒక విధంగా ఇది యాదృచ్ఛికంగా జరిగినా - ఆంధ్రవిశ్వ విద్యాలయంలో నేను చేరడానికి, ఆ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సెలర్ అయిన డా॥ సి.ఆర్.రెడ్డిగారి వాత్సల్యాభిమానాల్ని పొందడానికి కారణం అయింది. మాకుటుంబం విద్యావంతమైన అన్నోదకాలున్న సామాన్య మధ్య తరగతి కుటుంబం. పెద్ద ఉద్యోగులతో గాని, ధనవంతులతో గాని, పలుకుబడిగలవారితోగాని పరిచయాలు, స్నేహాలు ఉన్నదిగాని, సంపాదించగలిగినది గాని కాదు.గౌరవ మర్యాదలున్న కుటుంబం. మా సన్నిహితబంధువుల్లో నాటికి అత్యంతోన్నతోద్యాగాలు చేస్తున్నవాళ్లు ఎవళ్లూ లేరు. కనుక, కట్టమంచి రామలింగారెడ్డిగారి వంటి వైస్ ఛాన్సెలర్‌తో సన్నిహితత్వం ఏర్పడ్డం సామాన్యంగా ఊహించలేనిమాట! ఇందువల్లనే, ఈ సన్నివేశానికి ఇంత ప్రాముఖ్యం ఉంది! సిఫార్సులు నాకోసం చేసే, చేయగలిగిన వాళ్లు ఎవళ్లూ లేరు.

రాజమండ్రి ఆర్ట్సుకాలేజీలో నాచదువుబాగా సాగింది. హాకీ, క్రికెట్ మొదలైన ఆటలు ఆడుతున్నా ఇంటర్ కాలీజియేట్ డిబేట్స్‌లో పాల్గొంటున్నా, చదువునకు సాధ్యమైనంత ఎక్కువ కాలమే వినియోగిస్తూ వచ్చాను. ఇక్కడి ఆనాటి ఆచార్యులను గురించి కొంత చెప్పాలి. ఇంగ్లీషు బెండపూడి మల్లికార్జునరావుగారు, నరసింహా అయ్యంగార్ (తమిళులు) కజ్జా వెంకటరావుగారు, కరంచంద్‌వాడేగారు, కేదారరావుగారు (మహారాష్ట్రులు) చెప్పుతూఉండేవారు. గణితం చింతలూరి సుబ్రహ్మణ్యంగారు, ప్రిన్సిపాల్‌గా ఉన్న తెన్నేటి సూర్యనారాయణగారు, చరిత్ర రాళ్లబండి సుబ్బారావుగారు (1891-1969) దామెర్ల వెంకటరావుగారు చెప్పేవారు. ఇంక భారతీయ భాషలకు వస్తే - తెలుగునకు ప్రసిద్ధ పండితులైన ప్రయాగ వెంకటరామశాస్త్రిగారు, సాగి వెంకటనరసింహంగారు; అనువాదం చెప్పడానికి సుప్రసిద్ధులైన కూచిమంచి గోపాల కృష్ణమ్మగారు ఆనాటి మా ఆచార్యులు. ప్రయాగ వెంకటరామ శాస్త్రిగారు సంస్కృత వ్యాకరణంలో దిట్టలు, మహా భాష్యం అంతా సంధ్యావందన ప్రాయంగా ఆయనకు వచ్చునసేవారు! 1903 ప్రాంతంలో ఆయన యువ కులుగా స్వగ్రామమైన తామరాడనుంచి రాజమహేంద్రవరం వచ్చినప్పుడు తమర్ని కలిశారనీ, అప్పుడు తమ దగ్గిర ఏదీ ఉద్యోగం లేకపోవడంవల్ల నెలకు ఆరు రూపాయలిచ్చి ఆయువ పండితుణ్ణి ఒక సంవత్సరం తాను పోషించాననీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ స్వీయచరిత్రలో వ్రాశారు. ప్రయాగ వారు అంతటి ప్రసిద్ధ పండితులు. ఇంక 'సాగి' వారు ఎమ్. ఏ. పట్టభద్రులు. 'త్యాగి' అనే పేరుతో పద్యాలు వ్రాసేవారు. కూచిమంచివారు ప్రాచీన పద్ధతిలో సంస్కృతంలో ఎమ్. ఏ. పట్టభద్రులై మంద్రాసు ఎడ్యుకేషనల్ సర్వీసు (ఎమ్. ఇ. ఎస్) లో ఉండేవారు. ఆనాటి భాషాశాఖాధ్యక్షులు వారు. విద్యార్థులలో క్రమశిక్షణకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఆయన మౌనంగా ఉన్నా అందరూ భయపడుతూఉండేవారు. ఆయన నవ్వడం నేను చూడలేదు.! ఆయన స్నేహశీలి అనీ, పండిత పక్షపాతి అనీ విన్నానుగాని, విద్యార్థిగా ఆయన ఈ గుణాల్ని అనుభవించే అవకాశం నాకు కలగలేదు. ఒక్కసారి మాత్రం - నా అనువాదాన్ని మెచ్చుకొని "నీకు ఇంగ్లీషు తెలుగు సమానంగా వచ్చునుగనుక అనువాదం బాగా చేస్తావు" అని అన్న తరువాత, "నేను మెచ్చుకున్నా, నీవు ఇంక నేర్చుకోవలసింది ఏదీ లేదనుకోకు!" అని హెచ్చరించారు. నేను కళాశాలలో చదువుతూనే, ప్రయాగవారి ఇంటి దగ్గిర, ఆయన బోధనలో సంస్కృత

వ్యాకరణాలంకారాదుల్ని కొంత నేర్చుకొన్నాను. ఈ చదువు నాకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను, విజయ నగరంలోను పునాదిగా పనికివచ్చింది.

నేను రాజమండ్రిలో చదివిన నాలుగు సంవత్సరాలలో చాలామంది స్థానికులైన కవులను ప్రఖ్యాతులలో చాలమంది- జాషువా (1895-1971), విశ్వనాథ, (1895-1976) కృష్ణశాస్త్రి, (1897-1980) వేదుల (1900 -1976), ప్రభృతులు పైఊళ్లనుండి అప్పుడప్పుడు వచ్చి పోయేకవులను కలిసి మాట్లాడాను. శ్రీపాద, వడ్డాది మొదలైనవారు స్థానికులైనా ప్రాచీన పద్ధతి రచనలు చేసేకవులు. ఆ ఊరికి చెందిన అచ్చమయిన ఆధునిక కవి, కవికొండల వెంకటరావుగారు (1898-1964). ఆయన మా కళాశాలకు దగ్గిరగా ఇన్నీసుపేటలో ఉండడం, ఆయన పుత్రికాపుత్రులు మాకాలేజీలో చదవడం, ఆయన నిరాడంబరత నన్నాకర్షించాయి. ఆయన కవిత్వం ఎంత మెత్తగా ఉంటుందో మనిషి హృదయం కూడా అంత మెత్తన. ప్రకృతి కవి. గాలి గట్టిగా వీస్తే ఎగిరిపోతాడా అనే టంతటి పల్చటి మనిషి. ఆయనగేయాల్లో ''శివరాత్రి ప్రభ'' మంచి ప్రచారానికి వచ్చింది. ఇంగ్లీషు కవి వర్డ్స్‌వర్త్‌లాగే ఈయనకు ప్రకృతి అంటే చాలా ప్రేమాభిమానాలు. ఆయన ప్రభావంకింద చాలా గేయాలు రచించారు. యువకులమైన మాకు సన్నిహితంగా వచ్చారు గనుకనే, ఈయన షష్టిపూర్తికి అనుకొంటాను - తెలుగు స్వతంత్రలో ఓ వ్యాసం కూడా వ్రాశాను నేను.

నేను రాజమండ్రిలో ఉండగానే ఆధునిక కవులందరితో పరిచయభాగ్యం కలిగింది అన్నాను గదా! ఇది 1936-1940 మధ్యమాట. ఆ నాటికి, తరువాతి కాలంలో చాలా ప్రసిద్ధికి వచ్చిన మహాకవులందరూ పేరు ప్రఖ్యాతులు సంపాదించే మార్గంలో ఉన్నారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారిని, నవయుగ కవి చక్రవర్తి జాషువాగారిని మొట్టమొదటి సారిగా 1937లో చూడ్డం, వారి కవితాగానం వినడం, మాట్లాడ్డం జరిగింది. ఆనాడు గౌతమీ గ్రంథాలయంలో జరిగిన సభలో విశ్వనాథవారు ''అంధభిక్షువు'', జాషువాగారు ''శ్మశానవాటిక'' చదివి సభ్యుల్ని వరవశం చేశారు. మేమప్పుడు జాషువాగారి ''పిరదౌసి'' పాఠ్యంగా చదువుతున్నాం గనుక, మేం చదివే పుస్తకం వ్రాసిన కవి మమ్మల్ని ఎక్కువగా ఆకర్షించారు. ఆరోజుల్లోనే నాకు జానపద వాఙ్మయ సేకరణ కోసం జీవితం అంకితం చేసిన నేదునూరి గంగాధరం

(1904-1970) గారితో పరిచయం. అది స్నేహంగా మారడం జరిగింది. ఆయన నుదుటిమీది ఎఱ్ఱటి రేఖాతిలకం, భుజంమీద సంచీ ఇప్పటికీ నాకంటికి ఎదుట కనబడుతూ ఉంటాయి. ఆయన వయస్సులో నాకంటె చాలా పెద్ద అయినా ఎంతో ఆదరంగా ఆప్యాయతతో స్నేహితునితో మాట్లాడేటట్లు మాట్లాడేవారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి (1897-1980) గారితో కొంత బంధుత్వం ఉండడం వల్ల, ఆయన తరుచుగా రాజమండ్రి వస్తూ ఉండడంవల్ల భావకవుల్లో మొట్టమొదట ఆయన్నే బాగా ఎరుగుదుననాలి. ఆయన రూపరేఖలు ఆకర్షకాలు. ఆయన రచనలకున్న సహజ ప్రచారాన్ని ఇనుమడింపజేసే పద్ధతిలో వాటిని గానం చేసే వింజమూరి సోదరీ మణులను - సీతా అనసూయగార్లను - కూడా (1872- 1950) అప్పటినుంచీ ఎరుగుదును. శ్రీ అరవిందుల అనన్య భక్తుడై ఎప్పుడూ ''లైఫ్ డివైన్'' (Life devine) పుస్తకహస్తుడై కనబడే తిరుపతి గారినికూడా అప్పటినుంచీ ఎరుగుదును. వారి ఇంటిపేరు ''ఉల్లి'' వారుట! కాని, ఆ పేరు ఎవరేనా ఎత్తుతే ఆయున మండిపడిపోయేవాడు. మా ఇంటిపేరు 'అరవిందం' వారు అనే వారాయున. చిత్రకారుడుగా, కళాకారుడుగా ఇప్పుడు లబ్ధ ప్రతిష్ఠుడైన బుజ్జాయి (సుబ్బారాయశాస్త్రి) అప్పటికి చాలా చిన్నవాడు. తండ్రిగారితో కలిసి రాజమండ్రి వచ్చినప్పుడు, కృష్ణశాస్త్రిగారిని చూడ్డానికి వెళ్లినప్పుడు కనబడేవాడు. చాలా సౌమ్యంగా వుండేవాడు. అప్పటికీ చిత్ర కళాకుశలుడు.

రాజమండ్రిలో బి.ఏ. అయిన తరువాత ఆంధ్రవిశ్వవిద్యాలయంలో చేరడానికి ఒక విధంగా విస్సా అప్పారావు (1884-1966) గారు కారణం. ఆయన మాకుటుంబానికి రాజమండ్రిలో మిత్రులు. ఓసారి గౌతమీ గ్రంథాలయానికి వచ్చినప్పుడు మాఇంటికి వచ్చారు. నేనప్పుడు అక్కడ ఉండడం వల్ల ప్రసంగవశాత్తు, నాభావి విద్యా వ్యాసంగం సంగతి వచ్చింది. నేను తెలుగులో ఆనర్సు క్లాసులో చేరితే బాగుంటుందని సూచించారు. ఆయన అప్పుడు ప్రిన్సిపాల్గా ఉండడంకూడా - పెద్ద దిక్కుగా ఉంటుందనే భావంతో - మా అమ్మగారు ఒప్పుకోవడానికి కారణం అయింది. ఇదిగాక, అప్పుడు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పండిత పదవిలో ఉన్న మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు ఒకప్పుడు రాజమండ్రి యందుండడం వల్ల మాకుటుంబాన్ని ఎరుగుదురు. అప్పుడక్కడ తెలుగు శాఖలో పింగళి లక్ష్మీకాంతం

గారు (1894-1972), గంటి జోగిసోమయాజిగారు (1900-1987), వఝుల చినసీతారామ స్వామిశాస్త్రిగారు (1878-1964), మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు (1889-1962), అబ్బూరి రామకృష్ణారావుగారు (1896-1979), ఉండేవారు. అది 1940వ సంవత్సరం. నేను ఫోర్తు ఆనర్సులో చేరడంవల్ల, అప్పటికప్పుడే థర్డ్ ఆనర్సులో చేరి ఒక సంవత్సరం తరువాత ఫోర్తు ఆనర్సులోకి వచ్చిన కవిగా ఆచార్యునిగా, ప్రిన్సిపాల్‌గా ఈనాడు లబ్ధ ప్రతిష్ఠులైన నండూరి రామకృష్ణమాచార్యులుగారు నాకు క్లాసుమేటు అయ్యారు. కలుసుకొన్న మొదటి రోజునుంచీ మేం స్నేహితులమయ్యాం. అది నేటికీ కొనసాగుతోంది. ఆ రోజుల్లో మాతో చదువుకొని (రాజనీతిశాస్త్రం) తరువాత రాజకీయ సాహిత్యరంగాలలో ప్రసిద్ధులైన వారిలోఅబ్బూరి వరదరాజేశ్వరరావుగారొకరు. ఇదేవిధంగా, పాత్రికేయునిగా, లలితకళా విమర్శకునిగా, ఆంగ్ల రచయితగా లబ్ధప్రతిష్ఠులైన ఇంకొకరు ఎ.ఎస్. రామన్ గారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం గుంటూరులో ఉన్న ప్రారంభ సంవత్సరంలో (1942) నేనక్కడ పరిశోధన కోసం చేరడం రాయప్రోలు సుబ్బారావుగారి ద్వితీయ పుత్రిక లలితతో నా వివాహం జరగడానికి, నేను విజయనగరం కళాశాలలో ఉద్యోగంలో చేరడానికి సాయపడింది. ఇప్పుడు, ఈ రెండింటికి పునాదివేసిన సభను గురించి చెప్పాలి. మహా మహోపాధ్యాయ తాతా సుబ్బారాయుడు శాస్త్రిగారి దగ్గిర విజయనగరంలో చదివిన వారిలో సాహిత్య మార్గంలో విశిష్టస్థానాన్ని సంపాదించినవారు జమ్ములమడక మాధవరామశర్మగారు. ఆయన 'నవరస గంగాధరం' అనే పేరుతో జగన్నాథ పండితరాయల రస గంగాధరం తెలుగుచేశారు. దాని ప్రథమానవం ఆవిష్కరణ సభ జూలై 1942లో గుంటూరులో జరిగింది. దాన్ని ఆయన తమ గురువులైన తాతావారికి అంకితం చేశారు. ఇది నవ్యసాహిత్య పరిషత్తు పక్షాన వెలువడింది. తెలుగు సాహిత్య మాలా సీరీజ్ అని ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు సంపాదకులుగా ప్రారంభమైన దానిలో ఈ రచన మొదటిది. సంస్కృతంలోని ఈ అలంకార శాస్త్ర గ్రంథాన్ని తెలుగులోనికి అనువాదం చేయించాలని రాయప్రోలు వారికి చిరకాలం నుండి ఉన్నకోరిక దీనివల్ల నెరవేరిందని తరువాత తెలిసింది. అంకితం తీసుకోవడంకోసం తాతావారు విజయనగరం నుండి

వచ్చారు. ఆ సభలో విస్సా అప్పారావుగారుకూడా ఉన్నారు. సభ బాగా జరిగింది. ఆ సభలో విస్సావారి ప్రోత్సాహంవల్ల కొత్తగా తెలుగులో ఎం.ఏ. ప్యాసయి వచ్చిన నాకు కూడా నాలుగు మాటలు చెప్పే అవకాశం కలిగింది. బాల్యం నుండి తెలిసిన విషయాన్ని నిర్భయంగా చెప్పే అలవాటున్న నేను సమయోచితంగా కొంచెంసేపు మాట్లాడాను. అంతకి పూర్వమే నేను ప్రతాపరుద్రీయం, కావ్య ప్రకాశం చదివి ఉండడంవల్ల బాగానే మాట్లాడాను అనుకొన్నాను. తాతా సుబ్బారాయుడు శాస్త్రిగారు ఆకర్షితులై నన్ను గురించి నా చదువును గురించి ప్రశ్నించి వివరాలు తెలుసుకొన్నారు. నాకింకా మీలాంటి పెద్దల దగ్గిర సంస్కృతం చదువుకోవాలని ఉందని నేనన్నాను. అప్పుడాయన, ''మా ఇంగ్లీషు కాలేజీలో - విజయనగరంలో సంస్కృత కళాశాల, సంగీత కళాశాలలు ఉండడంవల్ల, ఇంటర్, బి.ఏ. లున్న కళాశాలను ఇలా పిలుస్తారు - ఓ కాలీ ఉన్నట్లుంది. నేను ప్రిన్సిపాల్ శొంఠి పురిషోత్తంగారిని కనుక్కొంటాను'' అన్నారు. నేను రిసెర్చికి చేరిన విషయం చెప్పి పింగళివారి సలహా ప్రకారం చేస్తాను అన్నాను. అంతకి పూర్వం, రాయప్రోలు సుబ్బారావుగారిని 1941లో ఆయన విశాఖపట్టణం వచ్చినప్పుడు చూశాను. 1941సంవత్సరంలోనే వాల్తేరులోనే నేను డా॥ పట్టాభి సీతారామయ్యగారిని చూచి మాట్లాడ్డం జరిగింది. ఆయన హాస్టల్ విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడారు అద్భుతంగా ఇంగ్లీషులో. ఆయన వ్రాసిన కాంగ్రెస్ చరిత్ర రాజమండ్రిలో చదువుతున్నప్పుడు బహుమానంగా ఇచ్చారు. అప్పుడు గౌరవం ఏర్పడింది. ఇప్పుడు చూడ్డం జరిగింది. గాంధీజీ సూత్రకారుడైతే ఈయన భాష్యకారుడు అనిపేరు పొంది ఉన్నారు. తరువాత 1953లో భోగరాజు వారి దౌహిత్రి శ్రీమతి రాజేశ్వరిని మాబావమరిది శ్రీమార్తాండం వివాహం చేసుకోవడంతో సీతారామయ్యగారిని నేను చాలా సార్లు కలిసి మాట్లాడడం జరిగింది.

అదే మొదటిసారి ఇద్దరినీ చూడ్డం! రాయప్రోలువారు హైదరాబాదులో ఉద్యోగంలో ఉండడంవల్ల కోస్తా ప్రాంతాలలో విశేషంగా కనబడేవారుకారు. మిగిలిన ఆధునిక తెలుగు కవులను - ఇంచుమించుగా అందరిని అనాలి - 1936 నాటికే నేను ఎరుగుదును. చాలామందిని కలిసి మాట్లాడాను. రాయప్రోలు వారు దూరస్థులు కావడం వల్ల 1941 వరకు కలియడం జరగలేదు. గుంటూరులో కలిసి నప్పుడు, విస్సా అప్పారావుగారు నన్ను మళ్లీ పరిచయం చెయ్యడం, నేను 1941లో వాల్తేరులో

ఆయన్ని విశ్వవిద్యాలయంలో కలియడం జ్ఞాపకం చేశాను. అప్పుడు ఆయన చదివిన ''వంశిన్‌వంచివ్యృణాళవమున్ మెలిచి'' అనే పద్యాన్ని జ్ఞాపకం చేశాను. సభ ముగిసింది. తరువాత విజయనగరం కాలేజీవారు - దరఖాస్తుకూడా లేకుండా - ఆర్డరు పంపించడం జరిగింది. పింగళి లక్ష్మీకాంతంగారిని సలహా అడిగాను. ఆయన వెంటనే ''వెళ్లిచేరు. అదిమంచికాలేజి. నువ్వు ఇంకా చదువుకోవచ్చు. ఇక్కడ నరసింహం స్కాలర్‌షిప్ మీద ఉన్నాడు. ఇంకోటి దొరకడం కష్టం'' అన్నారు. నా పరిస్థితికూడా ధన సాహాయ్యంలేకుండా గుంటూరులో ఉండి పరిశోధన సాగించగలిగిన స్థితిలో లేదు. వెంటనే విజయనగరంలో వెళ్లి చేరాలనే నిర్ణయానికి వచ్చి, మా అమ్మగారు, బావగారు, అక్కయ్య, పిన్ని ఉన్న రాజమండ్రి వచ్చాను. అక్కడి నుండి బయలుదేరి విజయనగరం వచ్చి చేరాలని నిర్ణయించుకొన్నాను.

ఉద్యోగంలో నేను విజయనగరంలో ఉన్న 17 సంవత్సరాల్లో **10,12** సంవత్సరాలు - ఇంచుమించుగా - విద్యార్థిలా జీవించాను. ఎన్ని నేర్చుకోవడానికి అవకాశాలున్నాయో అన్నీ కొంచెం కొంచెం చవిచూశాను. నా జీవిత ధ్యేయం పఠన పాఠనాదులనీ, అవి తెలుగు భాషా సాహిత్యాలకు, మన సంస్కృతికి సంబంధించినవై ఉండాలనీ ఏనాడో నిర్ణయించుకొన్నాను. ఆ నిర్ణయానికి తగిన అవకాశాలు విజయనగరంలో ఉన్నవాటిని ఉపయోగించుకొన్నాను. విజయనగరం - మహారాజుల పోషణవల్ల - నిజంగా విద్యానగరమే. ఏ చదువు చదవాలన్నా, ఏకళను అభ్యసించాలన్నా అవకాశాలుండేవి. పేద విద్యార్థులకు భోజనాది సదుపాయాలు ''సత్రం''లో కల్పించడం వల్ల యావదాంధ్రం నుంచి విద్యార్థులు - సంస్కృత, సంగీత, ఇంగ్లీషు కళాశాలల్లో చేరడానికి వచ్చేవారు. ఆరోజుల్లోనే ఘంటసాల వెంకటేశ్వరరావుగారు (1922-1974) సత్రంలో భోజనం చేస్తూ పట్రాయన సీతారామశాస్త్రిగారి దగ్గిర గాత్రం నేర్చుకోవడం నాకు తెలుసును. హరికథా పితామహులు, సంగీత కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్‌అయిన అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు(1834-1945)గారిని దర్శించి వచ్చేవాడిని. నేను వెళ్లిన తరువాత రెండు మూడేళ్లు ఈయన జీవించి ఉన్నారు. విద్యార్థులు తమ్ము పరివేష్టించి ఉండగా ఈయన వీధుల్లో సంచరిస్తూ ఉండేవారు. అకస్మాత్తుగా ఒకచోట ఆగి, శిష్యుల్ని ''హరికథ చెప్పండి'' అనేవారు. వాళ్లు ఏమాత్రం సంకోచించినా ఆయన ఊరుకొనేవారుకాదు. ''మీకున్న సభాకంపం

పోవాలి. అందుకే ఇది'' అని అక్కడ నిల్చుండేవారు. ఓ సారి అలాగ, విజయనగరం మెయిన్‌రోడ్డుమీది గంట స్తంభం దగ్గిర ఈయన శిష్యుల చేత హరికథ చెప్పించడం నేను చూశాను! ఇప్పుడు నేపథ్య గాయనీమణిగా ప్రఖ్యాతి పొందిన పి.సుశీలగారు, వాళ్లనాన్నగారితో వచ్చి ద్వారం వెంకట స్వామినాయుడుగారి దగ్గిర పాడ్డం నాకు బాగా జ్ఞాపకం ఉంది. వాళ్లనాన్నగారు ముకుందరావుగారని ఆ ఊళ్లో ప్రఖ్యాతికెక్కిన లాయరు. అప్పటికామె చిన్నపిల్ల. చాలా ప్రతిభావంతురాలని చెప్పుకొంటూ ఉండేవారు. తరువాత అది రుజువయింది.

నేను, 1942లో డాక్టరేటు పరిశోధనకోసం, ఆంధ్రవిద్యాలయం గుంటూరులో ఉండగా తెలుగుశాఖలో చేరినా, విజయనగరంలో ఉద్యోగం రావడంతో- ఆనాటి ఆర్థికాది పరిస్థితుల ననుసరించి, పెద్దల సలహాల ననుసరించి- మహారాజావారి కళాశాలలో ఉద్యోగంలో చేరడం జరిగింది. నేను, అక్కడ ఎనిమిది సంవత్సరాలు ఉద్యోగం చేసిన తరువాత, మా కాలంలో శాఖాధ్యక్షులుగా ఉన్న పింగళి లక్ష్మీకాంతంగారు రిటైరు అయి, గంటి జోగి సోమయాజులు గారు శాఖాధ్యక్షులైన కాలంలో, 1950లో డాక్టరేటు కోసం పరిశోధన విద్యార్థిగా - జీతం నష్టం మీద రెండు సంవత్సరాలు సెలవు తీసుకొని ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరాను. అనాటి నా పరిస్థితులలో అది సాహసమే! ఉద్యోగం చేసుకొంటూ పరిశోధన, డిగ్రీకోసం చేసే అవకాశం, ఇతర కళాశాలాధ్యాపకులకు ఆనాడు లేదు. ఉద్యోగం మానుకొని పూర్తికాలం విశ్వవిద్యాలయంలో చేరి పరిశోధన చేయవలసిందే! ఈ సాహసం చెయ్యలేనివారు, విశాఖ పట్టణంలోనే ఉన్నా స్థానిక కళాశాలాధ్యాపకులు డాక్టరేటు చెయ్యలేదు - తరువాత తరువాత, నామిత్రులలో కొందరు ఈ నియమాలు లేని రాష్ట్రేతర విశ్వవిద్యాలయాలలో పేరు నమోదుచేసుకొని ప్రైవేటుగా డిగ్రీలు సంపాదించారు!.

నేను పిహెచ్.డి. కోసం విశ్వ విద్యాలయంలో చేరేనాటికి (1950)లో నాకు వివాహం అయింది (1944). బాధ్యతకొంత పెరిగింది. కాని నాభార్య పూర్ణ సహకారం ఇయ్యడం వల్ల ప్రోత్సహించడంవల్ల ఈ సాహసకార్యం చెయ్యగలిగాను. ఆమెకు చిన్నతనం నుండి జన్మతః వచ్చిన సాహిత్యాభిరుచి కాకుండా - అన్నలు భాషా

సాహిత్యాభిమానులు, రచయితలు అయిన శ్రీ రాజశేఖర్ తరువాత ఏ.ఐ.ఆర్, శ్రీ మార్తాండం తరువాత ఇంజనీరు-కవిగా శ్రీనివాస్‌రాయప్రోల్ గార్ల ప్రభావం వల్ల వివాహం నాటికే ఇంగ్లీషు సాహిత్యంతో సన్నిహిత సంబంధం, లోతైన అవగాహన ఉండడంవల్ల - నా సాహిత్య కృషికి నిస్సంకోచంగా, హృదయ పూర్వకంగా సాయపడింది. ఆమె ఏమాత్రం ''ముభావం'' గా ఉన్నా నేనీ సాహసం చెయ్యలేక పోయేవాణ్ణి! ఆమె తనకున్న సాహిత్యాభిమానంవల్ల, రచనా పాటవంవల్లనే - చిన్ననాడే, తెలుగు స్వతంత్రకు, ఆంధ్ర మహిళకు రచనలు చేసింది. తరువాత ప్రైవేటుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సోషియాలజీలో ఎమ్.ఏ. కూడా చేసింది. ఆమె ప్రోత్సాహంతోనే - నేను జీతం నష్టం మీద రిసెర్చికి చేరగలిగాను. నాకు పిత్రార్జితంగా పశ్చిమగోదావరి జిల్లాలో పెంటపాడు దగ్గర మా గ్రామం చిలకంపాడు (చెరుకుగనమ అగ్రహారం)లో ఉన్న పంటపొలం అమ్మి డబ్బు సమకూర్చుకొని ఆంధ్ర విశ్వ విద్యాలయంలో రిసెర్చికి చేరాను. ఆనాడు ''వేలు'' వచ్చిన భూమిధర, ఈనాడు లక్షలమీద ఉంది! అయితే, డిగ్రీ వస్తే వెంటనే వచ్చేది ఏమీలేదు ఆనాడు. డాక్టరేటు సంపాదించాలనే పట్టుదల! తరువాత కూడా డిగ్రీ వస్తే పెద్ద ఒరిగింది ఏమీలేదు. చాలాకాలం దాకా పరిస్థితి ఇది.

నాకంటె ముందు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో 1942నాటికే చేరి పరిశోధన చేసి డిగ్రీ పొందిన కాకర్ల రామనరసింహంగారు తరువాత ఉద్యోగం లేక బాధపడుతూఉంటే, విజయనగరం మహారాజావారి కళాశాలలో 1942లో చేరిన నేను ప్రాచ్య భాషా శాఖాధ్యక్షునిగా ఉండగా ఆయన్ని ఆశాఖలో ట్యూటరుగా తీసుకోవలసి వచ్చింది. మంచి విద్వాంసులైన ఆయన, తరువాత ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరి లబ్ధ ప్రతిష్ఠులై ఆచార్యులైనా, ఆనాటి పరిస్థితిని తెలియ జేయడానికి ఇది చెప్పాను. నేను కూడా 1956లోనే డాక్టరేటు పొందినా, 1978లో హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం వచ్చేవరకు - ఢిల్లీలో ఉద్యోగం చేసినా, అమెరికాలో బోధించివచ్చినా - ఆచార్యునిగా కాలేదు! పరిస్థితులు రెండు మూడు దశాబ్దులు తరువాత కూడా అలా ఉండగా, 1950లో నేను చేసినది సాహసమే! విద్యావ్యసనం! పట్టుదల అలా ఉండేది.

అప్పటికి ఆంధ్రవిశ్వవిద్యాలయంలోనే తెలుగునకు ఆచార్య స్థానం లేదు. కవులని, విమర్శకులని, ఉత్తమాచార్యులని పేరు పొందిన పింగళి లక్ష్మీకాంతంగారు అక్కడి నుండి రీడరుగానే రిటైరు అయ్యారు. తరువాత గంటి వారు ఆస్థానానికి వచ్చారు. ఆయన కూడా రిటైరు అయితే, నేను గురువుగా గౌరవించగలిగిన వారెవ్వరూ అక్కడ నాకు సూపర్‌వైజరుగా ఉండడానికి - విశ్వవిద్యాలయ నిబంధనలనుసరించి- ఎవ్వరూ ఉండరనే భావంతో నేను చేరాను. పరిశోధక విద్యార్థులుంటే తన హోదాకు తగినట్లు ంటుందని గంటివారు కూడా నన్ను ప్రోత్సహించారు. అప్పటికి ఆయన రీడరే!

నావిజయనగరం జీవితానికి సంబంధించిన రెండు ముఖ్యవిషయాలు ఇక్కడ చెప్పాలి. మొదటిది - ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యోగం కోసం పెట్టిన దరఖాస్తులు, రెండోది - దూరంగానయినా రాజకీయాలతో నాకు కలిగిన పరిచయం. దీనిలో మొదటి దాన్ని గురించి ముందు చెప్పుతాను. ఇది ఆనాటి - అంటే 1950ముందు నాటి - తెలుగు అధ్యాపకులకు కొంతవరకు సంబంధించినది. దీన్ని గురించి తెలిసినవాళ్ళు ఇప్పుడు చాలా తక్కువమంది ఉన్నారు. తెలిసినవాళ్లున్నా ఉస్మానియా విశ్వ విద్యాలయానికి చెందకున్నా, ఆ ప్రయత్నాలు చేసినవాళ్లు మరీ తక్కువ, లేరన్నా తప్పు కాదేమో!నేను ఈ ప్రయత్నాల్లో పాల్గొన్నవాణ్ణి కనుక ప్రత్యక్షసాక్షి నన్నమాట! దీన్ని రెండుగా విభజించ వచ్చును. పోలీసు ఆక్షన్(Police Action) నకు ముందు, దాని తరువాత అని చెప్పవచ్చును. ఆ రోజుల్లో ఎక్కడా తెలుగులో ఆచార్య స్థానం విశ్వవిద్యాలయాల్లో లేనప్పుడు ఉస్మానియాలో ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు ఆచార్యులుగా ఉండేవారు. అది నిజాము పరిపాలనా కాలం. పోలీసు చర్యకు (1948 సెప్టెంబరు) పూర్వం తెలుగు లెక్చెరరు ఉద్యోగానికి కొన్ని ఇంటర్వ్యూలు జరిగాయి. 1942లో ఎం.ఏ. ప్యాసు అయి అప్పటికే విజయనగరం కళాశాలలో 6 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించిన నేనొక అభ్యర్థిని. పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఒక అభ్యర్థి. ఇద్దరం రాయప్రోలువారి అతిథులమే! అప్పుడెవర్నీ నియమించలేదు. రాయప్రోలు వారు 1948లో రిటైరయిన తరువాత, ఖండవల్లి లక్ష్మీరంజనంగారు - వీరు మొదటి నుండి ఉస్మానియాలో ఉన్నవారే - శాఖాధ్యక్షులయ్యారు. పోలీసుచర్య తరువాత, మళ్లీ ఇంటర్వ్యూ

లయ్యాయి. అప్పుడు అలీయవార్‌జంగ్‌గారు వైస్ ఛాన్సెలర్‌గావచ్చారు. ఆ ఇంటర్వ్యూ చాలా విశిష్టమైనది. దానిలో పాల్గొనడానికి ఆనాడు దేశంలో తెలుగు విద్వాంసులుగా ఆచార్యులుగా ప్రసిద్ధులైన ''హేమాహేమీలు'' చాలామంది వచ్చారు. వారిలో - పింగళి లక్ష్మీకాంతంగారు, గంటి జోగి సోమయాజిగారు, విశ్వనాథ సత్యనారాయణగారు, నిడుదవోలు వెంకటరావుగారు ఉన్నారు. ఉస్మానియాలో ఆనాడు మిగిలిన విశ్వవిద్యాలయాలకంటె జీతాలు ఎక్కువ. విద్యా సంబంధమైన స్వేచ్ఛ ఎక్కువ.

నేను కూడా ఒక అభ్యర్థిని ఆనాడు. సెలక్షన్‌కమిటీలో రాయప్రోలు సుబ్బారావుగారు, ఖండవల్లి లక్ష్మీరంజనం గారు ఉన్నారు. అలీయ వార్‌జంగ్‌గారికి రాయప్రోలువారు, తమకు ఇంచుమించుగా తమకు సమకాలికులైన ఆ పండితకవులను పరిచయంచేశారు. విశ్వనాథవారు మహాకవి అని, బహుగ్రంథకర్త అని సుబ్బారావుగారు పరిచయం చేశారట! వి.సి.గారు చాలా మర్యాదగా ''మీరు వ్రాసిన ఒకటి, రెండు పుస్తకాల పేర్లు చెప్పండి'' అన్నారట! అప్పుడు విశ్వనాథవారు ''నేను బండెడు పుస్తకాలు వ్రాశాను'' అనే భావంతో "I wrote a cart load of books" అన్నారట! "All are important, how can I name" అన్నారుట! బైటికి వచ్చి అందరికంటె చిన్నవాణ్ణి నేనూ ఉన్నాను. ఇది ఆయనే నాతో సగర్వంగా చెప్పారు. గంటివారిని '' మీరుద్యోగంలో ఒక విశ్వవిద్యాలయంలో ఉన్నారుగదా! ఈ ఉద్యోగం మీకెందుకు?'' అని అడిగితే ఆయన ''అక్కడికంటె ఇక్కడ జీతం ఎక్కువ'' వంటి ప్రసంగంఏదో చేసినట్లు తెలిసిందనీ అది ఆయనకు సహజంగానే ఉందని అనుకొన్నారనీ నిడుదవోలువారు తరువాత అన్నారు. పింగళి, నిడుదవోలుగార్ల విషయంలో రిటైర్మెంటు ప్రస్తావన వచ్చిందట! ''యువకులెవరైనా ఉంటె బాగుంటుంది'' అని వి.సి. గారన్నారని, అప్పుడు ''మీ ప్రస్తావనే వచ్చింది'' అని తరువాత నాయందభిమానం మొదటినుండి ఉన్న ఖండవల్లివారు నాతో చెప్పారు. ఇంతలో భారత ప్రభుత్వంవారు అలీయవార్ జంగ్ గారిని రాజదూతగా నియమించడంతో ఆయన వెళ్లిపోయారు. తరువాత, ఉస్మానియా విశ్వ విద్యాల యంలో లెక్చెరరుగా చేరిన దివాకర్ల వెంకటావధానిగారి ప్రసక్తి ఆనాటికి లేదు. అలీయవార్‌జంగ్ గారి తరువాత వి.సి. గావచ్చిన రిజాఉద్దీన్ సిద్దికీ గారనుకొంటాను. అలీయవార్‌జంగ్‌గారు నిర్ణయించిన పానెల్ (Panel) ను రద్దు చేశారట! ఈ పానెల్‌లో నాపేరుందని తెలిసింది.

అప్పుడు ఎవర్నీ వెయ్యలేదు. తరువాత, జనవరి 26, 1950లో హైదరాబాదు స్టేటు ఇండియన్ సమాఖ్యలో చేరడంతో నిజాం రాజ్‌ప్రముఖ్‌గా ఎం.కే. వెల్లడి. ఐ.సి.ఎస్. ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడాయన ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పర్చారు. దానిలో ఆచార్య తణికెళ్ల వీరభద్రుడుగారు - వెల్లోడిగారికి గురువని తెలుస్తోంది - ఒకమెంబరు. ఆనాటికి తెలుగులో - డా॥ చిలుకూరి నారాయణరావు గారికి (1929) డా॥కె. వి. ఆర్.నరసింహంగారికి (1945) తప్ప ఎవ్వరికీ పిహెచ్.డి. లేదు. సర్వీసు కమిషన్ రూల్స్ ప్రకారం, 30 సంవత్సరాలు దాటిన అభ్యర్థి, ఉద్యోగానికి సెలెక్టు కావడానికి అర్హుడుకాడు. వెల్లోడి గారి మంత్రి మండలిలో ఉద్యోగి వర్గానికి చేరని సభ్యులు నలుగురు. వీరిలో బూర్గుల రామకృష్ణారావుగారు, వల్లూరి బసవరాజుగారు ఉన్నారు. సర్వీసు కమిషన్ ముందు జరిగిన ఇంటర్వ్యూలో అభ్యర్థి నేను (నాకప్పటికి 28 ఏళ్లు), దివాకర్ల వెంకటావధానిగారు ఇంకా కొందరు ఉన్నాము. నేనప్పటికి (1950) 8 సంవత్సరాలనుండి విజయనగరం కళాశాలలో ప్రాచ్య భాషాశాఖాధ్యక్షునిగా బి. ఏ. తరగతులు బోధిస్తున్నాను. ఫస్టుక్లాసు, యూనివర్సిటీ ఫస్టు మొదలైన వాటితో బాటు వయస్సుకూడా రూల్సునకు లోబడి ఉంది. కాని నేను సెలెక్టు కాలేదు! ఇంటర్వ్యూ అంతా ఇంగ్లీషులోనూ, కొంత తెలుగులోను జరిగింది. రెహమాన్ అనే పేరుతో ఒక సభ్యుడున్నట్లు జ్ఞాపకం. ''మీకీ ఊళ్ళో ఎవరేనా బంధువులున్నారా?'' అని వీరభద్రుడు గారు తెలుగులో అడిగారు. అప్పటికి రాయప్రోలు సుబ్బారావుగారు రిటైరై పోయారు. ''రాయప్రోలు వారు మామామగారు'' అన్నాను. ఆయన ఏమీ మాట్లాడలేదు. ఉద్యోగాల్లో ఉన్నప్పుడు ఇద్దరి మధ్య కొంత స్పర్థ ఉండేదని తరువాత తెలిసింది. తరువాత ఆయన ''పక్వ బింబాధరోష్ఠీ'' అని చదివి ''ఇది ఎక్కడిది'' అన్నారు. ''ఇది ఎక్కడిదైనా కావచ్చును. కాని మేఘసందేశంలో ఇలా ఉంది'' అని నేను ''తన్వీశ్యామాశిఖరి దశనా పక్వబింబాధరోష్ఠీ'' అనే మేఘదూత కావ్యంలోని పాదం చదివాను. వెంటనే ఆయన "Much Ado About Nothing" ఎవరు వ్రాశారు అన్నారు. నేను షేక్స్పియర్ అన్నాను. ''గోదావరి కున్న రెండు ఉపనదుల పేరు చెప్పండి'' అన్నారు. నేను మంజీర, శబరి - అన్నాను. ఇంటర్వ్యూ ముగిసింది. నాకా ఉద్యోగం రాలేదు. రూల్సు ప్రకారం ఉండవలసిన వయస్సుకంటె ఎక్కువ వయస్సున్నా (30సంవత్సరాలు నియమం) దివాకర్ల వెంకటావధానిగారికి ఆ ఉద్యోగం వచ్చింది! అప్పటికి ఎవ్వరికీ డాక్టరేటు

డి(గ్రీలేదు. దాని తరువాత నేను, జీతం నష్టం మీద 1950లో రెండేళ్లు సెలవు పెట్టి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి. కోసం చేరాను. నాకు ఉద్యోగం రాకపోవడాన్ని గురించి పలువురు పలువిధాలుగా అనుకొన్నారు! దివాకర్ల వెంకటావధానిగారు ఉస్మానియాలో చేరి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి దగ్గిర పిహెచ్.డి.చేశారు. ఈయనకు 1957లో డి(గ్రీ వచ్చింది. నాకు 1956లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి వచ్చింది. ఖండవల్లివారి దగ్గరే పరిశోధన చేసిన బిరుదురాజు రామరాజుగారికి 1956లోనే డి(గ్రీ వచ్చింది. ఈ విధంగా, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సంబంధించిన మట్టుకు అప్పటి నా ఉద్యోగ పర్వం ముగిసింది. నేనింతకుముందే చెప్పినట్లు ఉస్మానియాలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి ఔదార్యంవల్ల, శిష్యవాత్సల్యంవల్ల, ఇతర సదుపాయాలవల్ల, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పట్ట భద్రులైనవారు అనేకులు ఉస్మానియా నుండి డాక్టరేటు తీసుకొన్నారు. ఇవన్నీ ముగిసిన తరువాత, నేను ఢిల్లీ విశ్వ విద్యాలయంలో ఉండగా - ఇంకోసారి నేను ఆచార్య పదవికి ఉస్మానియా ఇంటర్వ్యూకు వచ్చాను. ఇంటర్వ్యూ 30-3-1964 న జరిగింది. అప్పుడూ నాకు రాలేదు! తరువాత, తరువాత నాకు హైదరాబాదు కేంద్ర విశ్వ విద్యాలయంలో ఆచార్య పదవి లభించినప్పుడు కొందరు మిత్రులు ''నువ్వు ప్రొఫెసరు కావడానికి కొత్త విశ్వవిద్యాలయం పెట్టవలసి వచ్చింది'' అన్నారు! అందరం నవ్వుకున్నాము!

నేను ఢిల్లీలో ఉండడంవల్ల నాకు కలిగిన అనుభవాలలో ప్రత్యేకంగా చెప్పవలసినది - మాన్యమహోదయులు, ప్రాక్ప్రతీచీతత్త్వశాస్త్ర నిష్ణాతులు, మహా వక్తలు మన ఉపరాష్ట్రపతులు, తరువాత రాష్ట్రపతులు అయిన మాన్యశ్రీ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ మహాశయులతో కలిగిన సన్నిహిత పరిచయానుభవం. నాడు ఢిల్లీవాసులు, ప్రముఖ పాత్రికేయులు అయిన శ్రీ కె. ఈశ్వరదత్తుగారు, మాన్యశ్రీ బెడవాడ గోపాలరెడ్డిగారు నన్నుగురించి చెప్పడం వల్ల, నేను మహాకవులు ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి అల్లుణ్ణి అని తెలియడంవల్ల, సర్వేపల్లి వారికి సహజంగా ప్రతిభావంతుల యందున్న ఆదరాభిమానాలవల్ల - నాయందు వారికి అవ్యాజ వాత్సల్యం ఏర్పడింది. ''తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావం'' అనే నా పుస్తకాన్ని చదివి మెచ్చుకొని, ''మీరు దీన్ని అంకితం తీసుకోవాలి'' అని నేను అడిగిన వెంటనే

ఒప్పుకొన్నారు. తరువాత తరువాత నేను ఎన్నోసార్లు వారు ఉపరాష్ట్రపతిగా ఉండగా, రాష్ట్రపతిగా ఉండగా వారిని కలుసుకొన్నాను. ఎప్పుడూ వాత్సల్యానురాగాలతో నన్ను చూచేవారు. మేమిద్దరం ఎప్పుడూ తెలుగులోనే మాట్లాడుకొనేవాళ్లం. ఆయనకి వందల కొలది తెలుగు పద్యాలు నోటికి వచ్చును. ప్రసంగాలలో ప్రస్తావన వచ్చినప్పుడు అవి అలవోకగా చదువుతూ వుండేవారు. నాకు వారు మంచి చనువు ఇయ్యడంవల్ల వారు విశ్రాంతి తీసుకొనే గదిలో మాట్లాడుకొనేవాళ్లం. ఆయన మంచంమీద శయనించి ఉండేవారు. నేను ఎదురుగా కుర్చీలో కూర్చునే వాణ్ణి. అప్పుడప్పుడు ఆయన ఆగదిలో పచారుచేస్తూ ఉండేవారు. నేను కూడా పక్కనే నడుస్తూ, లేదా ఒకచోట నిలబడి మాటలు సాగించేవాణ్ణి. ఆయన రాష్ట్రపతిగా ఉండగా కూడా ఇలాగే జరిగేది. ఆయన సాధారణంగా సన్నిహితులైన అతిథులకు - ''తియ్యని బూంది, కారబ్బూంది'' తెప్పిస్తూ ఉండేవారు. తరువాత అతిథి ఇష్టానిష్టాన్ని బట్టి టీగాని కాఫీగాని తెప్పించేవారు. మేధావులతో వారికి కలిగిన అనుభవాల్ని గురించి చెబుతూఉంటే మనం చెవియొగ్గి వినడం తప్ప చెప్పడానికి ఏమి ఉంటుంది?

ఆ రోజుల్లో కవి పండిత పక్షపాతులు, సహృదయులు, దామోదరం సంజీవయ్యగారు కూడా అక్కడే ఉంటూ ఉండడంవల్ల, ఆంధ్ర భాషా సాహిత్యాభిమానంతో వారు నడుపుతూ వచ్చిన ''తెలుగు సాహితి'' కార్యక్రమాలలో నేను పాల్గొంటూ ఉండేవాణ్ణి. నార్ల వెంకటేశ్వరరావుగారిని తరచు కలుసుకొంటూ, వారి సతీమణి శ్రీమతి సులోచనమ్మగారి ఆతిథ్యాన్ని పొందేవాణ్ణి. ఇదే విధంగా గోపాలరెడ్డిగారి ఇంటికి వెళ్లినప్పుడల్లా వారి సతీమణి శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారి ఆతిథ్యం లభించేది. ఇదిగాక, ఇన్ఫర్మేషన్ మినిస్టరుగా ఉన్న గోపాలరెడ్డిగారిని సమీప నగరాలలోని సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనవలసినదిగా ఆహ్వానించినప్పుడు, నామీద అభిమానంతో నన్నుకూడా రెండు మూడుసార్లు తమతో తీసుకొని వెళ్లారు. ఈవిధంగా మీరట్, ఆగ్రాలు వెళ్లడం నాకు జ్ఞాపకం ఉంది. ఇంతేకాక వారి ప్రోత్సాహం వల్ల ఒకటి రెండుసార్లు నేను తెలుగు సాహిత్యంమీద ఉపన్యసించానుకూడా. హిందీ విద్యార్థులకు తెలుగు చెప్పడానికి ఢిల్లీ విశ్వ విద్యాలయానికి వచ్చిన నన్ను అక్కడి విద్వాంసులు, కవులు చాలా గౌరవంగా చూశారు.

నేను ఢిల్లీ ఉన్నరోజుల్లోనే ఆచార్య సూరి భగవంతంగారు, భారత ప్రభుత్వానికి రక్షణశాఖ సలహాదారుగా ఉండేవారు. నేను ఆంధ్ర విశ్వ విద్యాలయంలో

చదివినప్పుడు (1942) ఈయున మాకు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. వీరినీ అప్పుడప్పుడూ కలుస్తూ ఉండేవాణ్ణి. ఆయన ఉన్నారని సర్. సి.వి. రామన్‌గారు వచ్చి ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ''రామన్ ఎఫెక్ట్'' మీద ఒక సర్వజన సుబోధకంగా ఒక ఉపన్యాసం ఇచ్చారు (1941). అది విన్న మాకందరికీ అంతా తెలిసిపోయినట్లయింది! ఆయన బోధనాశక్తి అట్టిదని ఆయన విద్యార్థులందరూ చెప్పగా విన్నాను. దానిలో అతిశయోక్తి లేదని నాకు నాడు బోధపడింది. ఆనాడు ''బెంజీన్'' (Benzene) ను గూర్చి ($C_6 H_6$) ఆయన చెప్పగా సైన్సు విద్యార్థిని కాని నాకు బోధపడినట్లు ఉండడమేకాక, ''క్లోజ్డ్ స్ట్రక్చర్'' (Closed Structure) అనీ, ఆ ఫార్ములా, దాన్ని వేసిన శాస్త్రవేత్త ''కెకులే'' పేరు అనీ ఇన్ని దశాబ్దుల తరువాత నాకు జ్ఞాపకం ఉన్నాయి.

ఇంక ఒక్క విషయం చెప్పాలి. మనకు మన భాషమీద అభిమానమని విఱ్ఱవీగుతూ ఉంటాము. ఇది నిజమేనా? అనే ఒక సన్నివేశం ఢిల్లీలో జరిగింది. అప్పుడు మాన్యశ్రీ రాజేంద్ర ప్రసాద్‌గారు రాష్ట్రపతులు. తమిళులు మహాకవి సుబ్రహ్మణ్యభారతి ''వర్ధంతి'' చేసి ఆయన్ని అధ్యక్షులుగా పిలిచారు. సభ బాగా జరిగింది. ఆ సభలో ఆయన తప్ప మిగిలివాళ్లందరూ తమిళంలో మాట్లాడారు. ఆయన హిందీలో మాట్లాడారు. హర్షధ్వానాల మధ్య సభ ముగిసింది. కొంతకాలానికి తెలుగువారందరూ కందుకూరి వీరేశలింగంగారి వర్ధంతి జరిపారు. ఆయన్ని పిలిచారు. ఆయన హిందీలో మాట్లాడారు. వీరేశలింగంగారిని గురించి నన్ను మాట్లాడవలసిందిగా - నేను విశ్వవిద్యాలయంలో ఉన్నందుకు కాబోలు- పిలిచారు. నేను తెలుగులో మాట్లాడాను. మిగిలిన మన తెలుగు హేమాహేమీలందరూ ఇంగ్లీషులో మాట్లాడారు! కొందరిని తరువాత, ''ఇదేమి విడ్డూరం'' అని అడిగితే, రాష్ట్రపతికి తెలియని భాషలో మనం మాట్లాడితే ఆయన్ని అగౌరవం పర్చినట్లవుతుందని నాకు సమాధానం చెప్పారు! తమిళులకు ఈ మాత్రం తెలియకపోయింది. పాపం! అనుకొన్నాను.

శ్రీమతి దుర్గాబాయమ్మగారు (1909-1981) ఆకాలంలో ఢిల్లీలో ఉండడంవల్ల, అంతకి పూర్వం ఆమెతో పరిచయం ఉండడంవల్ల నేను వారిని అప్పుడప్పుడూ కలుసుకొంటూ ఉండేవాణ్ణి. మా విశ్వవిద్యాలయానికి శ్రీ

చింతామణి దేశ్‌ముఖ్ వైస్ ఛాన్సలర్ అయిన తరువాత, ఆమెను కలుసుకోవడానికి వెళ్లినప్పుడు నన్ను ఆమె దేశముఖ్‌గారికి పరిచయం చేశారు. ఆయన లౌకిక వ్యవహారాలలో ఎంత దక్షులో సంస్కృతంలోను అంత పండితులు గనుక, భాషోపన్యాసకుడనైన నన్ను చాలా గౌరవించారు. ఆయన మేఘసందేశానికి చేసిన మరాఠీ అనువాదం నాకిచ్చారు. దానిలోని మొదటి శ్లోక ప్రారంభం ''ఏకాయక్ష'' నా కింకా జ్ఞాపకం ఉంది.

నేను ఢిల్లీలో ఉండగానే, ఆంధ్రవిశ్వ విద్యాలయం పూర్వపు వైస్ ఛాన్సెలర్ డా॥ వి.ఎస్.కృష్ణగారు యు.జి.సి. (యూనివెర్సిటీ గ్రాంట్స్ కమిషన్) కి అధ్యక్షు లయ్యారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థినీ విద్యార్థులు చాలామంది ఉన్నతోద్యోగాలలో ఢిల్లీలో ఉండడంవల్ల, అందరూ శ్రీమతి దుర్గాబాయమ్మగారి సారథ్యంలో ఆయనకొక సన్మానం తలపెట్టి దాన్ని స్థానిక శ్రీ వేంకటేశ్వర కళాశాలలో నిర్వహించాము. మేమందరము మాట్లాడినాము. డా॥కృష్ణగారికి విద్యార్థినీ విద్యార్థులంటే చాలా అభిమానం. అందరం ఆనందించాము. ఆయన సంతృప్తిని వెల్లడించారు. కాని, భగవంతుడు అన్యథా తలంచాడు. ఒక ఆఫీసు కార్యక్రమంలో - నాటి విద్యాశాఖామాత్యుడు డా॥ శ్రీమాలి, మంత్రి డా॥బెజవాడ గోపాలరెడ్డిగారు మొదలైనవారున్నప్పుడు - పాల్గొంటూ ఆకస్మికంగా కీర్తిశేషులై మాకు దుఃఖాన్ని కలిగించారు. అప్పుడాయన, తాత్కాలింగా బస చేసిన ''కోటహౌస్'' నకు వెళ్లి మేము పరామర్శించి వచ్చాము.

నేను ఢిల్లీ వెళ్లిన కొంతకాలానికే దేవులపల్లి రామానుజరావుగారు రాజ్య సభ సభ్యులుగా ఢిల్లీ వచ్చారు. అప్పుడు ''కాన్స్టిట్యూషన్‌హౌస్'' లో బసచేశారు. నేను వెళ్లి ఆయన్ని చూచి నా ఆనందాన్ని వెలుబుచ్చాను. ఇప్పుడదిలేదు. అక్కడ మల్టీస్టోరీడ్ ఫ్లాట్స్ వచ్చాయి. కర్జన్‌రోడ్ అపార్ట్‌మెంట్స్ అవి. ఆరోడ్డు కస్తూర్‌బా రోడ్డు అయింది.

నేను ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యునిగా ఉండడంవల్ల, ప్రభుత్వంలో తెలుగునకు సంబంధించిన సెలక్షన్స్ గాని, వివరణలుగాని కావలసి వస్తే నన్ను పిలుస్తూ ఉండేవారు. ఆలిండియా రేడియోలో మొదటి తరం - శ్రీ

పన్యాల రంగనాథరావు ప్రభృతులు - న్యూస్ రీడర్సుకాక, తరువాతి తరంలోని న్యూస్ రీడర్సును చాలామందిని సెలక్టు చేసిన కమిటీలలో నేనున్నాను. తరువాత వారందరూ నాకు మిత్రులయ్యారు. వీరిలో శ్రీ ఏడిద గోపాలరావుగారు మొదలైనవారున్నారు. ఢిల్లీ రేడియోనుండి, నేను తెలుగును గూర్చి, ఇంగ్లీషులో అంతర్జాతీయ కార్యక్రమాలకు చాలాసార్లు బ్రాడ్‌కాస్ట్ చేశాను. ''ఇండియన్ సిస్టమ్స్ ఆఫ్ రైటింగ్'' అనే జాతీయ కార్యక్రమంలో నేను తెలుగు నందినాగరి అనే లిపులను గూర్చి ప్రసంగించి అవి - మిగిలిన భారతీయ భాషా లిపులవలెనే - ఉర్దూ తప్ప - ఎలాగా బ్రాహ్మీనుంచి వచ్చాయో చెప్పాను. ఉర్దూ భారతీయ భాష అయినా లిపి బ్రాహ్మీ నుండి రాలేదుగదా!

ఈ సందర్భంలోనే - సుప్రసిద్ధ మహాకవులైన మన డా॥ సి. నారాయణరెడ్డి గారు ఢిల్లీ వచ్చిన సందర్భంలో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆధునిక భారతీయ భాషా విభాగంలో, నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చి కావ్యగానం చెయ్యడం జ్ఞాపకం వస్తోంది. వివిధ భారతీయ భాషా భాషీయులున్న ఆ సభలో మన ఆధునిక మహాకవులువారి కావ్యగానంతో సభ్యుల్ని ముగ్ధుల్ని చేశారు. కొన్ని సందర్భాల్లో హిందుస్థానీలోనికి వారి గేయాల్ని అనువాదం చేస్తూ వచ్చారు కూడా. ఇది జరిగి ఇంచుమించుగా మూడు దశాబ్దులు దాటింది. కాని వారా సందర్భంలో తమ ఒకగేయానికి చేసిన అనువాదం ''ముఝే జహర్ పీనేదో'' అనేది ఇన్ని దశాబ్దులైనా నన్ను విడువక నాహృదయంలో మెలగుతూనే వుంది. ఆ గేయం, అనువాదం - అయిన తరువాత సభాసదులు చేసిన కరతాళ ధ్వనులు ఇంకా నా చెవుల్లో మోగుతూనే ఉన్నాయి. ఆ రోజుల్లోనే మాన్య శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి ప్రోత్సాహంవల్ల మేమిద్దరం ఆగ్రావెళ్లి 'టాజ్‌మహల్' చూచి వచ్చాము. తిరిగి వచ్చిన తరువాత ''టాజ్‌మహల్'' ఎలా ఉంది అని వారడిగినప్పుడు, ''బాగానే ఉంది గొప్పగా, కాని కొందరు వర్ణించేటంతటి ప్రభావం చూపించలేదు, వెన్నెల రాత్రిలో ప్రియురాలితో చూస్తే అలా ఉండవచ్చును'' అని నేనన్నాను. వారు వెంటనే రవీంద్రుడు, ఉర్దూ కవులు - దాన్ని వర్ణించిన కవితాభాగాల్ని ఆశువుగా వినిపించి మమ్మల్ని ఆనందింపజేశారు. పద్మ భూషణులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు మహాకవులు అయిన డా॥ నారాయణరెడ్డిగారి ఆనాటి ''రాక'' జ్ఞాపకాలు నన్నెప్పుడూ విడనాడవు. ఆలాగే - 1956లో జరిగిన నా సన్మాన సభకు

వారు రావడమూ మరిచిపోలేను! నేను ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉన్నరోజుల్లోనే, కేంద్రసాహిత్య అకాడమి ఆనాటి కార్యదర్శి కృష్ణ కృపలానీగారితో పరిచయ మేర్పడింది. ఆయన రవీంద్రనాథ్ ఠాకూర్‌గారి మనుమరాలి భర్త. మహాకవి రాయప్రోలు సుబ్బారావుగారికి చిరకాల మిత్రులు. తరువాత కార్యదర్శిగా చాలాకాలం పనిచేసిన డా॥ప్రభాకర్ మాచ్వేగారు సన్నిహిత మిత్రులయ్యారు. నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రారంభంలో పనిచేసిన మంజరీ ఈశ్వరన్‌గారు నాకు మద్రాసులోనే తెలిసినవారు. తెలుగు స్వతంత్ర సంపాదకులైన గోరాశాస్త్రిగారి ద్వారా వీరి పరిచయం మద్రాసులోనే అయింది. తరువాత ఈ 'బుక్ ట్రస్ట్' డైరక్టర్ అయిన శ్రీకర్తార్‌సింగ్ దుగ్గల్ అనే ప్రముఖ పంజాబీ రచయిత పరిచయం ఆయన ఆలిండియా రేడియోలో ఉద్యోగంలో ఉండగానే; మాబావ మరిది, ఇంగ్లీషులో కవి, ఢిల్లీ రేడియో స్టేషన్ డైరక్టర్ - ఇప్పుడు కీర్తిశేషులు - అయిన ఆర్. సి. రాజశేఖర్‌గారి ద్వారా అయింది. తరువాత శ్రీ దుగ్గల్, నేను తెలుగు అకాడమీలో ఉండగా వచ్చి మాసాయంతో హైదరాబాదులో అనువాద సదస్సు నిర్వహించారుకూడా. ఈ విధంగా - సాహిత్య అకాడమీతోను నేషనల్ బుక్ ట్రస్ట్‌తోను వాటి ప్రారంభంనుంచి సంబంధం నాకున్నదని చెప్పుకోవచ్చును.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉద్యోగించడం వల్ల ఉత్తర దేశంలో ప్రచలితంగా ఉన్న వివిధవైష్ణవ సంప్రదాయాలనుగురించి, ఆర్య సమాజాన్ని గురించి, శిఖ్‌మతాన్ని గురించి ప్రత్యక్షంగా తెలుసుకొనే అవకాశం కలిగింది. గురుద్వారాలను, మందిరాలను, ఢిల్లీలోని నిజాముద్దీన్ జౌలియాదర్గాను, దాని ప్రాంగణంలోనే ఉన్న అమీర్‌ఖుస్రూ సమాధిని దర్శించే అవకాశం కలిగింది. మనం ఎక్కడ ఉంటే అక్కడి విశేషాలను గ్రహించాలనీ, పెద్ద చిన్నల తారతమ్యం జ్ఞానసముపార్జనలో కూడదని మొదటినుంది నా సిద్ధాంతం. ఇందువల్లనే, నేను విజయనగరంలో ఉన్నప్పుడు - ఆ ఊరి దృష్ట్యా - పెద్ద కాలేజీలో ఉద్యోగంలో ఉన్ననేను - పండితుల అరుగుల మీద కూర్చుని సంస్కృతం లోని ఉద్గ్రంథాలను చదివాను. అవి ఆవిద్వాంసులే చెప్పగలిగిన వారని నాకు తెలుసును. వారందరూ మహా విద్వాంసులు! వారి ముందు నేను సామాన్య విద్యార్థిని! ఇదే విధంగా చిత్రకళా కోవిదుడైన అంట్యాకుల పైడిరాజు గారి దగ్గిర కొంత చిత్రకళనేర్చాను. ఆయన మన గొప్ప చిత్రకారులలో ఒకరు. ఇంక సంగీతం

నేర్చానని అనలేనుగాని - కళాతపస్వి, సంగీత సరస్వతి, సంగీతకళానిధి ద్వారం వెంకటస్వామినాయుడుగారి వాయులీనాన్ని రోజూ వింటూ సంగీతం గొప్ప దనాన్ని గ్రహించడానికి ప్రయత్నించాను. అక్కడే, రోణంకి అప్పలస్వామిగారు, కె. విశ్వనాథం గారు మొదలైన పాశ్చాత్య భాషా వేత్తల స్నేహంవల్ల తెలుగునకు ఇంగ్లీషు మొదలైన పాశ్చాత్య భాషలు ఎంత సాయపడగలవో గ్రహించాను.

హైదరాబాదులో తెలుగు అకాడమి (1968) స్థాపించినప్పుడు దాని స్పెషల్ ఆఫీసర్ డా॥ పి.ఎస్.ఆర్. అప్పారావుగారు - ఆనాటి విద్యామంత్రి, అకాడమి గవర్నింగ్ బాడి అధ్యక్షులు అయిన మాన్య శ్రీ పి.వి. నరసింహారావుగారి ఆమోదంతో నన్ను ఆహ్వానిస్తే ఢిల్లీ నుండి హైదరాబుదుకు వచ్చాను. అప్పటికే డా॥బూదరాజు రాధాకృష్ణ, నాగభూషణరావుగారు వచ్చి చేరి ఉన్నారు. అందరం కలిసి శ్రమపడి ప్రారంభదశలో అకాడమిని అభివృద్ధి చేశాము. నేను అకాడమిలో ఉండగానే - ఢిల్లీ శ్రీ వేంకటేశ్వర కాలేజీ ప్రిన్సిపాల్గా (1970), మధురై విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసరుగా (1971) ఉద్యోగాలు వచ్చినా, అకాడమి స్కేలు కంటె అవి రెండు మంచి స్కేలు ఉద్యోగాలైనా - అకాడమి తలపెట్టిన పని చెడిపోతుందని వెళ్లలేదు. వాటివల్ల అక్కడ కొంత అభివృద్ధి కలిగించరా? అని భావించాను. కాని తగినంత ప్రోత్సాహం అకాడమి వారియ్యలేదు. తెలుగును ద్వితీయ భాషగా బోధించడానికి భాషా ప్రయోగశాల చాలా ఉపకరిస్తుందని, నాకు అమెరికాలో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో కలిగిన అనుభావాన్ని పురస్కరించుకొని అధికారులకు నచ్చచెప్పి, ఆనాటి డైరెక్టరు సాయంతో 1977లో తెలుగు అకాడమిలో భాషా ప్రయోగశాలను ఏర్పాటు చేసే విషయంలో చాలా శ్రమించి సాధించడం జరిగింది. దీని ప్రారంభోత్సవం 11-12-1977 జరిగింది. కాని, అకాడమి పని రానురాను చైతన్యదాయకంగాలేనట్లు కనబడడంతో హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగులో ఆచార్యత్వం రాగానే దాన్ని స్వీకరించి 1978లో అకాడమిని విడిచె పెట్టాను.

1978లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో మొదటి తెలుగు ప్రొఫెసరుగా, రీజినల్‌స్టడీస్ డైరెక్టరుగా, స్కూల్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ మొదటి డీనుగా చేరి పనిచేశాను. విశ్వవిద్యాలయంలో చేరడానికి పూర్వమే, ఆనాటి రాష్ట్రపతి

విశ్వవిద్యాలయానికి 'విజిటర్'గా తనకున్న హక్కును వినియోగించికొని నన్ను మొట్టమొదటి అకడమిక్ కౌన్సిల్ సభ్యునిగా (నామినేటడ్) 5-5-1976 న నియమించారు. గౌరవ ప్రదమైన ఈ నామినేషన్‌ను నేనంగీకరించి 4-4-1977నాడు జరిగిన మొదటి అకడమిక్ కౌన్సిల్‌నకు హాజరై కార్యక్రమంలో పాల్గొన్నాను. అప్పటికింకా నేను తెలుగు అకాడమిలోనే ఉన్నాను. విశ్వ విద్యాలయంలో ఉద్యోగంలో చేరలేదు.

ఆచార్యునిగా నేను విశ్వవిద్యాలయంలో చేరేనాటికి ఇంక ఏ భారతీయ భాషలోను ప్రొఫెసరుగా చేరలేదు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఏ శాఖలోను ప్రత్యేకంగా యూనివెర్సిటీ సెలక్టు చేసిన ప్రొఫెసరు లేడు. మొట్టమొదట ఈ కేంద్ర విశ్వ విద్యాలయంలో హిందీ లేదు. నేను వచ్చి చేరిన తరువాత ఉర్దూ ప్రొఫెసరు వచ్చి చేరారు. ఈ రెండు భాషలు రీజినల్ స్టడీస్ సెంటర్‌లో ఉన్నాయి. వీటిలో ఎం. ఏ. లేదు. సోషల్ సైన్సెస్‌లో రీజినల్ స్టడీస్‌లో పరిశోధన చేసేవారికి సాయం చెయ్యడంకోసం - తెలుగు, ఉర్దూ రీజినల్ భాషలనే భావంతో - వీటిని పెట్టారు. ప్రతి భాషకు ఒక ప్రొఫెసరు, ఒకరీడరు, ఒక లెక్చెరరు అధికారులు ఆమోదించి నిర్ణయించిన ఉద్యోగాలు. అప్పటి ప్రధాన మంత్రి అయిన శ్రీమతి ఇందిరా గాంధీగారు స్వయంగా వచ్చి శ్రీమతి సరోజినీ నాయుడు (1879-1949)గారి ఇల్లు అయిన గోల్డెన్ థ్రెషోల్డ్ (Golden Threshold) ఆమె పుత్రిక అయిన శ్రీమతి పద్మజా నాయుడు గారికి సంక్రమించగా ఆమె కేంద్ర విశ్వవిద్యాలయానికి దానం చెయ్యగా (17-11-1974) భవనాన్ని ఆనాటి వైస్ ఛాన్సలర్ అయిన డా॥ గురు బక్షీసింగ్ గారికి స్వాధీనం చేశారు. అప్పటికున్న హోటలు తొలగింది. ఈ సభకు ఆహ్వానితుడనై నేను వచ్చాను. అప్పటికింకా నేను యూనివెర్సిటీలో చేరలేదు. ఈ విషయాలన్నీ చాలా మందికి తెలియవు గనుక, నేను మొదటినుండి ఉన్నాను గనుక ఇవన్నీ చెప్పాను. దీని తరువాత చెప్పవలసినది తెలుగులో, ఉర్దూలో ఎం.ఏ. క్లాసులు వచ్చిన కథ.

నేను చేరినవెంటనే, వి.సి.గారిని కలిసి ''పాఠాలు చెప్పడానికి పరిశోధనలు చేయించడానికి నేను చేరానుగాని ఊరికే కూర్చుండడానికి కాదు. ఎం.ఏ.క్లాసులు పెట్టించండి'' అన్నాను. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, సెంటర్ ఫర్ రీజినల్ స్టడీస్

ప్రణాళికాదులను సిద్ధం చేసిన కమిటీవారు, ఈ భాషలలో ఎం.ఏ.లను ఊహించ లేదనీ, స్థానికంగా ఉన్న విశ్వవిద్యాలయంలో, ఇంకా రాష్ట్రంలో ఉన్న వివిధ విశ్వవిద్యాలయాలలో ఆకోర్సు ఉంది గనుక ఇక్కడ అనావశ్యకం అనుకొన్నారని, వి.సి.గారన్నారు. మళ్లీ వాళ్లనే పిలిచి తమ నిర్ణయాన్ని మార్చుకోవలసినదని అడగడం అనుచితం, అనావశ్యకం అన్నారు. 1978లో ఉద్యోగంలో చేరిన నేను నిర్వ్యాపారంగా కూర్చోలేనని, పిహెచ్.డి. విద్యార్థుల్ని తీసుకోవడం విషయంలో అభ్యంతరం లేదు గనుక వారిని తీసుకొంటానని చెప్పి - శ్రీమతి లావణ్యసరస్వతి, శ్రీమతి పద్మావతి అనే ఇద్దరు ఎం.ఏ. ఎం.ఫిల్. ఉన్నవారిని ఇంటర్వ్యూలవో సెలక్టుచేసి పిహెచ్.డి. కోసం తీసుకొన్నాను. వారిద్దరు నాదగ్గిరే రిసెర్చిచేసి సకాలంలో పని ముగించి డిగ్రీలు పొంది - కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్లు పొందిన ప్రథమ విద్యార్థినులు అయ్యారు.

ఇంతలో నేను ఆ కమిటీ సభ్యులెవ్వరో తెలుసుకొని వారిలో డా॥బెజవాడ గోపాలరెడ్డిగారు, నార్ల వేంకటేశ్వరరావుగారు, ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తిగారు, ఆచార్య సర్వేపల్లి గోపాల్‌గారు, డా॥నగేంద్రగారు ఉన్నారని తెలిసినవెంటనే - అందరిని నేను ఎరుగుదును గనుక, విషయ మంతా వారికి వ్రాసి, వారి ఆమోదాన్ని పొంది, వి.సి. గురుబక్షసింగ్‌గారి ఆమోదంతో నేనొక లేఖలో ఎం.ఏ. ఉంటే బాగుంటుందని ''నేను అడిగినట్లుగా'' ఒక లేఖ వ్రాసి పంపగా వారిలో కొందరు హైదరాబాదు వచ్చారు. డా॥గురుబక్షసింగ్‌గారి ఇంట్లోనే సభ జరిగింది. దానిలో వారు, ''సమర్థులు ఆచార్యులుగా చేరారు గనుక, ఎం.ఏ. ఉండవచ్చును'' అని తమ అభిప్రాయం తెలిపారు. గురు బక్షసింగ్‌గారు అంగీకరించారు. 1979లో తెలుగు ఎం.ఏ. క్లాసులు ప్రారంభం అయ్యాయి. తరువాత ఉర్దూలో వచ్చాయి. తరువాతి సంవత్సరం, కేంద్ర విశ్వవిద్యాలయంలో హిందీ లేకపోవడం ఏమిటని కేంద్రంలో ప్రశ్నలుత్పన్నంకాగా, హిందీ డిపార్ట్‌మెంటు ఏర్పడి క్లాసులు వచ్చాయి. మొదట్లో డా॥ సింగ్ గారు అనుకూలంగా లేకపోయినా చివరకి ఒప్పుకొని సాయం చేశారు. ఈ కృషివల్ల - తెలుగు, ఉర్దూ, హిందీ డిపార్టుమెంటులు వచ్చి అభివృద్ధి పొందాయి. ఆచార్యుల సంఖ్య పెరిగింది. ఎందరో డాక్టరేట్లు ఎం.ఫిల్. డిగ్రీలు పొందారు. ఈ డిపార్టుమెంటులు తరువాత సముచితంగానే ఇంగ్లీషు కూడా ఉన్న స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్‌లో భాగాలుగా అయ్యాయి. నేనిప్పుడు చెప్పిన చరిత్ర చాలా మందికి తెలియదు.

తెలుగులో మొదటి ఆచార్యుడను నేనే గనుక. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మొదటి డీన్‌ను నేనే గనుక ఈ కృషి చేయవలసి వచ్చింది. ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను గనుక నాకు విషయాలన్నీ సమగ్రంగా తెలుసును. ఆరోజుల్లో నేను, ఇంకా భాషలు చేర్చి స్కూల్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్ ఏర్పర్చవలసినదని కూడా వ్రాశానుగాని అది జరుగలేదు.

హైదారాబాదు విశ్వవిద్యాలయంలో ఉండగానే ''తెలుగుదేశం పార్టీ'' మాన్యశ్రీ ఎన్.టి.రామారావుగారి నాయకత్వం కింద మంత్రిత్వం ఏర్పాటు చేయడం జరిగింది. అప్పుడాయన మహాకవులు, ఆచార్యోత్తములు అయిన డా॥ సి. నారాయణరెడ్డిగారిని అధికార భాషా సంఘాధ్యక్షులుగా చేశారు. వారితోను, ఇతర సభ్యులతోను పర్యటించి వివిధ జిల్లాలలో అధికార భాషగా తెలుగు అమలును పరిశీలించే అవకాశం కలిగింది. తరువాత, ఆచార్య సి. నారాయణ రెడ్డిగారు, శ్రీ అంబేడ్కార్ ఓపెన్ యూనివెర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నియుక్తులై, అధికారభాషా సంఘాధ్యక్ష పదవిని విడిచి వెళ్లినప్పుడు, మాన్యశ్రీ ఎన్.టి.రామారావుగారు, ముఖ్య మంత్రులు, ఉదారంగా 1986లో నన్నా స్థానంలో నియమించారు. నేను ఆపదవిని 16-12-1985న స్వీకరించాను. సుప్రసిద్ధ దేశభక్తులైన వావిలాల గోపాలకృష్ణయ్యగారి కాలంనుండి, అధికార భాషా సంఘంలో కార్యదర్శిగా మెలగుతూ సంఘాభివృద్ధికి, కార్యనిర్వహణకు దక్షతతో తోడ్పడుతూ వచ్చిన ఆప్త మిత్రులు గోవిందరాజు రామకృష్ణారావుగారు సంఘకార్యదర్శిత్వాన్ని విడిచి, ఓపెన్ యూనివర్శిటీకి పోతున్నప్పుడు నా అభ్యర్థన మేరకు, మా ఆప్తతను మన్నించి డా॥ నారాయణ రెడ్డిగారి అనుమతితో నాదగ్గిర కార్యదర్శిగా కొంతకాలం మార్గదర్శకులుగా ఉండి నేను నియమించుకొన్న చిరకాల మిత్రులు సి. ధర్మారావుగారు కార్యదర్శిగా చేరిన వెంటనే ఓపెన్ యూనివర్శిటీకి, వైస్ ఛాన్సెలర్‌గారికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓ.ఎస్.డి) గా వెళ్లిపోయారు. నేను ఒక సంవత్సరం (19851986) అధికార భాషా సంఘాధ్యక్షునిగా పనిచేసి, హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయానికి, డా॥బి.ఎస్. రామకృష్ణగారి తరువాత వైస్ ఛాన్సెలర్‌గా వచ్చిన చిరకాలమిత్రులు డా॥భద్రిరాజు కృష్ణమూర్తిగారు, విశ్వవిద్యాలయంలో నా'' లీన్'' కొనసాగించడానికి వీలుకాదని తెలియజేయగా తిరిగి విశ్వవిద్యాలయంలో 1-1-1987 చేరి 1987 జూన్ ఒకటో తేదీన పదవీ విరమణ చేశాను.

అప్పటికి నేను 45సంవత్సరాలనుండి ఉద్యోగం (1942-1987)చేస్తూనే ఉన్నా ఎక్కడి కక్కడికి విజయనగరం మహారాజ కళాశాల (1942-1959) ఢిల్లీ విశ్వవిద్యాలయం (1959-1968) తెలుగు అకాడమి (1968-1978) కేంద్ర హైదరాబాదు విశ్వవిద్యాలయం (1978-1987)నుంచి కంట్రిబ్యూటిరీ ప్రావిడెంటు ఫండ్ స్కీము (సి.పి.ఎఫ్) కిందనేను చిన్న చిన్న మొత్తాలు తీసుకొంటూ రావడంవల్ల, పెన్షన్ లేని స్థితి ఏర్పడి మళ్లీ ఉద్యోగా న్వేషణ ప్రారంభం అయింది. ఇది 65వ ఏట! అప్పటికి తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పడి ఉండడం వల్ల విద్వన్మిత్రులయిన డా॥ తూమాటి దొణప్పగారు, విశ్వ విద్యాలయం కొత్తగా ఏర్పాటు చేస్తూ ఉన్న రాజమహేంద్రవరంలోని తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పీఠానికి నన్ను ఏకమొత్తం జీతం మీద ఆగస్టు 1987లో పీఠాధిపతిగా నియమించడంతో ఆ ఉద్యోగంలో చేరాను. (14-8-1987) నా బాల్యం, ప్రథమ యౌవనం గడిపిన రాజమహేంద్రవరంలో మహాకవులు స్థానికులు అయిన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు, గౌతమీ విద్యా పీఠంలోని పరిచితులైన విద్వాంసులు మహా మహోపాధ్యాయపేరి సూర్యనారాయణ శాస్త్రిగారు మొదలైనవారు వేద విజ్ఞానఖని రేమెళ్ల సూర్య ప్రకాశ శాస్త్రిగారు, జ్యోతిష విజ్ఞాన భాస్కర మధుర కృష్ణమూర్తి శాస్త్రిగారు, ప్రముఖ న్యాయవాది పోతుకూచి సూర్యనారాయణ మూర్తిగారు, ప్రసిద్ధకవి చిన్మయ బ్రహ్మంకవిగారు స్థానిక గౌతమ గ్రంథాల యోద్యోగులు రచయితలు అయిన సన్నిధానం శర్మగారు నన్ను చాలా ఆదరించి గౌరవించారు. చాలా కాలానికి నేను ఆ ఊరు వచ్చినందులకు సంతోషించారు.

అక్కడ ఒక సంవత్సరం అయిన వెంటనే నా ఉద్యోగం ముగిసింది (13-8-1988) హైదరాబాదు తిరిగి వచ్చిన నాకు, తెలుగు విశ్వ విద్యాలయాధికారులు జ్యోతిషశాఖలో ఉద్యోగం ఇచ్చారు. (1-2-1989) మాకు వంశపారంపర్యంగా సంక్రమించినది, నేను చిన్నతనంలో అభ్యసించినది, అజ్ఞాతంగా కృషిచేస్తూ వచ్చినది జ్యోతిషం. అది 1989 లో నాకు జీవిక అయినది. విధి నిర్ణయం చాలా చిత్ర మయినది అనుకొన్నాను. అక్కడ - చిరకాల మిత్రులయిన రామప్పగారు, ఆర్. శంకరానారాయణరాజుగారు, డిపార్టుమెంటు ప్రారంభంలో నేనే సెలెక్టు చేసిన సిహెచ్.వి. సుబ్రహ్మణ్యంగారు, జి. వీరభద్రాచారిగారు సహోద్యోగులై నాకు

ఆనందాన్ని కలిగించారు. డా॥ ద్రోణప్పగారి తరువాత వైస్ ఛాన్సలర్‌గా వలచ్చిన డా॥ సి.నారాయణరెడ్డిగారు నన్ను జ్యోతిషశాఖలో కొనసాగించారు.1992 లో నేను మద్రాసు విశ్వవిద్యాలయంలో ఒక ధర్మనిధి ఉపన్యాసం ఇస్తూ ఉంటే 'గుండెపోటు' వ్యాధి వచ్చి అక్కడ హాస్పిటల్‌లో ఉండవలసి వచ్చింది. కొన్ని నెలలకు కోలుకొన్న తరువాత తిరిగి జ్యోతిషశాఖలో చేరి పనిచేశాను. ఆ అనారోగ్యకాలంలో నా మిత్రులు ఇ. సుబ్బారావుగారు కొంతకాలం జ్యోతిషశాఖలో పనిచేశారు. మధ్యకాలంలో, మహేశ్‌యోగి జ్యోతిషశాఖలో పనిచేశారు. మధ్యకాలంలో, మహేశ్‌యోగి జ్యోతిష సంస్థవారు నన్ను విదేశాలలో జ్యోతిష్కునిగా పర్యటించవలసినదని కోరినా, అనారోగ్యకారణాలవల్ల వెళ్లలేదు. నామిత్రులు సుబ్రహ్మణ్యంగారు, సుబ్బారావుగారు వారి ఆహ్వానం మీద వెళ్లి పర్యటించి వచ్చారు. డా॥ నారాయణరెడ్డిగారి తరువాత, వైస్ ఛాన్సెలర్‌గా వచ్చిన డా॥ పేర్వారం జగన్నాథంగారు,1994 జనవరి ఒకటి నుండి నన్ను ఉద్యోగంలో 'కంటిన్యూ' చెయ్యలేదు. దీనితో సంస్థలలో ఉద్యోగం చేసే ''పర్వం'' ముగిసింది(1-1-1994).

అర్ధ శతాబ్దికంటె కొంచెం అధికంగానే ఉన్న నా ఆచార్యకం, నేనెందరినో పెద్దలను, విద్వాంసులను, కవులను, మహాపురుషులను వివిధ ప్రదేశాలలో కలుసుకనే అవకాశాలు ఇచ్చింది. నాకు చేతనయినంతవరకు చిత్తశుద్ధితో ఆచార్యత్వం నెరపినాను. జయాపజయాలు రెండూ చవిచూచాను. ఇన్నిచోట్ల ఉద్యోగాలు చెయ్యడంవల్ల, 'లీవ్' తీసుకొని వెళ్లినా పెన్షన్ లేదు. వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చెయ్యడంవల్ల స్థిరాస్తీ లేదు. ఆయా సంస్థలలో ఇన్ని దశాబ్దులలో తీసుకొన్న 'కంట్రిబ్యూషన్'' లను వడ్డీతో చెల్లిస్తే, పెన్షన్ రావడానికి వీలుండేటట్లు ఇప్పుడు రూల్సు వచ్చాయని మిత్రులంటున్నారు! చూద్దాం!

మధ్యతరగతిలో పుట్టి - జీవితమంతా చదువుకోవడం - చదువు చెప్పడం మినహా పెద్దగా వైవిధ్యం లేని జీవితం గడిపిన సామాన్యుణ్ణి నేను. ''మధ్యతరగతి మందహాసం'' మాత్రమే తెలిసిన వాణ్ణి. అయితే - తెలుగునకు సంబంధించిన ప్రథమ ప్రయత్నాలు చాలా సార్లు చేసే అవకాశాలు నాకు లభించాయి. ఢిల్లీ విశ్వ విద్యాలయంలో, హిందీ ఎం.ఏ. స్థాయిలో ఔత్తరాహులకు మొట్టమొదట తెలుగు

ద్వితీయ భాషగా బోధించే అవకాశం (1959-1968) అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో తెలుగు బోధించడానికి ప్రత్యేకంగా నియమితుణ్ణయిన ప్రథమ భారతీయుణ్ణే అయ్యే అవకాశం (1961-1962) తెలుగు అకాడమిలో తెలుగును ద్వితీయ భాషగా బోధించాడానికి వీలుగా, భాషా ప్రయోగశాల స్థాపనకు అధికారులకు తోడ్పడి స్థాపితమైన దానిలో ప్రప్రథమంగా తెలుగును బోధించే అవకాశం (1977) హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసరుగా, తెలుగు ఎం.ఏ. తరగతులు స్థాపనకు, పిహెచ్.డి., పరిశోధనాకార్యక్రమ ప్రారంభానికి కృషిచేసే అవకాశం (1978) తెలుగు విశ్వ విద్యాలయం వారి రాజమహేంద్రవరం ప్రాంగణంలోని సాహిత్య పీఠానికి మొదటి పీఠాధిపతిగా, మొదటి ప్రొఫెసరుగా ఆ పీఠాభివృద్ధికి బీజావాపం చేసే అవకాశం (1987) నాకు - పరమేశ్వరానుగ్రహంవల్ల - లభించాయి. అయితే, ప్రథమ ప్రయత్నాలన్నీ ప్రథమ ప్రయత్నాలే! శ్రమతో కూడిన వైనా, ఇంకా చేయవలసినది చాలా ఉంటుందని అనుభవంవల్ల గ్రహించాను. కాని, ఎవరో ఒకరు ప్రారంభించాలిగదా! ఆయా ప్రదేశాలలో నా తరువాత వచ్చినవారు ఆయా వాటిని అభివృద్ధి చేశారనీ, ఇంకా చేస్తున్నారనీ విని ఆనందిస్తూ ఉంటాను.

ఇంచుమించుగా అరవై సంవత్సరాల నా సామాన్య సాహిత్య జీవిత కథ, తద్వారా నాకు కలిగిన అనుభవాలు మీముందుంచాను. అందరి జీవితాల్లో లాగే కష్టసుఖాలు జయాపజయాలు నాజీవితంలోను వచ్చాయి. మానవుల జీవితాలకు ''ఉగాది పచ్చడి'' చక్కని ప్రతీక! ప్రప్రథమంగా దీన్ని భావించి కల్పించిన మహానుభావులెవ్వరో తెలియదుగాని, సాంకేతికంగా దీన్నిమించినది లేదు. దీన్ని కల్పించినది ఎవరో కాదు! సామాన్య మానవుడు! ఇది సర్వమానవానుభూతికి ప్రతినిధి! సామెతలు కల్పించినవారు గాని, మొట్టమొదట వాడినవారుగాని ఎవరో మనకు తెలియకపోయినా వాటిని పండితపామరులందరూ ఉపయోగించుకొంటూ ఉన్నట్లే ఇదీని!

నేను గ్రహించినది - ఈర్ష్యాద్వేషాలు జీవితంలో ఏవీ సాధించి పెట్టలేవనీ - మానవుల సర్వ దుఃఖాలకు కష్టాలకు ఇవి జన్మ స్థానాలని! ఇవి పాత మాటలే! కాని, ప్రతివ్యక్తి తన జీవితం ద్వారా సత్యాన్ని గ్రహించి, వాటిని పారదోలడానికి

''యథాశక్తి'' ప్రయత్నించాలి. ఆలోచనా విధానంలో ఆచరణలో సంకుచితత్వం పనికి రాదు. వైవిధ్య శోభితమైన మానవజీవితంలో బహుజనహితం, బహుజనసుఖం అత్యున్నత ఆదర్శాలు! ఇక్కడ ''బహు'' అంటే ''సర్వ'' అని ర్థం చెప్పుకోవాలి. ఇవి మనం అందుకోలేని ఆదర్శాలు అనుకోకుండా ప్రతివ్యక్తి వాటిని అందుకోవడానికి గాని, వాటి సామీప్యాన్ని కొంతైన పొందడానికి గాని చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. హింసా ప్రవృత్తి - తన మార్గమే సర్వోత్తమం అని మానవుడు అనుకోవడంలో పుట్టుతుంది. ఇది - మతం, భాష, సాహిత్యం, రాజకీయార్థిక సిద్ధాంతాలు, ఇంకా అనేక విషయాలకు సంభంధించి ఉంటుంది. ''కాకి పిల్ల కాకికి ముద్దు'' అనే సామెత ఒకటి ఉంది. దీన్ని మనం అర్థం చేసుకొంటే సంకుచితత్వం తొలగిపోతుంది. అయితే తరతమ భావాలుండవనికాదు. వీటి తారతమ్య నిర్ణయం - సమాజ శ్రేయస్సు దృష్ట్యా జరగాలికాని, మనం ముందే నిర్ణయించుకున్న సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా? లేవా? అనే దానిమీద ఆధారపడికాదు. సమాజం మారుతూ ఉంటుంది. మానవునకు లాగే దీనికీ - యౌవనం, మధ్య వయస్సు, వార్థక్యం ఉంటాయి. ఆయా వయస్సులలో వచ్చే ''రోగాలు'' ఉంటాయి. వీటిని పరిహరించుకొంటూ ఉంటే- మానవునిలాగే సమాజంకూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇది - సమాజం మానవుల గుంపు గనుక - ఆ గుణపులోని అందరికి వర్తిస్తుంది. కొందరికి అన్నీ ఉండి కొందరికి లేకపోవడం మొదలైనవి సమాజ సంతులనాన్ని కల్లోల పరుస్తాయి. దీన్ని గుర్తించి సకాలంలో సక్రమ విధానంలో సరి దిద్దుకోవాలి. అకాలం, అక్రమ విధానం అనర్థ హేతువులవుతాయి. ప్రాచీనులు పుణ్య పాపాలు అన్నవాటిని మనం - మంచి, చెడ్డలుగా అర్థంచేసుకోవచ్చును - సమాజ శ్రేయస్సు దృష్ట్యా , ''పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం'' అనే దానికి ఆధునిక సమన్వయం ఇదే! క్రాంత దర్శి అయిన మహాకవి గురజాడ అప్పారావుగారు ''మంచి చెడ్డలు ఎంచి చూడగ రెండె కులములు'' అన్నప్పుడు - ఆయన భావం ఇదే! ''ఓర్వలేమి పిశాచి, దేశం మూలుగులు పీల్చేసెనోయ్'' అన్నప్పుడు ఆయన మనస్సులో ''ఈర్ష్యా ద్వేషాలు'' తెస్తూ ఉన్న ''అనైక్యం'' ఉంది! వ్యర్థ కలహాలు పెంచవద్దనీ, ''కత్తివైరం'' కాల్చు అని ఆయన ఉద్బోధం. ''అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నీ మెలగవలెనోయ్'' అన్నప్పుడు - ఇది సాధ్యమైనప్పుడే, ''దేశమనెడి దొడ్డవృక్షం, ప్రేమలను పూలెత్తు''

నని ఆయన నిర్ణయించారు. నాటికి, ఈనాటికి ఏనాటికీ ఇదే మన ఆదర్శం కావాలని, ఇది ''క్షురస్యధారా నిశితా దురత్యయా'' అయినా, మనం ఈ మార్గంలోనే నడవాలని - నేనాచరణలో పూర్తిగా పెట్టలేకపోయినా - గ్రహించాను.

మధ్య తరగతికి చెందిన ఒక సామాన్యుని జీవిత సరళిని సహృదయులైన నా తెలుగు సోదరుల ముందుంచాను. సానుభూతితో, క్షమాదృష్టితో చిత్తగించవలసినదని మనవి. ఆ అవకాశం - ఇక్కడా మొదటి ఉపన్యాసం కావడం - యాదృచ్ఛికమైన నా అదృష్టావకాశం. ఈ ''పరిణతవాణి'' నాకు వయస్సు పైబడినా, నావాణి ''పరిణతవాణి'' స్థాయిని అందుకొన్నదనినేననుకోవడంలేదు. దీనిలోని ''పరిణతవాణి'' పెద్దలనుండి స్వీకరించి చెప్పినది! కార్యక్రమాన్ని భావించి, రూపరేఖలు దిద్ది తీర్చినాకీ అవకాశం కల్పించిన మాన్యమిత్రులు, మహాకవులు, జ్ఞాన పీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణులు, డా॥ సి.నారాయణరెడ్డిగారికి, వారికి చేదోడువాదోడుగా సాయపడిన కార్య నిర్వాహక మిత్రులకు నా కృతజ్ఞతా పూర్వక వందన సహస్రాలు.

కాళోజి నారాయణరావు

(10-8-1994)

మూడు భాషల మధ్య పుట్టి పెరిగిన జీవితం నాది. తెలుగయినా, ఉర్దూ అయినా, ఇంగ్లీషయినా అన్నిటికన్నా ఎక్కువ చదువుకుంది ఉర్దూ - పదివాచకాలు. తెలుగు చదువుకున్నది నాలుగు వాచకాలు. అప్పటి రాజ్యం నైజాము నవాబుది. దీనికి సంబంధించిన భాష - సర్కారు భాష విద్యాభాష అంతా ఉర్దూ. ఇంట్లో పరిస్థితి ఎటువంటిది? నాయనగారు కాళోజీ రంగారావుగారు ఉర్దూ, పారసీలలో పండితులు, ఇంగ్లీషులో కూడా. ఆయనకు అన్నిటికంటే తక్కువ వచ్చింది తెలుగే. ఆయన పెళ్లి చేసుకున్నది మహారాష్ట్రకర్ణాటక వాళ్లని. నాకు ఎనభై, మా అన్నకు ఎనభై ఏడంటే, పెళ్లయిన పధ్నాలుగు సంవత్సరాల తర్వాత మా అన్న పుట్టాడంటే ఆ పెళ్లి ఎప్పుడు జరిగిందో తెలుస్తుంది. మహారాష్ట్ర కర్ణాటకకు సంబంధించినవారు, హనుమకొండకు సంబంధించినటువంటి తెలుగువారు, ఉర్దూ ఫారసీ పండితుడు వీరితో వివాహం. ఆ కుటుంబంలోకి ఈ భాషలన్నీ ఎట్లా వచ్చినై అని చెప్పడానికి ఈ సంగతులన్నీ చెప్పవలసి వచ్చింది. పెళ్లి పిల్లవైపు వాళ్ళు - ముఖ్యంగా ముసలివాళ్లకు - కన్నడం తప్ప మరో భాష రాదు. పెళ్లి కొడుకు వైపు నుంచి వచ్చిన ముసలి వాళ్లకు తెలుగు తప్ప ఇంకో భాష రాదు. ఏదన్నా పురుషులకు కొద్దిగా వస్తే ఉర్దూ వస్తుంది. అటు మహారాష్ట్ర కర్ణాటక వాళ్లకు కూడా ఉర్దూ కొంతవచ్చు. పురుషులు మాట్లాడుకోవడానికి ఉర్దూ ఉంది. ఆడవాళ్ళు ఆడవాళ్ళు మాట్లాడు కోవడానికి భాషలేదు. పెళ్లి జరిగిందెక్కడా? తిరుపతిలో. కాపురానికి వచ్చింతర్వాత మరి ఏం మాట్లాడుకోవాలి వీళ్లిద్దరూ! ఆమెకు ఉర్దూరాదాయె, తెలుగు రాదాయె. ఈయనకు మరాఠి రాదాయె, కన్నడం రాదాయె. కొద్దిగా ఉర్దూ మాట్లాడితే తెలిసేదామెకు. మా తల్లితండ్రిగారు ఆర్య సమాజస్థులు. మా మేనమామలంతా

ఆర్యసమాజ్‌కు సంబంధించినవాళ్ళు. కాబట్టి ఆమెకు హిందీ తెలుసు. ఈయన ఉర్దూవాడే కాబట్టి ఉర్దూలో మాట్లాడేవాడు. ఆమె మరాఠిలో మాట్లాడేది. ఈయన కూడా మరాఠి ఏదో తెలుసుకోవడానికి ప్రయత్నం చేసేవాడు. అది వారి సంసారం ఆరంభం. అయితే చచ్చిపోయే వరకు కూడా నాయన ఉర్దూయే మాట్లాడేవాడు; అమ్మ మరాఠియే మాట్లాడేది. తరువాత ఆయన మరాఠి నేర్చుకున్నాడు. ఆమె తెలుగు నేర్చుకున్నది. చచ్చేనాటికి కూడా ఆమె లేవలేని స్థితిలో కూడా కోడళ్ళెవరన్నా ఆంధ్రప్రభో ఏదో ఇట్లా పట్టుకురావాలి - ఆమెకు కళ్ళజోడు పెట్టి ఆమె చదువు కునేది. అంతవచ్చినా కానీ మొదటి అలవాటు మాత్రం పోలేదు. ఇది వారిద్దరి సంగతి. మరి మాగతి ఏమిటి? అయ్యతోటి ఉర్దూ, అమ్మతోటి మరాఠి, ఇరుగుపొరుగులతోట తెలుగు.

కాని ఎంతలాభం కలిగింది. మూడు భాషలు మాతృభాషలుగా మాకు వచ్చేశాయి. ఎప్పుడైనా మేనమామ వచ్చేవారు. ఆయన సంస్కృతంలో మహా పండితుడు, శాస్త్రి, వేదతీర్థ్. గంగ ఒడ్డున ఒక గురుకులం పెట్టాడు. 14వ ఏటనో 16వ ఏటనో వెళ్ళిపోయినవాడు 87వ ఏట మరణించాడు. ఆయన సంస్కృతం నేర్చుకోండిరా అంటే మేం వినలా ఆయనమాట. ఇటు నాయనగారు ఫారసీ నేర్చుకోండిరా అంటే ఈయన మాటావినలేదు. ఏదో ఉర్దూ ఎటూ వచ్చేసింది. ఈ విధంగా మేం పెరిగిన వాళ్లం.

సంఘ సేవ చేసే మహానుభావులంతా మాయింటికి రావటం, చారిత్రకంగా ఏదన్నా పరిశోధన చేసేవారంతా రావడం, ఆర్య సమాజికులందరూ రావడం, పండితులు రావడం, రాజకీయవాదులందరు రావడం, ఉండడం, అందువల్ల మా ఇంట్లో అన్నిటితోను పరిచయం. ఈ మడికొండ ఎటువంటి గ్రామం? నేను పుట్టడానికి ఒక సంవత్సరం ముందు 1913 లో శ్రీ పాదకృష్ణమూర్తి శాస్త్రి మడికొండకు వచ్చాడు. ఆ ఊళ్లో తవుటింటి గోపాలరెడ్డి అని ఒక పెద్దాయన చదువుకున్న వాడుండేవాడు. ఆయనతో సన్మానం పొందాడు. బ్రాహ్మణులు,

పండితులు వచ్చినట్లయితే ఉండడానికి ఆయన తన బంగళాలోనే ధర్మశాల నొకదాన్ని కట్టించాడు. ఒక పుస్తకం 1913లో గోపాలరెడ్డి గారి కంకితం ఇచ్చాడు. ఆ ఊళ్ళో పండితులు అనుముల కృష్ణమూర్తి తండ్రి అనుముల పండరి శాస్త్రి. ఆయన 14సంవత్సరాలు బెనారస్‌లో ఉండి విద్వాంసుడై వచ్చినాడు. కృష్ణమూర్తి పెదనాయన పెద్దయ్య శాస్త్రిగారు వేదాంతి. వారి తండ్రిగారు 115 సంవత్సరాలు బ్రతికాడు. గురుస్థానంలో ఉండేవాడు. సంవత్సరానికోసారి 15 రోజులేవో ఉత్సవాలు జరగేవి. కృష్ణమూర్తికి పెంపకం పోయిన విశ్వనాథశాస్త్రిగారు వైయాకరణి. ఇది ఆ వూళ్ళో సంగతి. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు ప్రతి సంవత్సరం వచ్చేవారు. గోపాల్‌రెడ్డి గారింట్లో ఈ పండితులంతా ఏవో చర్చలు చేసేవారు. ఇంకా వానమామలై వరదాచార్యులగారి పెద్దన్నగారు వెంకటాచార్యులుగారు - ఈ పేర్లన్నీ రావండి; ఎక్కడా సాహిత్య చరిత్రల్లో రావు - వానమామలై వరదాచార్యులుగారు ఆయన తమ్ముడు లక్ష్మణాచార్యులుగారు. వరదాచార్యులుగారికి చాలా సంతానం. ఆ కుటుంబంలో రెండో పూటకు భోజనం ఉంటుందన్న గ్యారంటీ లేదు. ఇంకా రెండో వారు మానాయనగారు. వారుకూడా అంతే మహానుభావులు. రెండో పూట ఉన్నది అనేది లేదు. 1916 నుండి 24 వరకు మడికొండలో ఉన్నాం. 1920లో గ్రంథాలయం స్థాపింపబడ్డ దక్కడ. మేం ఆరేళ్ల వాళ్లం. ఆ గ్రంథాలయం నైజాం రాష్ట్రంలోనే తెలుగువారి గ్రంథాలయాల్లో నాలుగవది. 1901లో కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, 1904లో హనుమకొండలో రాజరాజనరేంద్ర భాషానిలయం, 1913మట్టెవాడలో శబ్దానుశాసన గ్రంథాలయం, 1920లో ప్రతాపరుద్రాంధ్ర భాషానిలయం మడికొండలో వచ్చినది. ఆ భాషానిలయాన్ని స్థాపించకముందే రామలక్ష్మణ విద్యాలయం అని ఒక విద్యాలయం ఉందక్కడ ప్రయివేటుది. దానికి గస్తినిశాన్ తిర్పన్ అనేది వచ్చి ప్రైవేట్ స్కూళ్ళు రద్దు చేసేదాంట్లో అది కూడా రద్దయి పోయింది, విద్యాలయాలు ఉండవద్దని. లైబ్రరి పెట్టడం అంటే పెద్ద టెర్రరిస్టు మూమెంట్ చేసి ఏదో ఉద్యమం సాధించినట్లు. పత్రిక చదవడం అంటే సర్కారుకు ప్రమాదం చేసినట్లు, ఖాదీ తొడగడం అంటే ఇంకేమీలేదు అంతే.

ఇటువంటి పరిస్థితుల్లో వెంకటాచార్యులుగారు, రంగారావుగారు వీరిద్దరు ఇంగ్లీషు, ఉర్దూ, ఫారసీ-ఎవరన్నా 'లా' కు పోదలచుకున్నారంటే 'కానూన్' పాఠాలు చెప్పేవాళ్లు. వాళ్లు హిస్టరీ, జాగ్రఫీ, సంస్కృతం చెప్పేవాళ్లు. తెలుగు వెంకటాచార్యులు గారు చెప్పేవారు. రమాబాయమ్మగారని ఉండేవారు. ఆమె ఇంట్లోనే ఉండేవారు. అక్కడకు వచ్చి పాఠాలు చెప్పేవారు. రంగారావు ఉదయం నాలుగు గంటలకే లేచి ఈ 29, 30 మంది విద్యార్థులను తీసికొని ఊరు బయటకు వెళ్లి అక్కడ వ్యాయామం చేయించి, కుస్తీ నేర్పి, మళ్లీ ఊళ్లోకొచ్చేవారు. ప్రతి శుక్రవారం అప్పుడు సెలవు. ఆదివారం కాదు. ప్రతి శుక్రవారం వక్తృత్వ పోటీలు. పద్యాలు చదివించే పోటీలు. 1924వరకు మా మడికొండలో ఈ విద్యాలయంలో చదువుకున్నవారు ఒక పదిమంది ఉర్దూ కవులు, ఒక ఇరవైమంది తెలుగు కవులుండేవారు. మోతుక్కారు వారని వారి భవనంలో నాటకం ఆడుతూఉంటే ఒక వెయ్యిమంది కూర్చునే స్థలం ఉండేది. అక్కడ వానమామలై వరదాచారి, జగన్నాథాచారి, కాళోజీ రామేశ్వరరావు,సాంబ సిద్ధయ్య, వీరయ్య, సొన్నాయిల వెంకటి, వీళ్లంతా డ్రామాలాడేది - గయోపాఖ్యానం మొదలైనవి. అటువంటి వాతావరణంలో పెరిగిన వాణ్ణి నేను.

పదేళ్లకో ఎనిమిదేళ్లకో దక్షిణాదిలో కాంగ్రెస్ మహాసభలు జరిగితే మామగారు ఏ.ఐ.సి.సి. సభ్యులుకాబట్టి హాజరయ్యేవారు. 1923లో కాకినాడలో జరిగాయి సభలు. మా మామగారు మహా సభలకు హాజరయి తిరుగు ప్రయాణంలో హైదరాబాదుకు వస్తే ఆయనను కలవడానికి మా అన్నయ్యగారు, నాన్న, నేను హైదరాబాదుకు వచ్చి, రెండు మూడు రోజులున్నాము. వారిద్వారా కాంగ్రెస్, కాంగ్రెస్ రాజకీయాలు తెలుసుకోవడం. ఆయనెవరో కాంగ్రెస్‌వాడట, 17 సార్లు జైలుకు పోయాడట అని మా వెనుక సి.ఐ.డి.లు. మా అమ్మ చదువుకున్నది. ఆర్య సమాజస్థులు కాబట్టి మా మేనమామగారిని హరిద్వార్ పంపారు చదువుకోడానికి. ఆనాడు మహాపండితులు, మహాత్యాగులు ఎంతో మంది. ఉత్తర దేశంలో కానీయండి, దక్షిణ దేశంలో కానీయండి ఆనాడు గాంగ్రెస్ నాయకుల్లో 60శాతం మంది ఆర్య

సమాజీయులే. ఇక్కడ హైదరాబాదు సంస్థానంలో కూడా ప్రజల్లో చైతన్యం తెచ్చిన ఉద్యమం నిర్వహించిన సంస్థ ఏదీ అంటే మొట్టమొదటిది ఆర్య సమాజ్ సంస్థే. ఆర్య సమాజ్ స్థాపింపబడి ఇప్పటికి 150 ఏళ్లు కావచ్చు.

ఆర్యసమాజ్ సంస్థ, బ్రహ్మ సమాజ్ భవనం, థియోసోఫికల్ సొసైటీ, కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, ఇవన్నీ ఎక్కడున్నయో చూడండి. ఇప్పటి ఉమెన్స్ కాలేజి నాడు రెసిడెంట్స్ కోర్ట్. అటు చాదర్‌ఘాట్‌నుంచి ఇటు ట్రూప్‌బజార్ దాకా రెసిడెన్సీ ఏరియా. చాదర్‌ఘాట్ దగ్గర భాగ్యరెడ్డి వర్మగారి ఆది హిందూ స్కూలు, కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, ఆర్య సమాజ్, మాడపాటి హనుమంతరావుగారి నివాసము- ఇవన్నీ ఈ ఏరియాలోనే ఉండేవి. ఇక్కడ కొంత స్వేచ్ఛ ఉండేది. పబ్లిక్ యాక్టివిటీ ఉండేది. ఊపిరి తీసుకోవటానికి వీలుండేటటువంటిది రెసిడెన్సీ ఏరియా. బ్రిటీషిండియాలో మొదలయ్యే టటువంటివి ఏ ఉద్యమాలయినా, ఏ కొద్దిగానయినా. హనుమంతరావు పంతులు గారు ప్రభుత్వోద్యోగి. వరంగల్లులో ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో పనిచేశారు. తరువాత నిజాం ప్రభుత్వంలో తాలీమాత్ (విద్యాశాఖ) లో పనిచేశారు. పరీక్షపాసైన తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన ఆంధ్రోద్యమానికి పితామహుడు. ప్రతాపరెడ్డి పండితుడు, దేనికయినా మొదటి అధ్యక్షుడాయన. ఆయుర్వేద కాన్ఫరెన్సు జరిగితే అధ్యక్షుడు ప్రతాపరెడ్డి. గ్రంథాలయోద్యమ ప్రారంభానికి సభ జరిగితే దాని అధ్యక్షుడు ప్రతాపరెడ్డి. ఆంధ్ర మహాసభకు మొదటి అధ్యక్షుడెవరయ్యా అంటే ప్రతాపరెడ్డి. పద మూడు మహాసభలు జరిగాయి. ప్రతాపరెడ్డి, రామకృష్ణుడు, రంగారాయుడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింతర్వాత మొదటి మహాసభ జరిగింది వరంగల్లులో. అదొక చరిత్ర. రాజేశ్వరరావు గారి భవనం ఆవరణలోపట ఒక పదిహేను, ఇరవయివేల మంది కూర్చునేటువంటి పందిరి వేయించారు. అక్కడ పుస్తక ప్రదర్శన. ఆ ప్రదర్శనలో ముద్రిత, అముద్రిత గ్రంథాలు తీసికొనివచ్చి పెట్టి, ఆదిరాజు వీరభద్రరావు గారితో ఆ ప్రదర్శన ప్రారంభించారు. దాని ఆహ్వాన

సంఘానికి కార్యదర్శి కాళోజీ, అధ్యక్షుడు ఒద్దిరాజు రాజేశ్వరరావు. రెండున్నర రోజులు సభ జరిగింది. వారి యిల్లు వరంగల్లుకు హనుమకొండకు మధ్య ఉంది. తెలంగాణ జిల్లాల నుంచే 300 మంది వచ్చారు. వచ్చినవాళ్లంతా హనుమకొండ - వరంగల్లు వాళ్లతో సహా అక్కడే భోంచేసారు. 3000 మందికి మూడు రోజులు భోజనం. ఆ పందిళ్లు వేయించిన, అంతా ఖర్చు వారిదే. కవి సమ్మేళనం పెట్టాం. ఆ కవి సమ్మేళనం కోటలో ఎందుకు పెట్టుకోకూడదని ఆలోచన వచ్చింది కాళోజీకి. కలెక్టర్‌కు చెప్తే అది ఆర్కియాలజీ డిపార్టుమెంటుకు సంబంధించింది, అది ఎవరికి ఇవ్వరు, వీల్లేదు అన్నాడు. సరే అని కోట భవనాల శిథిలాల పక్కకు ఒకరి పొలంలో పందిళ్లు వేయించాం. రేపు ఒంటి గంట నుంచో రెండ గంటల నుంచో ప్రారంభం ఈ కవి సమ్మేళనం. ఇవాళ సాయంత్రం వచ్చి పందిళ్లు కాలబెట్టారు. ఉర్దూ లేకుంటే అది ఉర్దూకు వ్యతిరేకమన్నమాట. **Non Urdu is Anti-Urdu. Anti Urdu is Anti State.** ఉర్దూ కానిది ఉర్దూకు శత్రువు. ఉర్దూకు శత్రువువైంది సంస్థానికి, రాజ్యానికి శత్రువు. తురకవాడు లేకపోతే తురకవాడికి విరోధి. తురకవాడికి విరోధి కాబట్టి రాజ్యానికి విరోధి. ఈ విధంగా పందిళ్లు కాలబెట్టారు. తెలుగు అభిమానులంతా కాపాడడానికి పోయారు. వాళ్లతో దెబ్బలాడారు. దెబ్బలాట జరిగింది. కొట్లాడుకోవద్దు అని చెప్పాం మేం కాంగ్రెస్ వాళ్లం కదా! వీళ్లని వాళ్లని ఆపాలని పోయి ఆడివాల సత్యనారాయణ అనే యువకుడు, ఎం. ఎస్. రాజయ్య అనేవాడు అప్పుడు బి.ఏ., చదువుతున్నవాడు వాళ్ల వీళ్ల లాఠీ దెబ్బలకు మూర్ఛపోయి ఆస్పత్రి పాలయ్యారు. కాళోజీ పంతమేమిటంటే అక్కణ్ణే ఆ శిధిలాలలోనే జరగాలి. హనుమంతరావుగారున్నారు, ప్రతాపరెడ్డిగారున్నారు, రామకృష్ణరావుగారున్నారు. ముసుపట్ల పట్టాభిరామారావు గారనే వారు కవిసమ్మేళనానికి అధ్యక్షులు. మూడురోజుల మహా సభలకు ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు. ప్రాచీనమయిన శిథిలాలే కాకుండా ప్రత్యేకించి ఆనాడు వేసుకున్న పందిళ్ల శిథిలాలలో కూడా కవిసమ్మేళనం జరిగింది. దాశరథి మొదలయిన 60 మంది కవులు ఇత్తెహాదుల్ ముసల్మీన్ వారిని కూడా పిలిపించుకొని కూర్చుండ బెట్టుకొని చూడండి, ఏం జురుగుతుందోనని

చూపించాం. దాశరథి, వరదాచార్యులు మొదలుయిన వాళ్లంతా ఏమికోట అది! ఏమి శిల్పాలవి అని! కవిత్వం చదివారు. 'శిల్పి' అన్న కవిత దాశరథి రాసిందక్కడ. ఆనాడు గాయపడి దెబ్బతిన్న నంది ఈనాడు కూడా గడ్డికరవడంలేదన్నాడు తన పద్యాలలో వానమామలై వరదాచార్యులు. తక్కినవాళ్లు కూడా చదివారు ఇదే విధంగా. ఈ ధోరణి చూసి నేను ఈ పూర్వ వైభవమూ అదీ అని అంతా రాస్తున్నారు కదా! సంపూర్ణంగా Ant కవిత నాది 'కూలిపోయిన కోట గోడలను చూపి, శిథిలమయిన గుళ్ల శిల్పములు జూపి, తుప్పుబట్టిన కత్తి తురకలకు జూపి, పురుగుబట్టిన తాటి పొత్తాలను జూపి, ఏమేమో జూపి పూర్వవైభవము తలచి పొంగేటి నీకు ప్రస్తుతావస్థ ఏ పగిది నున్నదో' అని. సంపూర్ణంగా యాంటీ కవిత నాది. చాలా వైభవంగా జరిగింది కవి సమ్మేళనం.

ఇక కాంగ్రెస్ వాళ్ల ఉద్యమాన్ని తీసికొన్నట్లయితే హయగ్రీవాచారి ఉన్నారు. 1946లో వరంగల్లుకోటలో రామస్వామి, మొగిలయ్య అని అన్నదమ్ములు వారి ఇంటి ముందు జండా ఎగరవేశారు. జండా వందనం జరిగింది. ఇంట్లో నాయకులకు టీ, బిస్కట్లు ఏవో ఏర్పాటు చేసారు.ఎట్లాగో వెనుక ద్వారం గుండా నాయకులను తప్పించి మొగిలయ్య లాఠీ తీసుకొని రజాకార్లను ఎదుర్కొన్నాడు. ఓ ఇద్దరి తలకాయలు పగులగొట్టి పడిపోయాడు. అతని రక్తసిక్తమయిన శరీరాన్ని తీసుకొని నినాదాలు చేస్తూ మూడు నాలుగు మైళ్లు వరంగల్ కోటనుంచి ఊరుదాకా ఊరేగింపుగా వెళుతూ ఉంటే అడిగేవాళ్లు లేరు. 'పట్టపగలే పట్టణములో పట్టి పౌరుల కొట్టి చంపినా దుష్టకూటమితో ప్రభుత్వము దొంగ (బేరము చేసిన) ...'' అని కోళోజీ చెప్పాడు. అట్లా ఊరేగింపుగా వస్తూవుంటే శబ్దానుశాసన గ్రంథాలయం దగ్గర - ఆ గ్రంథాలయానికి రామానుజరావు కార్యదర్శి యాభై ఏళ్ళపాటు - ఒక రెండు మూడేళ్ల పిల్లవాడు అరుగు మీద నిలబడి ఉన్నాడు. వాణ్ణి పొడిచి మోరీలో పడవేసారు.

ఇట్లానే ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రారంభోత్సవం. జండా వందనం మొదలయిన సంఘటనలతో ఒక రన్నింగ్ కామెంటరీగా, వాఖ్యానంగా నా కవిత్వం

సాగింది. 'ప్రజలను హింసించు ప్రభువు మాకేలా' మహబూబ్ బాద్షా చచ్చిపోతే రాజ్యం ఆయన కొడుకు ఉస్మానలీఖాన్‌కు వచ్చింది. ఉస్మాన్ ఆలీఖాన్‌కు వస్తుంది నిజాం నిరంకుశ పాలన. ఈ పదిహేడు జిల్లా లలోపట వాని ఇష్టారాజ్యం. వానికి హైకోర్టు, వానికి సైన్యం వానికి టప్పా, వానికి సిక్కా, బ్రిటిష్ ప్రభుత్వానికి వాడు 'యూరెవఫాదార్' (**Faithful Servant**). రెండవ ప్రపంచయుద్ధంలో ఎంతో సహాయ పడ్డవాడు, మొదటి ప్రపంచయుద్ధంలో కూడా సహాయ పడ్డాడు. అన్ని సంస్థానాల వాళ్లకూ హెచ్.హెచ్. యే. హిజ్‌హైనెస్సే. కాని మనవాడికి హెచ్.ఇ.హెచ్. మహోఘనత వహించిన నిజాం ప్రభువు. మూడునెలల కోసం కాళోజీ వరంగల్లు జిల్లా నుండి బహిష్కృతుడు. నాకు హిందువులు ఒక కన్నైతే, ముస్లింలు ఒక కన్ను. ఇద్దరూ నాకు సమానం అని చేప్పేవాడు నిజాం. దీనిమీద కాళోజీ వ్యాఖ్యానం నాగొడవలో, 'నేటి (వారము) రెండుకళ్ల మేటి మాటలెందుకు...' అని, 'ప్రజలను హింసించు ప్రభువులు మాకేల వధియింప భక్షింప...' అని నా ప్రశ్న 'రాణి వాసములో రంజిల్లు రాజా-రైతుబాధలు తీర్చి రక్షింపలేవా? పట్టణపు సొగసులకు పాటుపడురాజా,? అని ప్రశ్నలు. నా గొడవలో సొంతం ప్రశ్నలే ప్రశ్నలు. ''అడుగు తున్నాడు కాళోజీ ప్రథమ పౌరుని....'' అని వరాహగిరి వెంకటగిరి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ప్రశ్నించాను. సాహిత్యంలోపట నాకు శేషగిరిరావు గారు, అయిదారు భాషలలో పండితులు. కొత్త పట్నం రాధాకృష్ణగారు, ముసుపట్ల పట్టాభిరామారావు గారు, రాళ్లపాటి రాఘవరెడ్డిగార్ల దగ్గరవారు. మాయింట్లో జరిగిన విషయం, విశ్వనాథ సత్యనారాయణగారు మొదటిసారి వచ్చినప్పుడు- విశ్వనాథ సత్యనారాయణ గారేమిటి? ఎవరు వచ్చినా కాళోజీ రామేశ్వరావుగారి ఇంటికి రావలసిందే - రాఘవరెడ్డి గారు పద్యాలు చదివారు. వేల పద్యాలు రాశారు. రామేశ్వరరావుగారి ఇంటికి పండితులు మహానుభావులు, రాజకీయవేత్తలు అందరూ వచ్చేవారే. అదొక వాతావరణం. సాయంకాలం భాగవతమో, తులసీదాసు రామాయణమో, సంత్ జ్ఞానేశ్వర్ రచనలో చదివేవారు. అటువంటి సాహిత్య వాతావరణం అక్కడ.

ఆనాడు తెలంగాణాలో ప్రత్యేక పరిస్థితి. భయం, అనుమానం. ప్రతి దాన్నీ అనుమానించేవారు. అప్పుడు ఢిల్లీ నుంచి అయినా, మద్రాసు నుంచి అయినా ఇటు కృష్ణా, గుంటూరు, గోదావరుల నుంచైనా ఎవరు వచ్చినా కాళోజీ రామేశ్వరరావు గారి ఇంటికి రావలసిందే. మద్రాసు నుంచి ఢిల్లీ పోవాలంటే కాజీపేట మీదుగా పోవలసిందే. రైలు నైజాములో ప్రవేశించిందగ్గరి నుండి కిటికీలు మూసుకొని పడుకొనేవారు. ఏమి జరుగుతుందోనని భయం. సభలు సమావేశాలు ఏమి జరిగినా రెసిడెన్సీ ఏరియాలో జరగవలసిందే. ఆర్య సమాజ మహాసభలు అక్కడే జరిగేవి. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావుగార్లు కార్యదర్శులు, అధ్యక్షులుగా పనిచేశారు. రెసిడెన్సీ ఏరియాలోనే ఈ అవకాశం.

తెలంగాణా ప్రాంత పరిస్థితి వెనుకబడినపరిస్థితి. కులాలు పట్టించుకోక పోవడం, బాల్య వివాహాలు వదిలి పెద్దయిన పిల్లలకు పెళ్ళిళ్లు చేయడం, కులాంతర వివాహాలూ ఇవన్నీ మనకంటే ముందు మహారాష్ట్రలో మొదలయ్యాయి. సంఘ సంస్కరణ అక్కడే ముందు జరిగింది. మన దగ్గర పరిస్థితి ఏమిటంటే శారదాబిల్లు మరో మూడునెలల్లోఅమల్లోకి వస్తుంది అంటే కృష్ణా జిల్లాకు మా నైజాం జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సుమారు లక్షవివాహాలు జరిగాయి. మాడపాటి హనుమంతరావుగారి జన్మస్థలం ఎర్రుపాలెంలో యాభైవేల పెళ్ళిళ్లు జరిగాయి. నా పెళ్ళి కూడా చాలా చిన్నప్పుడే జరిగింది.

ఇక సాహిత్యాలలోకి వస్తే గరిమెళ్ల సత్యానారాయణ, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, ఇలా రాజకీయ ఉద్యమాల గురించి రాసినవాళ్లు అయిదుగురు, ఆరుగురు కంటే ఉండరు. అయ్యదేవర కాళేశ్వరరావుగారు చెప్పిన కథ. రాయప్రోలు సుబ్బారావుగారు 'ఎక్కడనో పలు శస్త్రశాలలు నిలుపువాడు....' అని ఏదో పద్యంలో రాస్తే కృష్ణాజిల్లా నుంచి ఎవరో రెసిడెన్సీకి రాస్తే, రెసిడెన్సీవారు ఎంక్వయిరీ జరిపారు. అప్పుడు Arms Act ఉండేది. కాళేశ్వరరావు పంతులుగారికి

రాయప్రోలు సుబ్బారావు గారంటే గౌరవం. ఆ సంగతంతా తెలుసుకొని వాళ్ల దగ్గరకుపోయి రామ రామ బ్రాహ్మడు శస్త్రశాలలు అని రాయలేదు సత్రశాలలు అని రాశాడు అని బొంకారు. నిర్భయంగా చెప్పిన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు 'తెల్లవారను గడుసరి గొల్లవారు' అని చెప్పారు. ఈ విధంగా ప్రభుత్వ వ్యతిరేకంగా నేరుగా చెప్పినటువంటి సాహిత్యాన్ని చూడండి. ఆధునిక మహా కవుల్ని కూడా తీసుకోండి. నేరుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసినటువంటి కవులను చూపించండి. సిద్ధాంతంగా సిద్ధాంతపరంగా లేకపోతే విశ్వాసపరంగా అన్యాయం చేయడం తప్పు అని చెప్పిరాయవచ్చు. దోపిడీ చేయడం తప్పు అని ఎవరైనా రాయవచ్చు. మన శ్రీ శ్రీ అన్నాడుకదా 'దౌర్జన్యాలు దోపిడీలు ఇంకానా ఇక సాగవు' అని. దీనిమీద నా ప్రశ్న 'ఏమైందని ఎందుకు సాగవు?' అని. సాగుతూనే ఉన్నాయి కదా. అయోధ్యరామయ్య అని ఒకాయన నూరు బుర్రకథలు రాశాడు. తెలుగు పత్రిక తీశాడు. మొదలు మాసపత్రిక, తరువాత పక్షపత్రిక, తర్వాత వార పత్రిక తర్వాత వారానికి రెండు సార్లు, తర్వాత భాగ్యనగర్ అని తెలుగు డైలీ పెట్టి మూడు సంవత్సరాలు నడిపాడు. సుబ్బరాజు, బుర్రకథ రాజు అని ఆయనకు పేరు. ప్రత్యక్షంగా పాడేవారు రజాకార్లకు, నైజాంకు వ్యతిరేకంగా. దాశరథి ఏమిటి. అతను పెద్ద ఉద్యమాలు నడిపించింది లేదు. పెద్ద ఉపన్యాసాలిచ్చింది లేదు. సభల్లోకి పోయి ఆ పద్యాలు చదివేవాడు. అదే పెద్ద ఉపన్యాసం. ఒక రెండు వేల ఉపన్యాసాల ప్రభావం కలిగించాడు ఆ పద్యాలతోటి

వందే మాతరం పాడడం ఇక్కడ నిషిద్ధం 1938 - 39లో. ఉస్మానియా విశ్వవిద్యాలయం కాలేజీలలోపట, హాస్టళ్లలోపట వందే మాతరం పాడతామని విద్యార్థులు ముస్లిమేతర విద్యార్థులు, ప్రభుత్వం పాడవద్దని - హాస్టల్స్‌కు తాళాలు పడ్డాయి. వెళ్లగొట్టబడ్డారు. అప్పుడు ఇంటర్మీడియేట్ చదువుకొనేటటువంటి కాలేజీలు నాలుగు. ఒకటి ఔరంగా బాదుల మహారాష్ట్ర, ఒకటి గుల్బర్గా, కర్ణాటకలో మెదక్ సుబాకు సంబంధించి ఇక్కడ ప్రారంభించిన సిటీ కాలేజీ, వరంగల్‌లో ఒకటి. ఇవన్నీ నైజాం పాలనలోని 17 జిల్లాలలోవి. తర్వాత యూనివర్శిటీ. అయితే 600 మంది స్టూడంట్సు వందేమాతరం పాడడానికి ముందుకు వచ్చారు. వీళ్లను

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరిస్తే ఆంధ్ర విశ్వవిద్యాలయం వాళ్లు రానివ్వలేదు. మద్రాసు విశ్వవిద్యాలయం అసలే అంగీకరించలేదు. నాగపూర్, విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కేదార్ అని ఆయన అందరికీ నాగపూర్, వార్థా మొదలయిన ప్రదేశాల్లో అవకాశాలు కల్పించారు. వరంగల్‌లో ఇంటర్‌లో 49 మంది ముస్లిమేతర విద్యార్థులముండేవాళ్ళం. అందులో మొదటి సంవత్సర విద్యార్థి రాజాగౌడు, రెండవ సంవత్సరం విద్యార్థి సుదర్శన్‌రావు అనే విద్యార్థులు తప్ప తక్కిన 47 మంది వందే మాతరం పాడడానికి వచ్చారు. నాగపూర్‌కు పంపించిన ఈ 47 మందిలో అందరికంటే చిన్నవాణ్ణయినా పెద్దవాణ్ణి నేను. హయగ్రీవాచారి కూడా ఉన్నాడు. వాళ్లలో నేటి ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావు, ఇక్కడ అచ్యుతరెడ్డి, పద్మనాభం వాళ్ళలో పెద్దవాళ్లు. ఒక మేలు మాత్రం జరిగింది. అట్లా వెళ్లిన 600 మందిలో 400 మంది దాకా ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు అయి పెద్ద పెద్ద చదువులు చదివి నాయకులయ్యారు. వందేమాతరం పాడ వద్దంటే తెలుగు, పార్సీ, ఇంగ్లీషు పదాలు కలిపి కాళోజీ దాన్ని ఒక వ్యంగ్య గేయం చేశాడు. మా పి.వి. నరసింహారావు మాటల్లో చెప్పాలంటే, 'లక్ష ఉపన్యాసాల కంటే ఎక్కువ పని మా కాళోజీ గేయం చేసింది. మచిలీపట్నం కూడా నాదే, రాయలసీమ అంతా నాదే. నాకు సముద్రపు ఒడ్డు కావాలి. అందుకని మచిలీపట్నం నాకు కావాలి, అట్లా బేరాలు. అదికూడా నాదే మీ బకాయి వసూలుకని ఇచ్చాను. ఇంకా వసూలు కాలేదా అది కూడా నాదే అన్నాడు నిజాము. నిజాంరాజు గారి బావ అయిన షాహెమసూధ్, షాహెబెరాయి. అంటే మచిలీపట్నం రాజు. ఇవన్నీ తనవేనని నిజాంక్లెయిమ్ చేశాడు. ఖమ్మందాటితే కృష్ణాజిల్లా. అప్పుడు ఖమ్మం మా వరంగల్ జిల్లాలోనే ఉండేది. ఖమ్మం దాటితే మిమ్మల్నెవారూ అడగరు. కాని మేం మాత్రం మసూలా రాజులం. మేము షాహెబా రారు. ఇదంతా చాలా వ్యంగ్యం. ఇక్కడ ముప్పయి సంవత్సరాలు నలభై సంవత్సరాలు పెద్ద పెద్ద ఉద్యమాలలో ఉండి మహాపండితులు మహాకవులు అయినవాళ్లు, మా హైదరాబాదు రాష్ట్రంలో ఉండేటటువంటి వంటి ఇద్దరు. ఆలిండియా ప్రఖ్యాతిగాంచినటువంటి సరోజినీనాయుడు ఒకామె. ఆమె మా హైదరాబాదు

కోడలు. మేజర్ నాయుడు భార్య. ఆయన మిలిటరీ డాక్టరు. ఈమె ఆ రోజుల్లో బెంగాల్‌నుంచి వచ్చినటువంటి ఒక హెడ్మాస్టరుగారి బిడ్డ. ఈమె మా హైదరాబాదు నివాసి. రెండో వారు రాయప్రోలు సుబ్బారావుగారు. మహానుభావుడు. ఈయన కృష్ణదాటితే జాతీయ కవి. ఉక్కడెక్కడ ఉండేవాడో ఏమిటో మాకెవరికీ తెలియదు. మేమెవరమో ఆయనకు తెలియదు. ఒక సంఘటన చెప్తా.

మన రామానుజరావు శబ్దాను శాసన గ్రంథాలయ కార్యదర్శి. గ్రంథాలయ రజతోత్సవం చేస్తూ దానికి మహామహులనందరిని పిలిచాడు. 1944-45 ప్రాంతం-రాయప్రోలు సుబ్బారావుగారు, తల్లా వజ్ఝుల శివశంకర శాస్త్రిగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, 'విజయ' అనే పత్రిక తీస్తూ ఉండిన పల్లెల శ్రీరామమూర్తిగారు ఈ అయిదారుగురు మహానుభావులు వచ్చారు. వీరందరిదీ కూడా వరంగల్ స్టేషన్ దగ్గర ఒక సత్రంలో బస. నేను వీళ్లంతా అక్కడ ఉన్నారు కాబట్టి వెళ్లాను. ఆ హాల్లో జంపఖానా పరిచిఉంది. అతిథులందరూ కూర్చుని ఉన్నారు. ఒక పక్క ఈజీచైరులో రాయప్రోలు సుబ్బారావు గారు కూర్చున్నారు. నేను పోయే సరికి వాళ్లందరూ మా హరిసర్వోత్తమరావుగారూ, తక్కిన వాళ్లూ కాళోజీ రా రా అని చనువుగా పిల్చి కూర్చోపెట్టుకొని వాళ్లందరూ మాట్లాడుతూ ఉన్నారు. రాయప్రోలు మహానుభావుడు నన్నేదో వింతగా చూస్తున్నాడు. హరి సర్వోత్తమరావుగారు చూసి 'ఏమోయ్ సుబ్బారావు అట్లా చూస్తున్నావ్ కాళోజీ నెరుగరా' అన్నాడు. తెలవదు అనవచ్చుగదా. కాని హరిసర్వోత్తమరావుగారు అంత ఇదిగా మాట్లాడుతున్నారు. తల్లావజ్ఝులస్వామి వారు మాట్లాడుతున్నారు. ఎక్కడనో చూసినట్లే ఉంది అన్నాడు. ఎందుకనాలి? హరి సర్వోత్తమరావుగారు పదిపదిహేను నిమిషాలపాటు 'ఏమిటిది? నీవు 30, 35 సంవత్సరాలు హైదరాబాదులో ఉండడ మేమిటి? కాళోజీని ఎక్కడో చూసినట్లుందనడమేమిటి? ఎవరితోనూ కలవవా? ఇక్కడి ప్రజలతోటీ, ప్రజల ఉద్యమాలతోటీ ఏమీ సంబంధం లేదా నీకు'? అని ప్రశ్నించారు. అది వసంత ఋతువు. సాయంత్రం సభలు. కవి సమ్మేళనం రాయప్రోలువారు అధ్యక్షులు. కవి సమ్మేళనంలో కవిత్వం చదవ వలసినవారిలో

మొట్టమొదటి పేరు కాళోజీ నారాయణరావుది. వసంత ఋతువు, పౌర్ణిమ, కవిసమ్మేళనం, కాళోజీగారు 'కోకిల' అని కవిత వినిపిస్తారు అని పరిచయం చేశారు. నేను కోకిల అని రాశాను. దాంట్లో అన్యాపదేశంగా రాయప్రోలు వారిని తిడుతూ రాశాను. ఆ తర్వాత మాత్రం ఆయన వరంగల్లుకు వస్తే మా ఇంట్లోనే దిగేవారు. 'లేమావి చిగురులను లెస్సగా మేసెదవు, ఋతురాజు వచ్చెనని అతి సంభ్రమముతోడ, మావి కొమ్మల నీడ మైవరచి పాడెదవు, తిన్నతిండెవరిదే కోకిలా - పాడుపాటెవరిదే! ఏనాటి సుకృతమో, ఏ విశ్వకవి చలవో ఈ నాడు నిన్నింత దానిగా చేసినది...'

అంతేకాదు రాయప్రోలు ప్రసిద్ధ గీతం 'ఏ పీఠమెక్కినా ఎందుకాలిడినా ఏ దేశమేగినా...' అనే దానికి మొట్టమొదట పేరడీ చేసింది కాళోజీ. ఆ పాదాలట్లనే ఉంచి 'పొగడా నీతల్లి భూమిభారతిని' అన్నదాన్ని 'చూడరా నీబొజ్జ పూడుమార్గము' అని మార్చి రాశాను. 'నరులు ప్రాణాలతో నడచుదాకా...' చూడరా నీబొజ్జ నిండు మార్గము.' అని సభలో నేనే అధ్యక్షుణ్ణి. రాయప్రోలు వారు ముఖ్య అతిథి అనుకుంటాను. రాయప్రోలు వారు ఇంత గొప్ప దేశభక్తి గీతం రాసి ప్రభావం వేస్తే, నేను ఈ పేరడీ రాసి ప్రభావం వేశాను. 'చూడరా నీ బొజ్జ పూడు మార్గము' అన్న నామాటే అందరూ పాటిస్తారు కాబట్టి నా ప్రభావమే ఎక్కువ అన్నాను. వరంగల్లులో సుప్రసన్న, సంపత్కుమార, జగన్నాథం వీళ్లు సాహితీ బంధు బృందం అని సంస్థ పెట్టారు. ప్రారంభోత్సవానికి రాయప్రోలు అధ్యక్షులు, విశ్వనాథ ముఖ్య అతిథి. విశ్వనాథ సంస్కృతం లేకపోతే తెలుగు లేదు, సంస్కృతం లేకపోతే దేవుడే లేడు అన్నాడు. దేవుడు లేకపోతే మాకు దయ్యం లేదు పొమ్మన్నాను.

అరవవాళ్లతో బాధలుపడి విడిపోయి ప్రత్యేక రాష్ట్రం కావాలని అంతకాలం ఉద్యమాలు నడిపి 1913లో ఆంధ్ర మహాసభ మొదలు 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడేదాకా రాసిన కవితలన్నిటిలో చేసిన ప్రసంగాలన్నిటిలో అరవల దగ్గర ఆంధ్ర అనీ, ఆంధ్రుల దగ్గర తెలంగాణులనీ పెడితే సరిగ్గా సరిపోతాయి ఆ బాధలన్నీ. మరి అన్ని బాధలు పడ్డవాళ్ళు మమ్మల్నింకా

బాధలెందుకు పెడుతున్నారో నా కర్థం కావడంలేదు. మొదట్నుంచీ ఢిల్లీ నుంచి, లక్నో నుంచి వచ్చినవాడు మాకు ఉర్దూ రాదనీ, మద్రాసు నుంచి వచ్చిన పెద్ద పెద్ద ఇంగ్లీషు పండితులు మాకు ఇంగ్లీషు రాదనీ, హిందీ వాళ్లు వచ్చి మాకు హిందీ రాదనీ అన్నారు. కాని మాకు తెలుగు రాదన్న వాళ్లులేరు. కాని ఈ మహానుభావులొచ్చి మాకు తెలుగు రాదన్నారు. ఇది చూడండి మీరు. 1913 లోపల శ్రీ పాదకృష్ణమూర్తి శాస్త్రి వంటి పండితులు కూడా మడికొండకు వచ్చి రెండేసి నెలలు, మూడేసి నెలలు ఉండి పోయినారు. ఇల్లెందులో 25వ గ్రంథాలయ మహాసభలు జరిగితే ఈ మహానుభావుతందరూ వచ్చారు.

గుజరాతులో కాంగ్రెసు మహాసభలకు రావినారాయణ రెడ్డిగారు ఆంధ్ర నుండి వెళ్లిన సభ్యులతో ఉంటే ఎన్.జి. రంగానో మరెవరో రెడ్డిగారిని 'ఏ రెడ్డిగారూ మీరు తెలుగుచదువుతారా, మీ నైజాములో తెలుగు చదువుతారా?' అని అడిగారు. ఆయనేమంటారు. నవ్వారు. జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి అని ఒక మహానుభావుడు వచ్చేవాడు. మా వరంగల్లులో కూడా ఎన్నో నెలలు ఉండేవాడు. మాయింట్లో కూడా ఉండేవాడు. మహావక్త. నా మహారాష్ట్ర యాత్ర, నాబెంగాల్ యాత్ర అని రాయటమే నాసంగతి మా సంగతి రాయకపోతివంటే తంతా' అన్నాను. ఎందుకోసం అంటే 'అరే కాళోజీ నీవు తెలుగు బాగానే మాట్లాడతావే' 'అంటే మరేం మాట్లాడతరా?' అన్నాను. వావిలాల గోపాలకృష్ణయ్యగారు, లక్ష్మీనరసింహం పంతులుగారు సభలకు వస్తే నేను, కోదాటి నారాయణరావుగారు, తెలుగులో మాట్లాడితో వారికి ఆశ్చర్యమాయె. వీరు నైజాం వాళ్ళు తెలుగు మాట్లాడుతున్నారు. మీరు ప్రపంచమంతా తిరిగి వచ్చినారె, అమెరికా గిమెరికా గురించి జ్ఞానమున్నదే, మా తెలంగాణే అంటే తెలియకుండా పోయింది మీకు. బోయిభీమన్న, బుచ్చిబాబు, గోపీచంద్ 1956 తర్వాత ఇక్కడికి వచ్చారు. తెలంగాణా రచయితలు ఒక సభపెట్టి ఈ ముగ్గురికీ చిన్న సన్మాన కార్యక్రమం చేస్తే మేం ఏదో ఎడారిలో, అరబ్ దేశానికో పోతున్నామనీ మాతో తెలుగు మాట్లాడే వాళ్లెవరన్నా ఉంటారా అని అనుకున్నామని ఆ ముగ్గురూ మాట్లాడారు1956లో 1945లో కథకుల సమ్మేళనం

చేసుకున్నాంమేమిక్కడ. కవి సమ్మేళనాలయితే తెలంగాణా రచయితల సంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తులో అంతకుముందే జరుగుతూ ఉండేవి. కాళోజీని మూడునెలలు వరంగలు జిల్లా నుంచి వెడలగొడితే చంకూరు అనే కుగ్రామంలో 'సాహితీ మేఖల' వార్షికోత్సవం జరిగితే రామానుజరావుగారు అధ్యక్షత వహిస్తే 60 మంది కవులు దాంట్లో పాల్గొంటే, మూడువేల మంది గ్రామస్థులు కూర్చుని వింటే 12గంటలు జరిగింది - ఆ కవిసమ్మేళనం. జనగాంలో గురజాడ జయంతి రోజు కన్యాశుల్కం మీద సభ జరిగితే నాలుగు అయిదు వందల మంది వచ్చారు. దానికి బోయి భీమన్న, గోరా శాస్త్రి ముఖ్య అతిథులుగా వచ్చారు. వారిద్దరి గుసగుస, మనం ఏం చెపితే వాళ్లకేం తెలుస్తది?' అని అంటే వాళ్లు 'మీ యిద్దరి ఉపన్యాసాలు వినడం కోసం రాలేదు నాయనా, గురజాడ వారి కోసం వారి కన్యాశుల్కం కోసం వచ్చారు. అన్నారు.' ఎట్లా ఇంటిగ్రేషన్ జరుగుతుంది, ఎట్లా సాధ్యం? ఈ దేశం అందరిదని, అంతా భారతీయులమని అంటేనే అయిపోతదా, అనిపించాలి కూడా కదా. ఫస్టయినా పండగయినా అందరిదీ అయినప్పుడు, అప్పయినా ఆస్తయినా అందరిదీ అయినప్పుడు, నాకనిపిస్తుంది 'నేనింకా నానుండి మా వరకు రాలేదు. మనమంటే కదా ముందడుగు' అని రెండున్నర జిల్లాలది దండిబాస అయినప్పుడు, తక్కినవాళ్లయాస తొక్కిపట్టబడినప్పుడు ప్రత్యేకంగా రాజ్యం పొలడగక తప్పదు. కూలివాళ్లకోసం ఎంతో శ్రమ పడ్డవాడు, ఆరణాల కూలీ నుండి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయినవాడు, మహానుభావుడు అంజయ్య రవీంద్రభారతిలో మాట్లాడుతూ ఉంటే గోల, హేళన . అది మా హైదరాబాదు, సికిందరాబాదు భాష అని దాశరథి సమర్థిస్తే అంజయ్యగారి భాషే అసలైన తెలుగట దాశరథి గారన్నారని ఆరునెలల వరకు పండితులు విమర్శించారు. ఎవని యాస ఎవని భాష వానికి సిసలైన భాష. ఆ గురజాడ వారి పుణ్యం, ఆ గిడుగువారి పుణ్యం వల్ల ఇంతమంది కవులు, ఇంతమంది కథకులు ఇవాళ రాస్తున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి తన అనుభవాలలో రాసుకున్నాడు-చిన్నప్పుడు ఆయన ఒక తెలుగు పద్యం రాసుకొని మెత్తకింద పెట్టుకుంటే ఆయన అన్నచూసి చెంపమీద ఒకదెబ్బకొట్టి, తీసుకొనిపోయి తండ్రికి చూపిస్తే ఆయన కర్ర తీసుకొని చేతిమీద కొట్టాడట. ఆంధ్రలో గాని మహారాష్ట్ర, మద్రాసులలోగాని ఉన్న ఆంగ్లేయ ఉద్యోగులు భాషాభిమానం ఆసక్తి

ఉన్నవారు అటు ఉర్దూనయినా, మరాఠీనయినా, తెలుగయినా ఉద్ధరించారు. లేకపోతే మన ఈ మహాకవులందరూ దేశ భాషలనేవి లేకుండా చేసేవారు. ఇది మన భాషాసేవ.

'ఏ భాషరా నీది ఏమి వేసమురా?...' అక్కడగాని ఇక్కడగాని మొన్న మొన్నటిదాకా 'తెలంగీమే బాత్‌కర్‌నా నహీ ఆతా' అనో 'ఐడోంట్‌నో, హౌటు స్పీక్ తెలుగు' అనో అనేవాళ్లే. ధోవతి కట్టుకోవడం అవమానం, పంట్లాం వేసుకొని టై కట్టుకోవడం వానికి, ఇక్కడ పైజామా లాల్చీ వేసుకోవడం వీనికి. వాడు వీణ్ణి ఆక్షేపించడం. ఎట్లున్నది చూడండి. వానిది రోడ్డు తెలుగు, వీనిది సడకు తెలుగు, మాకు 'చాయ్' తెలుగు, మీకు 'టీ' తెలుగు. 'అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్మురాదనుచు సకిలించు ఆంధ్రుడా చావవేమిటికిరా...' అని రాయవలసి వచ్చింది కాళోజీ.

ఒకని అలవాట్లను ఒకడు సహించాలి. సహృదయం ఉండాలి. మైత్రి ఉండాలి. వ్యసనమున్నవాడు తనకు స్నేహితుడయితే వ్రతం చేసేవాడు వానికి తన యింట్లో ఏర్పాటు చేస్తాడు. వ్రతము, వ్యసనము కలిసి వర్ధిల్లించు పాఠాలు, పండితుడు పామరుడు పలికించి మాటాడు, కలిమిలేములు కలిసి సయ్యాటలాడు! మా రాఘవరెడ్డి ఎంత పండితుడు! మా గురువుగారు మహాదేవ వర్మ కవితలన్ని తెలుగులో రాసినవాడు. అటువంటి మహానుభావుడు. ఇంకో మహానుభావుడు పిల్లా వెంకటరత్నం (విజయవాడ) నాలుగువేలో పదివేలో పద్యాలు రాశాడు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వర్ణిస్తూ ఆయన రాసిన పద్యాలు రాఘవరెడ్డిగారు, పి.వి. నరసింహారావుగారు, పాములపాటి సదాశివరావుగారు మేం అందరం విన్నాం.

పసిపాపలు బుసకొట్టిరి
కసవూడ్చెడి ముసలి యవ్వ కను లెఱ్ఱబడెన్
అసువుల కన్నను స్వేచ్ఛా
మసలుండే మేలటన్న మత్సరమొదవెన్

అన్న పద్యం నాకింకా గుర్తు ఉంది. బెడవాడకు పోతే ఆ పిల్లా వెంకటరత్నం ఇంటికిపోయే వాళ్లలో నేనొకణ్ణి. పువ్వాడ శేషగిరిరావొకడు. పువ్వాడ శేషగిరి రావుగారికి ఆయన శిష్యుడు. 'వినయకుమారము' అని వెంకటరత్నంగారు రాసిన

చిన్న కావ్యం ఆవిష్కరణ సభలో చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు అధ్యక్షత వహించి చెప్పిన పద్యం పంక్తులలోని భావం. నాశిష్యుడు లక్ష్మీకాంతం, అతని శిష్యుడు పువ్వాడకవి, అతని శిష్యుడు వెంకట రత్నం ఈ విధంగా ఈ కవితా శిష్యవంశం దినదినాభివృద్ధి పొందుతూంది అని. ఆ పిల్లా వెంకటరత్నం గురించి ఇప్పుడెవరికీ ఏమీ తెలియదు. ఎవరన్నా చదువుతున్నారో లేదో.

16,17 సంవత్సరాల వయస్సు నుంచీ ఉపన్యాసాలే ఉపన్యాలిచ్చేవాడిని. కాళోజీ, కోదాటి, కొమనగిరి మేం ముగ్గురం 20 ఏళ్ళ లోపటనే ఈ ప్రజాఉద్యమాల లోకి దిగిన వాళ్లం. ఉపన్యాసాలిస్తూ తిరుగుతూ ఉంటే వీటి బదులు ఏమైనా కథలు రాస్తే బాగుంటుంది అని కథలు రాశాను. ఏం రాసినా కాని ఏదో పేరు తెచ్చుకోవాలని గాని, కవిగా పేరుపొందాలనిగాని రాయలేదు. అందుకే అది కవిత అని కూడా అనలేదు. 'నా గొడవ' అన్నా. 1930 ఉప్పు సత్యాగ్రహం నుంచి 1940దాకా భారతదేశమంతా తిరిగి గాంధీగారితో ఉండి మాంచెస్టర్ గార్డియన్ అనే పత్రికలో హెచ్.ఎం. గ్రేట్ ఫర్డ్అనే పత్రికా ప్రతినిధి రాసిన వ్యాసాలన్నీ 'రెబెల్ ఇండియా' అనే పేరుతో పుస్తకంగా ప్రచురితమయింది. దాన్ని ట్రాన్స్‌లేట్ చెయ్యాలి. తిరగబడ్డ భారతం అంటే నైజాం రాష్ట్రంలో తిరుగబడు అనే మాట ఉంటే ఇంకేమైనా ఉందా. దాన్ని క్లుప్తంగా 'నా భారత దేశ యాత్ర' అని అనువదించాను. మహానుభావుడు వట్టికోట ఆళ్వారుస్వామి కాశీనాథుని నాగేశ్వరరావు చనిపోయిన సంవత్సరంలో దేశోద్ధారక గ్రంథమాల స్థాపించి 38 పుస్తకాలు అచ్చువేశాడు. వాటిలో 1940లో అచ్చైన పుస్తకం 'నాభారతదేశ యాత్ర'. అంతకుముందే కె.సి. గుప్తా, వెల్దుర్తి మాణిక్యరావు కలిసి అణా గ్రంథమాల పెట్టారు. అణాకు పుస్తకం. పదహారు పేజీలు ఇరవై పేజీలు చిన్నవి. సుభాష్ చరిత్ర, గాంధీ చరిత్ర, వీర్‌సావర్కార్ చరిత్ర, ఆర్య సమాజ్ దయానంద సరస్వతి చరిత్ర మొదలైనవి. ఆ కె.సి.గుప్తాగారి మీద ప్రభుత్వం 12 సంవత్సరాలు శిక్షపడే కేసు పెట్టినారు. హైకోర్టులో బూర్గుల రామకృష్ణరావు మొదలయిన వాళ్ళు - చాలా మితవాదులని వారిపైన ఆక్షేపణ. ఆరు పుస్తకాలో, ఎనిమిది పుస్తకాలో నిషేధింపబడ్డాయి. దాంట్లో కాళోజీ కథలు అని, వాదించి తప్పించారు. ఉపన్యాసాల

కంటే ఉద్యమాలలో ఈ కథలు గేయాలు కవితలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఉద్యమాన్ని ప్రజలలోకి తీసుకు వెళ్తాయి అని ప్రహ్లాదుని చరిత్ర. పురాణ కథలు కొన్ని తీసుకొన్నాను. ప్రహ్లాద చరిత్ర తీసుకొని యాదగిరిగుట్ట నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో ఆ నరసింహస్వామిని సంబోధించి ఆనాడు హిరణ్యకశిపుని చంపిన నాటి నీ కోపం లక్ష్మీదేవి స్వయంగా వచ్చి ప్రార్థించినా చల్లారని కోపం నాకు మళ్ళీ చూడాలని ఉంది అని రాశాను. ఆనాడు రుద్రుడు, ఇంద్రుడు ఎవరువచ్చి ప్రార్థించినా ఆయన కోపం చల్లారలేదు. వేయి యుగాలలో ఎన్నడూ చూడనంత కోపం ఆయనకు వచ్చింది. అంతవరకు హిరణ్యకశిపునికి జేజేలు పలికినవారంతా వాణ్ణి నృసింహస్వామి చంపేటప్పటికి నృసింహస్వామికీ జై అన్నారు. అయినా ఆయన కోపం చల్లారలేదు. ఆనాడు నిన్నుజేరగ భయకంపితగు లచ్చియమ్మె ఈనాడు నీతొడపై హాయిగ కూర్చుని యున్నది లక్ష్మి. అటువంటి నీ కోపము దితి పుత్రుడు ప్రహ్లాదుడు చేరి మ్రొక్క చప్పున చల్లారెన్, మా కొంపలు ఆరెన్. నా గొడవలో నా సాహిత్యంలో ఉండే విశేషం ఇటువంటిది. ఎందుకు మన కొంపలెందుకు ఆరినయి. ఇక ఆనాటి గోల ఎందుకు? ప్రహ్లాదుల మాట ఎందుకు? వాని అయ్యతల దన్నినవాళ్ళు, వాని బంట్లు, ఏజెంట్లు ప్రహ్లాదుని పేరుతోడ నీకడకు ఏతెంచుట లేదా మరి కొంపలారి నట్లే కదా. నీకు తెలస్తలేదురా బ్రహ్మోత్సవారు చేస్తున్నారు, దద్దోజనాలు పెడుతున్నారు పులిహోరల నైవేద్యం పెడుతుంటే నీకు తెలుస్తలేదు. మా బాధలు. నీ వెవడవురా నీ వా అసలు నరసింహం? నేను నీకు మొండెం ఇచ్చాను సింహం తన తలిచ్చింది. సింహపుతల నామొండెం. నీకు తల ఇచ్చిన ఆ సింహం సంతానం, నీకు మొండెమిచ్చిన నా సంతానం ఏ పరిస్థితిలో ఉంది? ఆనాడు నా మొండెం నీకిస్తి. నాతలకాయ ఎక్కడో పారేసుకున్నాను. ఇంకా దొరకలేదు. నేను తల లేకుండానే ఉన్నాయింకా. సింహాలెక్కడున్నాయి సర్కసులోనన్నా ఉన్నాయి, లేకపోతే జూలో ఉన్నాయి. అందుకోసం ఆనాటి నీరూపం ప్రళయభయంకర రూపం చూడాలని ఉంది నాకు. నీ ఈ రూపంతో నాకు తృప్తి లేదు. ఆ బ్రహ్మోత్సవాలకు 20, 30 వేల జనం వచ్చారు. నా గొడవ విన్నారు. వరాహావతారం, వరహావతారం సందేశం ఏమిటి? 'జనహంతకుని ఎదిరి చంపు పందయిన పరమాత్ముడు' అనే కదా!

డాక్టర్ పి.ఎస్.ఆర్. అప్పారావు

(6-9-1994)

నేనొక పల్లెటూళ్ళో పుట్టినటువంటి వాణ్ణి. మ తండ్రిగారు గ్రామ కరణం. వారు మంచి రామభక్తులు, ఎప్పుడూ భాగవతం చదువుతూ ఉండేవారు. చిన్నప్పుడు నేను చాలా సుస్తీ పడ్డాను. ఆ రోజుల్లో అన్నం తిన్న తర్వాత మధ్యాహ్నం వెంటనే నిద్ర పోకూడదు; నిద్రపోతే మళ్లీ జ్వరం వస్తుందని నమ్మకం. అంచేత ఆయన ఒక గంటసేపనయినా నా మంచం దగ్గిర కూర్చుండి భాగవతం పద్యాలు చదువుతూండే వారు. నాకప్పుడు ఆరేడేళ్ళు. అప్పటికి ఇంకా చదువు ప్రారంభించలేదు. అవెలాగో ముద్ర వేసుకున్నాయి నామనసు మీద. తరువాత మా ఊళ్లో పిచ్చుకుంట్లు భాగవతులనే వాళ్లుండేవాళ్లు. వారు కూచిపూడి వారి నాట్య సంప్రదాయాన్ని నేర్చుకొని మంచి ప్రదర్శనలిస్తూ ఉండేవారు. అవి మనస్సులో చెరగని ముద్రవేశాయి. ఈ రెండూ నన్ను ఒక విధంగా మలిచాయి, తీర్చి దిద్దాయి. నాలోని మార్పునకు కారణం ఈ రెండేనని చెప్పగలను.

నాకు చిన్నప్పుడు చదువు మీద దృష్టి ఉండేది కాదు. మాకు పెద్ద వ్యవసాయం ఉండేది, పాలేర్లు ఉండేవారు. వీరితో పొలానికి వెళ్లేవాడిని. చివరకు వ్యవసాయంలో మొదట నాగలి పట్టేవాణ్ణి. ఆ విధమైనటువంటి శక్తి కూడా సంపాదించుకున్నాను. అలాంటి వాణ్ణి నేను చాలా సంస్థలలో ప్రారంభకుడిగా కూడా ఉన్నాను. తరువాతి జీవితంలో కొవ్వూరు మండలానికి సంబంధించిన వాణ్ణి నేను. ఒక రోజున కొవ్వూరు నుంచి చుట్ట మొకాయన మా ఊరు వచ్చి, ఆ రోజున మా నాన్నగారి వద్ద ఇతరుల వద్ద అనేకమైనటువంటి పద్యాలూ అవీ చదువుతూ తెలుగు సాహిత్యం గురించి తెలుగులో గొప్పవారి గురించి ఒక పూట పూటంతా చెప్పడం మొదలుపెట్టారు. నాకు కొంచెం బుర్ర తిరగడం మొదలు పెట్టింది. అప్పటికి మా

వాడికి చదువు రాదని నన్ను వదిలేశారు. కాని ఆ చుట్టం వెళ్లిపోయిన తర్వాత నేను చదువుకుంటానని పట్టు పట్టాను. హైస్కూలులో చదవాలంటే కొవ్వూరు పోయి చదవాలి మా ఊళ్లో లేదు. మా వాళ్లకు నమ్మకం కుదరలేదు. రెండు రోజులు అన్నం తినకుండా సత్యాగ్రహం చేశాను. మా నాన్నగారు వీడికి నిజమైనటువంటి బుద్ధి కలిగిందని నమ్మి కొవ్వూరు పంపించారు. ఆ రోజుల్లో ఫస్టు ఫారం నుండి ఎస్.ఎల్.సి. (నేటి 11వ క్లాసు) వరకు కొవ్వూరు బోర్డు హైస్కూలులో ఉండేది. నేను ఫస్టు ఫారంలో చేరినప్పుడు మొట్టమొదటిగా తెలుగు భాషకు బదులుగా హిందీ తీసుకోవచ్చునని ఒక ఆప్షన్ ఉండేది. అంటే తెలుగు పూర్తిగా మానేసి సెకండ లాంగ్వేజి క్రింద హిందీ తీసికోవచ్చు. నేనెందుకో ఆ హిందీ తీసుకున్నాను. అప్పుడు మా నాన్నగారు చెప్పిందేమిటంటే 'ఒరే తెలుగు పూర్తిగా మర్చిపోతావేమో, భాగవతం కొంత పరిచయమయింది కదా! అప్పుడప్పుడు చూచి కాపీ రాస్తుండు' అని సలహా ఇచ్చారు. ఇంతలో అక్కడ కళువె వీరరాజు గారని ఒకాయన భారతాన్ని పద్దెనిమిది రోజులు హరికథగా చెప్పారు. ఆ చెప్పడం చాలా హృదయంగమంగా ఏమీ తెలియని వాడికి కూడా మనస్సుకు హత్తుకుపోయేటట్లు చెప్పాడు. మానాన్నగారి ఉపదేశం ప్రకారం రాత్రి ఆ విన్నటువంటి కథను ఇంటికి వచ్చి ఉదయం విన్నది విన్నట్లు రాయడం ప్రారంభించాను. అసలు నా రచనా వ్యాసంగం ఆ విధంగా ప్రారంభమయింది. ఒక హరికథ చక్కగా చెప్పినటువంటి వ్యక్తి వల్ల. థర్డు ఫారంలో అని సెట్టి జగన్నాధ శాస్త్రి గారనే గొప్ప తెలుగు పండితులు తెలుగు చెప్పేవారు. వారికి జ్యోతిషంఫ్షైరాలు కూడా వచ్చును. వారు ఒక రోజున భీష్మస్తవం పాఠంగా చెప్పడానికి పూనుకొంటే వారు చెప్పడానికి ముందే ఎప్పుడో సంవత్సరాల క్రిందట విన్న పద్యాలన్నీ నేను చెప్పడం మొదలు పెట్టాను. ఒక విధంగా ఏదో విస్మృతి నుంచి బయటికి వచ్చినట్లు వచ్చి చెప్పేటప్పటికి ఆ మాస్టారు కూడా చాలా సంతోషించి నాకు చాలా ప్రోత్సాహ మిచ్చారు. ఆ విధంగా హైస్కూలు చదువు గడిచింది. చిన్నప్పుడు కూచిపూడి వారి ప్రదర్శనలు చూడడం వల్ల కలిగిన స్ఫూర్తితో నేనే సాముద్రికం వంటి కొన్ని స్కిట్స్ రాసి హైస్కూల్లో ప్రదర్శనలు చేశాను. నేను కూడా అందులో

పాత్రధారణ చేశాను.

1941 జూన్ నెలలో బెజవాడ శ్రీరాజా రంగయ్యప్పారావు కాలేజీలో ఇంటర్మీడియట్ చదవడానికి వెళ్లాను. అక్కడ విశ్వనాథ సత్యనారాయణగారు, తెలుగు లెక్చరర్. డా. పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు ప్రిన్సిపాల్. ఆ కాలేజీలో ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియరు మాత్రమే ఉండేది. నేను ఫస్టియర్‌లో చేరాను. అ్పడు ఎన్. టి. రామారావుగారు సెకండియర్‌లో ఉండేవారు. మేం చాలా సన్నిహితంగా అప్పుడు మెలిగేవాళ్లమనుకోండి. ఇప్పుడైనా ఎక్కడైనా కనిపిస్తే 'అబ్బో అప్పారావుగారు మా స్నేహితులు' అంటూ ఉంటారు. అంతకు ముందు నేను హైస్కూలులో చదువుకునేటప్పుడు 'వేయి పడగలు' ఆంధ్ర పత్రిక వార పత్రికలో పడుతూ ఉండేది. అది బాగా చదువుకున్నాను నేను. నేను సైన్సు స్టూడంటుని. విశ్వనాథ సత్యనారాయణగారి ప్రభావం ఎంతటిది అంటే నాకు రాజమండ్రి కాలేజీ సైన్సులో సీటు వచ్చినా ఆయన కోసమని అది వదులుకొని బెడవాడ వచ్చి చేరాను. అక్కడ మాథమాటిక్సు, ఎక్కౌంటెన్సీ, బ్యాంకింగు నా గ్రూపు. సైన్సు బొత్తిగా వదిలేశాను. సరే విశ్వనాథ సత్యనారాయణగారి ఇంట్లో రాత్రిళ్ళు పన్నెండు, ఒంటి గంటవరకు ఉండి పోయేవాణ్ణి. వారి అమ్మగారు, విశ్వనాథ వెంకటేశ్వర్లుగారు ఇంకా కొందరూ కూర్చుని ఏవో కబుర్లు చెబుతూ ఉంటే నేను ఊరికే శ్రోతను మాత్రమే. తరవాత ఒక రోజున ''నాకు వ్యాకరణం చెప్పండి'' అని వారిని కోరాను. వారు సాయంకాలమప్పుడు కృష్ణానది కాలువ వద్దకు స్నేహితులతో కలిసి వాహ్యాళి వెళుతూ ఉంటే నేను కూడా వెంట వెడుతూ ఉండేవాణ్ణి. నా బాధపడలేక ఒక రోజున బాలవ్యాకరణం సంజ్ఞా పరిచ్ఛేదం అంతా రయోస్ కాలువ ప్రక్కన కూర్చుండి చెప్పారు. అప్పటికే మేం మొదటి సంవత్సరాంతానికి వచ్చాం. సంవత్సరాంతంలో తెలుగు వ్యాకరణం చెప్పే అలవాటు తెలుగు పండితులకు ఉంటుంది. తెలుగు మాష్టర్లుగా మేమూ కొంతకాలం చేశామాపని. ఆయన ఒకనాడు క్లాసులో వ్యాకరణం చెబుతూ - మామూలుగా అరసున్న నిండు సున్న అవుతుంది. కాని నాడులో ఉన్న

అరసున్న నిండు సున్న కాదు ఎందుచేత? అని గబుక్కున నన్నడిగారు. సంజ్ఞా పరిచ్ఛేదంలో దానికి సూత్రం ఉంది. భగవంతుడు నాపట్ల ఉన్నాడు కాబోలు నాకు ఆ సూత్రం వెంటనే జ్ఞాపకం వచ్చింది. లేకపోతే చివాట్లు తినే వాణ్ణే నేనాయన చేత. ఆ సూత్రం చెపితే మంచిది బాగుంది అని మెచ్చుకున్నారు. మొదటి సంవత్సరం చివరలో కళాశాల ఉత్సవంలో మాజిక్ చేసి అందరి మెప్పు పొందాను. తరువాత మా సెకండు ఇయర్‌లో అంటే 1942 ఆగస్టులో క్విట్టిండియా మూమెంట్‌లో మేము కూడా ఒక పదిరోజులపాటు పికెటింగ్ అదీ చేసి కాలేజీకి వెళ్లకుండా మొత్తం స్టూడెంట్స్ అందరినీ ఆపాం.. నేనప్పుడు స్టూడెంట్సు యూనియన్‌కి వైస్ ప్రెసిడెంటుగా ఉండేవాణ్ణి. డా. శ్రీనివాసాచార్యులుగారితో చాలా సన్నిహితంగా ఉండేవాణ్ణి. తాజ్‌మహల్ అనే నాటిక ఒకటి అప్పటికి నేను ప్రచురించాను. దానికాయన పీఠిక కూడా రాశారు. అటువంటిది ఎప్పుడైతే నేను నాయకత్వం వహించి పికెటింగ్ చేయిస్తున్నానో ఆయనకు చాలా కోపం వచ్చింది. అప్పటికీ మా మిత్రులందరినీ ఒక చోట కూర్చోబెట్టుకొని ఇట్లా చెప్పాను. ఆయనెప్పుడూ గుర్రబ్బండిలో వచ్చేవారు. ఆయనున్నచోటి నుంచి మా కాలేజీకి - గుర్రబ్బండీ వచ్చేటప్పుడు చెప్పండి, కొంచెం పక్కకు తప్పుకుంటూ మని. ఆయన మాకంటే తెలివైన వారు కదా! వారు ఆనాడు శుభ్రంగా సైకిల్ ఎక్కి వచ్చేశారు. ఎవడూ చూళ్లేదు, మేం పట్టుబడ్డాం. ''సరే నువ్వు వస్తావా కాలేజీకి రావా, రాకపోతే నీమీద యాక్షన్ తీసుకుంటాను'' అని బెదిరించారు. 'ఏమండి ఇంత మందున్నారు, తీసుకుంటే అందరిమీద తీసుకోండి, నా ఒక్కడిమీదే తీసుకుంటారా' అన్నాను. అప్పటికే నా తాజ్‌మహల్ నాటకం కాలేజీలో వేయడానికి ఆయన అనుమతి ఇచ్చి ఉన్నారు. కాలేజీలో ఒక విద్యార్థి హార్మోనీ వాయించే వారు. ఇంకొకరు స్త్రీ పాత్ర వేసే వారు. అందరినీ సిద్ధం చేసుకొని రిహార్సల్సు చేస్తున్నాం. మా నుంచి తిన్నగా కాలేజీలో క్లాసుల్లోకి వెళ్ళి అప్పారావుతో ఎవరూ కోఆపరేట్ చేయడానికి వీల్లేదని ఆయన అందరికీ చెప్పారు. అది విని నేను మాట్లాడకుండా ఊరుకున్నాననుకోండి.

ఆ తరువాత సెకండియర్ అయిపోయింతర్వాత నేను ఆయన దగ్గరకు వెళ్లి కాండక్టు సర్టిఫికేట్టు కావాలండి అన్నాను. అంతవరకు ఇంచు మించు ఆరు నెలలు ఆయనతో కలవడానికి వీలుపడలేదు, మాట్లాడలేదు. నన్ను ఎగాదిగా చూచి కూర్చో అన్నారు. కూర్చున్నాను. అప్పుడే నీకు కాండక్ట్ సర్టిఫికెట్ ఎందుకు? అన్నారు. నేనిక ముందట చదువులు చదవలేనండి. కాండక్ట్ సర్టిఫికెట్ ఇస్తే ఎక్కడన్నా ఉద్యోగం వెతుక్కొంటాను అన్నాను. అప్పుడు వారు వాత్సల్యంతో '' నీ మీద నాకేమీ కోపం లేదు. నువ్వు బాగా చదువుకుంటున్నావు. నాటకం ప్రచురణ చేశావు. నువ్వెక్కడ చెడిపోతావో అన్న భయం తప్ప నీమీద కోపమేమీ లేదు. నీ పరీక్షలయిపోగానే రెండురూపాయలు కట్టినట్లయితే నీ మార్కులొస్తాయి. ఆ మార్కులు తీసుకొని నా దగ్గరకు రా'' అన్నారు. వెళ్తే ఆ మార్కులు చూసిం తర్వాత - నాకు మాథమాటిక్స్ లోనూ డిస్టింక్షన్ వచ్చింది తెలుగులోనూ వచ్చింది. నువ్వు తెలుగు ఎం.ఏ. చదవ వలసిందే అని చెప్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారికి ఉత్తరం వ్రాసి నన్ను గుంటూరు పంపించారు. నిజంగా ఆయనే కనక తలచుకున్నట్లయితే ఆ రోజున నన్ను జైలుకు పంపించేవారు. జైలుకు పంపించి ఉన్నట్లయితే ఏమయ్యేదో జీవితం తెలియదు. ఎవరో ఈ మధ్య తమాషాగా అడిగితే పోనీలే మినిష్టర్‌నుకాని, కనీసం ఎం.ఎల్.ఏ. గాని అయ్యేవాణ్ణిలే అని వేళాకోళంగా అన్నానుకోండి. కాని జీవితం మాత్రం బాగా మలుపు తిరిగి ఏమయ్యేవాణ్ణో. ఎందుకంటే డబ్బులేని వాళ్లం, చదువు లేనటువంటి వాళ్లం. కాని ఆనాటి ఆ గురువులున్నారే వారియొక్క వాత్సల్యాన్ని చెప్పకుండా నేనుండలేను. నన్ను జెలుకు పంపిస్తారనుకున్నవాణ్ణి లక్ష్మీకాంతం గారికి ఉత్తరం వ్రాసి, సీటు ఇప్పించి, స్కాలర్ షిప్పు కూడా ఇప్పించారు. ఆ పుట్టపర్తి శ్రీనివాసాచా ర్యులు గారు. వారు తర్వాత హైదరాబాద్‌కి ఆర్కియాలజీ డిపార్టుమెంటుకి డైర్కక్టరుగా వచ్చారు. అలా ఆ రోజుల్లో గురువుల యొక్క వాత్సల్యాన్ని చవిచూచాం. అదే విధంగా విశ్వనాథ సత్యనారాయణ గారితో సన్నిహితంగా ఉన్నాను. అసలు ఆ పదిరోజులు కాలేజీ ఎందుకు మానేశానంటే - విశ్వనాథవారు 12గంటలకు భోజనం చేసి ఒక గంట కునుకుతీసి రెండుగంటలకు క్లాసుకు వచ్చేవారాయన. అట్లా వచ్చి ఒక రోజున చెడతిట్లు తిట్టారు మీకు దేశభక్తి లేదా, క్లాసులకి రావడానికి సిగ్గులేదా అని. ఆ రోజుల్లో షోలింగర్ అని అప్పల లక్ష్మణరావుగారి భార్య, నిక్కరు బనియను వేసుకొని మా

దగ్గరకు వచ్చేది. ఆమె మా లీడరు. మాకు దేశ భక్తి ప్రబోధించినవారు విశ్వనాథ సత్యనారాయణగారు, మమ్మల్ని లీడ్ చేసినామె ఆ షోలింగర్.

తర్వాత బి.ఏ. (ఆనర్స్) చదవడానికి గుంటూరు వెళ్లాను. ఇక్కడ విశ్వనాథ సత్యనారాయణగారి వద్ద చదివింతర్వాత - విశ్వనాథ సత్యనారాయణగారి కిన్నీ, లక్ష్మీకాంతంగారికిన్నీ పడదని అప్పటికే చాలా ప్రచారం ఉండేది. కాని ఆ పడకపోవడం ఎటువంటిదంటే ఇక్కడ వీరిట్లా మమ్మల్ని అన్నారని విశ్వనాథ సూర్యనారాయణగారి దగ్గర, వారిట్లా మిమ్మల్నన్నారని పింగళి లక్ష్మీకాంతంగారి దగ్గరా మధ్యలో కొందరు చెప్పడంవల్ల - విన్నాను నేను స్వయంగా - లేకపోతే అన్నగారూ తమ్ముడుగారూ అన్న వ్యవహారంలోనే ఉండేవారు ఆ ఇరువురు. లక్ష్మీకాంతంగారు చనిపోయినప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారు రేడియో ఉపన్యాసంలో ఏడ్చేశారు. '' మా అన్న వెళ్లి పోయాడు నేనింక నిర్వీర్యుణ్ణయిపోయాను'' అని చెప్పి ఏడ్చారు సత్యనారాయణగారు. అలాంటి సన్నిహితుల మధ్య అనేక కారణాలవల్ల ననుకోండి తగవులు పెట్టడం ప్రారంభించారు. సరే ఏమైతేనేం ఇక్కడ సత్యనారాయణగారికి కొంచెం గుర్రుగా ఉండేది నాపైన. వీడు నన్ను వదిలిపెట్టేసి లక్ష్మీకాంతం దగ్గరకు వెళ్ళిపోయాడని. లక్ష్మీకాంతంగారికి ఉండేదో లేదో తెలియదు; చాలా గంభీరుడాయన. మాకు పింగళి లక్ష్మీకాంతంగారు, గంటి జోగి సోమయాజులుగారు, దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారు ముగ్గురున్నూ గురువులు. తరువాత ఈ ముగ్గురే కాకుండా గుర్తి వేంకటరావుగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారున్నూ మాకు హిస్టరీ క్లాసులు కొన్ని చెప్పారు. అంటే అప్పుడు బి.ఏ. ఆనర్సు అని ఉండేది. ఎం.ఏ. కాదు. ఎస్.ఎల్.సి వరకు 11 సంవత్సరాలు, ఇంటర్మీడియేట్ రెండు సంవత్సరాలు, తరువాత ఆనర్సు మూడు సంవత్సరాలు. అది ఇప్పుడు 15 సంవత్సరాలకు సరిపోతుందనుకోండి. బి.ఏ. ఆనర్సు పూర్తయిన ఒక సంవత్సరం తర్వాత ఎం.ఏ. అని డిగ్రీ ఇచ్చేవారు యూనివర్సిటీ వాళ్లు. అక్కడ గుత్తి వెంకటరావుగారని వైస్ ప్రిన్సిపాల్ భగవంతంగారు ప్రిన్సిపాలు. కట్టమంచి రామలింగారెడ్డి గారు వైస్

ఛాన్సలరు. అప్పుడు యుద్ధ సమయంలో జపాను వాళ్లు బాంబు వేస్తే మొత్తం యూనివర్శిటీని విశాఖపట్టణం నుంచి గుంటూరు తీసుకొని వచ్చి పెట్టారు. మళ్లీ అక్కడే సముద్రం పక్కనే; మరెందుకు తీసుకువెళ్లారో తెలియదు. తక్కిన యూనివర్శిటీ అంతా మాత్రం ఇప్పుడు మెడికల్‌కాలేజీ ఉందే అక్కడ పనిచేసింది. 1942లో వచ్చింది. 1946లో మా ఆనర్సు పరీక్షలయిపోయింతర్వాత మళ్లీ విశాఖ పట్టణం వెళ్లి పోయింది. ఆ గుంటూరులో ఉండేటటువంటి సమయంలో మలేరియా ఒకటి చాలా తీవ్రంగా ఉండేది. సెరెబ్రల్ మలేరియా అని చెప్పి చాలామంది స్టూడెంట్స్ అది వచ్చి చనిపోవడం కూడా జరిగింది. అది నాక్కూడా సంక్రమించింది. ఒక రోజున చచ్చిపోయినంత పనీ జరిగింది. నేను పిచ్చి కేకలు వేస్తూ ఉంటే మా ఆవిడ కంగారు పడిపోయి పక్కనే కాపురం ఉన్న దువ్వూరి వెంకట రమణ శాస్త్రిగారిని పిలుచుకొని వచ్చింది. ఆయన వచ్చి నన్ను మందలించారు. కాని ఇదేమిటి చిన్నపిల్లాళ్లా నువ్వలా అరుస్తావా అని. నేను ఇంచుమించు యమలోకానికి వెళ్లి, తిరిగి వచ్చానన్న సంగతి వారికేం తెలుసు. నిజంగా ఆరోజున చచ్చిపోయినట్లే నేననుభూతిని పొందాను.

ఆనర్సులో 'వేణువు' అనే రచన చేసాను. దీనిని పొయెటిక్ ప్రోజ్ అని చెప్పుకుంటునాననుకోండి. స్ఫూర్తి గీతాంజలి. కాని గీతాంజలికి దీనికే పోలికలేదు. దాన్ని ప్రకటించడం జరిగింది. లక్ష్మీకాంతం గారితో కొంచెం దూరంగా ఉండేవాణ్ణే కాని, ఇంటి పక్కనే ఉండడంవల్ల దువ్వూరి వెంకట రమణ శాస్త్రిగారితో చాలా సన్నిహితంగా ఉండేవాణ్ణి. తరువాత గంటిజోగి సోమయాజులుగారు క్లాసులో మాతో చాలా సన్నిహితంగా ఉండేవారు. గంటిజోగి సోమయాజులుగారు ఒక నిండుకుండ వంటివారు. వసు చరిత్రకాయన వ్యాఖ్యానంచేసి చెబుతూ ఉంటే నిజంగా నభూతో నభవిష్యతి అన్నట్లుగా ఉండేదాయన వ్యాఖ్యానం. తరువాత భాషాశాస్త్రం మొట్ట మొదటిసారి బోధించినవారు భద్రిరాజు కృష్ణమూర్తిగారు మొదలైన వారంతా ఆయన శిష్యులే. అక్కడ రెండు శాఖలు భాష, లేదా సాహిత్యం ఉండేవి (Two Streams).

మొట్టమొదట మేం అప్లికేషనులోనే రాయాలి. మేం లాంగ్వేజీ తీసుకుంటాము లేకపోతే లిటరేచర్ తీసుకుంటాము అని. మేం లాంగ్వేజీ తీసుకుంటాము అని వ్రాసినప్పటికీ మొట్టమొదటి క్లాసులోనే లక్ష్మీకాంతంగారు వచ్చి నేను లిటరేచరు మొదలు పెట్టేస్తున్నాను అన్నారు మా యిష్టంతో సంబంధం లేకుండానే. మళ్లీ ఆరోజున మాయిష్టం ప్రకారం చేస్తే భాషా శాస్త్రంకు వెళ్లి ఉండే వాళ్లమేమో. కాని లక్ష్మీకాంతం గారు సాహిత్యం వైపు తిప్పారు. అందులో ఫస్టుక్లాసు వచ్చింది.

తరువాత భీమవరం కాలేజీలో ట్యూటరుగా చేరాను. నండూరి రామకృష్ణమాచార్యులుగారు అప్పుడు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు. అక్కడ ఆ రోజుల్లో తెలుగు క్లాసులు అంటే చాలా చిన్నచూపు చూస్తూ ఉండేవారు. పండితులే ఉండే వారు ఎక్కువగా. ఒక్క సంవత్సరం పాటే నేను భీమవరంలో ఉండి తర్వాత రాజమండ్రి ప్రభుత్వ కళాశాలకు వచ్చాను. మొట్టమొదట ట్యూటర్ అన్నారు. తర్వాత గ్రేడ్ వన్ పండిట్, గ్రేడు టూ పండిట్ అని రెండు రకాలుండేవి. ట్యూటరు మీద ఉద్యోగాలన్నమాట అవి. ఆ విధంగా ఆ రెండు ఉద్యోగాలూ చేశాను. మధ్యలో మద్రాసు ట్రాన్స్ఫరు చేయడం జరిగింది. మళ్లీ తిరిగి రావడం కూడా జరిగిందనుకోండి. తిరిగి వచ్చిన తరువాత ''అసిస్టెంటు లెక్చరర్ ఇన్ తెలుగు'' అని నాకు డిజిగ్నేషన్ ఇచ్చారు. మీకు తెలుసో లేదో నేనే తెలుగులో మొదటి 'అసిస్టెంటు లెక్చరర్ ఇన్ తెలుగు' ని. అంతకు ముందు ''అసిస్టెంటు లెక్చరర్ ఇన్ లాంగ్వేజస్ అదర్‌దేన్ ఇంగ్లీష్'' అని ఉండేది. తమిళం, కన్నడం, తెలుగు, ఉర్దూ వీరందరూ Asst. Lecturer in Language other than English. Asst. Lecturer in Telugu అన్న డిజిగ్నేషన్ ఇండిపెండెన్సు తరువాత వచ్చింది. అది మొదట నాకే వచ్చింది. అప్పాయింట్‌మెంటు ఆర్డర్‌లో ఆనాడు ప్రతికాలేజీలోనూ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ అని ఒకటి ఉండేది తప్పనిసరిగా. ప్రిన్సిపాలు దానికి చైర్మన్. వారికి ఇష్టం ఉన్న వ్యక్తి నొకరిని వైస్ చైర్మన్ అనేవారు. అక్కడ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఉండి విద్యార్థినీ విద్యార్థులచేత అనేక నాటకాలు ప్రదర్శింప చేశాను. అనార్కలీ అనే

నాటకాన్ని కేవలం విద్యార్థినులచేత విజయవంతంగా ప్రదర్శింపచేశా. అది ఆనాడు సాహసమే. చిన్నప్పటినుంచీ ఉన్న నాటకాభిలాష అక్కడ ఆ విధంగా కొంత తీరింది. తరువాత అక్కడి నుంచీ ట్రాన్స్‌ఫరై ప్రెసిడెన్సీ కాలేజీకి మద్రాసు వెళ్లినప్పుడు - అంతవరకూ కూడా అయిదారు సంవత్సరాలు ఇంటర్మీడియట్‌కూ, బి.ఏ.కీ మాత్రమే పాఠం చెప్పాను. ఆ బి.ఏ.లో రాజమండ్రీ కాలేజీలో ఉన్నప్పుడే స్పెషల్ తెలుగు ఉండేది. అందులో పోలాప్రగడ సత్యనారాయణగారు (తరువాత ఇంగ్లీషు లెక్చరర్ అయ్యారు .వారు మంచి కథకులూ నావెలిస్టు కూడాను) మానాప్రగడ శేషశాయి (మంచి కవి, విమర్శకుడు) మొదలయిన వారికి వసుచరిత్ర చెప్పాను నేను. ఎంతవరకు చెప్పానో తెలియదు గాని మొన్నెప్పుడో ఫోనుచేస్తే ''పోలా ప్రగడవారు మాస్టరు మీరు చాలా బాగాచెప్పేవారు పాఠం'' అని పొగిడారు. మనసులో చాలా సంతోషం కలిగిందనుకోండి.

మద్రాసు మౌంటు రోడ్డులో మద్రాసు ముస్లిం కాలేజి అని ఒకటుండేది. ఆ ముస్లిం కాలేజీలో అందరూ షేర్వాణీ వేసుకొని వెళ్లాలి. వాళ్లకు శుక్రవారం సెలవు. శనివారం ఒకపూటే వాళ్లకి . రెండున్నర రోజులు సెలవుండేదన్నమాట. స్వాతంత్ర్యం తరువాత అవినాశలింగం చెట్టియార్ మొట్టమొదటి ఎడ్యుకేషన్ మినిష్టరయ్యాడు. ఆయన ఈ 'ముస్లిం కాలేజీ' అనేదీ పేరుమార్చి ''ఆర్ట్స్ కాలేజీ'' అని పెట్టారు. అందులో మాష్టర్లు చిరకాలంగా పాతుకుపోయి ఉండేవారు. వాళ్లందరినీ తలోమూలకు విసిరేశారు ఆయన. మరే మినిష్టరయినా ఆ పనిచేయగలిగి ఉండేవాడు కాదేమో! ఆయన చేశాడు. అక్కడ ఒక సంవత్సరంన్నర ఉన్న తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీకి ట్రాన్స్ఫర్ చేశారు. అక్కడ భూపతి లక్ష్మీనారాయణరావు గారు శాఖాధ్యక్షులు. ఆయన సాహిత్యం బాగా చదువుకున్నారు. భాషాశాస్త్రం ఎక్కువగా బోధించేవారు ఆయన. నేను రాజమండ్రి కాలేజీలో ఉన్నప్పుడు హెడ్ ఆఫ్‌ది డిపార్టుమెంటుగా ఉండేవారు. తరువాత ప్రెసిడెన్సీ కాలేజీలో తెలుగు ఎం.ఏ. ప్రారంభించినప్పుడు వారిని అక్కడికి తీసుకు వెళ్లారు. నేను వెళ్లి ఒంటిగంటన్నరకు

ఛార్జి తీసుకున్నాను. రెండు గంటలకు వెళ్లి ఆనర్సుకి ఉత్తర హరి వంశం పాఠం చెప్పమన్నారు నన్ను. అక్కడికి వెళ్లి చూస్తే అక్కడ కొంతమంది వయస్సులో కూడా నాకంటే పెద్ద వాళ్లున్నారు. అందులో ఒకాయన్ని బాబాయిగారని అందరూ పిలిచేవారు, నేనూ పిలిచేవాణ్ణనుకోండి. ఆ క్లాసు చూసేటప్పటికి మనస్సులో కంగారు కలిగింది. నిజం చెప్పాలంటే ఇంటర్మీడియట్, బి.ఏ. పాఠం చెప్పేటప్పుడు - ఆ రోజుల్లో తెలుగుగైడ్స్ బాగా ఉండేవి. మనం శ్రమపడకపోయినా గైడ్ చదివేస్తే ఏమిటీ మాస్టారు అని ప్రశ్నించిన వారుండేవారు కారు. కాని ఇక్కడ ఎదురుగుండా కూర్చొని ఉత్తర హరివంశం పాఠం చెప్పాలనేటప్పటికి మనస్సులో జంకు కలిగింది. ఆ రోజు నుంచి పుస్తకాలు కొనుక్కోవడం, చదవడం (అధ్యయనం చేయడం) ప్రారంభించాన్నేను. నాజీవితంలో ప్రెసిడెన్సీ కాలేజీలో ఆనర్సుకు పాఠం చెప్పడమనేది నిజమైనటువంటి మలుపు. ఓల్డ్ పోయెట్రీ సబ్జక్టు ఒకటి నేను చెప్పవలసి వచ్చింది. అందులో వెస్టర్న్, ఈస్టర్న్ రెండు ఈస్థటిక్స్‌నీ కూడా కంపారటివ్‌గా చెప్పాలి. ఆనాడు అక్కడ చదువుకున్న విద్యార్థులు శ్రీయుతులు ముదిగొండ వీరభద్రశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి, వి.వి.ఎల్.నరసింహారావు, ధారా రామనాధ శాస్త్రి ప్రభృతులు. వీళ్లందరూ కూడా నాకు విద్యార్థి మిత్రులు. మాకు పూర్వం లిటరరీ క్రిటిసిజం లక్ష్మీకాంతంగారు చెప్పారు. చెప్పేటప్పుడు భరతుడిలా అన్నాడు, అలా అన్నాడు అని అక్కడక్కడా కొటేషన్స్ ఇవ్వడం జరిగేది. అవేవో కంఠస్థం పట్టి వ్రాసేవాళ్లమనుకోండి. కాని అసలు భరతుడు నిజంగా ఏం అన్నాడో మూలం చూడాలన్న కోరికతో అక్కడ భరతనాట్య శాస్త్రం చదవడం మొదలు పెట్టాను. ఆ రోజుల్లో సంస్కృత పుస్తకాలు మద్రాసులోనే దొరికేవి. రాజమండ్రిలో దొరికేవికావు. తరువాత హైదరాబాదులో ఇప్పటిక్కూడా సరిగా దొరకవు. నాట్యశాస్త్రం కొని చదవడం మొదలు పెట్టింతర్వాత నాకు నిజంగా మరొకలోకానికి వెళ్లినట్లనిపించింది. చదివింతర్వాత రాజమండ్రి నుండి వచ్చే సంస్కృతి అనే పత్రికలో వరుసగా 15 ఛాప్టర్స్ నేను అనువాదం చేసి ప్రకటించాను. తర్వాత దీన్ని పూర్తిగా అనువదించి వ్యాఖ్యానంతో ప్రచురిస్తే బాగుంటుందని అనుకునేవాణ్ణి. భూపతి లక్ష్మీనారాయణరావుగారు చాలా

స్ట్రిక్టుగా ఉంటారు. నేను వెళ్లిన కొత్తలో నాదగ్గర ఎక్కువ పుస్తకాలుండేవి కావు. ఈ లైబ్రరీ పుస్తకాలు తీసుకొని ప్రక్కన నోట్సు రాసుకుంటూ ఉండేవాణ్ణి. విశ్వనాథ నరసింహంగారని చెప్పి అక్కడ మాతో ఒక పండితులుండేవారు. ఆయనలా రాస్తూ ఉంటే భూపతి లక్ష్మీనారాయణగారు కేకలేశారట, అదేమిటి లైబ్రరీ పుస్తకం పాడు చేస్తున్నావని. సరే నేను కూర్చుని రాసుకుంటూ ఉంటే పక్కనున్నాయన హేళన చేశాడు. అవున్లే నువు ప్రొఫెసర్‌గారికి దగ్గరివాడివి కదా నువ్వు రాసుకోవచ్చులే అని. ఏమిటయ్యా! అంటే ఇలా అన్నారు పుస్తకాలమీద రాయకూడదని. నేను సొంతం పుస్తకాలు కొనుక్కోవడానికి కూడా అదొక కారణమన్నమాట. లక్ష్మీనారాయణరావు గారు నాకు ఇచ్చినటువంటి ప్రోత్సాహం ఉన్నది. నేను నాట్య శాస్త్రం అనువాదం చేస్తున్నానంటే విశ్వనాథ సత్యనారాయణగారు, పింగళి లక్ష్మీకాంతంగారు, గంటి జోగి సోమాయాజులుగారు, దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు వీరందరూ కూడా నన్ను ప్రోత్సహించి మంచి పని చేస్తున్నావని ఆశీర్వదించారు. ఆ ఆశిస్సుల ఫలితమే నేను ఆంధ్రులకు ఇచ్చినటువంటి నాట్య శాస్త్రం.

ఆ ప్రెసిడెన్సీ కాలేజీ మహామహులైన కొక్కొండ వేంకటరత్నం పంతులు గారు మొదలైన వాళ్లందరూ పనిచేసిన కాలేజీ. విశ్వవిద్యాలయంతో సమానమైనటు వంటిది. ఇప్పుడు మనకు ఇతర కళాశాలల్లో కూడా పోస్టు గ్రాడ్యుయేట్ తరగతులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తర్వాత అనుమతి ఇచ్చారు. అక్కడ ప్రెసిడెన్సీ కాలేజీ, క్రిస్టియన్ కాలేజీ, పచ్చయప్పా కాలేజీ మొదలైనటువంటి చోట ఎం.ఏ. లు పెట్టేవారు ఆ రోజుల్లో. ఒక్క మద్రాసు యూనివర్సిటీలోనే కాక ఇతర కాలేజీలలో కూడా ఆరోజుల్లో ఎం.ఏ. ఉండేది. జి.ఎన్.రెడ్డిగారు పచ్చయప్ప కాలేజీలో తెలుగు ఎం.ఏ. ప్యాసయినవారు. తరువాత ఎస్.వి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా కూడా చేశారు. వారు మా కొలీగ్. అలాగ తలొక చోట నుండీ వచ్చిన మాళ్లమంతా అక్కడచేరి మాండలికమైన చర్చలంతా కూడా అక్కడ చేసుకుంటూ ఉండే వాళ్ళం. నేను సర్కారువాణ్ణి, రెడ్డిగారేమో రాయలసీమ వారు. మా డిపార్టుమెంటు కాకపోయినా

ఇంకోకాయన తెలంగాణావారు పక్క డిపార్టుమెంటులో ఉండేవారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన వారు శ్రీ భాష్యం అప్పలాచార్యులవారు. అప్పలాచార్యులవారి గురించి ఒక విషయం చెప్పవలసి ఉన్నది. ఆయన అష్టాధ్యాయి బాగా చదువుకున్నటువంటి వాడు. శ్రీకాకుళం జిల్లాలో మునిసిపల్ హైస్కూలులో చిన్న పండితులుగా ఉండేవారు. ఇక్కడ ఎం.ఏ. వాళ్లకు అష్టాధ్యాయి సంస్కృతంలో పాఠం చెప్పవలసి వస్తే వాళ్లు వెతికి శ్రీకాకుళంలో ఎక్కడో చిన్న హైస్కూలులో పనిచేసేవారిని పట్టుకొని తీసుకొచ్చి ఎం.ఏ.కు పాఠం చెప్పించారు. వ్యాకరణం విషయంలో అంత గొప్ప వ్యక్తి ఆయన. వారితో చాలా సన్నిహితత్వం ఏర్పడింది. నాట్యశాస్త్రం ప్రచురించే ముందు అందులో ప్రతి అక్షరం కూడా ఆయన పరిశీలించారు. ఒకసారి నేను శ్రీకాకుళం వెళ్లి నెల్లాళ్లు ఉండి వారికి చదివి వినిపించాను. సరిగ్గా ప్రెస్సుకు వెళ్ళేముందు వారు కూడా మాయింటికి వచ్చి నెల్లాళ్లుండి ప్రత్యక్షరమూ పరిశీలించారు. నేను సంస్కృత పండితుణ్ణి కాదు. తెలుగు చదువుకున్న వారికి సంస్కృతం ఇంతో అంతో వస్తుంది. అంతమాత్రమే తప్ప ఇందులో పాండిత్యమేమీ లేదు. అందుచేత ఏదైనా రాసినప్పుడు సంస్కృత పండితుల సహాయం తీసుకోవలసిన అవసరం తప్పకుండా ఉంటుంది. సంస్కృతంలో కూడా పండితులు కాని తెలుగు లెక్చరర్స్ అందరికీ కూడా. ఆ విధంగా వారు సహాయం చేశారు. ఆ ధైర్యంతోనే దీన్ని ప్రచురించడం కూడా తటస్థించింది. అది నలుగురి పంతుల యొక్క ఆమోదాన్ని పొందింది అంటే నా జీవితం ధన్యమైనట్లుగా నేను భావిస్తున్నాను.

తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చాను. ఇక్కడ తెలుగు శాఖాధ్యక్షులు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు. ఆయన సహృదయత ఇంత అని చెప్పనలవి కాదు. నేను ఎంతో మంది పెద్దవాళ్ల దగ్గిర చదువుకున్నాను. కాని లక్ష్మీరంజనంగారిలోని సహృదయతను మాత్రం నేనెక్కడా చూడలేదు. ఆయన నాకు సీటు ఇచ్చారు. స్కాలర్‌షిప్పు ఇచ్చారు. తర్వాత నాకు గవర్నమెంటు ఆఫ్ ఇండియా స్కాలర్‌షిప్పు కూడా వచ్చింది. అది తీసుకొని దీన్ని వదిలిపెట్టాను.

థీసిస్ రాసుకుంటూ ఇక్కడ మూడున్నర ఏళ్లున్నాను. ఆ మధ్యలోనే నాట్యశాస్త్రాన్ని ప్రచురించాను. అంటే నాట్యశాస్త్రాన్ని వ్యాఖ్యాన సహితంగా నేను ప్రచురించడానికి దోహదం చేశారు ఖండవల్లివారు. నేను తెలుగునాటక వికాసం సిద్ధాంత వ్యాసాన్ని రచించి దాన్ని కూడా ప్రచురించడానికి దోహదం చేశారు ఖండవల్లి లక్ష్మీరంజనం గారు. ఆ గురుదేవులకు నమస్కారం. నాట్యశాస్త్రం ప్రచురణ అయిం తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ వాళ్లు దీనికి ప్రచిరితమైన తెలుగు పుస్తకాలలో శ్రేష్ఠమైనది **(Best Published Book in Telugu)** అని నాకు అవార్డు ఇవ్వడం తటస్థించింది. అంతకు ముందు మూడు నాలుగు సంవత్సరాల పాటు తెలుగులో ఏ పుస్తకానికి కూడా ఆ అవార్డు ఇవ్వలేదట. నాకది వచ్చింది. అప్పుడు కొత్తపల్లి వీరభద్రరావుగారు నన్ను పొగిడారు కూడాను. నలభై సంవత్సరాలు నిండకుండా సాహిత్య అకాడమీ అవార్డు తీసుకున్నవారు మా మిత్రులు అప్పారావు గారొక్కరే అని. నిజంగా అది గర్వించదగినటువంటి అంశం. **Special Officer for Nationalisation of Text Books** అని **D.P.I.** ఆఫీసులో ఒక పోస్టు ఉండేది. అందులో మొట్టమొదట భూపతి లక్ష్మీనారాయణరావు గారున్నారు. తర్వాత సంపత్‌గారు చాలా తక్కువకాలం ఉన్నారు. తర్వాత ఫస్టు నాకు గజిటెడ్ ప్రమోషన్ అందులో వచ్చింది. ఒకటవ క్లాసునుంచి పదవ క్లాసు వరకు టెక్స్ట్ బుక్స్‌ను తెలుగు మాధ్యమంలో పబ్లిష్ చేయటం ఈ ఉద్యోగ ధర్మం. మేం చేసిన పనేమిటంటే మంచి రైటర్స్ నందరినీ, తెలుగు భాషలో బోధన చేయడానికి సమర్థులైన వారిని ఆహ్వానించాం. ఇంకొక విషయమేమిటంటే పది-పదకొండు క్లాసులున్న హైస్కూళ్ళలో ఈ జాతీయోద్యమం బాగా బలపడుతున్నటువంటి రోజుల్లో ఈ స్పెషల్ సబ్జెక్ట్స్‌ను తెలుగులో బోధించవచ్చును. తెలుగులోనే బోధించాలని కూడా కొన్ని సర్క్యులర్స్ వచ్చాయి . మొట్టమొదటగా మాథమాటిక్సు తెలుగు మాధ్యమంలో చదువుకున్న ఫస్టుబ్యాచ్ స్టూడెంటును నేను. అందుచేత దాని మీద ఉన్నటువంటి ఒక అభిరుచి అనండి లేదా అనుభవం అనండి ఒకటో క్లాసు నుండి పదో క్లాసు వరకు తెలుగు మాధ్యమంలో **Text Books** హైస్కూలుకు సంబంధించినంత వరకు ప్రకటించడానికి ఆరు సంవత్సరాలు నేను

కృషిచేశాను. ఎం.ఆర్. అప్పారావుగారు మొట్టమొదటిసారిగా మినిష్టర్ ఫర్ కల్చరల్ ఎఫైర్స్ అయ్యారు. మినిష్టర్ ఫర్ కల్చరల్ ఎఫైర్స్ అండ్ ప్రొహిబిషన్ - రెండింటి కాంబినేషన్ ఎలా పెట్టారో తెలియదు మరి. అప్పుడు ఈ Text Books Officer గా ఉండినటువంటి నన్ను స్పెషల్ ఆఫీసర్ ఫర్ కల్చరల్ ఎఫైర్స్ అని అక్కడికి తీసుకువెళ్లారు. అక్కడో రెండు సంవత్సరాలున్నాను. ఆ కాలంలో ఎవరైనా ఓపెన్ ఎయిర్ థియేటర్ కట్టుకుంటాము అంటే అయిదువేల రూపాయలు వారికిచ్చేవాళ్ళం. తరువాత ఎవరైనా మేం మా తెలుగు థీసెస్ అచ్చు వేస్తున్నాము అంటే థీసిస్ కాపీ పంపిస్తే చాలు అయిదు వేల రూపాయల చెక్కు మేమే పంపించేవాళ్ళం. అదికాక సాంస్కృతిక గురువులు అని చెప్పి కళలలో మంచి అనుభవం, ప్రావీణ్యం ఉన్న వారిని కొన్ని కాలేజీలలో పెట్టి వారికి ప్రభుత్వం నుంచే కొంత వేతనం ఇచ్చేవాళ్ళు. వాళ్లు **Co-ordinators for Cultural affairs** గా కొంతకాలం పనిచేశారు. తరువాత బాగా వృద్ధులైనటువంటి ఆర్టిస్టులను తీసుకొని వచ్చి దేశ వ్యాప్తంగా సన్మానం చేయడం కూడా మేం మొదలు పెట్టించాం. అప్పుడు మాకుండేటటువంటి బడ్జెటు రూ.రెండున్నర లక్షలు మాత్రమే. దానితో మేం ఇన్నిరకాల పనులు చేయడానికి సావకాశం కలిగింది; ఆ విధమైనటువంటి ప్రోత్సాహం ఎం.ఆర్. అప్పారావుగారిచ్చారు. అప్పుడు కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో పైన ఓపెన్ ఎయిర్ థియేటర్ కట్టడానికి కూడా మేం డబ్బిచ్చాం. ఆ విధంగా అనేకములైనటువంటి పనులు చేయడానికి అప్పుడు అవకాశం కలిగింది.

ఇంతలో మొరార్జీదేశాయిగారు ఫైనాన్సు మినిష్టరుగా ఉన్నప్పుడు హైస్కూలు స్థాయిలోనేకాదు విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా ప్రతి రాష్ట్రానికీ ఒక కోటి రూపాయలు మంజూరు చేశారు. మనకూ వచ్చింది. దీనికి ఏంపేరు పెట్టాలీ అని అంటే తెలుగు భాషా సంస్థ అని పేరు పెడితే బాగుంటుందని భద్రిరాజు కృష్ణమూర్తిగారు, మనకు విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేసి రిటయిరయిన శ్రీ జె.పి.ఎల్ గ్విన్ గారు ఒక రిపోర్టు ఇచ్చారు. అయితే ఈ పేరుతో ఒక సంస్థ

ఎన్సైక్లోపీడియా తయారు చేయడానికి ఇదివరకే ఉంది. అందువల్ల తెలుగు అకాడమీ అని పేరు పెట్టండి అని అప్పుడు ఎడ్యుకేషన్ సెక్రటరీగా ఉన్న డా. ఎన్. రమేశన్‌గారు సలహా ఇచ్చారు. ఇప్పటి తెలుగు అకాడమీకి నామకరణం చేసినటువంటి వారాయన. అసలు అందరూ కూడా శ్రీ జె.పి.ఎల్. గ్విన్ తెలుగు అకాడమీకి డైరెక్టరవుతారని అనుకున్నారు. నేను కూడా ఆ దృష్టితోనే పనిచేశాను. ప్రిలిమినరీ వర్క్ అంతా తయారు చేశాను. కాని అప్పుడు మాకు ఎడ్యుకేషన్ మినిష్టరుగా ఉన్నటువంటి శ్రీ టి.వి. రాఘవులుగారు, రమేశన్‌గారిని కొంచెం హేళనగా నువ్వు అరవ్వాడివి నీకేం తెలుగు వచ్చు అని అన్నారట. అంచేత ఎక్కడున్నా తెలుగు మీటింగులు జరిగినా ఏం జరిగినా కావలసిన సహాయం చేసేవారేకాని వాటికి వచ్చేవారుకాదు. డా. రమేశన్‌గారు. ఈ విషయం ఆయన ఒకనాడు చెప్పాడు. డా. రమేశన్‌గారు నీకు తెలుగు రాకపోతే నాకేం వస్తుంది. I don't want to be Director of Telugu Academy అని. ఆయనలా అనడం వల్ల బహుశా నేను డైరెక్టరు నయ్యాను. తెలుగు అకాడమీ స్పెషల్‌ఆఫీసరుగా, డైరెక్టరుగా ఆరు సంవత్సరాలక్కడ పనిచేశాను. ఇంటర్మీడియట్, బి.ఏ., బి.ఎస్సి., బి.కాం ఈ అయిదు సంవత్సరాలకు కూడా ఈ అన్నిక్లాసులకూ అన్ని సబ్జక్టులోనూ తెలుగు ఒరిజినల్ టెక్ట్స్ బుక్స్ మేము పబ్లిష్ చేశాం. అప్పటికి మూడు విశ్వ విద్యాలయాలున్నాయి. మూడు రీజిన్స్‌లోనూ, మూడు స్నాతకోత్తర కేంద్రాలున్నాయి. అంతకు ముందు ఈ ఆరు సెంటర్స్‌లోనూ ఉన్న ప్రొఫెసర్లు బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశాలలో కొంత మంది మాత్రమే కలిసి కొనేవారు. వీరందరూ ఉమ్మడిగా కలుసుకోవడం అనేది జరిగేది కాదు. ఈ ఆరుసెంటర్ల ప్రొఫెసర్లు ఒక్కచోట కలుసుకోవడానికి సంగమస్థానంగా నేను తెలుగు అకాడమీని తీర్చిదిద్దాను. వాళ్ళందరూ ఇక్కడికి వచ్చేవారు. నేను మొదటే వారికి మనం అనువాదాల జోలికి పోరాదు; ఒరిజనల్‌పుస్తకాలే రాయించాలి. కామన్ సిలబస్ ఇక్కడ తయారు చేయండి ప్రతి పుస్తకం నాలుగు సెంటర్లకు పనికి వచ్చేలాగు అని సూచించాను. ఆనాడు సిలబస్‌లలో మూడు యూనివర్సిటీల్లోనూ తేడాలుండేవి. వాటిని అన్నింటిని సమన్వయం చేసి ఆరు కేంద్రాలకు పనికి వచ్చేటట్లుగా సిలబస్‌లు

తయారుచేసి, వాటి ప్రకారం గ్రంథాలు రాయించా. ఆవిధంగా ప్రతి యూనివర్సిటీ ప్రొఫెసర్లూ, రీడర్లూ, లెక్చరర్లూ కూడా తెలుగు ఎకాడమీకి ఎనలేని సహకారం ఇచ్చారు. ఆవిధంగా అన్ని పుస్తకాలూ, ఒరిజినల్గా, ఏ విధమైనటువంటి అనువాదం లేకుండా తయారు అయినాయి. ఏ పుస్తకం తీసుకున్నప్పటికీ మూడు యూనివర్సిటీలకు, మూడు పోస్టుగ్రాడ్యుయేట్ సెంటర్సుకూ పనికి వచ్చేది. తరువాత మాకెదురయినటువంటి ప్రధాన సమస్య- తెలుగులో పాఠం ఎవరు చెప్తారు? కొందరు టీచర్సే మాకు ఎదురు తిరిగారు. అయినా మూడేసి వారాలు, నాలుగేసి వారాలు రిఫ్రెషర్ కోర్సులు పెట్టి ''మీరే తెలుగులో పాఠం చెప్పి చూడండి; ప్రయత్నంచేసి చూడండి; ఎట్లా చెప్తారో చూద్దాం'' అని ప్రోత్సహించేటప్పటికి వాళ్లే ముందుకు వచ్చి తెలుగు మాధ్యమంలో పాఠాలు చెప్పడానికి ప్రారంభించారు. ఆ తర్వాత మా పని సులువయింది. ఆ విధంగా స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ తెలుగు మీడియంలో పాఠం చెప్పడం జరిగింది. ఇంగ్లీషు మీడియంలో చెప్పిన వాళ్లే తెలుగు మీడియంలో కూడా చక్కగా పాఠం చెప్పడం జరిగింది. నేను 6 సంవత్సరాలు తెలుగు అకాడమీ డైరెక్టరుగా ఉన్నాను. ఆరు సంవత్సరాలు కూడా శ్రీ పి.వి. నరసింహారావు గారు అధ్యక్షులు. మాకు వచ్చిన ఇంకో సమస్య ఏమిటంటే- ఇక్కడ మూడు రీజిన్సులోనూ మాండలిక భేదాలున్నాయి. పారిభాషిక పదాల స్థిరత్వం అంతవరకూ లేదు. ఏంచేయాలి. ఈ పారిభాషిక పదాలను ప్రొఫెసర్లకు వదిలేశాం. ప్రొఫెసర్లనీ, రీడర్లనీ, లెక్చరర్లనీ వీళ్లం దరినీ కూర్చోబెట్టి వాళ్ళందరూ ఒక కాన్సెన్సస్కు వచ్చే టట్లుగా చేశాము. ఇప్పుడు కూడా మన ప్రైంమినిష్టరుగారు అదే పాలసీ అవలంబి స్తున్నామన్నారు - అలాగ కాన్సెన్సస్ పాలసీ వారు చెప్పినటువంటిది. ఇంక ఆరుగు ర్లోనూ కనీసం నలుగురు కనక ఒప్పుకున్నట్లయితే ఆ పదాన్ని స్థిరపరచేవాళ్లం. ఆ విధంగా పారిభాషిక పదాలను నిర్ణయించడం జరిగింది. ఇంక మాండలికి భాష. శ్రీ పి.వి.గారు తెలుగు బాగా చదువుకున్నటువంటి వారు. మా మీటింగుల్లో వచ్చి కూర్చుని అధ్యక్షత వహించేవారు. ఫైనల్గా ఏదో ఒక రూపం- మూడు మాండలికాల్ని సమన్వయంచేసి నిర్ధారించే వాళ్ళం. ఇందులో కొంత కృతకత్వం వచ్చినప్పటికీ కూడా

ఏక భాషా పరిస్థితిని మేము ఏర్పరచడం జరిగింది. ఆ భాషలో ఆ పారిభాషిక పదాలు పెట్టి పుస్తకాలు రాయడం జరిగింది. ఆ రోజుల్లో జంట నగరాలలో తెలుగులో ముద్రణచేసే ప్రెస్సుల్లేవు. తెలుగు అకాడమీ పుస్తకాలను పబ్లిష్ చేయడానికి పునుకొన్నప్పుడు గబగబా మంచి ప్రెస్సులు చాలా వచ్చాయి. హైదరాబాదు, సికిందరాబాదుల్లో. సాధారణంగా ప్రొఫెసర్లు , ఎడిటర్లుగా ఉండేవారు, రీడర్లుగాని లెక్చరర్లుగాని గ్రంథరచన చేసేవారు. అయితే ఈ పారిభాషిక పదాల్ని అందరూ సరిగా ఉపయోగిస్తున్నారా లేదా, వేం నిర్ణయించినటువంటి భాషలు అందరూ ఉపయోగిస్తున్నారా లేదా అని పరిశీలించి, సరిదిద్దవలసిన బాధ్యత అకాడమీ మీద ఉండేది. అందు కోసమని ప్రతి సబ్జక్ట్ ఎక్స్‌పర్టునొకర్నీ, లాంగ్వేజి ఎక్స్పర్టు నొకరినీ నియమించుకున్నాం. ఈ లాంగ్వేజి ఎక్స్‌పర్ట్సు కూడా కేవలం తెలుగు చదువుకున్నటువంటి వారు మాత్రమే కాదు. బి.ఏ., బి.ఎస్సీ., బి.కాం. వరకూ కూడా సైన్సు, మాథమాటిస్సు వంటివి చదువుకొని ఫైనలుగా తెలుగు ఎం.ఏ. పాసయినటువంటి వాళ్లు. డిగ్రీ వరకూ వాళ్లిదివరకే సైన్సు వగైరాలు చదువుకున్నారు. కాబట్టి వారు పారిభాషిక పదాలనూ తర్వాత స్టైలునూ సరిచూడడానికి అవకాశం ఉండేది. కాగా, సబ్జక్టు ఎక్స్పర్ట్సు చూసేవాళ్లు. లాంగ్వేజి ఎక్స్పర్ట్సు లాంగ్వేజి చూసేవాళ్లు. ఆవిధంగా ఒరిజనల్ పాఠ్య గ్రంథాలను మేం రాయించడం జరిగింది. తరువాత గ్రంథాల వెల కూడా చాలా తగ్గించాం. ప్రతిభాషలోనూ వాళ్ళు చేసిన పనేమిటంటే కేవలం ట్రాన్స్‌లేషన్సు మాత్రమే. ఇంగ్లీషులో ఉండే Original Text Books ను వారు Translate చేయడం మాత్రమే చేశారు. మేం 350 ఒరిజనల్ Text Books ను ఈ ఆరు సంవత్సరాలలోనూ పబ్లిష్ చేశాం. సెంట్రల్ గవర్నమెంటు వాళ్లు ఈ పనిని పరిశీలించడానికి ఒక కమిటీని వేశారు. ఆ కమిటీకి సెంట్రల్ హిందీ డైరెక్టరేట్ చైర్మన్. చైర్మన్ గ్రంథ ఎకాడమీస్ రివ్యూ కమిటీ అని దీని పేరు.

తెలుగు అకాడమీ చేసిన కృషివల్ల నన్ను ఈ కమిటీకి సెక్రటరీగా నియమించారు. హిందీ గ్రంథ ఎకాడమీలు, ఇతర భాషా అకాడమీలు సందర్శించి

చర్చించి రిపోర్టు ఇవ్వడం కూడా జరిగింది. అంటే అది తెలుగు ఎకాడమీ చేసిన కృషికి గుర్తింపు అని చెప్తున్నాను. ఈ సృషి ఇండివిడ్యువల్‌గా చేసినటువంటిది కాదు. డైరెక్టరుగా నేనొక్కణ్ణే చేసింది కాదు, కొత్తపల్లి వీరభద్రరావుగారున్నారు, బూదరాజు రాధాకృష్ణగారున్నారు, ఇంకా దక్షిణామూర్తిగారు, మంజుశ్రీగారు వీళ్లందరూ కూడా మొట్టమొదటి రోజుల్లో చేరినవారు. తరవాత శివారెడ్డిగారూ వీరందరూ కూడా వచ్చిచేరారు. వీరందరూ చేసినటువంటి ఒక సామూహికమైనటువంటి ఒక క్యుములేటివ్ ఎఫెక్టువల్ల తెలుగు ఎకాడమీకి రికగ్నిషను వచ్చింది. అట్లా టీమువర్కుగా చేయడం జరిగినట్లయితే ఏ సంస్థ అయినా సరే పైకి రావడానికి రికగ్నిషన్ పొందడానికి అవకాశం ఉంటుంది.

నేను నోషనలైజేషేన్ ఆఫ్ టెక్స్ట్ బుక్స్ ఆఫీసరుగా ఉన్న రోజుల్లోనే నా నాట్యశాస్త్రానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఇవ్వడం జరిగింది. దీనికోసం ప్రత్యేకం అక్కడికి వెళ్లాం. వెళ్లినపుడు నేను మర్చిపోలేనటువంటి ఘటన ఒకటి ఉంది. మా బంధువు వేమరాజు భానుమూర్తిగారు ఢిల్లీలో ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంటులో ఆఫీసరుగా ఉండేవారు. ఆయన కారులో ఐదు నిమిషాలో పదినిమిషాలో ఆలస్యంగా వెళ్లాం. శ్రీ రాధాకృష్ణన్‌గారు వైస్ ప్రెసిడెంటు సాహిత్య అకాడమీకి; నెహ్రూగారేమో ప్రెసిడంటు. రాధాకృష్ణన్‌గారు ఏమిటి మన తెలుగువాడు రావడం లేదేమిటి? అని గుమ్మం దగ్గిర వెయిట్ చేస్తున్నారు నాకోసం.పంచె లాల్చీ కండువా కనిపించేటప్పటికి ఆయన పట్టరాని సంతోషంతో నాచేతులు పట్టుకొని లోపలికి తీసికొని వెళ్లి నెహ్రూగారి పక్కన కూర్చోబెట్టారు. అప్పుడు నెహ్రూగారు టీ కలుపుకుంటున్నారు. ఆయన టీ కలిపి ముందర నాకిచ్చి తరువాత మళ్లీ ఆయన టీ కలుపుకున్నారు. దురదృష్టమేమిటంటే అక్కడ ఫోటో ఎవరూ తీయలేదు. కాని అది జీవితకాలం జ్ఞాపకం పెట్టుకోవలసిన ఘట్టం. ఆ సంవత్సరం ప్రొఫెసర్ వి. కె. గోకక్ మొదలైనవారు కూడా సాహిత్య అకాడమి అవార్డు పొందారు. ఆరేళ్లు తెలుగు అకాడమిలో పనిచేశాను. అప్పుడు ప్రపంచ తెలుగు మహాసభలు జరపాలని

అనిపించింది మండలి వెంకట కృష్ణారావుగారికి. ఆయన కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ మినిష్టరప్పుడు. జలగం వెంగళరావుగారు చీఫ్ మినిష్టరు. అంతవరకు నేను చేసినటువంటి కృషి ఫలితంగానేమో ''నువ్వక్కడ ఆరేళ్లు పనిచేశాక చేసింది చేయడమే కదా. నువ్విక్కడికిరా'' అన్నారు కృష్ణారావుగారు. సరే మళ్లీ కల్చరల్ ఎఫైర్స్‌కి స్పెషల్ ఆఫీసరుగా సెక్రటేరియట్‌కు వెళ్లాను. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరపడానికి ఒక ఆహ్వాన సంఘం ఏర్పరిచారు. జలగం వెంగళరావుగారే మా చైర్మన్, మండలి వెంకట కృష్ణారావుగారు ఎగ్జిక్యూటివ్ చైర్మన్. తరువాత నన్ను ప్రధాన కార్యదర్శిగా నిర్ణయించారు. డా. జె. బాపురెడ్డిగారు, ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంటు డైరెక్టరుగా ఉన్న రాజ్యం సిన్హాగారు, ఆలిండియా రేడియోలో ఉన్న ఎన్.వి.ఎస్. ప్రసాదరావుగారు, ఈ ముగ్గురూ కార్యదర్శులు.

ప్రొద్దున్న ఏడున్నరకు కలవాలని అందరం అనుకునే వాళ్లం. ఏడూ ఏడుంభావయ్యేటప్పటికి ''అప్పారావు బయలుదేరుతున్నాను'' అని ఫోన్‌చేసేవారు మండలి వెంకట కృష్ణారావుగారు. ఉదయం ఏడున్నర నుంచి రాత్రి ఒంటిగంట వరకూ పనిచేశాం ఆ తొమ్మిది నెలలు. ఆ తొమ్మిది నెలల్లో ఎప్పుడూ రాత్రిపూట వేడన్నం తినలేదు. కాని అక్కడ కూడా ఆ తొమ్మిదినెలల్లో టీమ్ వర్క్ చక్కగా జరగడంతో ఆ తర్వాత వారం రోజులు జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంగా జరిగాయి. మండలి వెంకట కృష్ణారావుగారిలో గొప్పతనమేమిటంటే మేం మధ్యాహ్నం అన్నం తింటే తప్ప ఆయన తినేవాడు కాదు. మరీ ఆలస్యమయితే ఇంటి నుంచి కారియర్ తెప్పించడమో, లేకపోతే మేము అందరం వస్తున్నాం భోజనం ఏర్పాటు చేయమని భార్యకు ఫోన్‌చేసి మమ్మల్నందరినీ తీసుకొని పోవడమో చేసేవారు. అలాగ పనిచేసేటటువంటి మినిష్టరు మరొకరుండరేమో. ఆలాగ ఆయన పనిచేస్తుంటే పరివారమంతా నోరుమూసుకుని ఎలా కూర్చుంటుంది? అది ఆయనలో ఉండే ఊహ. మహా సభలు విజయవంతంగా జరిగాయి.

ఇంటర్నేషనల్ తెలుగు ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమయింది. సభలలోనే శ్రీ జె.పి.ఎల్. గ్విన్‌గారు తీర్మానం పెట్టారు. సభల తర్వాత ఇంటర్నేషనల్ తెలుగు ఇన్‌స్టిట్యూట్‌కు (అంతర్జాతీయ తెలుగు సంస్థ తుది రూపం ఇవ్వటం జరిగింది. మలేషియా నుంచి వచ్చినటువంటి డెలిగేట్స్ (36 మంది) సభలలో ఒక తీర్మానం ప్రతిపాదించారు. రెండో కాన్ఫరెన్సును మేం మలేషియాలో జరుపుతాం అని. అట్లాగే 1981 ఏప్రిల్‌లో మలేషియాలోనే రెండో కాన్ఫరెన్సు జరిగింది. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో వెల్లివిరిసిన తెలుగువారి ఐకమత్యాన్ని పురస్కరించుకొని ఇతర దేశాలలో ఉండేటటువంటి తెలుగు అసోసియేషన్లను గురించిన సమగ్రమైన సమాచారం ప్రకటించడానికి అంతర్జాతీయ తెలుగు సంస్థ మొట్టమొదటి ప్రయత్నం. ఆ విధంగా మన రాష్ట్రంలో ఉన్నట్లుగానే ఇతర రాష్ట్రాలలో కూడా ఒకటి కంటె ఎక్కువ తెలుగు సంస్థలు ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ కూడా. ప్రతిరాష్ట్రం కాదు ప్రతి ఊళ్లోనూ ఉన్నాయి పెద్ద పెద్ద ఊళ్లలో. అలాగే ప్రతిదేశంలోనూ. ఇలా అందరి యొక్క సమాచారాన్ని కూడా సేకరించి ఒక పుస్తకాన్ని ప్రచురించింది. అలాగే ఎక్కడి నుంచి ఎవరికి ఏవిధమైన సమాచారం కావాలన్నా గొట్టిముక్కల కృష్ణమూర్తిగారు లండన్ నుంచి కోహినూర్‌ను గురించి ఇన్ఫర్మేషన్ కావాలని నాకు ఉత్తరం రాశారు. ఎక్కడవెతికినా దొరకలేదు. కాని నేనెప్పుడో పదిలంచేసికొన్న కాగితాలలో వెతికితే దొరికింది. దొరికితే దానికి జిరాక్స్ తీసి పంపించారు. అలాగే హిమాచలప్రదేశ్ లెఫ్టినెంట్ గవర్నర్ మొసలికంటి తిరుమలరావుగారి ప్రైవేటు సెక్రటరీ నాకు ఫలానా పుస్తకం కావాలి. ఎంత మందికి రాసినా నాకు దొరకడం లేదు అని రాస్తే నా సొంత పుస్తకం పింపించాను. అలాగ ఎవరు ఎక్కడ ఏమూలనుంచి ఏ ఇన్ఫర్మేషన్ కావాలనా ; సాంస్కృతికంగా విద్యా విషయకంగా ఇన్ఫర్మేషన్ ఇవ్వడానికి మేము సన్నద్ధం అయ్యాము. ఆ విధమైనటువంటి ఇన్ఫర్మేషన్ వారికి అందించాం. ఆ విధంగా అంతర్జాతీయ తెలుగు సంస్థ దేశంలో విదేశాలలో కూడా ఉన్నటువంటి తెలుగు వారి మధ్యన ఒక విధమైనటువంటి ఐక్యాతాభావాన్ని సంపాదించగలిగింది. ఆ తర్వాత నన్ను హైదరాబాదు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాలుగా బదిలీ చేశారు. కేంద్ర ప్రభుత్వం

సెప్టెంబరు 5వ తేదీన టీచర్లకు బెస్ట్ టీచరు అవార్డు లిస్తుంది. అదే విధంగా కళాశాల టీచర్లకివ్వాలని మన రాష్ట్ర ప్రభుత్వానికి సంకల్పం కలిగింది. అట్లా మొట్టమొదటిసారి ఆ అవార్డు లభించిన వారిలో నేను కూడా ఉన్నాను. కళాశాలలో ప్రిన్సిపాలుగా ఉన్నందువల్ల అది లభించి ఉండవచ్చు. ఏ డెరెక్టరుగానో ఉండి ఉంటే బహుశా అది లభించి ఉండేది కాదేమో.

తర్వాత భాట్టం శ్రీరామమూర్తిగారు కల్చరల్ఎఫైర్స్ మినిష్టరయ్యారు. అంతకు ముందు నాటి ముఖ్యమంత్రి డా. చెన్నా రెడ్డిగారు ఆఫీసర్ కల్చర్ ఎఫైర్స్ అన్నది మార్చి (జె.వి. సోమయాజులుగారు శంకరాభరణం సినిమాతో ప్రఖ్యాతులయ్యారప్పుడే) సోమయాజులు గార్ని డైరెక్టర్ కల్చరల్ ఎఫైర్స్‌గా అప్పాయింట్ చేశారు. ఈ డైరెక్టర్ కల్చరల్ ఎఫైర్స్ సెక్రటేరియట్‌లో కూర్చుండి పనిచేయాలి. దీన్ని డైరెక్టరేట్‌గా మార్చాలి అని సంకల్పించారు భట్టాచార్యగారు. అప్పుడు సోమయాజులుగారు అమెరికా టూరు వెళ్లటం జరిగింది. ఆ స్థానంలోకి నన్ను తీసికొని వెళ్లారు ప్రిన్సిపాల్‌షిప్పునుంచి. అప్పుడు డైరెక్టరేట్ స్థాపించడానికి మళ్లీ కృషిచేసి దాన్ని ప్రారంభించాను. డైరెక్టర్ కల్చరల్ఎఫైర్స్‌గా నేను ఛార్జీ తీసికొన్నాను. పోతన పంచశత జయంతి సందర్భంలో ఒక కల్చరల్ కాంప్లెక్సు కట్టాలని ప్రయత్నం జరిగింది. అప్పుడు సెంట్రల్‌లో శ్రీ పి.వి. నరసింహారావుగారు ఎడ్యుకేషనల్ మినిష్టరుగానే ఉన్నారు. ''మంచి థియేటర్లు ఎలా కట్టాలో విదేశాల్లో పరిశీలించి రండి'' అన్నారు. భాట్టం శ్రీరామమూర్తిగారు నన్నూ, వి.వి. మాణిక్యాల రావుగారిని (డైరెక్టర్ ఇన్‌ఫర్‌మేషన్ పబ్లిక్ రిలేషన్సు) ఆ డెలిగేషన్‌లో చేర్చారు. కలకత్తాలో ఉన్న శ్రీ తరుణ్‌రాయిగారిని, శ్రీమతి ఉషామాలిక్‌గారిని (ఇప్పుడు సంగీత నాటక అకాడమీ సెక్రటరీ) కేంద్ర ప్రభుత్వం చేర్చింది. మేం నలుగురం లండన్, ఫ్రాన్స్, వియత్నాంలలోని పలు కాంప్లెక్సులను పరిశీలించాం. నేను డైర్కక్టర్‌గా తెలుగు అకాడమీలో ఉండగానే తెన్నేటి విశ్వనాథంగారితో ఒక కమిటీని వేశారు. ఎకాడమీస్ రివ్యూ కమిటీ అని. అప్పుడు కూడా దేశంలో చాలా చోట్ల తిరిగి వచ్చాం.

తర్వాత విశ్వనాథం గారు రిజైన్‌చేస్తే తొలి మెంబరుగా ఉన్న శంకరగిరి గారిని చైర్మన్‌గా నియమించారు. రిపోర్టు తయారు చేశాం. (మిగిలిన మెంబర్స్ కంటే నేను కొంత గర్వంగా చెప్పుకోగలది ఏమిటంటే "స్టేట్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ ఎఫైర్స్" ఉండి తీరాలి అని భావించి, దానికి ప్రాతిపదికను ఆ రిపోర్టులో చేర్చాను. అప్పటికి ఈ కల్చరల్ డైరెక్టరేట్ రాలేదు. ఈ కల్చరల్ కాంప్లెక్స్ అనేది ప్రతి పెద్ద పట్టణంలోనూ ఉండాలి అని నా వాదన. ఈ కాంప్లెక్స్‌లో క్లోజ్డ్ థియేటర్ ఉంటుంది. ఓపెన్ థియేటర్ ఉంటుంది. స్కూలు ఉంటుంది. ఆ మొత్తం కాంప్లెక్సుకి ఆ ప్రాంతంలో ప్రసిద్ధులైన మహాకవి లేదా, కళాకారుని పేరు పెడతారు. అతని విగ్రహంకూడా అక్కడ స్థాపిస్తారు. ఒక కాంటీన్ ఉంటుంది. ఆర్ట్ గలరీ ఉంటుంది. సెలవు రోజున ఎవరైనా ఒకరు ఫేమిలీతో ప్రొద్దుననంగా ఆ కాంప్లెక్సులోకి వెళితే రాత్రి వరకూ తిరిగి రానక్కర లేదు వాళ్ళు. అంత చక్కగా ఉంటుంది కల్చరల్ కాంప్లెక్స్ అంటే. ఆ కల్చరల్ కాంప్లెక్స్ ప్రతి పట్టణంలోనూ ఉండాలి. బహుశా '73లోనో,' 74లోనో ఈ రిపోర్టు మేమిచ్చాం. ఇటీవల స్టేట్ కౌన్సిల్ ఫర్‌కల్చరల్ ఎఫైర్స్ అని ఏర్పాటు చేశారు. దానికి సెక్రటరీని వేశారు. తర్వాత సెంట్రల్ యూనివర్సిటీలో ఒకనాడు డా. సీతారెడ్డి గారు వచ్చి బంజారా హిల్స్‌లో 25 ఎకరాల స్థలంలో కల్చరల్ కాంప్లెక్సు కడుతున్నాం అని ఇప్పుడు నేను చెప్పినట్టి విషయాలనే వర్ణించారు. అంటే ఇప్పటికి కొంచెం ప్రభుత్వం కదులుతున్నదన్నమాట. ఎప్పుడో నేననుకున్నటువంటివి కలలు కన్నటువంటివి కూడా ఇప్పుడు రియాలిటీలోకి రావడానికి అవకాశం కనిపిస్తున్నది. ఇంకొకటి నా కాంట్రిబ్యూషన్ చెప్పకుండా ఉండలేను. అది ప్రథమ ప్రపంచ మహాసభలు జరపడానికి ముందు జరిగింది. సెప్టెంబరు 5న జరిగే ఉత్సవాన్ని గురించి హిందీలో దీనిని ఉపాధ్యాయ దినమని పిలవటం బాగోలేదు. మండలి కృష్ణారావు గారడిగారు దీనికేమన్నా పేరు చెబుతావా? అని. ప్రక్కన వీరివెంట కృష్ణమూర్తిగారున్నారు. మేమిద్దరముఆలోచించుకొని గురు పూజోత్సవం అని సూచించాం.

డా॥ తిరుమల రామచంద్ర

(26-9-1994)

ఆగర్భశ్రీమంతుడు, ఆగర్భ దరిద్రుడు అన్నవి అందరికీ తెలిసిన తెలుగు నానుడులు. నేను చాలా విషయాలలో ఆగర్భ అదృష్టవంతుడిని. భగవద్భక్తి, దేశభక్తి పొంగిపొర్లే వంశంలో పుట్టడం నా మొదటి అదృష్టం. తాము ఏ కులమువారైనా విద్యార్థులను మానవత్వంతో పుత్రనిర్విశేషంగా ప్రేమించే ఉపాధ్యాయుల వద్ద చిన్ననాడు చదువుకోవడం నా రెండవ అదృష్టం. కౌమార దశలో ఆదర్శప్రాయులైన మహనీయుల పరిచయంతో జ్ఞానార్జనకు అవకాశం కలుగడం నా మూడవ అదృష్టం. పెద్దవాణ్ణైన తర్వాత నా మనస్సైన ధర్మపత్ని, సంతానం కలుగడం నా నాలుగవ అదృష్టం. మంచి మిత్రులుండడం ఐదవ అదృష్టం. ఇన్ని అదృష్టాలు వరించిన నేను ఎంతో గొప్పవాడు కావలసింది. నన్ను ప్రేమించిన వారంతా నేనొక మహాపురుషుడవుతాననే భావించారు. కాని, అన్నిటికీ మించిన నా చంచలత్వం అస్థిరత అనే దురదృష్టం నా అదృష్టాలన్నిటినీ దిగమింగి నన్నొక తెగిన గాలిపటం చేసింది. ఈ గాలిపటం ఎక్కడెక్కడికో కొట్టుకుపోతుంది. ఎప్పుడు ఎక్కడ, ఎట్లా బోరగిల పడుతుందో? ఇదీ నేను సింహావలోకనం చేసుకుంటే కానవచ్చేది నా జీవితగతి.

నేను అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రాగవంపల్లె శ్రోత్రియం గ్రామంలో మాతామహుల ఇంట్లో పుట్టాను. మా అమ్మకు ఆరుగురు అక్కాచెల్లెళ్లు. నేను మాతామహుల ఇంట్లో పుట్టిన ప్రథమ పురుష సంతానం. కనుక నేను ఆరుగురు తల్లుల ముద్దు బిడ్డను. మాతామహుడు వెంకట రాఘవాచార్యులు శ్రోత్రియంగారు. ఆంధ్ర నాటక పితామహులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులకు వియ్యంకుడు. ఆయన సరస హాస్య కవితా చతురులు తమిళ సంస్కృతాంధ్రాలలో.

సుప్రసిద్ధ నాటక కర్త కోలాచలం శ్రీనివాసారావుగారి అన్నగారు

కోలాచలం వెంకటరావుగారు మావూరికి ఏటా వచ్చేవారు. కోలాచలం వారికి తుంగభద్రా తీరంలో ఉన్న భూములను మేము సాగుచేసేవారం. ఆయన గొప్ప న్యాయవాది, దేశభక్తుడు, మొట్టమొదటి భారతీయ రైట్ ఆనరబుల్. తిలక్ గారిని అరెస్టు చేసినందుకు నిరసనగా ఆయన రైట్ ఆనరేబుల్ టైటిల్‌ను విసర్జించారు. ఆయన ప్రోత్సాహంతో మా యింట్లో చరఖాలు ఆడేవి. అందరూ ఖద్దరే కట్టేవారు. దిండూ గొసెనలూ ఖద్దరే.

ఆనెగొందిలో ఉన్నప్పుడే ఒక మారు నేను మాతాత గారితో పాటు గాంధీజీని దర్శించాను. గాంధీజీ భారత దేశస్థితిగతుల పరిశీలనకోసం దేశమంతా పర్యటించారు. ఆ పర్యటలనో బళ్లారికి వచ్చారు. బళ్లారిలో ఆంధ్రనాటక పితామహ కృష్ణమాచార్యుల బంగ్లాలో గాంధీజీకి స్వాగత సమావేశం ఏర్పాటు చేసారు. బళ్లారి నగరమంతా పండుగ యింటిలాగ అయింది. తర్వాత మా తాతగారు నన్ను తిరుపతి సంస్కృత కళాశాలలో చేర్చారు. తిరుపతి సంస్కృత కళాశాలలో నేను దాదాపు ఎనిమిదేళ్ళు చదివాను. సాహిత్యశిరోమణి చదువుతూ వ్యష్టిసత్యాగ్రహోద్యమంలో సత్యాగ్రాహినై జైలుకు వెళ్లి సంవత్సరం కఠిన శిక్ష అనుభవించాను. నేను ఎప్పుడూ తిరుపతిలో ఫస్టునే. మా గురువులు చాలా గొప్పవారు. ఆయుర్వేదోపాధ్యాయులు శ్రీ సి. వి. సుబ్రహ్మణ్య శాస్త్రిగారు వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యుల ప్రథమ శిష్యులు. నీవు వైద్యరాజు వవుతావన్నారు నన్ను. సాహిత్యోపాధ్యాయులు శ్రీ గిరిధరా చార్యులుగారు నీవు గొప్ప వ్యాఖ్యాతవవుతావన్నారు నన్ను. తర్కాచార్యులు శ్రీ చక్రవర్తి భట్టాచార్యులుగారు నీవు గొప్ప తార్కికుడవవుతావన్నారు. వేదాంతన్యాయా లంకార శాస్త్రాచార్యులు శ్రీ పురిశై కృష్ణమాచార్యులు నా సంస్కృత కవితలు చూచి గొప్పగా ఆశీర్వదించారు మహా కవివవుతావని. ఇలా ప్రతివారు నా భవిష్యత్తు ఉజ్జ్వల మన్నవారే. వారి ఆశలేవీ నేను పూరించలేకపోయాను. ఏమీ కాలేక పోయాను. శ్రీ సమ్మయ్యగారు - శఠగోపాచార్యులుగారు మాకు అనువాదం, వాక్యరచనా చెప్పే వారు. సంస్కృతవాక్య రచనకు పంచతంత్రం ఒరవడి అనేవారు. నేను అనేగొందిలో థర్డ్

ఫారంకు సమానమైన పరీక్ష ముగించాను. తిరుపతిలో ఇంగ్లీషు చెప్పే శ్రీ వెంకా సామిరావుగారు రవీంద్రభక్తులు. రవీంద్రుని ఆంగ్ల పద్యాలు చెప్పి మాకు ఉత్సాహం కలిగించేవారు. ఒక మారు సౌందర్యాన్ని గురించి ఒక వ్యాసం వ్రాయమన్నారు ఆయన. నేను సాక్షివ్యాసాలలో సౌందర్యం గురించిన వ్యాసాన్ని వంక్కీకి వంక్కీ సంస్కృతీకరించాను. అది చూచి ఆయన ''ఇవి నీ భావాలు కావు. ఎక్కడినుండి తీసుకొన్నావో ఆకరం తెలుపు. అది ఉత్తమ వ్యాసకర్త లక్షణం'' అని ఉపదేశించి అధస్సూచికలలో ఆకరాలు ఇచ్చే పద్ధతి తెలిపారు. కపిస్థలం కృష్ణమాచార్యులుగారు ప్రిన్సిపాలుగా ఉన్నారు కొంతకాలం. నాటికలు బాగా చెప్పేవారు.

అప్పుడు తిరుపతి దేవస్థానం విద్యాశాఖాధికారి శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారు. ఆయనపై అప్పటికే వాదోపవాదాలు ఉన్నా మాకు అవి తెలియవు. నాగరి దస్తూరీ బాగా వ్రాయగలవారు కావాలని ఆయన ఎవరితోనో అన్నారు. నేను ఆ మాట విని, అప్పుడప్పుడు సంస్కృత శ్లోకాలు రచించి వ్రాసుకున్న నోటుబుక్కుతోపాటు ఆయన దగ్గరికి వెళ్లాను. ఆయన చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అందరినీ అయ్యా అని సంబోధించేవారు. నా నోట్‌బక్‌లోని కవిత చదివారు. అది ఇది :

రచయంతీ రంగలతాం
మంగళగాత్రీ సలీలం అంగణకే,
విటజన హృదయాంగణకే
అనంగజ బాధాం విశాలయతికునూనమ్

ఒక అమ్మాయి ముంగిట్లో ముగ్గులు పెడుతుంటే వ్రాసిన శ్లోకమిది. అమ్మాయి ముంగిట్లో ముగ్గులు పెడుతూ విటజనుల హృదయాలలో మన్మథ బాధను విస్తరింపజేస్తున్నది - అని దీని తాత్పర్యం. ''నీ వయస్సెంతయ్యా?'' అనడిగారు రామకృష్ణకవిగారు. పదమూడండీ అన్నాను. నీ కవిత బాగుంది గాని, ఈ వయస్సులో శృంగారమెందుకయ్యా నీకు? అన్నారు. నేను తల ఎత్తలేదు. బాగా చదువు. పాఠ్య పుస్తకాలు కాక తక్కిన కావ్యాలు చదువు, అర్థంకానీ, కాకపోనీ.

సందేహాలు నన్నడుగు అన్నారు. ఆయనవల్ల వివిధ విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది. అంత గొప్పవాడు, మహాధారణ గలవాడు, ఎంత సరళుడు?

ఆయన ధారణను గురించి ఆయనే ఒక ఉదంతం చెప్పారు. ''నేను తాళపత్ర గ్రంథ సేకరణోద్యోగంలో ఉన్నప్పుడు, కలెక్టర్ ద్వారా తాళపత్ర గ్రంథాలున్న వారి యిండ్లకు వెళ్లేవాణ్ని. కలెక్టర్ ఉత్తరువులకు భయపడి పుస్తకాలు చూపేవారు. నేను ప్రతి ఆకూ తిరగేసి, రచయిత పేరు అన్ని ఆశ్వాసాలు, ఆశ్వాసాద్యంతాలు మనస్సులోనే గుర్తుచేసుకొని, ఇరవై ముప్పై పుస్తకాలు చూచి రాత్రి వాటిని డిస్క్రిప్టివ్ క్యాటలాగుగా వ్రాసుకొనే వాడిని. తర్వాత తర్వాత నమ్మి, పుస్తకాలలోని విషయాలు వ్రాసుకొనిచ్చేవారు. పిదప పుస్తకాలు ఇచ్చేవారయ్యా!'' ఎంత గొప్ప ధారణాశక్తియో!

నేను వేసవి సెలవులలో ఊరికి వెళ్లక చిత్తూరు జిల్లాలో విదేశ వస్త్ర దహనం, సహాయ నిరాకరణం మున్నగు వాటిని గురించి ప్రచారం చేసేవాడిని. ఉత్తర భారతం నుంచి వచ్చిన పురుషోత్తమ ఆర్య అనే స్వయం సేవకుడు నాతోపాటు తిరిగే వాడు. నేను విదేశ వస్త్ర దహనం చేయించేవాడిని. ఈ ప్రచారం వల్ల తిరుపతి టౌన్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి నయ్యాను. అంత చిన్న వయసు కార్యదర్శిని నేనే. అప్పుడు తిరుపతి కరణాలవీధిలో ఉన్న ఆదిమూర్తి ఆచారి అనే సంపన్నుడు టౌన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్యక్షుడు. అప్పుడు సహాయ నిరాకరణ సభల కోసం సంస్కృతంలో గేయాలు వ్రాశాను, మార్చింగ్ సాంగ్స్ వ్రాశాను.

సకల చరాచర నికరాకరే
వికసిత సురుచిర ఘనవనవారే
అకలంకే విమలోదకపూరే
ప్రేమపూతా, మాతా, సహచరితా
భింది భింది భారతీయ మాతృదాస్య శృంఖలమ్
మందహాసన విధురమద్య కలయమాతురాననమ్

అనే ఒకటి రెండు పాటల చరణాలు మాత్రమే జ్ఞాపకం ఉన్నాయి.

నేను తిరుపతిలో విద్యార్థిగా ఉన్నప్పుడు వివిధ విషయాలపై దాదాపు వంద సంస్కృత వ్యాసాలు వ్రాశాను. అవి తర్వాత విద్యార్థులకు ఒరవడి అయ్యాయి. నారచనలో ప్రధాన గుణం చిన్న చిన్న పదాలతో వాక్య రచన, సరళత. బళ్లారిలో గాంధీజీ ప్రసంగించినప్పుడు ఆంధ్ర నాటక పితామహుని కుమారుడు భోగేంద్రనాథ్ (ఇంజినీరు) ఆ ప్రసంగాన్ని అంత సరళంగానే తెలుగు చేశాడు. ఆ శైలి నాకు బాగా నచ్చింది. చిన్న పదాలతో భావ వ్యక్తీకరణకు నారులు అప్పుడే పోశాడు గాంధీజీ నాహృదయంలో.

గాంధీజీ-ఇర్విన్ సంధి విఫలమైన తర్వాత దేశమంతా వ్యష్టి సత్యాగ్రహం జరిగింది. నేను 1932 ప్రారంభంలో సత్యాగ్రహం చేసి శిక్షితుడనయ్యాను. చంద్రగిరి మేజిస్ట్రేట్ కోర్టు నాకు శిక్ష విధించింది. నేను రాయవెల్లూరు, తిరుచిరాపల్లి జెయిళ్లలో ఉన్నాను.

తిరుచిరాపల్లి జెయిళ్లలో ఉన్నప్పుడు నాకు ఆంధ్ర, తమిళ, కర్నాటక, కేరళ, హిందీ, వంగాది ప్రాంతాల వారితో పరిచయం కలిగింది. వారిలో చాలా మంది తర్వాత మంత్రులు, ఎం.ఎల్.ఏ లు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులూ అయ్యారు. అక్కడ సురేంద్ర మోహన్‌ఘోష్, ప్రతూల్ చంద్ర గంగూలీ, జీవన్‌లాల్ చటర్జీ అనే డెటిన్యూలు, భగత్‌సింగ్ కేసులో యావజ్జీవ కారాగార శిక్షపడిన బటుకేశ్వర్ దత్, ఏడెనిమిదేళ్ళు శిక్షపడిన కుందన్‌లాల్ గుప్త ఉండేవారు. వాళ్లు మాకు బాగా బ్రెయిన్‌వాష్ చేసేవారు. సురేంద్ర మోహన్ ఘోష్ ఉత్సాహంతో నేను రవీంద్రుని కొన్ని గీతాలను సంస్కృతీకరించాను.

సాహిత్య శిరోమణి పూర్తి చేయాలిగదా! తిరుపతికి వచ్చాను. సంస్కృత పాఠశాల వారు నన్ను చేర్చుకోనన్నారు. నెల్లూరు వెళ్లాను. అక్కడ నా సంగతులేమీ చెప్పకుండా చేరాను. నెల్లూరులో పలువురు ప్రముఖులు నన్ను ఆదరించారు. జెయిలుకు వెళ్లడంవల్ల కిడాంబి వీరరాఘవాచార్యులు, మాడభూషి నరసింహాచార్యులు నేలటూరి రామానుజాచార్యులు, వెన్నెలకంటి రాఘవయ్య, ఒంగోలు వెంకట

రంగయ్య మొదలయిన ప్రముఖ న్యాయవాదులు, దేశ భక్తులు నన్ను ఎంతో ఆదరించారు.

నేను నెల్లూరులో రంగనాయకుల పేటలో శ్రీ కె. వి. రాఘవాచార్యులు గారి యింటి ఎదుట ఉన్న స్వయంపాకులవారి సత్రంలో ఉండేవాడిని. వారాల భోజనం. మూలపేట సంస్కృత కళాశాలలో చదువు. తిరుచిరాపల్లి జెయిలులో నాతోపాటున్న పలువురు ప్రముఖులు - మైపాడు బలరామరెడ్డి, ఆళ్ల బాలకృష్ణారెడ్డి, బి. బాలకృష్ణారెడ్డి, చుండి జగన్నాథం మున్నగువారు నన్ను కలిసేవారు సత్రం గదిలో. జెయిల్లో అనుకున్న విప్లవ కార్యకలాపాల చర్చ జరిగేది. క్రమంగా విప్లవ కార్యకలాపాలకు పూనుకున్నాము. చదివేది సంస్కృతం, వారాల భోజనం. ఊళ్లో అందరికీ కాంగ్రెస్ వాది అయిన 'పిల్లకాయ' అని ప్రేమ. కాని గుప్తంగా విప్లవం పనులు. అక్కడ ఉంటే ప్రమాదమని తోచింది. ఎప్పటికైనా పోలీసులకు పట్టుబడక తప్పదనిపించింది. ఆ పరిస్థితిలోనే 1933 చివర అలీగడ్ ఆయుర్వేద విద్యాపీఠ్ పరీక్షలకు కట్టి ఆయుర్వేద భూషణ అనే ఉన్నత పరీక్షలో ఉత్తీర్ణున్నయ్యాను. నాలుగైదు సార్లు విప్లవవాదులతో తీవ్రమైన హింసాత్మక కార్యాలకు వెళ్లవలసి వచ్చింది. మిత్రుల సలహాపై మద్రాసు వెళ్లాను. మైలాపూర్ సంస్కృత కళాశాలలో చేరాను.

అక్కడ నాకు విద్యార్థి వేతనం లభించలేదు. మిత్రులు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దమ్మాలపాడు శేషగిరి రావు కూడ చదువుతున్నారు. నాకన్నా సీనియర్లు. లక్ష్మణశాస్త్రి సాహిత్య శిరోమణి ముగించి, వేదాంత శిరోమణిలో చేరాడు. వారు రాత్రిపూట కళాశాల హాస్టలులో మిగులు బొగులు అన్నం, పులుసు కూర కలగాపులగంగా కలిపి తెచ్చి తోటలో దొంగచాటుగా పెట్టేవారు. అలా మూడు నెలలు గడిచాయి.

ఇంతలో నెల్లూరిలో పట్టాభిరామ రెడ్డి అనే యువకుడు పోలీసులకు పట్టుబడి అప్రూవరయి చాలా మందిని పట్టించాడు. నన్నుకూడా పోలీసులు వెదుక్కుంటూ మైలాపూర్ కళాశాలకు వచ్చారు. నన్ను అరెస్టు చేయకుండా,

ప్రిన్సిపాలు మహా మహోపాధ్యా కరుంగుళం కృష్ణశాస్త్రిగారితో చెప్పి నేను పరిగెత్తి పోకుండా కట్టుదిట్టం చేశారు. కుట్రకేసు పెట్టారు పోలీసులు. మద్రాసు కుట్రకేసు విచారణ జరిగింది. సంవత్సరం పాటు నేను అందరికన్నా చిన్నవాడిని గనుక పోలీసులు నన్ను మభ్యపెట్టి ప్రాసిక్యూషన్ సాక్షిగా వేసుకున్నారు. నేను మొదటి సాక్షిని. నిందితులలో ఒకరు కానూరు రామానంద చౌదరి. ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకుల సోదరుడు. ఆయన తండ్రి దామోదరయ్యగారు. దామోదరయ్యగారు, బ్రిటిష్ ప్రభుత్వం పగబట్టి యువకులందరికీ యావజ్జీవ కారాగారవాస శిక్ష, ద్వీపాంతర వాసమో విధిస్తుంది గనుక, వారిని కాపాడవలసిందని ప్రకాశంగారిని ప్రార్థించారు. ఆయన వకాల్తా వదలి అప్పటికే ఇరవైయేళ్లు. మా కోసం ఆయన మళ్లీ నల్లకోటు తొడిగారు.

కేసు 1934 అంతా జరిగింది. ప్రకాశంగారి వదనాబలంవల్ల నా మిత్రులంతా కొద్దిపాటి శిక్ష పొందారు. నన్ను విడుదల చేశారు. కాని, సంస్కృత కళాశాలవారు నన్ను బహిష్కరించారు. వీధిలో పడ్డాను. నా మిత్రుడు కాశీభట్ట రామనాధ దత్త, (ఆయుర్వేద శిరోమణి, తర్వాత వేంకటరమణ ఆయుర్వేద డిస్పెన్సరీ మైలాపూర్ ప్రధాన వైద్యుడు) భారతి ఉపసంపాదకులు తిరువల వెంకటరాంగాచార్యులు, నాకు కొంత కాలం ఆశ్రయమిచ్చారు. పోలీసులు వెంటాడుతున్నారు. మద్రాసులో నా బంధువర్గం ''నా కొంపకూల్చకు నాయనా, మద్రాసు కుట్రకేసు సొంతం చదివాము నాయనా'' అని అంగలార్చారు; గడప తొక్కనివ్వలేదు.

అప్పుడు తెలిసింది, ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం అగ్మ్మారులో మ్యూజియం (చచ్చిన కాలేజీ) ఆవరణలో ఉందనిన్నీ, అక్కడ సంస్కృత తెలుగు ప్రాచీన గ్రంథాలు చూచి వ్రాయడానికిక లేఖకులు కావాలనిన్నీ. నేను నాపుట్టు పూర్వాలేమీ చెప్పకుండా అక్కడికి వెళ్లి దరఖాస్తు వ్రాసి స్వయంగా ఇచ్చాను. అప్పటి నావేషం గూడ కట్టుపంచ, ఉత్తరీయం, పొడుగాటి శిరోజాల ముడి, నొసట మూడు నామాలు. నేను విప్లవకారుణ్ణని 'ఛస్తే' ఎవరికీ తెలీదు. అందులోను

అప్పుడు ఆ పుస్తక భాండాగారం పండితులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు లీవు పెట్టడం వల్ల ఆ స్థానంలో తాత్కాలికంగా ఉన్న శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు అసలే ఊహించుకోలేరు.

శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు నా దస్తూరీ పరీక్షించి నేను కాపీయిస్ట్‌గా అర్హుడినని సిఫార్సు చేశారు. 1934 చివర కాపీయిస్టుగా చేరాను. నాకు కాపీయిస్టుగా నికరంగా ముప్ఫై రూపాయలు వచ్చేవి. అది అప్పుడు ఒక విధంగా పెద్ద రాబడే. హోటలు భోజనానికి ఏడు రూపాయలు. గదికి రెండు రూపాయలు అద్దె. తక్కిన 20 రూపాయలు ఎలా ఖర్చు పెట్టాలో తెలిసేదికాదు.

ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారం నాకు గొప్ప రక్షణ నిచ్చింది. నాలుగు సంవత్సరాలు అక్కడ పనిచేసాను. ప్రభాకర శాస్త్రిగారితో సన్నిహితత్వం ఏర్పడింది. ఆయన లీవు పెట్టినప్పుడు ఆయన స్థానంలో పనిచేశాను.

అప్పటికి నేను ప్రైవేటుగా సంస్కృత-తెలుగు విద్వాన్ పరీక్ష ప్యాసయ్యాను. ఈ పరీక్ష సంగతి కొంత చెప్పాలి. విద్వాన్ వంటి ఓరియంటల్ పరీక్షలకు ప్రైవేటుగా వెళ్లడానికి అభ్యర్థి వయస్సు 30 సంవత్సరాలుండాలి. నా వయస్సు 21 ఏళ్ళు. ఎనిమిదేళ్లు ఎక్కువ వేస్తే జీవికకు నష్టం. కనుక ప్రభాకర శాస్త్రిగారు వారి యోగ మిత్రులు శ్రీ విస్సా అప్పారావుగారి వద్దకు నన్ను పిలుచుకు వెళ్లారు. ఆయన ప్రెసిడెన్సీ కాలేజీలో అడిషనల్ ఫిజిక్స్ ప్రొఫెసర్. ఆయన నన్ను తన మిత్రులయిన మద్రాసు విశ్వ విద్యాలయం రిజిస్ట్రారు వద్దకు పిలుచుకు వెళ్లి నా సమస్య వివరించారు. ఆయన ఆలోచించి ప్రైవేట్ అభ్యర్థుల వయస్సు 20కి తగ్గించేట్టు నిబంధనను విశ్వవిద్యాలయంచే ఆమోదింపజేశారు. నేను శిరోమణి ప్రైవేటుగా చదవలేను గనుక విద్వాన్ పరీక్షకు వెళ్లాను. ఉత్తీర్ణుడనయ్యాను. చాల మంది పెద్దవయస్సు వాళ్లు గూడ 20 ఏళ్లు వేసుకొని పరీక్షకు వెళ్లడం వల్ల యూనివర్సిటీ రెండేళ్ల పిదప వయః పరిమితిని 30 ఏళ్లకు పెంచింది. ప్రభాకర శాస్త్రిగారికి నేను ఏకలవ్య శిష్యుణ్ని. ఆయన గొప్ప మనస్వి. కుంభకోణం

సి.వి.వి.గారి యోగ శిష్యాగ్రణి. ఆయన నడతను, వ్రాతలను, ప్రసంగాలను, సంభాషణలను, సలహాలను పాఠంగా గ్రహించి ఎన్నో విషయాలు గ్రహించాను. ప్రాచీన గ్రంథాల పాఠాంతర సంగ్రహణం, పాఠవివేచనం, పాఠ నిర్ణయం తాళపత్ర గ్రంథాల పఠనం మున్నగువాటిని తెలుసుకొన్నాను. నాసంగతులు కొంత కాలానికి తెలిసి ఆయన చాల కష్టపడ్డారు. నన్ను అంగుళిమాలుడు అనేవారు. ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలోని పెక్కు గ్రంథాలు, చాటు పద్యాలు ఎన్నో ఆయనకోసం నకలు చేసి ఇచ్చాను.

ఆ కాలంలోనే మద్రాసు విశ్వవిద్యాలయం వారు కొన్ని తాళపత్ర గ్రంథాలు సేకరించి రామకృష్ణ కవిగారిని క్యాటలాగు చేయడానికి నియమించారు. ఆయన నన్ను అసిస్టెంటుగా నియమించుకున్నారు. ఆయనతో కలిసి పనిచేయడం నా గొప్ప అదృష్టం. ఆయన విజ్ఞాన భండారం, మానవత్వఖని, మేధా విలాసానికి విలాసం, అన్నిటినీమించి సౌజన్యరాశి.

ఆ సమయంలోనే నేను భారతిలో ఒక వ్యాసం వ్రాశాను. దానిపేరు ఆంధ్రచ్ఛందో విశేషములు. అది 1935 సెప్టెంబరులో భారతిలో పడింది. దాన్ని గిడుగు రామమూర్తి పంతులుగారు మెచ్చుకున్నారు. భారతిలో పడిన మొదటి వ్యాసం అది. దానికి గిడుగు వారి మెప్పు. నాసంతోషానికి పట్టపగ్గాలు లేవు. అది ప్రభాకరశాస్త్రిగారి భావాలకు అనుగుణమైంది. గనుక అయనే తమ సాయంకాల ప్రార్థనా గోష్ఠులలో ప్రచారం చేశారు. భారతిలో వ్యాసం పడడమంటే మహా పండితుడన్నమాట.

ప్రభాకర శాస్త్రిగారి కోసం హర విలాసాది కావ్యాల, ప్రబంధాల పాఠాంతరాల సేకరణకు తంజావూరు వెళ్లి వచ్చాను. ఆ సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలం వారు ద్విపద భారత ప్రతులను తంజావూరు సరస్వతీ గ్రంథాలయం ప్రతులతో సరిచూచి ముద్రణ ప్రతి సిద్ధపరచడానికి అనుభవజ్ఞులయిన పండితులు కావాలనిపత్రికా ప్రకటన చేశారు. నేను దానికి దరఖాస్తు పెట్టుకున్నాను. మద్రాసుకు

వచ్చిన అప్పటి ఆంధ్ర యూనివర్సిటీ కాలేజస్ ప్రిన్సిపాల్ విస్సా అప్పారావుగారు నన్ను ఇంటర్వ్యూ చేశారు. నేను కొమ్మన మంచి జోగయ్య శర్మగారు తంజావూరులో పండితులుగా నియమితులయ్యాము.

నాకు తంజావూరు గొప్ప అనుభవం కలిగించింది. జిల్లా అంతా తిరిగాను. విరామ సమయాలలో జైల్లో నాతో ఉన్న ప్రముఖ నాయకులను కలుసుకున్నాను. సరస్వతీ మహల్ లైబ్రరీలోని అపూర్వ పుస్తకాలను నకలుచేసి ప్రభాకర శాస్త్రిగారి కిచ్చాను. నన్నెచోడుని కుమార సంభవం శాస్త్రిగారికోసమూ, నేలటూరు వెంకట రమణయ్యగారి కోసమూ మక్కీకి మక్కీ నకలు చేసి ఇచ్చాను. దాని వల్ల సందేహాలున్న ఎన్నో పాఠాంతరాల నిర్ణయిం జరిగింది.

నేను తంజావూరులో పని చేస్తున్నపుడు లాహోర్ విశ్వ విద్యాలయ గ్రంథాలయంలో ఉన్న తాళపత్ర గ్రంథాలకు వర్ణనాత్మక సూచి వ్రాయడానికి ఒక పండితుడు కావాలని ప్రకటన వెలువడింది. నేను ఆలోచించాను. తంజావూరు నుంచి లాహోరు అంటే, ఇంచుమించు భారతదేశమంతా చూడడం, అది వరకు ఒకసారి పశ్చిమ భారతం తిరిగాను. ఇది మరొక గొప్ప అనుభవం. నేను నా దరఖాస్తు సంస్కృతంలో వ్రాసి పంపాను. రెండు నెలల తర్వాత నాకు ''వచ్చి చేరమని'' ఉత్తరువు వచ్చింది లాహోర్ నుంచి. నాకు ఆశ్చర్య సంతోషాలు కలిగాయి.

ద్విపద భారతం ముద్రణ ప్రతి సిద్ధమయింది. ఇక రెండు నెలలు మిగిలాయి. నన్ను ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రచురిస్తున్న రంగనాథ రామాయణం పరిష్కరణ పనికి తోడ్పడమని ఆచార్య లక్ష్మీకాంతం గారు ఉత్తరువు పంపారు. నేను మద్రాసులో గన్నవరం సుబ్బరామయ్య గారికి రంగనాథ రామాయణ పరిష్కరణలో తోడ్పడి 1939 ఆగస్టు చివర లాహోరుకు బయలు దేరాను.

నేను తిరుపతిలో ఉన్నప్పుడు, తిరుపతి పెద్ద క్షేత్రం గనుక, దేశం నాలుగంచుల నుంచి వచ్చే పెద్దవారిని దర్శించే అవకాశం కలిగింది. అలాగే, నెల్లూరు,

తంజావూరులలోను. మద్రాసు మహానగరానికి జాతీయోద్యమ నాయకులు, మహాపండితులు తరచు వచ్చేవారు, వారిని చూడడం తటస్థించేది. మద్రాసులో ఉన్నప్పుడు హరిజనోద్యమ సమయంలో గాంధీజీతో పాటు పయనించే అవకాశం, మాబళంలో ఆయన బసలో కొన్నాళ్ళు ఉండే అవకాశం కలిగింది. లాహోర్ సుందర నగరం. సిటీ ఆఫ్ గార్డెన్స్ అని దానికి బిరుదు. నేను పురానీ అనార్కలీ ప్రాంతంలో ఒక బసీన్ అనే పెద్ద మనిషి ఇంటి గదిలో అద్దెకున్నాను. జహంగీర్ ప్రేమించిన అనార్కలీని నిలబెట్టి అక్బర్ సార్వభౌముడు గోరీ కట్టించిన ప్రాంతం అది. అప్పటికి ఆ గోరీ శిథిలాలు ఉండేవి. ఊరికి రెండు మైళ్లలోని షాలిమార్ గార్డెన్స్ ప్రపంచ ప్రసిద్ధమైన ఉద్యానం.

నేను యూనివర్సిటీ లైబ్రరీలో ఉన్నందున ఉదయశంకర్ భట్ వంటి గొప్ప రచయితలను, ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ మహామహోపాధ్యాయ మాధవశాస్త్రీ భండారీ వంటి గొప్ప విద్వాంసులను పరిచయం చేసుకోగలిగాను. మాధవ శాస్త్రిగారు షట్‌శాస్త్ర పండితులు. నిరాడంబరులు. సన్నగా పొడుగ్గా బంగారు శలాకలాగ వెలుగు స్తంభంలాగ మాట్లాడేవారు. రామకృష్ణకవిగారి తర్వాత ఆయన ప్రవర్తన నన్నెంతో వినీతుని చేసింది.

యూనివర్సిటీ లైబ్రరీలోని సంస్కృత విభాగంలో నాపని. తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ, నాగరీ, నందినాగరీ లిపుల తాళపత్ర గ్రంథాలు దాదాపు వేయి ఉండేవి. వాటిలో దాశరథి తంత్రం అనే తెలుగు లిపి గ్రంథంలో రెండంగుళాల వెడల్పు తాటాకులో ఒకవైపు దాదాపు 30 పంక్తులు ఉండేవి. అత్యాశ్చర్య కరం. లైబ్రేరియన్ లాభూరాం, సంస్కృత విభాగం లైబ్రేరియన్ బాలా సహాయ్ శాస్త్రిగారలు తెలుగు లిపి పొంకానికి ఆశ్చర్యపడి ఒక ప్రదర్శనం పెడుదామన్నారు, పెట్టాను. నగర ప్రజలంతా విరగబడి చూచారు. నేను వాళ్లకు దక్షిణాది లిపులు చదివి వినిపిస్తే, దేవనాగరి తప్ప మరొక లిపి తెలియని వారు ఆశ్చర్యపడేవారు. స్థానిక ట్రిబ్యూన్ మొదలయిన పత్రికలు ప్రదర్శనాన్ని చాలా ప్రశంసించాయి.

లాహోర్‌లో ఉన్నప్పుడు అక్కడి అత్యున్నత హిందీ పరీక్ష హిందీ ప్రభాకర్ ప్యాసయ్యాను. ప్రభాకర్ ప్యాసయిన వారు ప్రైవేటుగా మెట్రిక్యులేషన్‌కు వెళ్లవచ్చు. నేను మెట్రిక్ ప్యాసయి ఇంటర్ కూడ ప్యాసయ్యాను. బి.ఎ. లో హిందీకి ఎగ్జెమ్షన్ ఇస్తారు గనుక తక్కిన రెండు భాగాలూ పూర్తి చేద్దామనుకున్నాను. ఫీజు కూడ చెల్లించాను. ఈ డిగ్రీలు ఏమి ప్రయోజనంలే అని అనిపించింది మానివేశాను.

లైబ్రరీ పని తర్వాత లాహోర్‌లో ఒక హైస్కూలులో హిందీ పండిట్‌గానూ బంగారు కంపెనీలలో గుమాస్తాగానూ పనిచేశాను. ఇంకా ఎన్నో చిల్లర పనులూ చేశాను. అంతలో ద్వితీయ ప్రపంచ యుద్ధం తీవ్రమయింది. మిలిటరీలో చేరుదామని బుద్ధి పుట్టింది. హవాల్‌దార్ గుమాస్తాగా చేరాను. బెలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో శిక్షణ పొందిన పిదప నన్ను ఆఫ్గనిస్తాన్, పర్షియా సరిహద్దులోని చమన్‌లో ఒక గూర్ఖా బెటాలియన్‌కు పంపారు.

మిలిటరీలో జీవితం బాగున్నా, ప్రాణమిచ్చే మిత్రులే ఏర్పడినా, సైనికుల అయోని, వియోని, అన్వయోని సంపర్కాలు నాకు జుగుప్స కలిగించాయి. సారవాక్ నుంచి వచ్చిన ఒక తెలుగు డాక్టర్ కృష్ణ అనేవారి సహాయంతో సైనిక జీవితానికి అనర్హుణ్నని వ్రాయించుకొని బండెక్కి ఢిల్లీచేరి, మళ్లీ ఉద్యోగ ప్రయత్నం చేయసాగాను.

డెయిలీ టెలీగ్రాఫ్ అనే ఆంగ్ల దిన పత్రికలో చేరాను. వెంకట రామన్ అనేవారు సంపాదకులు. స్థిరంగా ఉండి పనిచేసే గొప్ప సంపాదకుణ్ని చేస్తానన్నారు నన్ను. ఇలాటి మాటలు ఇంతకు ముందు విన్నవే. నేను ఏమవుతానో నాకే తెలీదు. డెయిలీ టెలిగ్రాఫ్‌లో నేను రిపోర్టర్ని, ప్రూఫ్ రీడర్ను, మెస్ మేనేజర్ను. నేను రిపోర్టర్‌గా రిపోర్ట్ చేసిన మొదటి వార్త రాహుల్ సాంకృత్యాయన్ ప్రసంగం. నాకు తెలిసిన ఇంగ్లీషులో వ్రాశాను. సంపాదకులు సవరించి నన్ను ప్రోత్సహించారు. దానిలోనే ఉంటే గొప్ప వాణ్ణయే వాడినేమో.

నాకు 1939లో వివాహమయింది. తర్వాత బయలుదేరి వచ్చాను. రెండేళ్లుగా ఇంటికి ఉత్తరం వ్రాయలేదు. డెయిలీ టెలిగ్రాఫ్‌లో చేరిన తర్వాత వ్రాశాను, మానాన్నగారికి. ఆయన నేను పత్రికలో చేరినందుకు సంతోషిస్తూ, 'ఇంగ్లీషు మహా సముద్రం. తెలుగు పత్రికలలో చేరితే మాకు దగ్గరగా ఉంటావు' అని జవాబు వ్రాశాడు. దీని అర్థం ఉద్యోగం వద్దు, తిరిగిరా - అనడమే.

ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. నేను మద్రాసులో ఉన్నప్పుడు రాష్ట్ర శాసన సభలకు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ వాళ్లు పాల్గొనదలచారు, అప్పుడు వయోజన వోటింగ్ కాదు, ఆస్తి పరిమితి అర్హత. నేను జెయిలుకు వెళ్లాను. ఆస్తి పరిమితి కూడ ఉంది. కొందరు బళ్లారి నాయకులు హోస్పేట నియోజక వర్గం నుంచి మద్రాస్ శాసన సభకు నన్ను నిలబెడుతామని మా తాతగారిని అడిగారు. కాని, మా తాతగారు మేము తరతరాలుగా దేశభక్తులమే. కాని క్రియాశీల రాజకీయాలు మాకువద్దు. మాది ఆశీర్వదించే చేయి అన్నారు. తర్వాత చక్రపాణి అనే హోసపేట లాయర్ను నిలబెట్టారు. అతడు గెలిచాడు.

నేను 1944 చివరలో ఇంటి తిరిగి వచ్చానేగాని, తెలుగు పత్రికలు ఎన్ని ఉన్నాయి? రెండు మూడు. ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ, దేశాభిమాని. ఆంధ్రపత్రికలో దాదాపు నలభైమంది ఉండేవారు సంపాదక వర్గంలో. ఆంధ్రప్రభలో అనుభవం, అర్హతలు కావాలి. నాకు పత్రికానుభవం ఏముంది గనుక ఉద్యోమిమ్మని అడగడానికి. డెయిలీ టెలిగ్రాఫ్ సంపాదకుడు వెంకటరామన్ గారయితే నా అర్హత ఆకలి అంటే దయదలచాడేగాని, ఇతరులు అలా చూస్తారా. కనుక హైదరాబాద్ వెళ్లి ప్రయత్నం చేద్దామని బుద్ధి పుట్టింది.

ఇది వరకు అయితే ఏపని అంటే, ఆపని చేసేవాడిని గాని, ఇప్పుడు పత్రికలో పని చేయాలనే పట్టుదల కలిగింది. అంటే నా మనస్తత్వంలో మార్పన్న మాట. మిలిటరీలో నా మిత్రుడ ఆఫ్‌తాబ్ అహమద్ అనేవాడు ''రామ్‌చందర్ జీ మనం ఫౌజుకు తగినవాళ్లం కాదు. హమారా కామ్ పఢ్‌నా, పఢానా, లిఖ్‌నా'' అని.

ఆ మాటలు నాకు డెయిలీ టెలిగ్రాఫ్‌లో చేరినప్పుడు తరచు జ్ఞాపకం వచ్చేవి. నేను పత్రికా రచనను చేపట్టడానికి ఆ ఆఫ్‌తాబ్ మాటలే కారణమని నమ్ముతాను. తర్వాత వెంకటరామ్ గారి మాటలు మానాన్నగారి మాటలూ.

నేను సురపురంలో అత్తవారింట్లో నెల రోజులుండి, హైదరాబాదుకు బయలు దేరాను. అప్పుడు దక్కన్ క్రానికల్‌వారు తెలంగాణా పత్రిక అనే దినపత్రిక ప్రారంభించారు. దానికి ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావుగారు సంపాదకీయం వ్రాసేవారు. విశ్వనాథ సత్యనారాయణగారి సోదరులు వేంకటేశ్వర్లుగారు సహాయ సంపాదకులు. సంపాదకులు డెక్కన్ క్రానికల్ సంపాదకులు బుక్కపట్నం రామానుజాచార్యులు గారే. నేను సంగం లక్ష్మిబాయిగారి ద్వారా హనుమంతరావుగారి సిఫార్సుతో తెలంగాణ పత్రికలో సబ్ ఎడిటర్ చేరాను. అయినా, రిపోర్టింగ్ చేసేవాడిని.

నా మొదటి తెలుగు రిపోర్టు నిజాం నవాబుగారి పెద్దకోడలు నీలోఫర్ బేగంగారు ఏదో ఆస్పత్రిని ప్రారంభించడానికి సంబంధించింది. అప్పుడు పత్రికలు గ్రాంథిక భాషనే వాడేవి గనుక నేను గ్రాంథిక భాషలోనే రిపోర్టు వ్రాశాను. అది మరుదినం అచ్చయింది. రామానుజాచార్యులుగారు దానిని చదివి నన్ను పిలిచారు. 'ఏం సార్! మనది పత్రికా? లేక ప్రబంధమా?'' అని ప్రశ్నించారు. నేను ప్రశ్న అర్థం కాక ''పత్రికేనండీ'' అని అన్నాను. ''మనది పత్రికే అయితే, మీ రిపోర్టు మనుచరిత్రో, వసుచరిత్రో అని అనుకొనేలాగ ఉంది. ఎవరికి అర్థమవుతుంది మీ ప్రబంధ శైలి? మన దేశంలో అక్షరాస్యత ఎంత? నిజాం రాష్ట్రంలో ఎంత? అందునా తెలంగాణా ప్రాంతంలో ఎంత? సులభ గ్రాంథికంలో వార్తలు ఉండాలి గాని, మీ ప్రబంధ శైలి వద్దు. మీ రిపోర్టు మీకూ, నాకూ తప్ప ప్రజాసామాన్యానికి అర్థం కాదు. కనుక టోన్‌డౌన్ చేయండి'' అన్నారు.

నేను తెలంగాణా పత్రికలో మూడు నెలలున్నాను. ఇంతలో అడివి బాపిరాజుగారి సంపాదకత్వంలో '' మీజాన్'' అనే పత్రిక వెలువడింది. నేను దానిలో చేరాను. బాపిరాజుగారిని దర్శించి నా విషయం చెప్పాను. చేరమన్నారు.

బాపిరాజుగారు గొప్ప రచయిత విజ్ఞానఖని. ఏది వ్రాయాలన్నా, క్షుణ్ణంగా చదివి వ్రాసేవారు. ఆయన టెన్ ఇన్ ఒన్. నాకు నా సహోద్యోగులు రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీనివాస చక్రవర్తి, బొమ్మకంటి సుబ్బారావు. సంవత్సరం తర్వాత వచ్చిన విద్వాన్ విశ్వంలకు తమకు అభిరుచిగల విషయాలలో వ్రాయడానికి ఎంతో అవకాశ మిచ్చారు. నాకు సాంఘిక, చరిత్ర, భాషా సాహిత్యాలు అభిమాన విషయాలు. వాటిపైన వ్యాసాలు వ్రాయించేవారు.

హైదరాబాద్ నాకు ఎన్నో విధాల దోహదం చేసింది. వివిధ రాజకీయ పక్షాల, వివిధ సాహిత్య సంస్థల, వివిధ వర్గాల ప్రముఖులతో పరిచయం కలిగింది. ముఖ్యంగా మహా విద్వాంసులు సహృదయులు ప్రతాపరెడ్డిగారితో సన్నిహితత్వం కలిగింది. నేను, వారు అధ్యక్షులుగా ఉన్న వివేకవర్ధనీ పరిషత్తులో సభ్యుడిని. మీజాన్ పత్రిక అప్పుడు ప్రబల ప్రజా సంస్థ అయిన రావి నారాయణ రెడ్డిగారి అధ్యక్షతన ఉన్న ఆంధ్ర మహాసభను సమర్థించడంవల్ల ఆ సంస్థ ప్రముఖులు బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి మున్నగు వారితో సన్నిహితత్వం ఏర్పడింది. స్టేట్ కాంగ్రెస్ నాయకులతోను మంచి పరిచయం కలిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య రాయప్రోలు సుబ్బారావు, ఆచార్య ఆర్యేంద్ర శర్మ, రావాడ సత్యనారాయణ, ఆచార్య నిజాముద్దీన్ మున్నగు వారితో చర్చించేవాడిని. ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రిక నుంచి తప్పుకొని ప్రజావాణి పత్రికను ప్రారంభించినప్పుడు, ఆంధ్రప్రభలో ఉన్న నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. శ్రీమతి రాచమళ్ళ సత్యవతీదేవిగారి సంపాదకత్వంలో ఉన్న తెలుగు తల్లి మాస పత్రికను శెట్టి ఈశ్వరరావుగారు పునరుద్ధరించి పనిచేసినప్పుడు నేను దానిలో భాషా శాస్త్రానికి సంబంధించిన పెక్కు వ్యాసాలు వ్రాశాను. బూర్గుల రామకృష్ణరావుగారు ఎన్.కె. రావుగారు మున్నగు వారు కూడ నాకు అభిమానులయ్యారు. ఎన్నో సభలను నేను ప్రత్యేక ప్రతినిధిగా వెళ్ళి వార్తలు, సమీక్షలు వ్రాశాను.

మీజాన్‌లో పనిచేస్తున్నప్పుడు మధ్యాహ్నం అల్పాహారానికి ఒక వేప చెట్టు కింద కూర్చునే వాళ్లం. బాపిరాజుగారు ఒక పెద్ద టిఫిన్ కేరియర్ నిండా ఫలాహారాలు

తెచ్చేవారు. అందరికీ పంచేవారు. ఆ వేప చెట్టుకింద అంతర్జాతీయ విషయాలన్నీ చర్చకు వచ్చేవి. నేను మీజాన్ వదలి ఆంధ్రప్రభలో చేరినప్పుడు నా సహచరులు ''వేప చెట్టు నవ్వింది'' అనే శీర్షికతో నా స్వభావ స్వరూపాలు వర్ణిస్తూ వ్రాశారు.

మద్రాసు రాష్ట్రంలో టంగుటూరి ప్రకాశంగారి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం నుంచి ఆయన నాయకత్వం తప్పించడానికి 1947 ఫిబ్రవరి - మార్చిలలో పెద్ద కుట్ర జరిగింది కాంగ్రెస్ పార్టీలోనే. ఆ విషయాలు వివరంగా రిపోర్టు చేయడానికి బాపిరాజుగారు నన్ను, బి.సి. కామరాజు గారిని మద్రాసుకు పంపారు. మేము మా విధ్యుక్త కార్యాలు ముగించి తిరిగి వస్తూ, ఆంధ్రప్రభ ఎడిటర్ శ్రీ నార్ల వేంకటేశ్వర రావుగారిని మర్యాదగా చూడడానికి వెళ్లాము. మాతో ఉన్న, మీజాన్‌లో అడ్వర్‌టైజ్‌మెంట్ మేనేజరుగా ఉన్న పులిగడ్డ సుబ్బారాయుడుగారు సంభాషణ మధ్య అకస్మాత్తుగా ''మా రామచంద్రుగారు వస్తే మీరు ఉద్యోగం ఇస్తారా?'' అని నార్లగారిని ప్రశ్నించారు.నాకు చాలా కోపం వచ్చింది. నన్ను అడగకుండా ఆ ప్రశ్నవేయడం, మీజాన్ పత్రిక కర్తవ్యం మీద వచ్చి సొంతపని చూడటం - నాకు నచ్చలేదు. అక్కడే ఆయనను కోప్పడ్డాను. ఆయన నవ్వి మళ్లీ అదే ప్రశ్న వేశారు. నా అర్హతలు చెప్పబోయారు. ''నాకు డిగ్రీలు అవీ అక్కరలేదు. నేను వ్రాత పరీక్ష పెడతాను. నాకు సంతృప్తికరంగా నెగ్గితే తీసుకుంటాను.'' అన్నారు నార్లగారు. హైదరాబాద్‌కు కొన్న టికెట్టును రద్దు చేసుకొని నేను మద్రాసులో ఉండవలసి వచ్చింది. నార్లగారి ఇంటి నుంచి వచ్చిన తర్వాత నేను సుబ్బారాయుడు గారిని బాగా కోప్పడ్డాను. ఆయన నా ఉద్రేకం, కోపం తగ్గిన తర్వాత నవ్వి, ''మీకు ఆంధ్రప్రభ వంటి పత్రికలో ఉద్యోగం వస్తూంటే ఏమిటండీ ఈ కోపం?'' అన్నారు.

నేను ప్రభలో పరీక్షకు కూర్చోకపోతే ఎడిటర్ దృష్టిలోను, సుబ్బా రాయుడు గారి దృష్టిలోను అసమర్థుణ్ణని నిరూపించుకొన్న వాణ్ణవుతాను. పత్రిక పని మీద వచ్చి సొంత పని చేసుకోడం నా అంతరాత్మకు ఇష్టం లేకపోయినా, సవాలుగా గ్రహించి మరుసటి దినం ఆంధ్రప్రభ ఆఫీసుకు వెళ్ళాను 9-30 గంటలకు.

ఆరోజు బ్రిటిష్ పార్లమెంటులో బ్రిటిష్ ప్రధాని అట్లీ భారత స్వాతంత్ర్యం బిల్లు ప్రతిపాదించారు. ఆ బిల్లు పాఠం కొండవీటి చేంతాడంత ఉంది. దానిని నార్లగారు నాకు ఇచ్చి, ''దీనిని అనువాదం చేసి తగిన హెడ్డింగు పెట్టి ఇవ్వండి. నిదానంగా వ్రాయండి. టేక్ యువర్ ఓన్ టైం'' అంటూ వెళ్లిపోయారు. నా నాడీవేగం హెచ్చింది. నాకు బిల్లులు, రాజ్యాంగం విషయాలు కొత్త. పరాజయం ఎలాగూ తప్పదు. ప్రయత్నం హృదయ పూర్వకంగా చేద్దాం - అని నిర్ణయించుకొని అనువాదానికి పూనుకొన్నాను. మొదటి రెండు మూడు కాయితాలు చింపి పారేయడం నా అలవాటు. ఆనాటి ఆ వేగంలో ఎన్ని చింపిపారేశానో తెలీదు. ఆ కాగితాలు నలిపి జేబులో పెట్టుకున్నాను. ఆరంభం పెద్ద అవస్థ అయింది. తలయెత్తి చూస్తే పదిగంటలు కొట్టబోతుంది.

నేను మనస్సును చిక్కబట్టుకొని అనువాదం ప్రారంభించి సబ్‌హెడ్డింగ్స్ పెడుతూ ఒంటిగంటకు ముగించాను. దాదాపు మూడు-మూడున్నర కాలంలో అయింది. హెడ్డింగ్ పెట్టి నార్లగారికి ఇచ్చాను. ఆయన నన్ను కూర్చోమని గబగబా చదివారు. నా హెడ్డింగు నచ్చలేదు. వేరే హెడ్డింగ్ పెట్టారు. లీడర్ రైటర్ చల్లా జగన్నాథంగారితో సంప్రతించి కంపోజింగ్‌కు పంపారు. ఉద్యోగాభ్యర్థి వ్రాసిన దానిని కొద్దిపాటి సవరణలతో సరాసరి కంపోజింగ్‌కు పంపడం సంపాదకమండలికి ఆశ్చర్యాసూయలు కలిగించింది.

నార్లగారు నా వద్దకు వచ్చి ''రాత్రి గదా మీకు బండి, గంటసేపు ఉండండి. గోయంకా గారితో మాట్లాడి మీకు ఆర్డరిప్పిస్తాను'' అన్నారు. అంత త్వరగా ఏకంగా ఆర్డరు వస్తుందని నేను భావించలేదు, కనుక నేను ఆశ్చర్య పడ్డాను. భోజనం చేసి వచ్చాను. అక్కడి వారి పని తీరు చూస్తూ కూర్చున్నాను. ఈ లోగా ఐదుగంటలు కావచ్చింది. నార్లగారు నావద్దకు వచ్చి ''గోయంకాగారు లేరు రేపు రాగలవా?'' అని ప్రశ్నించారు. ''అయ్యా నేను నా అంతరాత్మకు విరుద్ధంగా ఈ పని చేస్తున్నాను. ఈ రాత్రి వెళ్లిపోతాను. మీరు ఆర్డరు పోస్టులో పంపండి. నేను మూడు నెలలు నోటీసును ఇవ్వవలసి వస్తే, తర్వాతే వస్తాను. నెలలో రాగలిగితే వచ్చే నెల వస్తాను అని వినయంగా

పరిస్థితి వివరించాను. ఆయన నా దురవస్థను గ్రహించి, ''మీకు సబ్ ఎడిటర్‌గా ఆర్డరు పంపుతాను. మీ సౌకర్యాన్ని బట్టి వచ్చి చేరండి'' అన్నారు.

నేను 1947 ఏప్రిల్ మొదటి వారంలో ఆంధ్రప్రభలో చేరాను. నాకు ఆదివారంనాటి అనుబంధం అప్పగించారు. నేను దినసరి వార్తల అనువాదం, ఎడిటింగ్‌తోపాటు ఆదివారం అనుబంధం చూసేవాడిని. ఒక రాజకీయ వ్యాసం, ఒక చిన్న కథ, ఒక సాంఘిక వ్యాసం, ఒక సాహిత్య వ్యాసం, ఒక భాషా చర్చ వ్యాసం, సీరియల్ నవల భాగం, పుస్తక సమీక్షలు ఉండాలి ఆదివారం అనుబంధంలో అన్నది నార్లగారి నియమం.

నేను కొన్ని వందల పుస్తకాలు సమీక్షించాను. పేరుతోను, పేరులేకను ఎన్నో వ్యాసాలు వ్రాశాను. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి వంటి పెద్దలు అస్తమించినప్పుడు సంతాప సంపాదకీయాలు, రాష్ట్ర సరిహద్దు సమస్యలవంటి భౌగోళిక చారిత్రకాంశాలపై సంపాదకీయాలు వ్రాశాను.

ఆంధ్రప్రభలో మొదటి పుస్తక సమీక్ష ఆచార్య గంటి సోమయాజిగారి తెలుగు భాషా చరిత్రముపైన. సోమయాజిగారు మరణించే వరకూ నా సమీక్షను మరచిపోలేదు. పైకి తీయగా మాట్లాడినా మనస్సులో వైరస్యం విడనాడలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఎటిమలాజికల్ డిక్షనరీ ప్రారంభించినప్పుడు, దానికి ఇన్‌చార్జి అయిన మిత్రులు డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తిగారు నన్ను తీసుకోడానికి ప్రయత్నించి నాకు వ్రాశారు. కాని సోమయాజిగారు. అప్పుడేదో వ్రాశాను, దానిని మనసులో పెట్టుకోకండి అని ఒక ముక్క గురువుగారికి, సోమయాజిగారిగి వ్రాయండి. మీరాకకు మార్గం సుగమం అవుతుంది, అని జాబు వ్రాశారు. నేను హృదయపూర్వకంగా తప్పులని విమర్శించి సమీక్ష వ్రాసినప్పుడు, ఏదో వ్రాశానని అనడం ఎలా? నేను వ్రాయలేదు. ఉద్యోగం రాలేదు. ఇంతకూ పత్రికా రచనా మకరందా స్వాదమత్తులకు మరొక ఉద్యోగం నచ్చదు. పత్రికా రచన నల్లమందు వంటిది అనేవారు అడివి బాపిరాజుగారు.

ద్వేషం మరణాంతం తెచ్చుకున్న మరొక పుస్తక సమీక్ష తెలుగు భాషా సమితి విజ్ఞాన సర్వస్వం నమూనా సంచికపై సమీక్ష. సంపాదకులు డాక్టర్ గిడుగు సీతాపతిగారు మరణించేవరకు నాపై కోపం కోల్పోలేదు. విజ్ఞాన సర్వస్వంలో ఒక్క వ్యాసం వ్రాయడానికి అవకాశమివ్వలేదు. ఆయన విజ్ఞాన సర్వస్వం సంపాదకత్వం నుంచి విరమించిన తర్వాత మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తెలుగు పండుగలను గురించి వ్రాయుమన్నారు. ఇలా గ్రంథ సమీక్షల వల్ల నేను పలువురి ఆగ్రహాన్ని కొని తెచ్చుకున్నాను.

నార్లగారు బాహ్యాకర్కశులు, ఆంతరసరళులు. ఆయనతో ఎన్నోసార్లు తగాదాపడి నెలల తరబడి మాటలాడకుండా గడపడం, రెండు మూడుసార్లు రాజీనామా ఇచ్చి, మధ్యవర్తుల రాయబారంతో చేరడం చేశాను. ఏమైనా నార్లగారు నా రచనలకు ఎంతో ప్రోత్సాహమిచ్చారు.

కమ్యూనిస్టులపై తీవ్రమైన దమన విధానం ఉన్నప్పుడు తాపీ ధర్మారావు గారి సంపాదకత్వంలో సందేశం అనే వారపత్రిక వెలువడింది 1958లో. నేను అప్పటి పత్రికల హెడ్డింగులను వ్యంగ్యంగా విమర్శిస్తూ ''హెడ్డింగ్'' అనే శీర్షికతో ఒక వ్యంగ్య రచన చేశాను. అది ఆంధ్రప్రభ హెడ్డింగ్‌లపైనే అని కొందరు నార్లగారికి పితూరీలు చెప్పారు. ఆయన ఉగ్రుడై నన్ను ఏమో అనబోయారు. ''అయ్యా, మీకూ నాకూ సరిహద్దు ఉద్యోగం'' అంటూ వెంటనే రాజీనామా ఇచ్చాను. కాని, నార్లగారితో పనిచేసినన్ని రోజులూ చాలా వరకు సామరస్యంతోనే ఉన్నాను.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రారంభించినప్పుడు మాలతీ చందూరు గారిని ప్రమదావనం శీర్షికకు నియమించకముందు మగువల మారుపేరుతో ఎన్నో వ్యాసాలు, చిట్కాలు వ్రాశాను. నుడి నానుడి శీర్షిక ప్రారంభించాను.

ఆంధ్రప్రభ వదిలిన వెంటనే ఆంధ్రపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్ స్పెషల్ కరెస్పాండెంటుగా, భారతి ఇన్‌చార్జి ఎడిటర్‌గా చేరాను. మూడేళ్లు పని చేశాను.

దేవరకొండ బాల గంగాధర తిలక్ కథ ఒకటి ప్రచురించాను. దానిపై శంభుప్రసాద్ గారికి నాకు భేదాభిప్రాయాలు వచ్చాయి. రాజీనామా యిచ్చి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెన్షియల్ ఎడిటర్ శేషాద్రిగారి ద్వారా మళ్లీ ఆంధ్రప్రభ చిత్తూరు ఎడిషన్‌లో చేరాను. అక్కడ నుండి ఆంధ్రప్రభ వీక్లీకి నన్ను బదిలీ చేశారు. మూడేళ్లు గడిచాయి. అప్పటి వీక్లీ సంపాదకుడు బి.సి. కామరాజుగారితో పేచీ వచ్చింది. మళ్లీ ఆంధ్రపత్రికలో చేరాను. అక్కడే ఉద్యోగ విరమణ చేశాను.

పిదప హైదరాబాద్‌కు తరలివచ్చి ఆంధ్రప్రభ వారపత్రికకు 'హైదరాబాద్ లేఖ' ఆరునెలల పాటు వ్రాసి, తర్వాత ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ''హైదరాబాద్ నోట్ బుక్'' అనే శీర్షికను 1972 నుంచి 1989 వరకు పత్రిక ఆగిపోయే వరకు నిర్వహించాను. బిర్లా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో తాళపత్రగ్రంథాల వర్ణనాత్మక సూచి సిద్ధపరచాను. ఆంధ్రభూమిలో మూడేళ్లు పని చేశాను. పిదప హరేరామ హరేకృష్ణ సంస్థలో కొన్ని ఆంగ్ల పుస్తకాలు అనువదించాను. ప్రస్తుతం ప్రభుత్వం ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో రెండు వందల సంవత్సరాల నాటి లఘు శబ్దార్థ సర్వస్వమ్ అనే సంస్కృత విజ్ఞాన కోశం పరిష్కరించి, ముద్రణకు సిద్ధపరిచే పని చేస్తున్నాను. సాయంకాలం తెలుగు విశ్వ విద్యాలయంలో ప్రాకృతం పి.జి. డిప్లొమో కోర్సులో ప్రాకృతం సమ్మాన్య ప్రాచార్యుడుగా ఉన్నాను.

నా వయస్సు 82 సంవత్సరాలు. ఇంకా 20 సంవత్సరాలు బతికి సెంచరీ కొడదామనే ఆశ ప్రబలంగా ఉంది. ఈ ఇరవై యేళ్లలోను కొన్ని నేననుకున్న అపూర్వ విషయాలు చెప్పాలని, కొన్ని అపూర్వ ప్రాకృత తమిళ గ్రంథాలు అనువదించాలని ఉంది.

నేను పనిచేసిన పత్రికలలో కొన్ని వందల వ్యాసాలు వ్రాశాను. కొన్ని వందల పుస్తకాలు సమీక్షించాను. అన్ని రంగాల ప్రముఖులను కలుసుకొని పరిచయాలు వ్రాశాను. కొత్త విషయాలు ఎన్నో చెప్పాను. దాదాపు 15 శీర్షికలు నడిపాను. స్వతంత్ర గ్రంథాలు వ్రాశాను. అనువాదాలు చేశాను. ఎందరో యువకులను ప్రోత్సహించి

రచయితలుగా, కవులుగా, విమర్శకులుగా, కథకులుగా తీర్చిదిద్దాను. ప్రముఖ సమస్యలపై, ప్రముఖులపై సంపాదకీయాలు వ్రాశాను. నాకున్నన్ని పేర్లు తెలుగు రచయితలలో ఎవరికీ లేవు.

నేను నా 13వ ఏటి నుంచి 69 సంవత్సరాలుగా రచయితగా, 1944 నుంచి 51 సంవత్సరాలుగా పత్రికా రచయితగా ఉన్నాను. ఇంకా శీర్షికలు నిర్వహిస్తున్నాను. నాకంటే వరిష్ఠులయిన (సీనియర్లయిన) రచయితలు ఉండవచ్చునేమోకాని, ఇంకా శీర్షికలు నిర్వహిస్తూ, ధారావాహికంగా వ్రాస్తున్న పత్రికా రచయితలు ఆంధ్రదేశ్‌లో లేరని నా అభిప్రాయం. తమిళనాడులో శ్రీ శేషాద్రిగారున్నారు. ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పుట్టినప్పటి నుంచి నేటి వరకు పని చేస్తున్నారు. ఆయన సర్వీస్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జీవితం.

ఇక నా రచనలను గురించి : నేను వ్రాసిన ప్రతి వ్యాసానికీ, ప్రతి పుస్తకానికీ, ప్రతి సంస్కృత గేయానికీ ప్రేరణ అననుగాని కారణం ఉంది. ప్రేరణ మానసిక భావజనిత ప్రోత్సాహం. కారణం వృత్తిరీత్యా ఆవశ్యకత. ప్రేరణ మానసికం మాత్రమే. తర్వాత ఇచ్ఛా సంకల్పాలు కలగాలి. కారణానికి తత్‌క్షణ కర్తవ్యోన్ముఖత తప్పదు.

నా సంస్కృత రచన: శృంగారమంటే ఏమీ తెలియని 13వ ఏట, కావ్యాల్లో చదువుకున్న శృంగారం ఆధారంగా సాగింది. దానికి ఉదాహరణగా ఇదివరకే మానవల్లి రామకృష్ణ కవిగారు చూసిన శ్లోకం తెలిపాను. ఆయన మందలింపువల్ల నా బుద్ధి దేశభక్తి గీతాలవైపు మళ్ళింది. వాటికీ ఉదాహరణ ఇదివరకే ఇచ్చాను. జెయిల్లో బ్రెయిన్ వాష్ కావడంవల్ల కమ్యూనిజం గంధంతో సుమతి శతకం అనే సంస్కృత శతకం వ్రాశాను. దానిలో పాత భావాలు కూడా లేక పోలేదు.

నేను ఆంధ్రప్రభలో పనిచేస్తున్నప్పుడు వివేకానంద పబ్లిషర్స్ యజమాని, కొసరాజు మాధవయ్యగారు అకస్మాత్తుగా నావద్దకు వచ్చి, కొన్ని వాచకాలు కావాలని అడిగారు. 'అయ్యా నేను ఆ రంగంలో లేను ఉపాధ్యాయులు వీడెవడో పత్రికల వాడు

మాకు పోటీగా వచ్చి, తక్కువకు వ్రాశాడు అనకుండా ఎంత ఇచ్చిన సరే' అన్నాను. ఆయన నాతో 1,2,3 వాచకాల పాఠాల సెట్లు రెండు వ్రాయించారు. నా మొదటి పాఠం సీతాఫలము, మరి రెండు కంపెనీలకు వాచకాలు వ్రాశాను. అప్పుడు మద్రాసులో ఆంధ్ర శేషగిరిరావుగారు దక్షిణాంధ్రులను గురించి కొన్ని పుస్తకాలు వ్రాశారు. ఆ ఒరవడిలో వీరగాథలు, దక్షిణాంధ్ర వీరులు అనే పుస్తకాలు వ్రాశాను.

హిందువుల పండుగలు – పర్వములు : ప్రతాపరెడ్డిగారు తెలుగు పండుగలను గురించి పుస్తకం వ్రాశారు. దానిలో లేని విషయాలు పరిశోధించి, పండితులు మెచ్చే పుస్తకం వ్రాయమని బాల సరస్వతీ బుక్ డిపోయజమాని బాల నాగయ్య శెట్టిగారు కోరారు. దాని ఫలితం పైన పేర్కొన్న పుస్తకం. దీనిని నేను ధర్మశాస్త్ర, జ్యోతిష, ఆయుర్వేద, మానవజాతి శాస్త్ర, సాంఘిక శాస్త్ర, భాషా శాస్త్రాల దృష్టితో శ్రద్ధగా వ్రాశాను. ఏటుకూరి బలరామమూర్తిగారు దీనిని విశాలాంధ్ర దినపత్రికలో ''పాత చాదస్తాలు తెలుసుకొనడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది'' అని ఒక పంక్తిలో సమీక్షించారు. కాని విశ్వనాథ, రాళ్లపల్లి, బూర్గుల వంటి పెద్దలు ఎంతగానో మెచ్చుకున్నారు.

మన లిపి పుట్టు పూర్వోత్తరాలు : విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజరు సుబ్బారావు బ్లాక్ ఆన్ వైట్ అనే చిన్న పిల్లల కోసం వ్రాసిన రష్యన్ లిపిని గురించిన ఒక చిన్న పుస్తకం పంపి తెలుగు లిపిని గురించి అలాంటి పుస్తకం, పెద్ద వాళ్లకు కూడా ఉపయోగపడేట్టుగా వ్రాయమన్నారు. నేను లైబ్రరీలు తిరిగి అపూర్వమైన ఫోటోలు, చిత్రాలు సేకరించి పైన పేర్కొన్న పుస్తకం వ్రాశాను. భారతీయ లిపులపై ఇలాంటి పుస్తకం వెలువడలేదు. విశాలాంధ్ర వారు దీనిని ప్రచురించారు. ఒక తరం తర్వాత కూడా ఇది మూడు ముద్రణలు పొందింది. ఈ పుస్తకం నాకు ఎనలేని కీర్తి సంపాదించి పెట్టింది. దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారు ఆవిష్కరించారు. దీనిని మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి, విశాలాంధ్ర ప్రజాశక్తికి అంకితమిచ్చాను. అంకితం ఇచ్చే ముందు మల్లంపల్లి వారికి దీనిని అక్షరక్షరమూ నెలపాటు చదివి వినిపించాను. దీనివల్ల నాకు కలిగిన కీర్తి శ్రేయస్సంతా విశాలాంధ్రదే.

నుడి – నానుడి : నేను మద్రాసు కన్నెమరా లైబ్రరీలో వాట్స్ డిక్షనరీ ఆఫ్ కమర్షియల్ ప్రోడక్ట్స్ ఆఫ్ ఇండియా, బర్మా అండ్ సిలన్ అనే పుస్తకం చూచాను. దానిలో ప్రతి పదం పుట్టుపూర్వాలు అద్భుతంగా ప్రామాణికంగా చర్చితాలు. అలాటిది తెలుగులో ఉంటే మేలనిపించింది. అప్పటికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు తెలుగు ఎటిమలాజికల్ డిక్షనరీకి పూనుకోలేదు. తర్వాత దాని కొన్ని భాగాలు వెలువడినా వాట్స్ డిక్షనరీ లాగలేవు. తర్వాత ''హెడ్జ్‌హాగ్ అండ్ అదర్ సేయింగ్స్'' అనే పుస్తకం ప్రతి నానుడికీ బొమ్మలున్నది చూచాను. ఈ లోగా ఆంధ్రప్రభలో సచిత్రవార పత్రిక ప్రారంభమయింది. దానిలో ఒక పదం చర్చ ఒక పుటకు మించకుండా చేయండని నార్లగారు ఆదేశించారు. నుడి-నానుడి శీర్షికతో పదాల, సామెతల, నుడికారాల చర్చ సంవత్సరంపాటు చేశాను. అదే పుస్తక రూపంలో విశాలాంధ్ర ప్రచురణగా తర్వాత వచ్చింది. ఐదు ముద్రణలు పొందింది. దీనిని అప్పటి విశాలాంధ్ర ప్రముఖులు జి. రాధాకృష్ణమూర్తి చాలా ప్రోత్సహించారు.

సాహితీ సుగతుని స్వగతం : నేను భారతి మాసపత్రికలో పని చేస్తున్నప్పుడు, శంభుప్రసాద్‌గారు ఏవో సందేహాలు తెలుపుతూ, వ్యాసం వ్రాయమనేవారు. ఈ లోగా చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి 'బుద్ధ చరితం' లాంటి వచనంలో సుగతుని స్వగతం అనే శీర్షిక భారతిలో ప్రారంభించి మౌలిక వ్యాసాలెన్నో వ్రాశాను. ''సుగతుడంటే బుద్ధుడుగదా! మీరు సాహిత్య బుద్ధులా? '' అని ఒకమారు మిత్రులు మల్లంపల్లి శరభయ్య శర్మగారు ప్రశ్నించారు. ''బుద్ధుణ్నికాను. సుగతుణ్ని చదివాను. దానికి సాహితి తగిలించి సాహితీ సుగతుని స్వగతం అని శీర్షిక పెట్టారు. మంచిమార్గంలో పోయేవాడిని' అని సంజాయిషీ చెప్పుకున్నాను. ఈ వ్యాసాలను మరి కొన్నిటిని కలిపి అదే పేరుతో విశాలాంధ్రవారు ప్రచురించారు. దీనికి రాష్ట్ర సాహిత్య అకాడమీ ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం 1970లో ఇచ్చింది.

తెలుగు వెలుగులు : నేను ఆంధ్రపత్రికలో ఉన్నప్పుడు నా ప్రోత్సాహంతో సచిత్ర వారపత్రికలో తెలుగు వెలుగులు శీర్షిక ప్రారంభమయింది. ఈ శీర్షికలో వివిధ రంగాల

తెలుగు ప్రముఖులను గురించి నేను సగానికిపైగా వ్రాశాను. శంభు ప్రసాద్‌గారు పావు భాగం వ్రాశారు. తక్కినవి పలువురు వ్రాశారు. ఇవన్నీ సంపుటంగా ముద్రణ పొందాయిగాని, ప్రచురణ కాలేదు.

కాటమరాజు కథ : నేను 'పరిశోధన' అనే సార్థక నామధేయమైన పత్రికను కొన్నేళ్ళు నడిపాను. దానికి డబ్బు అవసరమైనప్పుడు కొన్ని చిన్న చిన్న పుస్తకాలు 150-200 పుటలవి వ్రాశాను. అలాటి వాటిలో ఒకటి కాటమరాజు కథలు. ఇది కరిఆవుల కామరాజు కథ. ప్రాచ్యలిఖిత పుస్తకాలయంలోని పెక్కు వ్రాత ప్రతులు చూసి ప్రామాణికంగా వ్రాసిన పుస్తకం.

గాథాసప్తశతిలో తెలుగు పదాలు : మల్లంపల్లి సోమశేఖర శర్మగారు మొదలు పలువురు చరిత్రకారులు గాథా సప్తశతిలో తెలుగు పదాలున్నాయి అని అనడమే కాని, వ్రాయలేదు. మద్రాసు విశ్వవిద్యాలయం కన్నడం ప్రొఫెసర్ (శ్రీ) మరియప్ప భట్‌గార్ ''సమ్ కన్నడ వర్డ్‌స్ ఇన్ హాలసప్తశతి'' అనే వ్యాసం వ్రాశారు. నాల్గైదు పదాలు చూపారు. నేను దానికి సమాధానంగా 1947 ఆగస్టులో కాబోలు భారతిలో పై పేరుతో వ్యాసం వ్రాశాను. చరిత్రకారులు, భాషావేత్తలు మెచ్చుకొన్నారు.

ముక్త్యాల రాజాగారు ప్రచురించిన బుద్ధ జయంతి సంచికలో ''గాథా సప్తశతిలోని గ్రామజీవన సౌందర్యం'' అనే వ్యాసం కథలాగ వ్రాశాను. వీటిని నాట్యకళలో గాథా సప్తశతిలోని విశేషాలపై వ్రాసిన వ్యాసాలను కలిపి పైపేరుతో నేను ''ప్రాకృత అకాడమీ '' ప్రచురణగా ముద్రించాను. దీనికి రాష్ట్ర సాహిత్య అకాడమీ సాహిత్య విమర్శ పురస్కారం 1980లో లభించింది. ఇది పండితలోకంలోను, చారిత్రకలోకంలోను నాకు మంచిపేరు తెచ్చింది. నేను చిన్ననాడు నేర్చుకొన్న పాకృతాన్ని అధ్యయనం చేయడానికి అవకాశమిచ్చింది.

నూరేళ్ల తెలుగు వ్యాసం : వ్యాసం మనకు ఆంగ్ల సాహిత్య సంబంధంతో వచ్చిన కొత్త సాహిత్య ప్రక్రియ. నేను కోరగా కోరగా రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి దేవులపల్లి

రామానుజరావుగారు వ్యాసంపై సభ పెట్టించారు. నేను, కొలకలూరి ఇనాక్‌గారు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు కలిసి ఈ పుస్తకం వ్రాశాము. రాష్ట్ర సాహిత్య అకాడమీ దీనిని ప్రచురించింది. నాకు తెలిసినంతవరకు విషయవైవిధ్యంతో తెలుగులో ఉన్నంత వ్యాస సాహిత్యం భారత దేశంలో ఏ భాషలోనూ లేదు.

మూడు వాఙ్మయ శిఖరాలు : మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకర శాస్త్రి, నిడుదవోలు వెంకటరావు గార్లు ప్రాచీన గ్రంథ పరిష్కరణ విషయంలో సమాన ధర్మంగలవారు. నేను వీరు ముగ్గురికీ సన్నిహితంగా మెలగి, వారి స్వభావం, పరిశోధన పద్ధతులను ఎరిగిన వాడిని కనుక పరామర్శిస్తూ వ్రాసిన పుస్తకమిది. వారితో నాకుగల సన్నిహితత్వం అలాంటిది.

ప్రాకృత సాహిత్యంలో రామకథ : సత్యసాయి బాబాగారు 1975లో తమ బెంగుళూరు కేంద్రం వైట్‌ఫీల్డు ఆశ్రమంలో రామాయణ సదస్సు ఏర్పాటు చేశారు. దానికి దేశ విదేశాల నుంచి వివిధ భాషల విద్వాంసులు తమ తమ ప్రాంత రామాయణ కథలను గురించి పరిశోధన వ్యాసాలు చదివారు. నన్ను ప్రాకృత సాహిత్యంలో రామకథను గురించి ప్రసంగించమన్నారు. నేను తెలుగులో వ్యాసం వ్రాసి, ఆంగ్లానువాదం పంపాను. దీనివల్ల జైనబౌద్ధాది రామాయణాలు అధ్యయం చేయడం సంభవించింది.

నేను జైన బౌద్ధరామాయణాలు వాల్మీకికి ముందువని నమ్మను. వాల్మీకి రామాయణాన్నే వారు మార్పులతో చేర్పులతో తమకు అనుకూలంగా మలచుకొన్నారని నమ్ముతున్నాను. దానికి తగిన సాహిత్యాధారాలతో ఆ వ్యాసం వ్రాశాను.

ఆ వ్యాసం భారతిలో వరుసగా ప్రచరితమైంది. దానిని, ప్రాకృతంపైన, బౌద్ధ జైనాలపైన వ్రాసిన వ్యాసాలను కలిపి ప్రాకృత సాహిత్యంలో రామకథ అనే పేర ప్రచురించాను. ఇది మంచి పరిశోధన వ్యాస సంకలనమని నా విశ్వాసం.

మనవి మాటలు : నేను భారతిలో ఉన్నప్పుడు మనవి మాటలు అనే పేరుతో సంపాదకీయం వంటి వ్యాసాలు వ్రాశాను. వంద పుటల ఆ పత్రికలో దాదాపు 40 శాతం వ్యాసాలు మూరు పేర్లతో నా రచనలుండేవి. నాకు దాదాపు 12 మూరు పేర్లున్నాయి. ఇన్ని మూరు పేర్లుగల రచయిత తెలుగునాడులో బహుశా భారతదేశంలోనే లేడేమో! మూరు పేరుతో వ్యంగ్య రచనలు కూడా వ్రాశాను. ఈ ఘాటు ఎదుటి వారి నసాళానికి అంటేట్టు మనవి మాటల వ్యాసాలు, మరికొన్ని కలిపి ఆ పేరుతోనే ప్రచురించాను.

బృహదారణ్యకం : ఇది ఉపనిషత్తుకు సంబంధించింది కాదు. చీకిరి బాకిరిగా అడవిలాగ ఉన్న రకరకాల వ్యాసాలు కలిపిన సంకలనం. నా వ్యాసాలు కొన్ని విషయ నివేదన పరమైనవైనా ఏదో రూపంలో వాటిలో మౌలికత ఉండనే ఉంటుంది.

మరపురాని మనీషి : పలువురు ప్రముఖులను ఫోటోగ్రాఫర్ నీలంరాజు మురళీధర్ గారితో కలిసి చూచి వారిని ఇంటర్వ్యూ చేసి సరికొత్త పద్ధతిలో వ్రాసిన వ్యాసాల సంకలనమిది. నేను ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికలో ఉన్నప్పుడు ఈ శీర్షిక నిర్వహించాను. ఈ శీర్షిక తెలుగు వెలుగులు శీర్షికకన్నా ప్రజాదరణ పొందింది. ఈ వారం ఎవరు, ఈ వారం ఎవరు అనే ఉత్కంఠ ప్రజల్లో కలిగించింది. దీని వల్లానూ నాకు మంచి పేరు వచ్చింది. దీనిని మిత్రుడు కప్పగంతుల లక్ష్మణశాస్త్రికి అంకితమిచ్చాను.

అహంభో అభివాదయే : నేను ప్రత్యేకంగా పెద్దల ఇండ్లకు వెళ్లి కలుసుకొని వ్రాసిన వ్యాసాలు. నేను వృత్తి ధర్మంగా కలుసుకున్న వివిధ రంగాల ప్రముఖలపై వ్రాసిన వ్యాసాలను పై శీర్షిక కింద పుస్తక రూపంలో ప్రచురించాను. దీనిలో నేను కలుకుకొన్న షేక్ చిన మౌలా సాహెబ్ వంటి నాదస్వర విద్వాంసులు, టెంజింగ్ నార్కే వంటి వారు, దేవీ ప్రసాద్ రాయ్ చౌధురీ వంటి మహా శిల్పులు, కామరాజ్ నాడార్, అణ్ణాదురై, కామరాజ్‌నాడార్‌ను ఎన్నికలలో ఓడించిన శ్రీనివాసన్ వంటి రాజకీయ నాయకులు ఉన్నారు. సామాన్యులకు ప్రతినిధులైన సరోజినీదేవి ఆస్పత్రి నర్స్ దేవదీవనగారి వంటివారు ఉన్నారు. ఈ గ్రంథం నాకు చాల ఇష్టమైంది.

తెలుగు పత్రికల సాహిత్య సేవ : చంద్రంగారు (మద్దుకూరు చంద్రశేఖ రావుగారు) త్యాగధనులైన పత్రికా సంపాదకులు. ఆయన ప్రత్యేకాహ్వానంపై సాహిత్య పత్రికలను గురించి ప్రత్యేక వ్యాసం చదివాను. అది యథాతథంగా విశాలాంధ్రలో ప్రచురితమైంది. దాన్ని మరికొన్ని విషయాలు చేర్చి పెంచాను. ఈ పరివర్ధిత పుస్తకాన్ని విశాలాంధ్ర వారు ప్రచురించారు. ఇది కొంత ఉపయోగపడుతుంది. చంద్రంగారి స్మారక సభలో ఇలాంటి అవకాశం కలిగించి నందుకు విశాలాంధ్రవారికి కృతజ్ఞత చెప్పుకోవాలి.

హాలుని గాథలు : గాథాసప్తశతిలోని ప్రతి గాథా ఏదో సందర్భంతో చెప్పినట్టిది. ఒక్కొక్క దానికీ ఒక కథ వ్రాయవచ్చు. నేను కొన్ని గాథలను కలిపి కథలుగా అల్లి పల్లకి వారపత్రికలో సంవత్సరంపాటు ప్రచురించాను. వాటిని ప్రాచీ పబ్లికేషన్స్ (శ్రీ) జోషిగారు పుస్తక రూపంలో ప్రచురించారు. ఎడమవైపు బొమ్మ కుడివైపు కథతో ఇది చాలా ఆకర్షణీయంగా ఉంది. నేను చేసినదల్లా వర్ణనలను యథాయథంగా అనువదిస్తూ కథ పేనడమే. జానపద సాహిత్యానికి ఒజ్జ బంతి అయి, కాళిదాసాదులకు కూడా గ్రాహ్యమైన గాథాసప్తశతి సౌందర్యం చదివి అనుభవించ వలసిందే.

లాల్‌బహదూర్ శాస్త్రి : లిటిల్‌నెహ్రూ అని విఖ్యాతుడైన ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మహావీరుడు. అతడు మరికొంతకాలం ఉండి ఉంటే దేశగతి ఎంతగానో మారి ఉండేదని నా విశ్వాసం. ఆయన జీవిత చరిత్రనూ పిల్లలకూ, పెద్దలకూ ఉపయోగించేట్టుగా వ్రాశాను.

బుద్ధుణ్ని బడిలో వేసిన కథ : పిల్లల కోసము కొన్ని కథలూ, చిన్న చిన్న సంఘటనల లేఖన చిత్రాలూ వ్రాశాను. ఆంధ్రప్రభ ముప్ఫై ఏండ్ల క్రితం ప్రచురించిన బాలల ప్రత్యేక సంచికలో పలు పేర్లతో కథలు వ్రాశాను. వాటిలో కొన్ని ''బుద్ధుణ్ణి బడిలో వేసిన కథ'' అనే పేరుతో ప్రచురించాను.

దీనిలోని బుద్ధుణ్ని బడిలో వేసిన కథకు ఆధారం మహాయాన సంప్రదాయపు లలిత విస్తరం. దానిలో బుద్ధుడు అక్షర శాలను దర్శించిన ప్రకరణం

భాగాలు అనువదించుకొన్నాను. 'పెద్దన తాతయ్య' అనే కథ పెద్దనకు గండపెండేరం కృష్ణరాయలు తొడగడాన్ని ఆయన కుమార్తె స్వయంగా చూచి చెప్పినట్లు వ్రాశాను.

నేను వ్రాసిన వ్యాసాలు 99 పాళ్లు మౌలికమైన నూతనాంశాలు తెలిపేవే. నా లక్ష్యం సామాన్య మానవునికి విషయ బోధనం కనుక పాండిత్య ప్రకర్షమానుకొని సూటి అయిన సరళ స్పష్టశైలిని అనుసరించాను. విద్యార్థి దశలో నాకు సంస్కృతంలో స్పెషలిస్టని పేరు. మరి రెండు మూడు సెట్ల వాచకాలు, చిన్న చిన్న పుస్తకాలు చాలా వ్రాశాను. అవసర నైవేద్యాలుగా ఎన్నో వందల వ్యాసాలు, సమీక్షలు, పీఠికలూ పుస్తక రూపంగా రావాలి.

అనువాదాలు : నేను అనువాదాలను చిన్న చూపుతో చూడను. అనువాదమే లేకపోతే ప్రపంచ సాహిత్యమే లేదు. విశ్వవిఖ్యాతమైన ఆంగ్ల సాహిత్యం సగం అనువాదమే. అనువాదం లేకపోతే భారత పత్రికారచనే లేదు. నేటికీ ఇది అనువాద ప్రాయమే. అనువాదం డాక్టర్ కేస్కర్ అన్నట్లు అనుసృష్టి. ట్రాన్స్‌క్రియేషన్. ప్రతి భాషలోను గొప్ప సాహిత్యం కొంత అనువాదమే.

నేను నాకు సంతృప్తికరమైన అనువాదాలు చాలే చేశాను. సంస్కృతం నుంచి ప్రాకృతం నుంచి, కన్నడం నుంచి, తమిళం నుంచి, హిందీ నుంచి. ఇంగ్లీషు నుంచి సరే ఎన్నో. నా అనువాదాలన్నీ నేను ముఖ్యమనుకొన్నవి, ఇతరులు ముఖ్యమను కొన్నవి.

లలిత విస్తరం : ఇది మహాయాన బౌద్ధ సంప్రదాయానుసారమైన బుద్ధుని జీవిత చరిత్ర. ఇది క్రీస్తుకు మూడు శతాబ్దాలనాడు రచితమైంది. కర్త తెలియదు. ఒక సంఘం ఏర్పడి రచించి ఉంటుంది. ఇది నా దృష్టిలో భారత దేశంలోని మొట్టమొదటి లౌకిక వచనం. వేదంలోను, ఉపనిషత్తుల్లోను వచనాలు ఉన్నాయి. పురాణాల లోను ఉన్నాయి. అందువల్లనే లౌకిక వచనంలో మొట్టమొదటి దన్నాను. బుద్ధుని గురించిన కొన్ని అతిమానుషమైన అతిశయోక్తులున్నా, ఇది అప్పటి విషయాలకొక గొప్ప భాండారం.

నేను, ప్రముఖ విద్వాంసుడు బులుసు రమణయ్య కలిసి లలిత విస్తరాన్ని యథామూలంగా అనువదించాము. జటిలంగా ఉన్నవి సాధ్యమైనంత వరకు వివరించాము. ఈ అనువాదం వల్ల బౌద్ధుల విచిత్ర సంస్కృతి, చాదస్తాలు కూడా బాగా తెలిశాయి. క్షేమేంద్రుని అవధాన కల్పలత మరొక మంచి అనువాదం.

క్షేమేంద్రుని బృహత్కథామంజరి : క్షేమేంద్రుడు కథా సరిత్సాగర కర్త సోమదేవసూరికి వరిష్ఠ సమకాలీనుడు. దీనిని అనువదించి ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రికలో దాదాపు నాలుగేళ్లు వరుసగా ప్రచురించాను. ఇది కూడ చాలా జనాదరం పొందింది. కొంత పుస్తక రూపంలో వచ్చింది కాని, ధనాభావం వల్ల ఆపివేశాను.

హరమేఖల : శాస్త్ర గ్రంధం. ప్రాకృతంలో బౌద్ధ జైన తత్త్వగ్రంథాలు, ధర్మగ్రంథాలు, మతాతీత గాథా సప్తశతి వంటి కావ్యాలు కాక వైద్యక గ్రంథాలు ఉండేవనడనికి ఈ హరమేఖల సాక్షి. దీనిని సుప్రసిద్ధ ఆయుర్వేద మహోపాధ్యాయులు డాక్టర్ వేటూరి శంకర శాస్త్రిగారి ప్రోత్సాహంతో అనువదించాను. దీనిలో నేటికీ ఉపయోగపడే పెక్కు ప్రయోగాలు చేసి పరిశీలించండని పలువులు వైద్యులను, పలు ఔషధ సంస్థలను కోరాను.

లీలావయీ : ఇది 6వ శతాబ్దపు ప్రాకృత కావ్యం. సప్తగోదావరి, తెలుగు ప్రాంతాలతో సంబంధం గలది. దీనిని నేను కొన్ని దశాబ్దాల క్రితమే తోచినట్లు అనువదించాను. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ సచిత్ర మాస పత్రికలో ధారావాహికంగా వెలువడుతోంది. దీని అనువాదానికి కారణం కేవలం ప్రాకృతాభిమానమే. ఇది సాతవాహన సింహళ రాజకుమారి పరిణయ గాధ. కాని, ప్రాకృత కావ్యాలలో ప్రజాజీవితం వర్ణితమైనంతగా ప్రాచీన ప్రాకృతేతర భాషా కావ్యాలలో కనిపించదు. ప్రాకృత కావ్యాలు ఎన్నో అనువాదం కావాలి.

కన్నడం నుంచి పన్నెండు నవలలు, కథా సంకలనాలు, వ్యాస సంకలనాలు అనువదించాను. కన్నడం నా ప్రాంతీయ భాష. సాహిత్యం కూడా చదివాను.

కన్నడంలో ఒక గొప్పతనం ఉంది. మత భేదం ఉన్నా, వాళ్లు ప్రాచీన సాహిత్యాన్ని రక్షించుకొన్నారు.

కన్నడంలో శ్రీ కె.వి. అయ్యర్ రచించిన శాంతల అనే నవలను అనువదించాను. ఈ రచయితను గురించి ఒక చిత్రం ఉంది. ఇతడు చిన్నప్పుడు ఏమీ చదువు సందెలు లేనివాడు. బలిష్ఠమైన శరీరం ఆయనది. హోటల్‌లో ఇడ్లీ పిండి, అట్ల పిండి రుబ్బడానికి కుదిరాడు. ఇతని అంగసౌష్ఠవాన్ని చూచి ఎవరో సలహా ఇచ్చారు వ్యాయామశాల పెట్టమని. వ్యాయామశాల పెట్టాడు. హఠయోగాసనాలు నేర్చుకొని శిక్షణ ఇచ్చాడు. అదృష్టం కలిసి వచ్చింది. పెద్దవాళ్లతో పరిచయమయింది. రచన అబ్బింది. గొప్ప రచయిత అయ్యాడు. యోగశిక్షణతో పాటు శివరామకారంత్, మరళిమణ్ణిగె నవలను మరల సేద్యానికి అని అనువదించాను. ఇవి మరికొన్ని, కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోసం చేశాను. కారంత్ మరొక రచన అలిదమేలె అనేదానిని మరణానంతరం అని అనువదించాను. ఇది నాకు చాలా ఇష్టమైన నవల. నాదృష్టిలో కారంత్ రచనలో ఉత్తమోత్తమైనది. మానవుడు మరణించిన తర్వాత మిగిలేది ఏమిటి? మానవుడు పరిసరాలలో ఎలా ప్రవర్తించాలి? అనేది ఈ నవల వస్తువు.

విశాలాంధ్ర వారి కోసం నిరంజన రచించిన చిరస్మరణ అనే నవలను అనువదించాను. ఇది విశాలాంధ్ర దినపత్రికలో ధారావాహికంగా మొదలు వెలువడి, తర్వాత పుస్తక రూపంలో వచ్చింది. దీనిని అనువదిస్తున్నప్పుడు నా సత్యాగ్రహ జీవితం, జెయిలులో ఒకరిని ఉరి తీసినపుడు మేము పడిన బాధ, ఆ ఉరి తీసే ఉపకరణాలను చూచి దిగ్భ్రాంతులు కావడం జ్ఞాపకం వచ్చాయి. మనం ఏనాటికైనా ఏవిధంగానైనా ఇవ్వలేనిది జీవితం. దానిని అపహరించే హక్కు మనకు లేదు. ఎంత అపరాధి అయినా, ఎప్పటికయినా పశ్చాత్తప్తుడై బాగుపడవచ్చు. కనుక మరణశిక్ష అవసరం లేదని నా విశ్వాసం.

నేను తిరుచినాపల్లి జైలులో ఉన్నప్పుడు హనుమంతరెడ్డి అనే బళ్లారి యువకుడు మామూలు ఖైదీగా ఉండేవాడు. అతనికి అప్పటికి 35 సంవత్సరాల

వయస్సు). తన భార్యను అనుమానించి, అనుమానమున్న యువకుని క్షణికోద్రేకంలో పొడిచి చంపాడు. యావజ్జీవ కారాగారవాస శిక్ష 20 ఏళ్లు పడి అండమానుకు వెళ్లి, సత్ప్రవర్తన ఋజువు చేసుకొని భారతదేశ కారాగారాలకు బదిలీ అయి తిరుచినాపల్లిలో ఉన్నాడు. అతడు ఋషివంటివాడు. తెల్లవారుజామున స్నానంచేసి భగవద్గీత పారాయణం చేసేవాడు. జెయిలు వాసంతో విద్యావంతుడయ్యాడు. అలాంటివాడు హత్య ఎలా చేశాడా? అనిపిస్తుంది. కనుక మానవుడు పశ్చాత్తాపంతో సత్ప్రవర్తన కలవాడుకాగల అవకాశం ఎప్పుడూ ఉంది. ''స్వామీ? ఏం కావాలో అడుగు, ఏం కావలిస్తే అది తెచ్చిస్తాను. సత్యాగ్రహులలో చాలా మంది బీడీల కోసం, మజ్జిగ కోసం, నానా బాధా పడుతుంటారు. నీకా బాధ వద్దు'' అనే వాడు. ''నేను కష్టపడడానికే వచ్చాను. జెయిలు నిబంధనల ప్రకారం నడుచుకుంటాను'' అనే వాడిని. ''నిజమైన సత్యాగ్రహి నీవొక్కడివే స్వామీ!'' అని ప్రశంసించేవాడు.

ఇలాటి వాస్తవికతతో ఉన్న చిరస్మరణ గొప్ప నవల. దానిని నాతో అనువదింప జేసినందుకు విశాలాంధ్ర వారికి సర్వదా కృతజ్ఞుణ్ణి.

సుశీలా నయ్యర్ వ్రాసిన 'గాంధీజీకే కారావాస్ కే కహానీ' అనే గ్రంధాన్ని గాంధీజీ కారాగారగథ అనే పేరుతో అనువదించి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించాను. గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం కాలంలో ఆగాఖాన్ మందిరంలో నిర్బంధింపబడినప్పుడు మహాదేవదేశాయి మరణం, ఆయనను బతికించుకొనడానికి గాంధీజీ, కస్తూర్బా చేసిన ప్రయత్నం గాంధీజీ ఇతర కార్యకలాపాలు డైరీలాగా యథాతథంగా వర్ణించిన గ్రంథమిది.

ఆంగ్లం నుంచి దాదాపు ముప్పై పుస్తకాలు అనువదించి ఉంటాను. కొన్ని సోవియట్ భూమివారికి, కొన్ని అమెరికన్ కాన్సలేట్‌కు, కొన్ని హరేకృష్ణ వారికి ఇలా ఎన్నో. వీటిలో నాకు ఇష్టమైంది 'గాంధీజీస్ ఎమిస్సరీ' దీని రచయిత డాక్టర్ సుధీర్ ఘోష్. శంభుప్రసాద్‌గారు దీనిని అనువదించమన్నారు. సుధీర్ ఘోష్ గొప్ప మేధావి. స్వాతంత్ర్యానంతరం లండనులో తొలి భారత హైకమిషనర్ కావలసినవాడు. అమెరికా

నౌకాదళాన్ని చైనావైపు తరలించేట్టు చేయడంలో సుధీర్‌ఘోష్ అద్భుతపాత్ర, ప్రపంచ సంగ్రామం చెలరేగుతుందనే శంకతో చైనా వెను తగ్గడం మనోరంజకమైన వాస్తవాలు. ఆంధ్రపత్రికలో ప్రచురితం.

శంభుప్రసాద్‌గారి సూచనతోనే కమలనయున బజాజ్ రచించిన ''ఫ్రాంటియర్ గాంధీ ఇన్ కాబూల్'' అనేదాన్ని ''కాబూల్‌లో సరిహద్దు గాంధీ'' అనే పేర అనువదించి ఆంధ్ర పత్రికలో ప్రచురించాను.

పైరెండు పుస్తకాలు తెలుగు వెలుగులు కూడా పుస్తక రూపం దాల్చాయి. ఏవో ఆవాంతరాల వల్ల వెలువడలేదు.

హరేకృష్ణ వారి కోసం ఆంగ్లంలో అనువదించిన పది పన్నెండు పుస్తకాలలో కృష్ణా ది గాడ్ హెడ్ పెద్దది. వేయి పుటలది. దీనిని ''దేవాది దేవుడు శ్రీకృష్ణుడు'' అని అనువదించాను. ఇది భాగవతం దశమస్కంధానికి భక్తి వేదాంత ప్రభుపాదుల వ్యాఖ్యారూప అనువాదం.

కొన్ని వందల ఆంగ్ల వ్యాసాలు అనువదించాను పత్రికల కోసం. అవన్నీ పేరు లేకే ప్రచురితమయ్యాయి.

త్రి భాషా నిఘంటువు : రాష్ట్ర సాహిత్య అకాడమీ వారు తెలుగు - కన్నడ - తమిళ నిఘంటువు సిద్ధ పరచాలని, చాలా ఉపయోగపడుతుందని నేను అకాడమీ పరిశోధన సంఘం సభ్యుడుగా ప్రతిపాదించాను. అకాడమీవారు వేదం వెంకటరాయ శాస్త్రిగారు కన్వీనరుగా నేను, డాక్టర్ చల్లా రాధాకృష్ణ శర్మగారు సహాయకులుగా ఒక సంఘం నియమించారు. ఈ సంఘమే తర్వాత సంపాదక మండలి అయి త్రిభాషా నిఘంటువు నిర్మించింది.

లలిత కళాపదకోశం : నా చిత్రకార మిత్రులు పలువురు తాము లలితకళలపై వ్రాయదలచుకుంటే తగిన పదజాలం దొరకడం లేదని, ఒక లలిత కళా నిఘంటువు కావాలని కోరగా, నేను డాక్టర్ పి.టి. రెడ్డిగారు లలితకళా అకాడమీ కార్యదర్శిగా

ఉన్నప్పుడు కోశ నిర్మాణ ప్రతిపాదన చేశాను. అది ఆమోదం పొందింది. నేను చీమకుర్తి శేషగిరి రావు, వజ్ఝ్ఝుల శ్రీనివాస శర్మ ముగ్గురం ఆంగ్లంలో వెలువడిన లలితకళా నిఘంటువులు ఆధారంగా ఆంగ్లాంధ్ర నిఘంటు భాగం, ఆంధ్రాంగ్ల నిఘంటు భాగం సిద్ధ పరచాము. దీనిని లలిత కళా అకాడమీ ముద్రణ చేయడం ప్రారంభించింది. ఈలోగా అకాడమీలు తెలుగు విశ్వ విద్యాలయంలో లీనమయ్యాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఆంగ్లాంధ్ర భాగాన్ని మాత్రం ముద్రించింది. ఆంధ్రాంగ్ల భాగం ముద్రణ కావాలి. మేము నిర్దిష్టమైన పద్ధతిని అనుసరించి లలితకళా పదాలు సిద్ధపరచాము. ఆ పద్ధతిని రేఖా మాత్రంగా పేర్కొనడం వల్ల మా పరిశ్రమ విదితమవుతుంది.

ఇతరులతో పాటు నేను సంపాదకుడుగా ప్రచురించిన ప్రత్యేక సంచికలు ప్రాచీన గ్రంథాలు, పత్రికలు చాలా ఉన్నాయి.

బాల సరస్వతి 16వ శతాబ్దంలో ఉన్న గొప్ప ఆంధ్ర వైయాకరణుడు. ఇతడు సుశ్రుత శారీరాన్ని 'శరీరం' అనే పేరుతో అనువదించాడు. నేను ఒకానొక చర్మరోగంతో ముక్తాలలో డాక్టర్ శంకరశాస్త్రిగారి వద్ద చికిత్స పొందుతున్నప్పుడు ఈ తాళపత్ర గ్రంధాన్ని నాకు ఆయన చూపారు. నేను దాన్ని సుశ్రుత శారీరంతో సరిచూచి సంస్కరించాను. అది ధన్వంతరి పత్రికలో ధారా వాహికగా ప్రచురితమైంది. పుస్తక రూపంగాను వచ్చింది.

తెలుగు విజ్ఞాన సర్వస్వం లలితా కళా సంపుటాన్ని కూడా నేను కొంత సంకలనం చేశాను. రాష్ట్ర ప్రభుత్వం ప్రాచీన లిఖిత పుస్తకాలయంవారి కోసం 'అనుభవవైద్యం' అనే గ్రంథాన్ని 'భార్గవ పురాణం' అనే కావ్యాన్ని పరిష్కరించి విపులతర పీఠికలు వ్రాశాను.

ప్రపంచ తెలుగు మహాసభలు రెండూ ప్రచురించిన 'తెలుగు వాణి' ప్రత్యేక సంచికల సంపాదక వర్గంలో ఉన్నాను. నిజానికి పనిచేసిన వాళ్ళం నేను గోవిందరాజు రామకృష్ణారావుగారు. గౌరవానికి చాలా పేర్లు చేరాయి.

ఆంధ్రప్రదేశ్ బాలల మహాసభ ప్రత్యేక సంచిన సంపాదక వర్గం అధ్యక్షుణ్ణి బాలల అకాడమీ ప్రచురించిన 'బాల చంద్రికా' పత్రికకు సంపాదకుడుని. 'ఆరాధన' పత్రకకు గౌరవ సంపాదకుడిని. కోరాడ రామకృష్ణయ్య ప్రత్యేక సంచిక సంపాదక వర్గం సభ్యుడిని.

ఆల్ ఇండియా ఓరియంటల్ కాన్ఫరెన్స్, ఆంధ్ర ఓరియంటల్ కాన్ఫరెన్స్, హిస్టరీ కాంగ్రెస్‌లలో పలుమార్లు పరిశోధన పత్రాలు సమర్పించాను. తెలుగుదేశంలోని విశ్వవిద్యాలయాలలో ఏర్పాటయిన పెక్కు సదస్సులలో పరిశోధన పత్రాలు చదివాను.

దాదాపు ముప్ఫై సంస్థలలో సభ్యుడుగానో, సలహాదారుగానో, కార్యదర్శిగానో ఉన్నాను. ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి మూడు నాలుగు.

రాష్ట్ర సాహిత్య అకాడమీ పరిశోధన మండలి సభ్యుడుగాను, సామాన్య సభ్యుడుగాను ఉండి కొన్ని మంచి పనులు చేయడానికి కారణమయ్యాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అధ్యక్షతన 1960లో నియమించిన లిపి సంస్కరణ సంఘంలో సభ్యుడుగా ఉండి కొన్ని సూచనలు చేశాను. 1970లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తెలుగు-కన్నడ లిపి ఏకీకరణ సంఘానికి కన్వీనర్‌గా ఉన్నాను. తెలుగు స్వరూప సౌందర్యాలకు భంగం కలుగని రీతిలో సంస్కరణ ఉండాలనే తీర్మానాన్ని ఆమోదింప జేశాను.

కర్నాటక గవర్నర్ వెంకట సుబ్బయ్యగారు 1990లో నియమించిన తెలుగు - కన్నడ కామన్ స్క్రిప్ట్ కమిటీలో సభ్యుణ్ణయి పెక్కు సూచనలు చేశాను. ఈ సంఘం సంవత్సరం పాటు నెల నెలా సమావేశాలు జరిపి తెలుగు-కన్నడ లిపుల సమ్మేళనంతో 'విజయ లిపి' అనే పేర నూతన లిపిని రూపొందించింది.

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ కార్యదర్శిగా ఉన్నాను. జ్ఞానపీఠ్ అవార్డ్ సంస్థకు మొదటి రెండు సంవత్సరాలు కంపేరిటివ్ అస్సెసర్‌గా ఉన్నాను.

కౌలాలంపూర్‌లో జరిగిన ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలో ఒక సమావేశానికి రివ్యూయర్‌గా ఉన్నాను.

ప్రాకృత అకాడమీని 1978లో స్థాపించి అధ్యక్షుడుగా ఉన్నాను. ఈ అకాడమీ పక్షాన పది పుస్తకాలు ప్రచురించాను. నన్ను ఆంధ్రప్రదేశ్‌లోని సంస్థలు దాదాపు యాభై సన్మానించాయి. కొన్నిటిని మాత్రం పేర్కొనడం ఉచితం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు రెండింటిలోను సన్మానించింది.

సత్యసాయి బాబాగారు 1978లో వైట్ ఫీల్డ్‌లో జరిగిన రామాయణ సదస్సులో రజత ఫలకంతో సన్మానించారు.

రాష్ట్ర సాహిత్య అకాడమీ 1970లో 'సాహితీ సుగతుని స్వగతానికి' 1980లో 'గాథా సప్తశతిలో తెలుగు పదాలకు' ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం ఇచ్చింది.

పశ్చిమ బంగనాగరీ ప్రచారిణీ సభవారు ఉదంత మార్తాండ అనే హిందీ పత్రిక 116వ జయంత్యుత్సవంలో 1976లో 'పత్రకార శిరోమణి' బిరుదు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 1988లో గౌరవ డి. లిట్. ప్రదానం చేసి సన్మానించింది. ఇది డా॥ సి. నారాయణరెడ్డిగారి సహృదయతగా భావిస్తున్నాను.

మద్రాసు రాజాలక్ష్మి ఫౌండేషన్ వారు 1989లో పదివేల రూపాయల సాహిత్య పురస్కారంతో గౌరవించారు.

గుంటూరు అభ్యుదయ రచయితల సంఘం 1991లో పులపుల శివయ్య అవార్డుతో సత్కరించింది.

రాష్ట్ర ప్రభుత్వం రెండుసార్లు ఉగాది ఉత్సవాలలోను, తెలుగు విశ్వవిద్యాలయం రెండుసార్లు పరిశోధనకుగాను సన్మానించాయి.

తెలుగు విశ్వవిద్యాలయం 1994 అక్టోబర్‌లో 50వేల రూపాయల విశిష్ట పురస్కారంతో సత్కరించింది.

తెలుగు విశ్వవిద్యాలయం నన్ను శిల్పవాస్తు శాఖ బి.ఏ., ఎం.ఏ., పిహెచ్.డి. పరీక్షలకు పరీక్షకునిగా రెండు మూడుసార్లు నియమించి గౌరవించింది.

తమిళనాడు ప్రభుత్వం 1993లో నన్ను స్వాతంత్ర్య సమర యోధునిగా సన్మానించింది.

పరిశోధన ద్విమాస పత్రిక : నేను ఆంధ్రప్రభలో పని చేస్తున్నప్పుడే, పైవారి అనుమతితో 'పరిశోధన' అనే ద్విమాస పత్రికను మిత్రులు డాక్టర్ తమ్మావఝ్ఝుల కోదండరామయ్యగారితో కలిసి నిర్వహించాను. దీనిలో కథలు, కవిత నిషేధించాను. ప్రకటనలు ఉండరాదని నిర్ణయించుకున్నాను. అసిధారావ్రతంగా నడిపాను మూడేళ్లపాటు. ప్రభాకర సంస్మరణ సంచిక, ఆంధ్రనాటక పితామహ సంచిక, సోమనాధ సంచిక, బుద్ధ సంచిక, మొదలయిన ప్రత్యేక సంచికలు వెలువరించాను.

భాషా సేవక సమితి : నేను కార్యదర్శిగా తిమ్మావఝ్ఝుల కోదండ రామయ్య గారు సహాయ కార్యదర్శిగా భాషాసేవా సమితి అనే సాహిత్య సంస్థను నిర్వహించాను. వివిధ రంగాల ప్రముఖులను పిలిపించి ఉపన్యాసాలు ఇప్పించి, వాటి సారాంశం ఆంధ్రప్రభలో ప్రచురింపజేశాను. బోయి భీమన్నగారి మధుబాల, బొమ్మకంటి సుబ్బారావుగారి 'ప్రపంచ క్రీడా సంగ్రహ చరిత్ర' మొదలైన పుస్తకాల ఆవిష్కరణోత్సవాలు జరిపించాను.

అఖిలభారత సంస్కృత విద్వత్పరిషత్తు, వారణాసిలో ''మహోపాధ్యాయ'' బిరుదుతో గౌరవించింది. ఈ బిరుదు ఇవ్వడంలో ఒక తమాషా జరిగింది. నేను నా మిత్రులు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, దవ్వూలపాటి శేషగిరిరావు గార్లతోపాటు కూర్చున్నాను. ఈ బిరుదు మాకు మరికొందరికీ ప్రకటించి యోగ్యతా పత్రాలిచ్చారు. 'నేను ఈ బిరుదానికి అర్హుణ్నికాను. పత్రికా రచయితను దానికి తగిన

బిరుదిస్తే పుచ్చుకుంటాను' అన్నాను. వారు నామాట తోసిరాజని పత్రికా రచయిత రచనల ద్వారా బోధిస్తాడు. మేము మాటలతో బోధిస్తాము. కనుక మీరు ఉపాధ్యాయులే అన్నారు వారు. కాని ఈ బిరుదు మహా పండితులకు యోగ్యమైంది. కనుక దానిని చెప్పుకోవడమే జంకు.

మొన్నటి 1995 జూన్ 17వ తేదీకి నాకు 82 ఏళ్ళు పూర్తయ్యాయి. ఇంకొక పదిహేను ఇరవై యేళ్లుంటే ప్రాకృతం నుంచి కొన్ని మంచి పుస్తకాలు అనువదిస్తాను. భాషా విషయకంగా ఒకటి రెండు మౌలిక గ్రంథాలు వ్రాస్తాను. 'భారతి' వంటి ప్రామాణిక సాహిత్య మాసపత్రికను సంపాదకుడుగా నడిపిస్తాను. మరి కొన్ని వ్యాస సంపుటాలు ప్రచురిస్తాను. కొత్త రచయితలను, పరిశోధకులను రూపొందిస్తాను. ఇది దురాశ కాదు.

ఇంతకు నేను చేసిందెంత? సముద్రంలో తేనె చుక్క. నా జీవితం ఏమిటి? తెగిన గాలిపటం!

రాంభట్ల కృష్ణమూర్తి

(2-1-1995)

నాది చిత్రమైన జీవితం. సాహిత్యంలో నాకు పరిచయం వుందో లేదో నాకు తెలియదు కానీ సాహిత్యం నా ప్రధాన అంశం కాదు. అసలు ఏదీ కూడా ప్రధానాంశం కాదు. నేను మూడు విభిన్నమైన సిలబస్సులతో మూడు ప్రాంతాల్లో మూడోక్లాసు మూడుసార్లు చదివాను. నేను పుట్టింది గోదావరిజిల్లా, నాకు మూడేళ్ళు నిండకముందే విశాఖ జిల్లాకి రవాణా అయ్యాను. అక్కడ అయిదారు సంవత్సరాలు మాట, ఆట లేకుండా ఏకాంతవాసం గడిపాను. ఆ తర్వాత గజపతి నగరంలోని మావాళ్ళు ఇంగ్లీషు చదువుకోసం పట్నం పంపించారు. అక్కడ మూడో క్లాసు చదివాను.

అది చదివి అక్కడ వుండడానికి వీలులేక వెంటనే రవాణాకూ వీల్లేనందుకు అక్కడ మళ్ళీ మూడోక్లాసు చదివాను.

కారణమేమిటంటే తెలంగాణాలో, అదే నైజాంరాజ్యంలో, అప్పుడు మూడో క్లాసుదాకానే తెలుగు మీడియంతో వున్నట్టుంది.

తెలుగు పాఠాలతో పాటే అలీఫ్ బేలుకూడా నేర్పుతారు. నాలుగో క్లాసునుండి ఉర్దూ మీడియం నడుస్తుంది. ఆనాటి పరిస్థితి అది. అందుకని మళ్ళీ మూడోక్లాసులో చేరి అలిఫ్ బేలు నేర్చుకున్నాను. నేర్చుకున్న తర్వాత నాలుగో క్లాసులో ఎలాగూ అక్కడ చేరడానికి అవకాశం లేదు. ఈలోగా హైదరాబాదు రవాణా అయ్యాను. ఇక్కడ మళ్ళీ మూడోక్లాసు ఉర్దూ మీడియంలో చేరాల్సొచ్చింది.

మా యింట్లో మూడు తరాల నుంచి పాండిత్యంలేదని మాతాతద్వారా తెలిసింది. ఆయనకు పోతన గారి పద్యాలు తప్ప ఇంకేమీ తెలియదు. నాలిక మడత పెట్టి హుంకరించి తన్నడం చేతనవును. మాగ్రామానికి కరణం ఆయనే, మునసబు ఆయనే.

ఆయన దగ్గరే వేదం బట్టీ పట్టినట్లుగా గజేంద్రమోక్షం, రుక్మిణీ కళ్యాణం వామనావతారం పద్యాలు బట్టీ పట్టాం. అక్షరాలు తాటాకు మీద గంటంతో రాస్తూ నేర్చుకున్నాను. దీన్నిబట్టి నేను ఎంత బడుగు ప్రదేశంలో ప్రాచీన ప్రదేశంలో బతికానో, నా జీవితం ఎలా ప్రారంభమయిందో అర్థం అవుతుంది. ఆయనకు సంస్కృత శ్లోకాలు కూడ ఎక్కువ వచ్చేవి కావు. ఏవో తెలుగు పద్యాలు వచ్చును. నేను గజపతి నగరంలో వున్నప్పుడు మూడవ క్లాసులో కృష్ణశతకం, దాశరథి శకతం, నరసింహ శతకం యీ మూడు శతకాలు వుండేవి. రోజుకు 3 పద్యాలు అప్పచెప్పేవాళ్లం. హైదరాబాదు చేరిన తర్వాత నాంపల్లిలో ఉండేవాళ్లం. అక్కడ వేమన ఆంధ్ర భాషా నిలయంలో పుస్తకాలు రోజుకు రెండేసి, మూడేసి చదువుతూండేవాళ్లం. ఆ విధంగా గ్రంథ అధ్యయనం అలవాటైనది.

పల్లెటూళ్లోని ఏకాంతవాసం యీనాటికి నన్ను "హంటు" చేస్తూనే వుంది. ఏదైనా అనుమానం వస్తే ఎవరినైనా గాని కాస్త అడిగితే నన్ను తిట్టేవారు. చిన్నతనంలో పుస్తకాల ద్వారా వచ్చిన అనుమానాలను పుస్తకాల ద్వారానే తీర్చుకోవాలి. దానికి ఎంతటైమయినా పట్టవచ్చును. ఆ తరువాత రోజుల్లో సీతారాం బాగ్ వెనకాల ఒక ఆయుర్వేద వైద్యుడి ఇంట్లో వుండే వాడిని. అపుడు ఆయుర్వేద గ్రంథాలు చదివేవాడిని. ఏ పుస్తకం దొరికితే ఆ పుస్తకం చదవటం. నాకు పుస్తకం చదవటం కావాలి. వేమన ఆంధ్ర భాషానిలయంలో కథలు, వేగుచుక్క గ్రంథమాల, ఆంధ్ర ప్రజానీకం గ్రంథాలయంవారి కథలు, నవలలు, నాటికలు అయిపోయాయి. వీరేశలింగంగారి 12 వాల్యూమ్స్ అయిపోయాయి. సాక్షి ఆరు సంపుటాలు అయిపోయాయి. ఇక చదవటానికి ఏమి వుంది? కావ్యాల్లోకి వెళ్లాను. మనుచరిత్ర, పారిజాతాపహరణం మొదలైనవి. అపుడు నాకు నచ్చింది శ్రీనాథుని పద్యాలు. అప్పటికి నాకు పద్యాలు చదివి చదివి ఛందస్సు మీద ఒక అధికారం కల్గింది. అంతేగాక నాకు ఛందస్సు మీద వెగటు పుట్టింది. ముత్యాల సరాలు (హారం) మీద మోజు పుట్టింది. దాంతో పద్య సంస్కృతిని క్రమక్రమంగా విడిచి పెట్టి మాత్రా ఛందంలో కవిత్వాన్ని వ్రాయడం మొదలు పెట్టాను. అదైనా ఎక్కువ వ్రాయలేదు. సందర్భవశాత్తు వ్రాస్తూండే వాడిని. ఆ రోజుల్లోనే ఏదో ప్రత్యేకమైనది కావాలి కదా? అందుకని వేదాంతం మీద దృష్టిమళ్లింది. చిన్నతనంలోనే శంకరుడు నన్ను ఆకర్షించాడు.

శంకరాచార్యుని సిద్ధాంతం ద్వారా నేను నిరీశ్వరవాది నయ్యాను. ఇది కొంత మందికి ఆశ్చర్యం కలిగించ వచ్చును.

ఎందుకంటే శంకరుడు దేవుడంటే ఎవరంటే అజ్ఞానం అంటాడు, అవిద్య అంటాడు.

విద్య నేర్చుకోవడం నా ఉద్దేశ్యంకానీ అవిద్య నేర్చుకోడం నా ఉద్దేశ్యం కాదు. కనక దాంతో నేను Atheist నయ్యాను.

ఒక పండితునితో పరిచయం కలిగి శాస్త్రంలో దిగాను. శాస్త్రం ద్వారా నేను Materialist నైనాను. ఇటు Atheism అటు Materialism రెండూ కలిసి సహజంగానే Marxism వైపు నేను మొగ్గాను. ఇది నా ప్రస్థానం. ఇది సాహిత్య ప్రస్థానం కాదుగానీ మొత్తంమీద ప్రస్థానమే. సాహిత్యంలో నాకు శ్రీనాథుడు అంటే గౌరవం. ఆయన మీదే ఈనాటికీ గౌరవం వుందినాకు. పోతన్నమీదొక రకమైన గౌరవం వుంది. సామాన్యంగా మనకు సాహిత్యంలో మొట్టమొదట వచ్చేది శబ్దాలంకారం. మనిషి స్థాయి చిన్నగా వున్నప్పుడు అంటే వయసులో చిన్నకాక ఆలోచనలో చిన్నగా వున్నప్పుడు శబ్దాలంకారం ఆకర్షిస్తుంది. అందుకని పోతన్న చాలా Popular అయ్యాడు. ఎంత పాపులర్ అయ్యాడంటే తరువాత తరువాత నాకు తెలిసింది తెలంగాణాలో పోతన్న రాసిన రుక్మిణీ కళ్యాణంలోని పద్యాలు ప్రత్యక్షంగా జనంలో విన్పిస్తాయి.

పోతన్నగారి రుక్మిణీ కళ్యాణం జాగ్రత్తగా చదివి నట్లైతే అందులోని పేర్లే ఇక్కడ తెలంగాణాలో సర్వత్రా కన్పిస్తాయి. అంటే దాన్ని బట్టి పోతన్నగారి భాగవతానికి ఎంత ప్రచారం జరిగి వుందో అర్థమౌతుంది. అంతటి ప్రచారం మరో కావ్యానికి రాలేదు. పండిత మండలిలో వచ్చి వుండవచ్చును. సామాన్యజనంలోకి వెళ్ళలేదు. సామాన్యజనంలో ఈ రోజుకి కూడా పోతన్నగారి భాగవతంలో రుక్మిణీ కళ్యాణంలో కొన్ని పద్యాలలో ఉన్న పేర్లే అవమ్మాయిలకి పెట్టుకుంటారు తెలంగాణాలో. పరిశీలించి చూడండి తెలంగాణాలోపోతన్న ప్రభావాణ్ణి.

ఒక చిన్న ఉదాహరణిస్తాను. సుమతీ శతకం పద్యం వొకటి వుంది. ''సిరిదా వచ్చిన వచ్చును సలలితముగ నారికేళ సలిలము భంగిన్ సిరిదాపోయిన పోవును కరిమింగిన వెలగపండు కరణిని సుమతీ'' అని కరి మింగిన వెలగ పండంటే ఏమిటి? అని అడిగాను నేను. వెధవా ఈ మాత్రం తెలీదా నోర్మూయ్ అన్నారు నన్ను. మంచిది నోరు మూసుకున్నాను నేను. ఆరోజుల్లో సీతారాంబాగ్‌లో వుండేవాళ్ళం. మంగళహాట్‌కు సైకిల్‌మీద వెళ్ళి ఒక అర్ధణాకు ఆయిదారు వెలగపండ్లు ఇచ్చేవాళ్ళు. అవి కొనుక్కొని వచ్చి సీతారాంబాగ్‌కు ఒక ఫర్లాంగ్ దూరంలో ఫీల్-ఖానా ఏనుగుల శాల ఉండేది. సాయంత్రం వెళ్ళి మరీ ఇచ్చేవాణ్ణి. నేను చూస్తుండగా క్రష్ చేసి తొండంతో నోట్లో వేసుకునేది. క్రష్ చేసిందే అలాగు మరి. కాయకాయలాగెలా వస్తుంది. ఏమో లోపల తుక్కుంటుందేమో అనుకునేవాణ్ని. మర్నాడు ఉదయాన్నే తెల్లవారు ఝామునే లేచి చీకటి ఉండగానే కర్రతీసుకొని వెళ్ళి దగ్గరుండి శోధించేవాణ్ని. అన్నింటి పెంకులుండేవి. మరి కరిమింగిన అంటే ఏనుగు మింగిన వెలక్కాయ ఎలా వచ్చింది. జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం ఏనుగు తిన్న వెలక్కాయ జీర్ణం మా అబ్బాయి తాగిన ఉగ్గు జీర్ణం ఆవిధాన పాడుతుంటారే. ఎలా వచ్చింది. ఇంత పాపులర్ ఎలా అయింది. కారణం ఏదో ఒకటుండాలికదా? ఏమిటి అనే ఆలోచన 1936లో నాకొచ్చింది. ఆ అనుమానం ఎప్పుడు తీరింది 1968లో తీరింది. అంతవరకు బుర్రను పగులగొట్టుకున్నాను.

కృషి విజ్ఞానం ఇది. నిఘంటువుల్లో కరి అంటే వెలగపండును తినే రెక్కల పురుగు అనుంది. వెలగ కాయగా వున్నప్పుడు రెక్కలతో చిన్న రంధ్రంచేసి లోపల దూరుతుంది. అక్కడ గ్రుడ్లు పెడుతుంది. ఆ గ్రుడ్లు లార్వాలై రెక్కలొచ్చి అదే గుజ్జు తిని బ్రతుకుతాయి. ఆ సందులోంచి లేచి పోతాయి. ఈ లోగా లోపల గుజ్జుండదు. కాయ తేలికౌతుంది. కిందికి దూకుతుంది. పైగా వెలగపండంతా నిండుగా ఉండి చిన్న రంధ్రం కనిపించదు మనకి. అంత పరిశీలనగా ఎవరు చూడడు కదా. క్రింద వెలగకాయ పడుంటుంది. దాన్ని పగల కొడితే లోపల డొల్ల, ఇంకేమీ వుండదు. దాన్ని కరిమింగిన వెలగపండు అని వీళ్ళు దిద్దారు. అసలు సంస్కృతంలో ఇది! ఏమిటి ఇది - అని.

1940లో లక్ష్మీనృసింహశాస్త్రి వద్ద నేను మంత్రం శాస్త్రం నేర్చుకున్నాను. తాంత్రిక విద్యలు నేర్చుకున్నాను. దాని శాక్తం అంటారు. అది నేర్చుకున్నాను. కానీ వేదంతో కూడా సంబంధం వుంది.

ఒకరోజున తాతగారూ నాకు ఋగ్వేదం చెప్పండి అన్నాను. ఆయన సరే అని చెప్పారు. ఓట్టిపట్టాలి కదా ఆయన వొకసారి చెప్తే రెండుసార్లు మనం అనాలి. సాయంత్రానికి మొత్తం అయ్యాయి. ఋగ్వేదంలో మొట్టమొదట దానికి కర్త మదుచ్ఛందుడు అయిపోయింది. వేదం ఇక రాదురా నీ కన్నాడు. ఎందుకని మాకు శబ్దంతో తప్పితే అర్థంతో నిమిత్తం లేదు. అందుకని అర్థం మీద ఎప్పుడైతే దృష్టిపడిందో నీకు 'జ్ఞాపకం వుండదురా'. నీకు అర్థంమీద దృష్టి. కాబట్టి నీవు నేర్చుకోవద్దు. నీకు రాదు వేదం అన్నారు. మీరు వేదపండితులు అన్నాను. నాకు వేదంరాదు అని తిట్టి చెప్పాడు. అందుకని సికింద్రాబాదులో ఒక బుక్‌స్టాల్ ఉండేది. పాత పుస్తకాలు అమ్మేవారు. అక్కడికెళ్ళి ఋగ్వేదము కొనుక్కున్నాను . మళ్లీ అడక్కున్నన్ను నాకర్థం తెలీదు. నీవు చదువుకో. అర్థమవుతే అవుతుంది. నీ ఇష్టం అన్నారు కదా!. అలాగే ఆయన దగ్గర నాలుగు సంస్కృత గ్రంథాలుండేవి. మాన్యుస్క్రిప్టు. ఆ గ్రంథాలు నాకిచ్చి చదువుకోరా అన్నాడు. చదువుకో నన్నడగకు. నీకర్థం అయిందా నీకు స్ఫురించిందా . కానీ. స్ఫురించలేదా. నాకు తెలిసిందేదో నే చెబుతాను నాకన్నీ తెలుసునని అనోకోవద్దు నువ్వు. వాటిని చదువుతూఉంటే నాకు నేను మారి ఒక కొత్త జీవితాన్ని ఎత్తినట్లు కనిపించింది. దాని ద్వారా నేను భౌతిక వాదిని అయ్యాను. శ్రీవిద్య ద్వారా శాక్తం ద్వారా భౌతికవాది నయ్యాను.

నాకు ఫిలాసఫీ అంటే ఇష్టం. మార్కిస్టు ఫిలాసఫీతో చాలాకాలం మాపార్టీకి ఫిలాసఫీ టీచరుగా పని చేశాను. ఇప్పటికీ పని చేస్తూనే ఉన్నానూ. ఎవరైనా పిలిస్తే తప్పని సరిగా వెళ్తాను.

మార్కిస్టు ఫిలాసఫీతో పాటు ఇండియన్ ఫిలాసఫీ కూడా నాకు అర్థమయింది. అవసరమయింది. ఇండియాలోనూ మూడు philosophies.

సాంఖ్యం, లోకాయతం, ఇక వైశేషికం. ఈ మూడు philosophies తప్ప మిగతావన్నీ Idealist philosophies. భావం ప్రధానంగా కలిగినవి. ఈ మూడు philosophies మాత్రమే.

ఒకసారి బెజవాడలో నేను వుపన్యసించాను. దానికి వేదం బాగా చదువుకున్న పెరుకు శాస్త్రి వచ్చారు. ఆయన 82 పన్నాలు చదివాడు. అంతే ఆయనకు అర్థం తెలీదు. మొత్తానికి హాయిగా చదవగలడు. అక్కడా చెప్పాను. వేదానికి ఉదాత్తం, అనుదాత్తం, స్వరం అనిమూడు ఉన్నాయి. వీటిని మాత్రా ఛందస్సులోకి మలుచుకోడం అంటే అరమాత్ర. మాత్ర. ఒకటిన్నర మాత్ర: రెండు మాత్రలు మూడు మాత్రలు. అయిదుగా భాగించుకోవచ్చు. అవి ఉదాత్తంగా 1 1/2 మాత్ర. అనుదాత్తం అంటే క్రింది కెళుతుంది 1/2 మాత్ర. స్వరితం అంటే ఒక మాత్రాకాలం. దీర్ఘం అయితే రెండు మాత్రలు. ప్లుతం మూడు మాత్రలు. ఈ అయిదు అసలు ఒరిజినల్‌గా సప్త స్వరాలు కావు. అయిదే స్వరాలు. తర్వాత కాలంలో సప్తస్వరాలు వచ్చాయి. ఇంకో రెండు కలిపారు. అదే విధంగా మనకు రసాలు మూడే. ఈ మూడిటిని నాట్యశాస్త్రకర్త భరతుడు 8 చేసాడు. ఎనిమిదిని తర్వాత వారు తొమ్మిది చేసుకున్నారు. భోజుడు 12చేసాడు. ఇప్పటికి అలంకార శాస్త్రం తిరగేస్తే 24దాకా వున్నాయి. కృష్ణదేవరాయల లైబ్రరీలో నేను కావ్యమాల సిరిస్‌లో కొన్ని చదువు కున్నాను. కేటలాగు తయారు చెయ్యడం కోసమని ఆ పుస్తకాలు చదివేస్తుండడం. ఒక ఏడాదిపాటు Joint Secretary గా పని చేశాను. ఆ తర్వాత ఏడెనిమిది నెలల దాకా Executive Member గా ఉండే వాణ్ణి. అప్పుడు కొన్ని పుస్తకాలు నాకు కావాలని బుద్ధి పుట్టి తెప్పించాను. అందులో ఒకటి నాట్య శాస్త్రం. అప్పుడే కొత్తగా వచ్చింది గాయక్వాడ్ వాళ్ళు పబ్లిష్ చేశారు. అది తెప్పించాను. తరువాత సోమేశ్వరు దేవుడు రాసిన పుస్తకాల్లో అభిలషితార్థ చింతామణి అని ఒక ఎన్‌సైక్లోపెడిక్ పుస్తకం వుంది అది తెప్పించాను. అది చదివాను.

ఇలా కొన్ని పుస్తకాలను అక్కడ నేర్చుకున్నాను. చదువుకోవడంలో దీనివల్ల ఏమయిందంటే నాకు ఏ సబ్జక్టుమీద ముందుకు పోకుండా రకరకాల సబ్జెక్టులతో నా జీవితం మళ్ళింది. ఎన్ని మళ్ళీనాకానీ అల్టిమేట్‌గా ఫిలాసఫీ మాత్రం

నాకు మిగిలింది. నాకు హిస్టారికల్‌మెడివలిజంలో రిసెర్చి చెయ్యాలని బుద్ధి పుట్టింది. అసలు రసాలు మూడే శృంగారం, హాస్యం, కరుణ. ఈ మూడిటికి మధ్యన హాస్యం ఉంది. హాస్యం కరుణ విపాకమైతే గొప్పది. శృంగార విపాకమైతే అధమ హాస్యం అవుతుంది. సంస్కృత నాటకాలన్నిటిలోకి భ్రష్ట శృంగారమే చలామణి అవుతోంది.

మన సాహిత్యవేత్తలను సాహిత్యాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంతమంచిదని నేననుకుంటున్నాను. మన సాహిత్యవేత్తలందరూను వాళ్ళ పుస్తకాలు బ్రతికున్నాయంటే దానికి కారణం ఏమిటి? ఒకరాజు గారికో ఒక డబ్బున్నవాడికో అంకితం చేశారు. అంకితం చేస్తే వాడి వల్ల డబ్బొస్తుంది. ఆయన దీనికి ప్రతులు రాయించి తయారు చేయిస్తారు. ఆరోజుల్లో Printing లేదు. ప్రెస్‌లు లేవు. తాటాకుల మీద పదో, పదిహేనో, ఇరవైయ్యో, ముప్పైయ్యో ప్రతులు రాయించేవారు. ఇవి నాలుగు మూలలకు వెళ్ళేవి. ఆవిధంగా ఆ కావ్యాలు బ్రతికేవి. అందుకోసం అంకితం ఇచ్చేవారు. రెండవది అలంకారికుడు చెప్పాడు. 'కావ్యం యశసే అర్థ కృతే.' తక్కినవి ప్రక్కన పెట్టండి. కావ్యాన్నుంచి మొట్ట మొదట వచ్చేది యశస్సు. యశస్సును అర్థంగా కన్వర్ట్ చేసుకోవచ్చును. అర్థాన్ని యశస్సుగా Convert చేసుకోవచ్చును. ఆ విషయం చాలా మందికి తెలుసును. Mutually convertible coins యశస్సు అర్థమూను అందుకని వాళ్లు అంకితం చేసిన వాడికి అనుకూలంగా రాస్తారు. విరుద్ధంగా రాయడానికి వీలులేదు. కానీ అవి రాసిన వాళ్లు లేకపోలేదు. ఉన్నారు. వాళ్ళు ఎవడికీ అంకితం ఇవ్వలేదు. దేవుడికి అంకితం ఇచ్చారు. ఆ దేవుడినించి వాళ్ళకేం రాదు. యశస్సు కూడా రాదు. వాళ్ళు నిశ్చింతగా రాశారు. భద్రాచలం మీద రాసిన భల్లా పేరయ్య శతకం చదివితే తెలుస్తుంది విషయం.

ఎవరికి కావ్యాలు అంకితం చేసుకోవాల్సిన అవసరంలేని వాళ్ళు మాత్రమే సమాజాన్ని బయటపెట్టారు. ఈపని మొట్టమొదట చేసినవాడు మహేంద్రవర్మ. కంచి పరిపాలకుడు. ఆయన భగవదజ్జుకం మత్తవిలాసం రెండు ప్రహసనాలు రాశాడు. దానిలో ఆయన తూర్పార బట్టని విషయం లేదు రెండు ప్రహసనాలలోను మరి మహారాజయిన శూద్రకుడు మృచ్ఛకటికం రాశాడు. ఆయనకు ఎవడికి అంకితం ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. తనే ప్రతులు రాయించుకుంటాడు.

వీరేశలింగం 12 Volumes చదివాను నేను. అదినాకు జ్ఞాపకం వున్నాయి. జ్ఞాపకం ఎందుచేత ఉందంటే నేను పెద్ద మేధావిని కాదు జ్ఞాపకం పెట్టుకోడానికి. జ్ఞాపకం ఎలా వుంచుకోవాలనే విషయం చిన్నపుడే కనిపెట్టాను నేను. దేన్ని ఎవరిని అడగను కదా. నాఅంతట నేనే తెలుసుకోవాలికదా. జ్ఞాపకం వుంచుకోడానికి మార్గమేమిటంటే either you have to reproduce it by way of writing, by way of recitation or by way of telling somebody. దాన్ని అపుడు జ్ఞాపకం వుంచుకుంటాడు మనిషి.

నా ప్రస్థానం అనేది రకరకాలుగా సాగింది. ఎంత సాగినా కానీ మార్క్స్ ప్రతిదానికి అర్థం ప్రధానం అంటాడు . మార్క్స్ మీద కోపాలున్నాయి. మార్క్స్ పైన కొంతమందికి ఎలర్జీ వొస్తుంది. కానీ వాల్మీకి చెప్పింది కూడా అంతేగా. మనకు మూడే పురుషార్థాలున్నాయి. నాలుగో పురుషార్థాన్ని గొప్పగా చేసి చెప్పేశాడు. మోక్షమనేది మనిషి బ్రతికుండగా రాదు. అట్లా అన్ని బంధాలు విడుచుకొన్నా కానీ శరీర బంధం పోదు. శరీర బంధం పోయినపుడే మోక్షం వస్తుంది. అందుకని మోక్షం కావాలనుకుంటే మీరు చావండి. హాయిగా చావండి. మోక్షం వచ్చేస్తుంది. కపాల మోక్షంతోనే మోక్షం వస్తుంది. కానీ మిగతా దేనితోటి మోక్షం రాదు. మూడే పురుషార్థాలు. ధర్మం, అర్థం, కామమూను. వాల్మీకి మూడే పురుషార్థాలు తీసుకున్నాడు. కానీ ఇందులో ఏ పురుషార్థం స్వతంత్రం కాదు. 'కామార్థ గుణ సంయుక్తం ధర్మార్థ గుణ విస్తరం' అని చెప్తాడు. కామార్థ గుణ సంయుక్తం ధర్మార్థ గుణ విస్తరం అయినప్పుడే అది ధర్మమవుతుంది. కామము అయినప్పుడే అది కామవుతుంది. కేవలకామాలు కేవల ధర్మాలు లేవు. కానీ ఇవాళ మన మహాపండితులు మహా జిజ్ఞాసువులు మహా ఆధ్యాత్మికనిధులు అంతా కేవలం వాళ్ళ దుంపతెగ ఇది చెబితే సరిపోయేదిగదా. వాల్మీకిది చదివితేను తెలుస్తుంది. చదవరెవరూను. వాల్మీకిని ఈ మధ్యన నేను చదువుతున్నా. ఇంతవరకు అరణ్యకాండం దాకా వచ్చాను. ఇంక ముందు కెళ్లేదు. అంతవరకు కొన్ని నోట్ చేసుకున్నాను. ఆయనలో ఉన్న గొప్పదనమేమిటంటే ఆయన నిజం చెప్పడు. అబద్ధం రాదు. అబద్ధం దాచడు నిజం చెప్పడు. ఇదీ వాల్మీకి లోని గొప్పతనం. ఆవిషయం తెలుసుకుంటే అప్పుడు వాల్మీకి అర్థమౌతాడు. లేకపోతే అర్థం కాడు. వాల్మీకి ఒక విషయం చెప్పాడు. అదికూడా

అందులో ఒకటి Marxist అవడం వల్లే వచ్చింది. అది మానవుడు రెండు విషయాలు కనిపెట్టాడు. అందులో ఒకటి Anthropo Marxism.

ఆ Anthropo Marxismకి పురుషభావారోపణే . పురుషభావారోపణ లేంది కవిత్వం లేదు. ఏ కవిత్వానికి అయినా పురుషభావారోపణ అవసరం. మరి వసుచరిత్ర కవి. ఒక పర్వతాన్ని మొగుణ్ణి చేశాడు. ఒక నదిని పెళ్ళాన్ని చేశాడు. పురుషభావారోపణ లేకపోతే వసుచరిత్ర లేదు. తరువాత కిన్నెర పాటలు. పురుష భావారోపణ లేందే కిన్నెరసారి పాట ఎగిరి పోదా గాలికి. కోకిలమ్మ పెళ్ళి కూడా ఎగిరి పోతుంది. పురుష భావారోపణ అనేది ఒకటి. పురుష భావారోపణలో సమాజం అంతా మొత్తం ఉంది. ఈ జనాన్నంతిటిని ఏ మనాలి. వీళ్ళకి Identify లేదు. Identify లేని జనాన్ని ఒక మనిషిగా కుదిస్తే పురుష భావారోపణ చేస్తే ఏమౌతుంది.?

వేదంలోని విరాట్. విరాట్‌నించి మిగతావన్నీ పుట్టాయి అందర్ని మొత్తం సమాజాన్ని చేస్తే అది విరాట్ అవుతుంది అంతే దానిలో ఎవడికీ ఐడింటిటి లేదు. అది విరాట్ అవుతుంది. ఆ విరాట్ నించి దేవుడు పుట్టాడు. హిందువులకు మొత్తం సమాజమంతా కలిస్తే దేవుడైనాడు. అలాగే ఇంకొకటి నేను కనిపెట్టిందేమిటంటే భ్రాంతి. మానవుడు భ్రాంతిని వాస్తవికతను కనిపెట్టాడు. ఇదీ ఆదిమకాలంనాడు కనిపెట్టాడు. ఈ రెండూ లేనిదే సాహిత్యంలేదు. అసలు సాహిత్యమే భ్రాంతి. సాహిత్యమంటే వాస్తవం కాదు - కాదు. భావం ఉత్పాదన తక్కువైతే వస్తువుత్పాదన కాదిది. వీడు Touch చేయడు. వీడు వాసన చూడలేడు. పంచేంద్రియాలు చూడదిది. అచేతనంగా ఉండి మనసు గుర్తిస్తుంది భ్రాంతి. భ్రాంతిని అద్భుతంగా వుపయోగించుకున్నాడు వాల్మీకి. అందుకనే వాల్మీకి 40వేల మంది రాక్షసులను చంపాడు అడవిలో. రాముడు 40వేల మందిని చంపలేదు వాల్మీకి అన్నాడు నిజమే.

వాల్మీకి ఏదీ దాచడు. ఏదీ నిజం చెప్పడు. అని నిర్ణయానికి నేనొచ్చాను. కనక వాల్మీకి అంటే నాకు అభిమానం. నాకా భాష వొచ్చినా రాకపోయినా కానీ చదువుతుంటాను వొచ్చిన పాటికి చాలు నాకు ఇప్పుడిందాక చెప్పినట్టుగా నాకు వేదాలు రావు. నాకు సంస్కృతం రాదు. నేను చదివింది అయిదవ క్లాసు. ఉర్దూ

మీడియంలోను. అదీ మర్చిపోయాను. పోతే ఉర్దూ మీడియంలో చదివినందుకు ఒక్క అహం మాత్రం వచ్చింది. మున్షీ ప్రేంచంద్ కథలు ప్రేం పంచమి, ప్రేం పూర్ణిమ, ప్రేం బత్తీసి, ప్రేంచాలీస్ ఊరికినే చదువుకున్నాను. ఉర్దూలో చదువుకున్నా ఆ కథలన్నీ. అదొకటి లాభించింది. అందుకని నా సాహిత్యంలోను ఇతరత్రా ఏమయినా అడిగితే నేను వొకటే మాటంటాను. ఎవరో అడుగుతుంటారు నన్ను ఏంచదివారండీ అని నేను గోర్కీ రిస్టక్ గ్రాడ్యుయేట్‌ని అంటూంటాను. గోర్కీ ఏవన్నాడంటే Universe is my University అన్నాడు. నాకు అదే University కాబట్టి గోర్కీ గారి కాలేజీలో University లో నేను గ్రాడ్యుయేట్‌ని. ఈ రోజున సరే నేను బాపిరాజుగారితో వెంట సిలోన్ వెళ్లి చిన్న బహుమతి గూడా తీసుకొచ్చాను. సరే ఒక సామెత వుంది. పండిత్యాహీనా కవయో భవంతి. అదొక శ్లోకం వుంది కదా. అదంతటితో ఆపి పాండిత్య హీనా కవయోభవంతి అంతవరకూ ఓ.కే. కవిత్వహీనా క్రిటికో భవంతి అని చేప్తాను నేను. అందుకని కవిత్వం చేతకానివాడు క్రిటిక్కు అవుతాడు. ఆ విధంగా నేను క్రిటిక్‌ని. అలాగే బొమ్మలు గీయడంలోను ఫెయిలయినాను నేను. ఫెయిలవడానికి కారణం నేను కార్టూనిస్టు నయినాను. 1950లో కార్టూన్ యుద్ధం జరిగింది. ఆంధ్రదేశంలో. ఆయుద్ధంలో నేను ప్రధానుణ్ణి. కార్టూను, కార్టూను క్రిందొక పాట - కార్టూను - పాటను రాసేవాడిని. అందుకని బొమ్మలు గీయలేక పోయినప్పుడు కార్టూనిస్టునయినాను. అలాగే ఏదో అవుదామనుకుని ఏదో కాకపోయి ఏదో అయినాను. కనక ఇప్పటికైనా నాకు ఒకటే వొచ్చు. నేను ప్రత్యక్షంగా ఏదీ పరిశీలించందే నేను దేనిని వొప్పుకోను. పరిశోధనలో ఉపరిశోధన, గిరిశోధన ఉంది. ఆదిభట్ల నారాయణదాసుగారు ఏంచెప్పమన్నావయ్యా హరికథా గిరికథా అన్నాడాయన. గిరికథ అన్నాను నేను. గిరిజా కళ్యాణం చెప్పాడాయన. ఆశువుగా తెలుసును. ఆయన గిరిజా కల్యాణం చెప్పాడు. అలాగే నేను పరిశోధన, గిరిశోధన మనిషి. వేటికదే గిరి శోధనే. ఆయన చెప్పేగిరిశోధన ఏమిటయ్యా అంటే మామూలుగా ఉండే దాన్ని కొండను త్రవ్వి ఎలుక పట్టడం కాదు. ఆపాతాళ నిమగ్నమధ్యాచలం. వాటికి శోధన చేస్తున్నాడు అది గిరేగా. అదీ గిరిశోధనే. ఆ గిరిశోధన ఆపాతాళ నిమగ్నం. అంతవరకు అయితే తప్ప నేను వూరుకోను. అది నా weakness కావచ్చును. ఇం కేమన్నా కావచ్చును.